# అహల్య

యామినీ సరస్వతి

బంగరు గద్దె మీద కూచుని వీణ వాయిస్తూ ఉన్నది సృష్టికర్త సగ పాలులోని మేలిపాలు అయిన సరస్వతి. ఆమె వేలి చివళ్ళు వీణ తీగల మీద చరిస్తూ సృష్టికే సరికొత్త మాధుర్యాన్ని సృష్టిస్తున్నాయి. ఆమె జడ విడివడి వీపంతా ఆక్రమించుకుని చిరుగాలులకు సుతారంగా కదులుతూ బ్రహ్మ మనస్సుని కలవరపరుస్తూంది. అలవోకగా అంగుళుల్ని కదిలిస్తూ నూతన రాగ సృష్టిలో వినూత్న అందాలను వొలికిస్తూ చతురాననుడి ఎనిమిది శ్రవణేంద్రియాలకూ బ్రహ్మానందాన్ని పంచుతున్న వీణా విశారద అయిన శారద.

మరో బంగరు గద్దె మీద కూర్చుని జపిస్తూ ఒక చేతిలో జపమాల తిప్పుతూ, మరో చేత్తో రాగానికి తాళం వేస్తూ, మరో చేత్తో అద్భుతం అన్నట్లు అభినయిస్తూ, ఇంకో చేత్తో ప్రేమని వ్యక్తీకరిస్తూ, చతురాననుడు తన చతురత అంతా చతుర్ హస్తాలతో చదువుల రాణికి ప్రదర్శిస్తున్నాడు.

ధ్యానం చెడకుండా యోగం మారకుండా చిత్తం పరాయత్తం కాకుండా తన వీణా గానాన్ని వింటూ ఆలోచిస్తూ అభినందిస్తూ అలరింపజేస్తున్న పతిదేవుడు బ్రహ్మదేవుడి చతురభినయానికి మురిసిన భారతీదేవి రతీదేవిని తలదన్నేలా నవ్వింది.

వీణా వాదం ఆగింది.

'భారతీ!'

పలకరింపులోని ప్రల్లదనం గమనించిందామె. రెండర్థాలే కాదు. వేనవేల అర్థాలను సైతం అరరెప్పపాటు మాత్రం కాలంలో అవగతం చేసుకోగలిగిన శారదాదేవికి సృష్టికర్తలైన భర్త గుండెలోతుల్లో ఏముందో తెలుసుకోవడం కష్టమా!

'చతురాననా!' బదులుగా పలికిందామె. అందులోని వ్యంగ్యం ఆయన గుర్తించాడు. నాలుగు ముఖాలతో నాలుగు వేదాలు ఒకేసారి వల్లించడమే కాదు, నాలుగు ముఖాలలో నాలుగు భావాలను ప్రకటించగల నేర్పరులే మీరు అన్న భావం ధ్వనించింది అందులో.

'అందాల రాశీ!'

సృష్టికర్త పిలుపుకు ఉలికిపడిందామె. ఏమిటి ఈ వింత! ఏమిటా పలుకులోని కొత్తదనం! ఎందుకా గొంతులో రెపరెపలు!

'గద్దె దిగి కదిలి రావా!'

'ప్రభూ!'

'మనసు కరిగించే మధుమయ సంగీతాన్ని వినిపించావు. నాలుగు నోళ్ళా ప్రశంసించవలసిన ప్రతిభ ప్రదర్శించావు. పెదవికి పెదవి సమాధానంగా పెదవి విప్పిన పాండిత్యాన్ని పెదవితోనే అభినందించాలని వుంది!'

కానీ అందాల రాశీ అని నన్ను సంబోధించడమె అత్యాశ్చర్యకరంగా ఉంది స్వామీ! అందమంతా ఆమెలో దాగున్న మా అత్తగారు లక్ష్మీదేవికన్నా నేను అందగత్తెనా? అందానికే అందాలు దిద్దే మా అత్తగారి మరో కోడలు రతీదేవి కన్నా నేను అందంలో మిన్ననా?

నల్లనైనా నిగానిగాలతో సొగసుల స్రవంతిలా వెలుగొందే నగజాత పార్వతీ దేవికన్నా ఎన్నదగిన సౌందర్యవంతురాలినా! అచ్చమైన మెచ్చుదలకు ఆద్యులనదగిన అచ్చెర మచ్చెకంటి సమూహం హేలగా లీలగా చరిస్తుండగా నేను వారికన్న సొగసుల మిన్ననా! ఏమి స్వామీ తమ ఆంతర్యం?

పరమేష్టి పకపక నవ్వాడు.

'ముప్పై మూడు కోట్ల ముద్దుగువలు ముగ్ధమనోహరంగా ముందు నిలిచినా కట్టుకున్న ఇల్లాలి కన్నా అందంగా కనిపించే కనులనయనా! ఎవరిని సృష్టించాను! ఎన్ని శరీరాలు మలిచాను! ఎన్ని సోయగాలు ఎందరెందరు లావణ్యవతుల వంతు చేశాను! ఎన్ని కల్పాలు జరిగాయి! ఏ అద్భుత సృష్టీ నన్ను కదిలించలేదు. కలవారపరచ లేదు! నిన్ను సృజించిన ఈ చేతులతోనే అర్బుధాలు న్యర్బుదాలూ సృష్టించేశానూ! అయినా నీమీదే చిత్తమాయత్తమైంది! అది ఈ బ్రహ్మ మదిలోని ఆంతర్యం! అందుకే జగాలు మారినా యుగాలు తీరినా నాదమయ సుందరే నా దివ్య సుందరి!'

సరస్వతి నవ్వింది.

నాథుడి వచనం ఆమెనెంతో అలరించింది. అయినా ఒక కోరిక కోరాలని అనుకుంది. అదే సమయంలో బ్రహ్మదేవుడి మనసులో వింత చైతన్యం! వినూత్న చైతన్యం! తొలుదొల్త సృష్ట్యారంభంలో ఆయన మనస్సులో కదలాడిన కదలిక లాంటి కదలిక! సరస్వతీ దేవిని సృష్టించిన పూర్వం ఆయన మదిలో మెదిలిన ఊహకు జోడైన ఊహలాంటి కదలిక!

అందాలన్నీ ఒక చోట రాశి పోసి అత్యద్భుత మూర్తి మన్మథుడిని సృష్టించటానికి ఆయన హృదంతరంలో కదిలిన చిరు కదలిక లాంటి కదలిక! ఆ మన్మథమూర్తికి చేదోడువాదోడుగా కల్పించి మూసబోసిన రతీదేవీ రూపం రూపుదిద్దుకోడానికి పూర్వం ఆయన మనో మందిరంలో కదలాడిన కల్పన వంటి కల్పన!

సరస్వతీదేవి ఆలోచనలో నిమగ్నురాలైంది. భర్త మనస్సుకి ప్రతిబింబంలా ఆయన నాలుగు ముఖాల్లో కదలాడుతున్న క్రొంగొత్త కదలికని గమనించి ఆలోచనామగ్నురాలైంది.

## 2

పారిజాత ప్రసూనాల పరిమళాలు అన్ని దిశలా అలుముకుంటున్నాయి. పలు విధ పుష్ప సౌరభాలు నాసాపుట తర్పణంగా కమ్ముకుంటున్నాయి. సిద్ధ, సాధ్య, కిన్నెరా, గరుడ, గంధర్వ, యక్ష, పన్నగ, కింపురుషాదులైన దేవతా గణమంతా సభా మందిరంలో ఆశీనులై ఉన్నారు. దిక్పాలకులు తమ తమ భార్యలతో విచ్చేసి తమ తమ ఆసనాల్లో కూర్చున్నారు.

ఇంద్రుడు శచీదేవి మహోన్నతమైన మహోన్నతమైన సింహాసనాలపై తమ మతాధిపత్యాన్ని చాటుకునేలా కూర్చున్నారు. దేవర్షి నారద మహర్షి, దేవ గురువు బృహస్పతి, సృష్టికే ప్రతి సృష్టి చేసి ఇంద్ర లోకానికి ప్రతిగా మరో లోకాన్ని సృష్టించి ముప్పది కోట్ల దేవతలనూ ముప్పు తిప్పలు పెట్టిన విశ్వామిత్ర మహర్షి, గౌతమ, చ్యవన, జమదగ్ని, అత్రి, పరాశర, భరద్వాజ మొదలయిన మహర్షులంతా ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు.

రణరంగంలో వీర మరణం చెందిన వీరాధి వీరులు యాగాలు చేసిన ముని పుంగవులు, భూసురోత్తములు, నరోత్తములూ, తమ తమ పుణ్యం కొద్దీ స్వర్గం చేరినవారు నేటి ప్రత్యేక సమావేశానికి వచ్చారు. ఆ సభలో తప్ప ఇంకెక్కడా అగుపడరా అన్నట్లు మొత్తం స్వర్గవాసులంతా అక్కడే ఉన్నారు.

'అనరాదు కానీ ఈ సమయంలో ఏ రాక్షసుడైనా దండెత్తి వస్తే దేవలోకం అంతా ఖాళీ! స్వర్గాన్ని వాళ్ళు సునాయాసంగా ఆక్రమించుకోవచ్చు. అడ్డూ ఆపూ లేని అమృత వాహిని సురగంగ మందాకినిలో మునకలు వేయచ్చు.

ఏ కాపలా లేని నందనోద్యాన్ని సునాయాసంగా స్వాధీనం చేసుకోవచ్చు. అష్టదిక్పాలుర ఆవాసాలను తప్ప అందరి నివాసాలను స్వంతం చేసుకోవచ్చు. కామధేనువునీ, కల్పవృక్షాన్నీ కబళించవచ్చు. ఒక్కసారి ఈ సభని ముట్టడిస్తే రసగంగ అమృత పానంలో వివశులై ఉన్న అందరినీ తేలిగ్గా కొల్లగొట్టవచ్చు' అనుకున్నాడు నారదుడు.

ఆ క్షణంలో గజ్జెలు గలగల మన్నాయి.

అందెల రవళికి జతగా కంకణ ధ్వనులు ఘల్లుఘల్లుమని మోగాయి. రాగల కదలికలు రెపరెపలు కూర్చున్న వారి గుండెల్లో గుబులు పుట్టించాయి.

రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ, ఘృతాచి, హేమ, మదాలస, హరిణి మొదలగు గల అచ్చెర మచ్చెకంటులంతా సభలో ప్రత్యక్షమయ్యారు. ఒక్కసారిగా వీణాది సకల వాద్యాలూ మోగింపబడ్డాయి.

మృదంగం మోగింది. అచ్చెరల పాదాలు కదిలాయ్. లయానుగుణంగా నర్తించడం ప్రారంభించారు. నాట్య వేదానికి సరికొత్త భాష్యం రాయదగినంత నయన మనోహరంగా సాగుతున్నది నృత్యం.

ఉన్న రెండు కళ్ళూ రెప్పపాటు లేనివి కావడంతో దేవతలంతా ఒళ్ళు మరిచి కళ్ళారా ఆ సోయగాన్ని చూస్తున్నారు. రంభ కన్నా మిన్నగా ఊర్వశి, ఆమెను తలదన్నేలా మేనక, తనకంటే గొప్పగా తిలోత్తమ, ఆమె శిరస్సు దన్నేలా హేమ. అలా ఒకరిని మించి ఒకరు తమ నాట్య కౌశలాన్ని ప్రదర్శిస్తున్నారు. నిజానికది పోటీ ప్రదర్శన కానే కాదు. ఆ రోజున ఎవరు గొప్ప ఎవరు తక్కువ అని నిర్ణయించే పాటవ పరీక్షా లేదు.

ఉత్తమ కళాకారిణికి బిరుదిచ్చే సందర్భమూ కాదు. కానీ సకల దేవతా గణం, స్వర్గలోక నివాసులందరూ విచ్చేసిన సందర్భం కాబట్టి నిజమైన కళాకారిణులుగా వారివారి కౌశలాన్ని సోయగాలని ప్రదర్శిస్తున్నారు.

పాట ముగిసింది. ఆట ఆగింది. అలసట ఎరుగని అచ్చెరలు అందాల బొమ్మల్లా నిలబడ్డారు. సభలోని వారందరూ అభినందన పూర్వకంగా చప్పట్లు కొట్టారు. ఆగని కరతాళ ధ్వనులు అసుర లోకం దాకా ప్రతిధ్వనించి రాక్షసుల గుండెల్లో గుబులు పుట్టించాయి.

'అద్దా' అన్నాడు విశ్వామిత్రుడు.

'అద్భుతం!' అన్నాడు బృహస్పతి.

'అమోఘం!' అన్నాడు నారదుడూ.

'అసదృశం!' అన్నాడు పరాశరుడు.

అందరినీ కలయజూసి చిర్నవ్వులు చిందించాడు సురనాథుడు. ఎక్కడా ఎన్నడూ ఎవరికీ దక్కని భాసుర వైభవానికి గర్వించాడు.

'ఇందుకే కదా ఇంద్రుడన్నా ఇంద్రలోకమన్నా ఆ రాక్షసులకు అంత కోపం' తనలో తాను మురిసిపోయాడు. ఆకలి, దప్పి, అలసట, వేసట లేని అమరత్వ సిద్ధిని ఇచ్చే అమృతం, గాలి సోకితేనే పులకించి పోయేలా చేసే నందనోద్యానం, కోరిందల్లా కురిపించే కామ ధేనువు. అడిగింది అరక్షణంలో అందించే కల్ప వృక్షం. నిత్య త్రిదశత్వం. ఓహ్! ఇవన్నీ అమరుల అసూయా హేతువులే' అనుకున్నాడు.

నిండు గర్వంతో నిండు పేరోలగంలోని ప్రతి ఒక్కరినీ చూసి తనదైన బాణీలో ఇలా అన్నాడు "దేవర్షులారా! మహాత్ములారా! బ్రహ్మర్షులారా! అష్టదిక్పాలకులారా! దేవతలారా! దేవలోక నివాసులారా!'

'ఇప్పుడే ముగిసిన దేవకన్యల నాట్యం చూశారు మీరంతా. ఆ నాట్యంలో ఎవరు మిన్న? నృత్య ప్రదర్శనలో అందరినీ అధిగమించిన అన్నులమిన్న ఎవరు? భరత శాస్త్ర ప్రదర్శనలో అగ్రశేణిలో అలరించిందెవరు? అని.. మిమ్మల్ని ప్రశ్నించడం లేదు. అలాగే ఎవరద్భుతంగా పాడారు? అనీ అడగటం లేదు.

నా ప్రశ్న ఒక్కటే.....

ఇందరిలో అందగత్తె ఎవరు?

అంటే నా ఉద్దేశం గజ్జె కట్టి ఆడిన ఈ సుందరీమణుల్లో సుందరీమణి ఎవరు? అని కాదు! అందరిలో ఎందరున్నా అందరినీ మించిన అందగత్తె ఎవరు? మీ అభిప్రాయం తెలుసుకుని ఆ అందగత్తెను అందాల రాశిగా బిరుదుతో సత్కరించి గౌరవిస్తాను.

మహేంద్రుని మాటలు పూర్తయ్యాయి.

సభలో గుసగుసలు. ఎవరు? ఎవరు?? ఎవరు??? అఖిల లోకాల్లో అందాల రాశి ఎవరు? అందరి కనులకూ అమృత వర్షిణిలా కనిపించే ఆ అతిలోక రూపసి ఎవరు? అమరేంద్రుడి మన్ననలు అందుకోబోయే ఆ అందాల భామ ఎవరా అందాల రాశి?

మహనీయులు, మానసీయులు, మహర్షి సత్తములు, మౌన సముద్రాలంకారులయ్యారు. సామాన్యులు గుసగుసలు పోతున్నారు.

అందరినీ కలయజూశాడు విశ్వామిత్రుడు. సభా మర్యాద పాటిస్తూ లేచి నుంచున్నాడు.

'దేవేంద్రా!' దిక్పాలకులారా! మాన్యులారా! దేవ నాథుడు ఇన్ని యుగాలకు ఒక చక్కని కార్యాన్ని సంకల్పించాడు. జగదేక సుందరి ఎవరో నిర్ణయించి ఆమెను అందాల రాశిగా నిర్ణయిస్తానన్నాడు. బహు చక్కని ఊహ పుట్టింది ఇన్ని కల్పాలకు. గుడ్డివాడు వెన్నెలనీ చూళ్లేడు. వెలుగునూ చూళ్ళేడు. అందాన్నీ చూళ్ళేడు. అలంకారాన్నీ చూళ్ళేడు. అది వాడి తప్పూ కాదు. దోషమూ కాదు.దృష్టి దోషం! అంతే! అలాగే అనునిత్యం తన కళ్ళెదుటే తిరుగుతూ తన కన్నుసన్నలో మెలుగుతూ తన అపూర్వ లావణ్యంతో ఎందరెందరి ప్రశంసలనో పొందిన మేనక ఈ సభలో ఉండగా అందగత్తెను సూచించమనడం అంధత్వమే అవుతుంది. అది అధికార మదోన్మత్తత వల్ల అంత వినయవతి. వాటికి తార్కాణం మేమే! మా మాటలే! మరెవరు అవునన్నా కాదన్నా జగదేక సౌందర్యవతి మేనకే! మేనకే! మేనకే!!

విశ్వామిత్రుడి ధీర గంభీర వాక్కులు దిక్కులు ప్రతిధ్వనించాయి.

పిడుగు పడినట్టు అంతా నిశ్చల నీరవ నిరీహ నిశ్శబ్దంతో నిశ్చేష్టులయినారు. నిర్నిమేషత్వం వారి సొమ్మే కనుక రెప్పపాటు లేకుండా పోయింది.

అందరూ అలా ఉంటే విభాండకుడు లేచి నిలబడ్డాడు. 'హరిణీ! హూ! హరిణి లాంటి అందగత్తె ఈ చతుర్దశ భువనాలలో లేదు! ఇది మా నిశ్చితాభిప్రాయం' అని కూర్చున్నాడు.

'ఊర్వశి ఒక్కతే అందాల రాశి. ఇది నా దృఢ నిర్ణయం' అన్నాడు పురూరవుడు. అతని మాటలను వరుణుడూ, సూర్యుడు కూడా సమర్థించారు. ఒకరికిద్దరు గాక ముగ్గురు సమర్థించడంతో ఊర్వశి సభను కలయజూసింది. ఐతే అందులో ఆనందం ఉంది. గర్వం లేదు. అహంకారమూ లేదు.

అది అంతా గమనిస్తూ కుబేరుడి కుమారుడు నలకూబరుడు చిరునవ్వులు చిందించి అన్నాడు.

'నారీషు రంభా! ఈ మాట మరిచారా మీరంతా? రంభ సంరంభం చూడండి! ఆమె సొగసు సోయగమూ సౌష్టవమూ గమనించండి. మహనీయుల మాట మన్నించి జగదేక సుందరి రంభ అని ముమ్మారూ ప్రకటించండి!'

ఇంద్రుడికి ఒక్కొక్కరి ప్రతిపాదనా ఒక్కొక్క వజ్రాయుధపు దెబ్బగా అనిపించసాగింది.

క్రమ క్రమంగా ఎవరి అనుభవానికి తగినట్టు వారి వారి అభిరుచి మేరకు అందగత్తె పేరు సూచించవచ్చు అనే అభిప్రాయం బలపడింది.

ఒక్కొక్క మహర్షే లేచి నుంచుంటున్నాడు. ప్రతిపాదిస్తున్నాడు. ఒక్కొక్క వీరుడు సభా గౌరవం పాటించి పలుకుతున్నాడు. మునులు-యక్షులు-సిద్ధులు- వాళ్ళు వీళ్ళు అనడం ఎందుకు? అందరూ లెక్కించరాని విధంగా పేరు ప్రతిపాదిస్తున్నారు.

కొందరు మళ్ళీ మళ్ళీ మేనకనే ప్రస్తావిస్తే మరికొందరు రంభ పేరును సూచిస్తున్నారు. తిలోత్తమ మదాలస, ఘ్రుతాచి, ఊర్వశి! పదేపదే వినపడుతున్న పేర్లు రంభ! ఊర్వశి! మేనక!

మెలిమెల్లిగా ప్రతిపాదనలన్నీ నినాదాలయ్యాయి. నినాదాలు వాదాలయ్యాయి. గొంతులు హెచ్చుతున్నాయి. రోషం అగ్నిలా రాజుకుంటోంది. కోపం చిచ్చులా హెచ్చు మీరుతోంది. సభా మర్యాద పాటించడం మానడంతో వీధిలా తయారయింది.

ఉస్సురని నిట్టూర్చాడు సురనాధుడు. వెండి బెత్తాలవారి వైపు చూశాడు. ఆపై తమ గురువర్యులను చూశాడు. నారదాది మహర్షులను చూశాడు.

అందరూ తమ ప్రతిపాదనే సమజసమనీ-ఔచిత్యవంతమయిందనీ. సరి అయినదనీ అనుకుంటున్నారు. బృహస్పతి ఒక్కసారి అందరి వంకా జూసి 'నిశ్శబ్దం! నిశ్శబ్దం! ఇది సురసభ! కానీ అసుర సభ కాదు! ఇది దేవసభ. ఇచట యెద్దేవ తగదు! ఇది మలహరుడి సన్నిధి! కలహాల పెన్నిధి కాదు! మౌని మండలి దండిగా కొలువైన నిండు సభే గానీ మానవ సమావేశం కాదు. నిశ్శబ్దాన్ని పాటించండి' అన్నాడు.

'ఎవరికి తోచిన ప్రతిపాదన వారు చేశారు' లేచి నుంచుని అన్నాడు నారదుడు.

'దేవనాథుడు తన మదిలోని మాట చెప్పేవాడే కానీ శచీదేవి అర్ధాసనంలో ఉండగా మరొకరి పేరు చెప్పలేడు. తన భార్య పేరూ ప్రతిపాదించలేడూ. భార్య అనగానే ఎంత అందమైనా కంటికి కనిపించదు కదా! అయినా ఇక నిర్ణయించి ప్రకటించవలసిన సమయం వచ్చింది. శచీదేవి పేరు ప్రతిపాదిస్తాడో! తన నెప్పుడూ ఆదుకునే రంభ పేరు చెప్తాడో! విశ్వామిత్రుడి గండం నుంచి తప్పించిన మేనక పేరే పలుకుతాడో! నారాయణాంశ సంభావ ఊర్వశి పేరే వల్లిస్తాడో! అంతా మనకెందుకు! అది అతనిష్టం! అతని కష్టం! చెప్పనివ్వండి! ఎవరి పేరు ప్రకటిస్తాడో విందాం! దేవ గురువు చెప్పినట్లు మౌనంగా ఉందాం! విందాం!' నారదుడు చెప్పదల్చుకున్నది చెప్పాడు. వేయవలసిన కలహ బీజం వేశాడు.

మానవుల రీతిగా మహేంద్రుడికీ చెమటలు పట్టవలసిందే! కానీ దైవత్వ లక్షణం వల్ల ఆ స్థితి రాలేదు. కానీ భయం పుట్టుకొచ్చింది. ఏమంటే ఏమో అని శంకించాడు. అయినా తప్పదు ప్రకటించాలి!

సభ వంక తేరిపారి చూశాడు.

అందరిలో ఆరాటం! ఆత్రం!

'సభాసదులారా! మనలో ప్రతి ఒక్కరు ఒక సౌందర్యవతి పేరు సూచించారు. సంతోషం! ఎవరి మనోగతం వారిది. ఎవరి అనుభవం వారిది. ఎవరినీ నిందించతగదు. అలాగని అభినందించలేను. 'తా వలచినది రంభ! తను మునిగినది గంగ! అని నరలోకంలో అశేష జనులు అనుకుంటుండగా నేను విన్నాను. మీలో ఎందరో వినే ఉంటారు!'

ఆ చిన్న సమయంలోనే రంభ తోటి అప్సరసలను తిరస్కారంగా చూసింది.

గాధేయుడు చప్పున అన్నాడు 'రంభ కడు అందగత్తె అంటావా?'

విశ్వామిత్రుడు అలా ప్రశ్నించగానే ఇంద్రుడి గుండె గుభిల్లుమన్నది.

'గాధేయా రాగాధేయా! వినరాదా పూర్తిగా! ఆపై అనవలసినదేదో అనరాదా? నేను లోకరీతి సామెతగా అన్నాను. ఎందుకా ప్రస్తావన అంటే-అది సామాన్య లక్షణంగా చెప్పాను అంతే!'

విశ్వామిత్రుడు గర్వంగా నవ్వాడు.

రంభ ముఖం చిన్నబోయింది.

'కాబట్టి మనలో మనకు ఈ విషమ సమస్య పరిష్కారం కాదు. ఒకరిపై ప్రేమ మొగ్గు చూపినప్పుడు మరొక మాట రాదు! మరొకడు చెప్పినా అది వినరాదు. అందుకని ఈ నారీ లోకాన్ని సృష్టించిన ఆ సృష్టికర్త బ్రహ్మదేవుడి వద్దకే వెళదాం! పరమేష్టి నిర్ణయమే మనకు శిరోధార్యం. ఇక్కడి అచ్చెరలనూ, దేవతా స్త్రీలనే కాక, నాగ కన్నెలనూ, మానవ కాంతలనూ, మరెందరినో సృష్టించిన, సృష్టిస్తూన్న, సృష్టించబోతున్న ఆ పరమేష్టి మాటే మనకు వేదం!'

'లెస్స పలికావ్!' అన్నాడు విశ్వామిత్రుడు.

'మంచి ఆలోచనే!' అన్నాడు బృహస్పతి.

'అయితే ఇంకెందుకు ఆలోచన! సందడి చేస్తూ పదండి!!' అన్నాడు నారద మహర్షి.

త్రిలోకాధిపతి తన సింహాసనం దిగాడు. స్వర్గలోకం కదిలింది.

## 4

'దేవీ!' పిలిచాడు సృష్టికర్త.

'పతిదేవా! ఏమి తమ ఆలోచన!'

'ఎన్నడూ లేని మోహం పుట్టుకొచ్చింది. మరేనాడూ లేనిది మనస్సు చలించింది. ఎందుకో మనసునిండా నీ అందమే ఆక్రమించింది'.

'నాలుగు శిరస్సులున్నా, నాలుగు నోళ్ళున్నా, వేనోళ్ళ పొగడగల శక్తి ఉన్నా, నాలుగు నాలుకలున్నా, ఎనిమిది చేతులూ, అలాగే ఎనిమిది కళ్ళూ, ఎనిమిది చెవులున్నా, తమరికి మనస్సు మాత్రం ఒక్కటే...'

వాణి చతుర వాక్కులు అడ్డుకుంటూ అన్నాడు చతురాననుడు 'ఆ ఒక్క మనసూ దేవిగారికే అంకితం!'

కొంటెగా అడిగింది పుస్తక పాణి 'ఏ దేవి గారికి అంకితం?'

నాలుగు మోములూ విప్పారేలా నాలుగు నోళ్ళూ నిండుగా నవ్వాడు. 'ఈ చిత్తజుడి సృష్టికర్త చిత్తమెన్నడూ పరాయత్తం కాదు-కాలేదు. కాదు. కాబోదు నారదమాతా!'

'నారదుడు తమ మానస పుత్రుడు లోకకర్తా!'

'ఆ మనస్సు నీదే కదా సరస్వతీ!'

'ఆ పిలుపు 'సరసవతీ' లాగ ధ్వనించింది.'

'మహద్భాగ్యం!' అందామె.

'అసలు విషయాన్ని అవతలి మార్గం పట్టించడంలో అతివలు మిన్నలు కదా! మాట మార్చినా ఏమార్చినా మనస్సు మరలి పోదులే! ఆ ఏమన్నానూ మనసునిండా అందమే ఆక్రమించింది. అందుకని...

ఒక అపూర్వ సృష్టి చేయాలని ఉంది! ఎన్నడూ సృష్టించని విధంగా సృష్టించాలని ఉంది. ఒక అద్భుత లోకం కల్పించనా?

ఒక అద్భుత వనం నిర్మించనా? ఒక అద్బుత పురుషుడిని సృష్టించనా? ఒక అద్భుత లావణ్యవతికి ప్రాణం పోయానా? ఒక అరుదైన జంతువునో, పక్షినో పర్పంచానికి అందివ్వనా?' కోరుకో అన్నట్లు అడిగాడా? సూచించు అన్న రీతి చెప్పాడా? తెలియలేదు చదువుల తల్లికి.

'పద్మ సంభవా! ఎన్నడూ లేని సందేహం యీనాడు ఎందుకు కలుగుతున్నది. నిముష కాలంలో సకల చరాచరాన్ని సృష్టించగల నేర్పరులే! ఊహ క్రియ ఏక కాలంలో ఫలింప జేసుకోగల చతురులే! మీకు నా సలహా కావాలా? విచిత్రంగా ఉంది నాథా!'

బ్రహ్మ నవ్వేడు మళ్ళీ.

అంతలో అల్లంత దూరాన కలకలం ఎందరో వస్తున్నట్లు గాలి మార్పు.

నేత్ర హస్తుడు బరా బరులు పలికాడు.

'జయహో! భువనైక నిర్మాతా! జయహో! సమస్త దేవతా గణం, ముని గణం, బ్రహ్మర్షి విశ్వామిత్రుడు, బ్రహ్మర్షి వసిష్టుడు, దేవ గురువు బృహస్పతి, దేవర్షి నారదుడు, తమ సన్నిధికి వస్తున్నారు'

అలా విన్నవించి వెనక్కి వెనక్కి నడుచుకు వెళ్ళాడు నేత్ర హస్తుడు.

బ్రహ్మ మెడ తిప్పాడు. వాణి నవ్వింది. వాగ్దేవి నవ్వుకి అర్ధం తెలిసింది బ్రహ్మకి.

అంతలో ఇంద్ర లోకం విడిచి అందరూ బ్రహ్మ సన్నిధికి వచ్చారు.

బ్రహ్మను స్థితించాడు నారదుడు 'దేవరాజా! కట్ట గట్టుకుని అందర్నీ వెంటబెట్టుకుని విచ్చేశావేమిటీ! ఏ రాక్షసుడూ ఈ సమయంలో విజృంభించినట్లు వినలేదే! ఇది అసుర సమయం కాదే! సందిగ్ధ సంధ్య సమయం కాదే! మీ రాక లోని ఆంతర్యం విప్పి చెప్పు!'

'నేను చెబుతాను తండ్రీ!' ముందుకు నడిచి అన్నాడు నారదుడు.

'కలహ కోలాహలమా కుమారా!'

'అలాంటిదే తండ్రీ!'

పితామహుని చూస్తూ చెప్పసాగాడు.

'ఈ సురరాజు సురాపానం చేస్తూ, సుర భామల నాట్యం చూస్తూ, భాసుర వైభవంతో పాలిస్తూ, సుఖ భోగాలలో తేలియాడుతూ కాలం గడపడు! ఉల్లాసంగా ఉన్న ప్రాణానికి ఉరి పెట్టుకుని ఉసురుమంటూ ఉసురు పోగొట్టుకుంటారని భూలోకంలో సంచరిస్తుండగా సామెత లాగ విన్నాను. భూలోకంలో ఆంధ్రులకు సామెతల వాడకం ఆమెత లాంటిదే! ఈ మహర్షి విశ్వామిత్రుడికి సంతతి కదా ఆంధ్ర జాతి! ఆనందం ఆగ్రహం రెండూ పక్కపక్కనే ఉంటాయి.

పానకంలో పుడక లాగ అమరుల ప్రసక్తిలో ఆంధ్రుల ప్రసంగం అధిక ప్రసంగమే అవుతుంది. ఇదీ వారి సామెతే! రంభా, ఊర్వశీ, మేనక, తిలోత్తమ, హేమ, హరిణి, చిత్ర, ఘ్రుతాచి, ఈ ఎనిమిది మందీ ఆటగత్తెలే! అయినా అందంతో, చందంతో, నృత్య గాన విలాసాలతో భూమిని అష్ట దిగ్గజాలూ మోస్తున్నట్లు ఈ సురేంద్రుడి సింహాసనాన్ని భరిస్తున్నారు. ఆపదలో ఆదుకుంటున్నారు. ఎవరు తపస్సు చేసినా, యజ్ఞాలు ప్రారంభించినా తన పదవి మీద కన్నేశాడనే కదా అతగాడి భ్రమ! భయం! అప్పుడు వారిని చెదరగొట్టినా, బెదరగొట్టినా వీళ్ళే కదా నేర్పరులు!

ఉండనీ! ఆ కథ....

నవ యవ్వన రంభ-రంభ అందగత్తె.. ఉహూ ఉహూ సౌందర్య రూపసి. ఊర్వశి అందగత్తె- కాదు కరిగించి కరిగిపోయే ఘ్రుతాచి అందగత్తె. బంగారు వన్నెలు కురిపించే హేమ- ఆహా మేను మరిపించే మేనక- ఉత్తమ శరీర లక్షణ తిలోత్తమ సొగసు గత్తె. లేదు. మనస్సు హరించే హరిణి. చిత్ర విచిత్ర వైఖరులు ప్రదర్శించే చిత్రరేఖ. వీళ్ళెవరూ కాదు ఎవరో ఒకరు. అందగత్తె అనేస్తే సరిపోదూ! తన మాటకు అడ్డుందా! తన నిర్ణయానికి తిరుగుందా! కాదనే వారెవరు? వాదుకు దిగేదెవరు? తను అఖిల లోకాధిపతి తన శాసనం వజ్ర శాసనం!

అలా చెయ్యలేదు.

పరిషత్తులో అభిప్రాయాన్ని అర్థించినట్టు తమ అభిప్రాయాన్ని వెల్లడించమని అడిగాడు. సురాపన చిత్తులకు మత్తెక్కువ కదా! అందుకే అలా అడిగాడు. ఏముందీ! ఎవరిష్టం వారిది. వాక్స్వాతంత్రం వుంది కదా!

సురపతే అడిగాడు కదాని ప్రతీవాడూ తనకు నచ్చిన సుందరి పేరు ప్రకటించేశాడు. పాపం! వారి కంటికి ఆమె అందగత్తెగా, అతిలోక సౌందర్యవతిగా కనిపించడంలో ఆ సంగతమేముందీ?

చివరికి అమరేంద్రుడు విప్పుకోలేని చక్కని చిక్కులో పడ్డాడు! చక్కనమ్మ చిక్కినా అందమే! అంటార్లే ఆంధ్రులు. చిక్కు వచ్చినా అందమైన చిక్కే వచ్చింది.

జగదేక సుందరిని ఎన్నిక చేసి ఆమెకు అందాలరాశి అని బిరుదిచ్చి, గౌరవించడం అలతి కార్యంగా భావించాడు! అది ఇప్పుడు అంతఃకలహాలకు దారి తీసేలా ఉండటంతో... పితామహులుండగా మనకెందుకీ పేచీ అని మీ దగ్గరికే వెళదాం అని నిర్ణయించాడు. ఇదొక్కటే శచీపతి జీవిత కాలంలో చేసిన చక్కని నిర్ణయం. ఇక సర్వం తమ సన్నిధికి వచ్చింది. నిర్ణయం మీది సన్మానం దేవేంద్రుడిది.

ఆ మాటలకు అందరూ సంతసించారు.

విషయాన్ని వివరించడంలో గానీ వివదించడంలో గానీ తనకి తానేసాటి అని మరోమారు రుజువు చేసుకున్నాడు దేవర్షి.

'రంగం ఇక్కడికి మారిందన్న మాట!'

'అవును పితామహా! అఖిల సృష్టి జరిగే రంగస్థలం కదా ఇది! ఈ స్థలానికి రంగం మారడంలో ఔచిత్యం లేదూ!'

బ్రహ్మ శిరస్సులు నాలుగూ ఊగాయి.

'మీరలా తలలూపారంటే నాలుగు వేదాల సాక్షిగా సమ్మతించారనే నాకు తోస్తున్నది.'

'ఇన్నేళ్ళకి మాట లెస్సగా పలికావు' అన్నాడు దేవేంద్రుడు.

నారదుడింకేం అనలేదు. పరమేష్టి సరస్వతి వైపు చూశాడు.

ఆమె పెదాలు విచ్చీ విచ్చకుండా విరి అరవిరిసినట్లు నవ్వింది.

'మహేంద్రా! మంచి ఆలోచనే వచ్చింది నీకు! అంతకంటే మంచి పనే చేశావు. సురాధినాధుడను కదా! సకల సృష్టికీ పాలకుడను కదా! అని భావించి, అహంభావించి నీ మనసుకు నచ్చిన-నీకు మచ్చికైన అచ్చెర మచ్చెకంటికో- అమర

భామకో- మానవ కాంతకో- మరో సుందరికో- తొందరపడి సందడి చేసి ఏలికగా ఎన్నిక చేసి బహూకరించి బహు విమర్శల పాలు కాలేదు. సభాస్తారుల చక్కని అభిప్రాయాన్ని అడిగేవు. అది నీ పాలన లోని అభిరుచిని వ్యక్తీకరిస్తున్నది. అందుకు నీవు బహుదా శతధా అభినందనీయుడవు'

పరమేష్టి వాక్కులు పరిపూర్తి చెందగానే ఓ పూల మాల శచీపతి కంఠ సీమను అలంకరించింది.

చందన జలం చిలకరించబడింది. పరిమళభరిత జలం చిలకరించబడింది.

సృష్టికర్త చమత్కారానికి అంతా మురిసిపోయారు. ఎంతైనా చతురమతి కదా! చతురాననుడు ఒక్క క్షణం నిశ్శబ్దం. అమరేంద్రుడు అభివాదం చేశాడు.

వేదగానశీలుడు మళ్ళీ ప్రారంభించాడు.

'నిజం చెప్పాలంటే ఏ లోటూ లేని స్త్రీని నేను సృష్టించలేదు.'

ఆ మాటలు అందరి గుండెల్లో రాళ్ళలా పడ్డాయి.

'కొరత లేని కాంతని కల్పించలేదు. నలుగురిలో సర్వ శ్రేష్ఠ సర్వాంగ సుందరిని నేను సకల హృదయ రంజని అయిన నారీమణిని సృష్టించనే లేదు. ఏ అందగత్తెని పరిశీలించినా ఎక్కడో కొరత! ఏదో లోపం! ఎందుకో అసంతృప్తి! నాకేనాడూ పరితృప్తి అనిపించనే లేదు!'

బ్రహ్మ ఆగాడు క్షణం సేపు.

'సృష్టించిన సుందరీమణులంతా అందగత్తెలే! సోయగాల సొగసుల నిలయాలే అని మనసారా అనలేను. ఏయే స్త్రీ పూర్వజన్మ ఫలాన్ని బట్టి ఆయా స్త్రీకి అందం, ఐశ్వర్యం లభిస్తుంది. అష్ట లక్ష్ములలో చేరకపోయినా అందం కూడా సంపన్న లక్షణమే! విద్య, వినయం, వివేకం లాగే అందం కూడా! అవి అందరికీ లభించవు కదా! అవన్నీ అటుంచుదాం! ఈ సృష్టి ప్రారంభించడానికి ముందు నా మనస్సులో ఏదో తీయని భావన. మరేదో మధుర కల్పన తొనికిసలాడింది. అలాగే మన్మథుడిని కల్పించడానికి పూర్వం నా మదిలో ఒక వింత భావం! వినూత్న ఊహ మెదిలింది! అదే విధంగా రతీదేవిని సృష్టించడానికి పూర్వం ఈ విద్యాధిదేవత సరస్వతీ సృష్టి సంకల్ప సమయంలో నా మనస్సులో అందమైన ఆలోచనలూ, కొత్త కొత్త భావాలు తారాడాయి.

అందగాళ్ళ కల్లా అందగాడని మన్మథుడిని సృష్టించాను. అతనికి చాటుగా మాటుగా వుండాలని వసంతుడ్ని కల్పించాను. అందంలో సాటి వారిలో మేటిగా ఉండాలని ఇంద్ర కుమారుడికి-జయంతునికి రూపు దిద్దాను.

అయినా నా మనస్సుకి పరిపూర్ణత కలగలేదు. ఎప్పుడూ- ఇప్పుడు మళ్ళీ ఇన్ని యుగాలు గడిచాక, జగాలు నడిచాక- నా మనసులో ఏదో అపూర్వ భావం తారట్లాడింది. వింత వింత ఊహలు అల్లి బిల్లిగా కదలాడాయి. అదే సమయంలో దేవీ సరస్వతి ఓ వినూత్న రాగాన్ని ఆలపించింది.

రాగ భావానికి అంకురార్పణ చేసింది.

ఆ సమయంలో-ఒక అపురూప సృష్టి చేసి సకల ప్రపంచానికీ కానుకగా సమర్పించాలనే ఆలోచన వచ్చింది. మీరా సమయంలో వచ్చారు.

మీరు కోరుకుంటున్నది-నేను ఆలోచించిందీ ఒకటే అవుతున్నది. కనుక...' బ్రహ్మ ఆగాడు.

## 5

అది నదీ తీరం.

తన శిష్యులతో గౌతముడు నివసించే పవిత్ర భూమి. నదికి కొద్దిపాటి దూరంలో ఆశ్రమాన్ని నిర్మించుకున్నారు గౌతములవారు. శిష్యులకు పాఠాలు చెపుతూ మిగిలిన సమయంలో తపస్సు చేసుకుంటూ, తన తపస్సులో దర్శిస్తున్న సూత్రాలు శిష్యులకు వివరించి పాఠం చెపుతూ న్యాయ శాస్త్రాన్ని నిర్మిస్తున్నాడాయన.

ఆశ్రమ నిర్వహణకు అవసరమైనవన్నీ ఇక్ష్వాకుల నుంచి అడగబడకుండానే వస్తూంటాయి. కందమూలాలు కావలసినన్ని లభిస్తాయి.

ఆశ్రమ భూములను దున్ని సశ్యానుకూలం చేసిన శిష్యులు తొలకరి చినుకులు పడగానే భూమి విత్తడానికి అనుకూలం కాగానే రకరకాల కూరగాయలు విత్తుతారు. నివ్వరి ధాన్యాన్ని చల్లుతారు.

అవి పుష్కలంగా ఫలిస్తాయి. చాలినన్ని స్వీకరించి మిగతావి పొరుగు ఆశ్రమాలకు పంపుతారు. పశు పక్ష్యాధులకు ఫలహారం పెడతారు. గౌతములవారు అప్పుడప్పుడూ విదేహ రాజ్యానికి వెళతారు. ఆ రాజర్షి సన్నిధిలో తను ఏర్పరుస్తున్న గౌతమ న్యాయ సూత్రాలను చర్చిస్తారు. జనక మహారాజు రాజ యోగి. మహర్షులన్నా మహాత్ములన్నా ఆయనకు ఎనలేని గౌరవం.

గౌతముడి నిర్మల జీవితం ఆయనకి గౌరవ భాజకం ఆయన దర్శించి నిర్మిస్తోన్న న్యాయ సూత్రాలు సర్వ కార్యాలకూ, సర్వ దేశాలకూ, సర్వ జనులకూ శిరోధార్యాలనీ, వాటికి తగిన ప్రాచుర్యం ప్రచారం కల్పిస్తున్నారు.

ఆనాడు గౌతములవారు శిష్య సమూహాన్ని వెంటబెట్టుకుని నదికి వెళ్ళి పవిత్ర జలాలను తీసుకొచ్చారు. యోగం కల్పించే ఓ ప్రక్రియ పూర్తి చేయడానికి తగిన హోమం నిర్వహిస్తున్నారు. తనే కర్తగా కూర్చుని ఆ హోమం నిర్వహించసాగారు. శిష్యులు గురువుగారి సన్నిధిలో నిలుచుని హోమ ద్రవ్యాలు అందిస్తున్నారు. హోమం చక్కగా సాగుతున్నది.

గౌతముడి కంఠం నుండి వెలువడుతున్న మంత్రాలు ఆశ్రమ వాతావరణాన్ని మరింత ప్రశాంతం చేస్తున్నాయి.

ఆ సమయంలోనే...

అయోధ్యాపురి నుంచి కోసల రాజ్యం వెళుతూ మార్గ మధ్యం కాకపోయినా దారి మళ్ళించుకుని గౌతముడిని దర్శించి ఆశీర్వదించి వెళ్ళాలని భృగు మహర్షి తన శిష్య సంతతితో ఆశ్రమం చేరుకున్నాడు.

ఆయన ఆశ్రమ ద్వారం చేరుకోగానే పెంపుడు చిలుకలు స్వాగత మంత్రాలు పఠించాయి.

'స్వాగతం మహర్షి సత్తమా! స్వాగతం!' అన్నాయి.

అప్పుడే హోమం పూర్తయింది. పూర్ణాహుతి మిగిలిపోయింది. హోమగుండం వద్ద ఆశీనుడైన గౌతమ మహర్షి క్రతు మర్యాదననుసరించి ఆసనం నుండి లేవకుండా కదిలీ కదలనట్లుగా కదిలి తన ప్రధాన శిష్యులకు హెచ్చరిక చేశారు.

'శిష్యా! ఎవరో మహర్షులు విచ్చేసినట్టున్నారు. వెళ్ళి స్వాగతం పలికి ఆర్ఘ్య పాద్యాదులు సమర్పించు నాయనా!' అన్నారు.

శిష్యులు కదిలారు.

ఆశ్రమ ద్వారానికి పరుగు పరుగున వెళ్ళి భృగు మహర్షికి పూర్ణకుంభ స్వాతం సమర్పించుకున్నారు. ఆర్ఘ్య పాద్యాదులతో ఆశ్రమ మర్యాదలతో వారికి అతిథి సేవ చేశారు. ఆపై 'మహర్షీ! గురువులు హోమ నిర్వహణలో ఉన్నారు. పూర్ణాహుతి చేయాలి. తమరు విచ్చేసి...'

భృగువు లేచాడు.

యజ్ఞ వాటిక నివాస కుటీరానికి అల్లంత దూరాన ఉన్నది. అక్కడికి చేరగానే మహర్షులు పరస్పరం కనుసన్నలతోనే గౌరవించుకున్నారు. గురువులయినా, పెద్దలయినా, దేశాన్నేలే రాజాధి రాజయినా, యజ్ఞ వేదిక

సమీపంలోనూ, ఆలయంలో దైవసన్నిధిలోనూ తారసిల్లితే నమస్కరించవలసిన ధర్మం నిర్వర్తించనక్కరలేదు. వారికి నమస్కరిస్తే ఆలయంలోని దైవాన్ని, యాగ వేళలో ఆహ్వానింపబడిన దైవాల్ని అవమానించినట్టే. అందువల్లనే ఆలయంలోనూ యజ్ఞ వేదిక వద్దనూ పరస్పర గౌరవాలు కనుసన్న మాత్రాలే!

భృగు మహర్షిని ప్రార్థించారు గౌతముడు.

'అనుకోని రీతిగా తమరు విచ్చేయడం మా అదృష్టం! యగావసాన సమయంలో భృగు మహర్షుల రాక మా ఆశయ ఫలానికి సూచనగా భావిస్తున్నాము. తమ ఆధ్వర్యంలో ఈ యాగ పరిసమాప్తి కావాలని మా అభ్యర్ధన. పూర్ణాహుతికి ఆదేశించి ప్రారంభించండి!'

భృగు మహర్షికి ఎంతో ఆనందమయింది.

సకల శాస్త్రాలూ నేర్చి, ధర్మాలూ తెలిసి, న్యాయ సూత్రాలను నిర్మిస్తోన్న గౌతములంటే మహర్షి లోకంలో ఒక ప్రత్యేక గౌరవం ఉంది. ఆయన నిర్మల జీవనం, ప్రశాంత ఆశ్రమ జీవితం అందరికీ ఆదర్శప్రాయం. ఆయన శాంత చిత్తానికి ప్రతీక! కోపధారి అయిన భృగుమహర్షి కూడా ఆనందించాడంటే ఆయన గురించి చెప్పక్కరలేదు కదా!

పూర్ణాహుతి ప్రారంభమయింది. సకల ద్రవ్య శేషమూ హోమగుండంలో సమర్పించారు. హోమం పూర్తయింది. అందరికీ శిష్యులు హోమ భస్మాన్ని అందించారు. ఆపై అచట నుండి కదిలి సమీపంలోని తిన్నె మీద కూర్చున్నారు ఇద్దరు మహర్షులు. అశోక వృక్షం దట్టమైన నీలి నీడ కల్పిస్తున్నది.

'నాయనా గౌతమా! మేం కోసల దేశం వెళుతున్నాం. కౌసల్యా దేవికి పుత్రోదయం కలగాలని మంత్రోపదేశం చేసి, మంత్ర జలం ఇచ్చి ఆ విషయం కోసలేంద్రుడికి చెప్పడానికి వెళుతున్నాం. దశరధుడు సంతానం లేక పరితపించి పోతున్నాడు కదా! వేల ఏండ్లు గడిచినా పుత్ర సంతతి లేక ఆయన అలమటిస్తున్నాడు. త్వరలో సకలముని సమావేశం ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నాడు. కౌసల్య యీలోగా మంత్ర జపం పూర్తి చేసుకుని తోటి రాణులు సుమిత్రకూ కైకేయికీ ఉపదేశిస్తుంది. వారూ జపం పూర్తిచేస్తారు. అన్నీ చక్కగా అమరిపోతాయి.'

'దేశమే కాదు ఈ త్రేతాయుగమే తరించిపోతుంది మహర్షీ!' అన్నాడు గౌతముడు.

'అవును! మనమంతా అదృష్టవంతులం. ఒక ఆదర్శమూర్తి అవతరిస్తాడు! అతని సమకాలంలో మనం జీవిస్తాం! ఆ విషయం అటుంచు గౌతమా! తమరిప్పుడు నిర్వహించిన హోమం అపూర్వమైంది. దీని ఫలమేమో తెలుసా నీకు?' అడిగారు భృగువు.

'ఏముంది స్వామీ! లోకాస్సమస్తా సుఖినోభవంతు! అంతకంటే ఏమి కావాలి మహర్షీ!'

భృగుమహర్షి నవ్వారు వింతగా.

ఎక్కడో కోయిల కూసింది. పక్కనే ఉన్న రసాలం మీది జక్కువ పక్షులు కలస్వరం చేశాయి.

'లోకం సంగతి సరే మునీంద్రా! తమరి సంగతి ఏమిటీ?'

'నేనూ లోకంలోని వాడినే కదా! మా ఆశ్రమం ప్రశాంతంగా ప్రకృతి సిద్ధ ఫల సమృద్ధిగా ఉంటుంది. కృషి లభ్య సంభార సమన్వితంగా ఉంటుంది. అంతే!'

'అంతే కాదయ్యా! అమాయక చక్రవర్తీ! నువ్వు చేసిన ఈ హోమం ఫలితంగా నీ జీవితంలో శుభోదయమౌతుంది.'

'నా జీవితంలోనా!' ఆశ్చర్యపోయాడు గౌతముడు.

'అవును! నీకు పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది'

'అంటే!'

'అంటే! నీ జీవితం ద్వంద్వమవుతుంది'

'స్వామీ!'

'అవును గౌతమా! నీకు తగిన ఇల్లాలు లభిస్తుంది. ఏ మహనీయురాలు ఈ ఆశ్రమ సీమలో పాదం మోపుతుందో! ఇంతటి తపస్సంపన్నుడికి కన్యాదానం చేయగల పుణ్యాత్ముడెక్కడున్నాడో! ఎవరో! నాకయితే తెలియడం లేదు. దివ్యదృష్టికీ అందబోదని అలా యోచించడంలేదు. కానీ నీకు త్వరలో వివాహం జరుగుతుంది. ఈ ఆశ్రమానికి నీ అమృత జీవితానికీ పరిపూర్ణత సిద్ధిస్తుంది.'

గౌతముడు ఆశ్చర్యంలో మునిగిపోయాడు. ఏమీ చెప్పడానికి తోచలేదు. తనేదో సంకల్పించి హోమం పరిసమాప్తి చేశాడు. అనుకోకుండా ఈ దివ్యర్షి విచ్చేసి యిలా భవిష్యత్తు సూచిస్తున్నాడు. కానీ పరమేష్టి సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది అనుకుని అంజలి ఘటించి మహర్షి మాటలను ఆశీస్సులుగా స్వీకరించాడు.

* * * *

భృగుమహర్షికి ఆతిథ్యం ఏర్పాటయింది.

అయోధ్యా పురవరాధీశుడు- ఇక్ష్వాకుల కుల దీపకుడు- ఇనవంశ తిలకుడూ దశరథ మహారాజు ఆయన ప్రధాన సచివుడూ అయిన సుమంత్రుడు మహారాజా వారి అంతఃపురంలో ఆలోచనా మందిరంలో ఆసీనులై ఉన్నారు.

ప్రభువులకు ప్రశాంత చిత్తం కోసం దూరంగా వైణిక నిపుణి చతురిక వీణ వాయిస్తున్నది. చతురిక కౌసల్యాదేవి అంతరంగిక చెలి. కైకకు సఖి. సుమిత్రకు మిత్రురాలు. ముగ్గురు రాణులకూ ముచ్చట తీర్చే ముగుద.

సుతారంగా వినిపిస్తోన్న వీణానాదం వింటున్న మహారాజు లేచి పచార్లు చేయసాగాడు. సుమంత్రుడు ఏమీ తోచక దీర్ఘాలోచనలో ఏ పరిష్కారం తోచక మహారాజునే గమనించసాగాడు.

'సుమంత్రా!'

ప్రభువుల పిలుపుకి లేచి ఆయనను సమీపించాడు.

'విభాండక మహర్షికి హరిణి వల్ల జన్మించిన ఋష్యశృంగుల వారు పాదం మోపితే తప్ప రోమపాదుడి రాజ్యంలో క్షామం నివారణ కాదు. ప్రజలలో ఆయన కలిసిపోతే తప్ప అయోధ్యలో అడుగుపెట్టడు. ఆయన వచ్చేదెప్పుడూ? పుత్రకామేష్టి జరిగేదెప్పుడూ? ఫలం అందేదెప్పుడూ? ఆపై పుత్రోదయమై పుత్రుడి ముఖం చూసేదెప్పుడూ?' నిట్టూర్చినాడు దశరథుడు.

సుమంత్రుడు మెల్లిగా అన్నాడు.

'ప్రభూ అడవిలో తండ్రి తప్ప అన్య జన పరిచయం లేని ఋష్యశృంగ మహర్షిని కొనితేవటానికి వేశ్యోత్తమ బయలుదేరి వెళ్ళిందట ప్రభూ! తన ఆట పాటలతో ఆయన్ని ఆకర్షించి అలరించి ఆపై తన మాయలో బంధించి వంగ దేశానికి కొని రావటానికి తగిన ప్రణాళిక సిద్ధం చేసుకుందట!'

'కొడుకును క్షణమైనా విడిచి ఉండలేని ఆ విభాండక మహర్షి కను దృష్టినుంచి ఋష్యశృంగుడిని తప్పించడం సాధ్యమా!'

'కాలం కలిసి వస్తే!'

'కాలం.... బహు కాలంగా అనుకూల కాలం కోసం ఎదురుచూపులు చూడటంతోనే సరిపోతున్నదయ్యా....'

సుమంత్రుడేమీ అనలేదు. అంతలో ప్రతీహారీ వచ్చాడు.

## 6

'కనుక... ఇన్ని కల్పాలుగా సృష్టించని, ఇకముందు సృష్టించబోని సౌందర్య రాశిని ఇప్పుడే సృష్టిస్తాను. జగదేక సుందరిని మీముందు నిలుపుతాను. సోయగాల ప్రవాహం, సుకుమారాల సమూహం, అందాల రాశీత్వం, వన్నెల చిన్నెల వయ్యారాల రూపకం - ఓహ్ ఒకటేమిటీ? ఏ లోపం లేని అన్నిటా మిన్నదైన అందవతికి ఇప్పుడే జన్మనిస్తాను.

లోపం... ఇంతదాకా సృష్టించిన అందరిలో ఏదో ఒక లోపం ఉండనే ఉంది. దానికి తగిన కారణం ఉండే ఉంటుంది. అది నాటి మాట! నేటి మాట- సర్వ లక్షణ సంపన్నురాలూ, అందచందాలే ఐశ్వర్యంగా గల యువతీ అంగాంగాన అనుంగుని వైభవం అంగరంగ వైభవంగా ప్రకటించగల రసజ్ఞ మరెప్పుడూ తనకు సాటి రాగల స్త్రీ లేదని యుగాయుగాలూ చెప్పుకోగలిగిన అదృష్టవంతురాలు అయిన కన్యను నిర్మిస్తాను.

ఔను. ఆమె కన్యక! వివాహం జరిగినా, సంతానం కలిగినా ఆమె శాశ్వతంగా సకల లోకాలలోనూ 'కన్యక'గానే పిలవబడుతుంది. ప్రప్రథమ కన్య ఆమే! అది నా వరం. కొందరికి కలవరం కలిగించే వరం'.

బ్రహ్మ ఆగాడు. పరిపూర్ణ తృప్తితో క్షణమాత్రం తలపోశాడు. తన సృష్టిలో ఎక్కడెక్కడ ఏయే అందాల ఔన్నత్యం ఉందో అవన్నీ తలపోశాడు.

రంభ ఊరువులూ, మేనక కన్నులూ, హరిణి చూపులు, హేమ శరీర ఛాయ, మదాలస మరుపు, శశిరేఖ మెరుపు తిలోత్తమ నాజూకు, అలా అలా ఇలా తలంలోని మేలి మేలి అందాలూ అన్నీ రంగరించాడు.

విద్య, వినయం, వివేకం ప్రసాదించాడు.

దేవాధి దేవతలు, ముని పుంగవులు, మహర్షులు, బ్రహ్మర్షులు, దేవర్షులు కన్నులు విచ్చి చేష్టలుడిగి, అచ్చెరువంది చూసేలా వారి ముందు ప్రత్యక్షమయింది ఓ అందాల రాశి! ఓ జగదేకసుందరి!

ఆమెను చూడగానే యతులకు మతులు పోయాయి. మునులకు మనస్సులు చలించాయి. మహర్షులు హర్షాతిరేకంతో పరవశులయ్యారు. బ్రహ్మర్షుల బుద్ధి సంచలించింది.

ఆ లలనా శిరోమణి కనులు విప్పింది. కనులు తిప్పింది. కనులారా అందరినీ కనుగొంటూ ఆబ్జవునికి అంజలించింది.

ఆ కదలికలు అమరేంద్రుడికి కలవరం పుట్టించాయి.

'జనకా!'

కోయిల కుహూ కుహూమని పలికిందా! చిలుక చిరు పలుకులు చిలుకరించిందా! నీలకంఠం తన కలకంఠం సవరించిందా!

ఊహు! ఆ మదవతి పలుకరించింది బ్రహ్మను.

'అహల్యా!' అని పిలిచాడు.

ఆయనలా పలుకరించగానే ఆ యువతీ లలామ పేరు 'అహల్య' అక్కడున్న అందరికీ తెలిసిపోయింది. అహల్య! అహల్య! అహల్య! అందరినోళ్ళా అహల్య నామస్మరణం!

పంచాక్షరీ జప పరాయణులు దానిని మరిచి అహల్య! అన్నారు.

అష్టాక్షరీ మంత్రోపాసకులు మైమరిచి అహల్యా! అహల్యా! అని స్మరించారు.

ఓంకార స్మరణే అనుక్షణం కర్తవ్యమైన మహనీయులు అహల్యా! అని నామస్మరణ చేశారు.

'ఓ సుకుమారే! నీ పేరు అహల్య!' అన్నాడు సృష్టికర్త.

తిరిగి నమస్కరించి ఇటు తిరిగి చూసింది అహల్య.

ఆమె వెంటే చూపులు తిప్పుకుంటూ తిప్పలు పడుతున్న మహేంద్రుడప్పుడే ఆమెను చూశాడు. ఇద్దరి చూపులు కలిశాయి.

తొలిసారి ఆమె కన్నెత్తి చూసింది బ్రహ్మ పదకమలాలు, మలిసారి ఆమె కనులు విప్పి చూసింది మహేంద్రుడి వదన కమలం. అందులోని జంట పద్మాలు. నాలుగు కనులూ ఒకటయ్యాయి.

పుట్టి నేర్చిందో-పుట్టక ముందే నేర్చిందో- చప్పున ఓ చూపు చూసి తల వంచుకుంది అహల్య!

శతకోటి మన్మధులు పుట్టుకొచ్చారు. ఆ చూపుల తూపుల్లో ఆ వాల్చూపుల వయ్యారంలో మునకలేస్తున్నాడు ఇంద్రుడు. అక్కడున్న అందరూ అహల్య సౌందర్యాన్నే గమనిస్తున్నారు.

ఆడవారైన సరస్వతి, రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ మొదలైన వారంతా అచ్చెరుపాటుతో విచ్చిన కనులతో వీక్షిస్తున్నారు.

అందరినీ అలా చూసిన నారదుడికి నవ్వొచ్చింది.

'చెల్లెలా!' పిలిచాడు నారదుడు. 'నేను నీకగ్రజుడిని అవుతాను. నేను బ్రహ్మ మానసపుత్రుడిని. నారదుడ్ని! నువ్వూ బ్రహ్మ మానస పుత్రివే!'

ఆమె అన్నగారి పాదాలను చూస్తూ వందనం సమర్పించింది.

'ఇష్టవర ప్రాప్తిరస్తు!' దీవించాడు.

ఉలికిపడ్డాడు ఇంద్రుడు.

బ్రహ్మ కూడా కలవరపాటు చెందాడు.

'పితామహా! చెయ్యక చెయ్యక అద్భుత సృష్టి చేశావు. నభూతో నభవిష్యతే కాదు. నవర్తమానః అన్నట్లు లావణ్య రాశిగా పోత పోశావు. ఏ కన్యకైనా తన తండ్రి తగిన వరుణ్ణి ఎన్నిక చేసి కన్యాదానం చేసి అత్తవారింటికి పంపితే అనురూప లావణ్య తారుణ్యాదుల సరిజోడుతో సంసారం చేసి తరిస్తుంది. నా చెల్లెమ్మకు ఏ వరుడిని సృష్టించి ఉంచావ్!'

ఉలిక్కిపడ్డాడు బ్రహ్మ.

అవును ఎవరు? ఎవరు? ఎవరు? అనుకున్నాడు.

వింటూన్న దేవ నాధుడికి మంచి అవకాశం చిక్కినట్టయింది.

'దేవర్షీ! ఎదురుగా నేనుండగా మరొకరి మాటెందుకయ్యా? ముక్కోటి దేవతలు మొక్కులందుకునే మూడు లోకాలకూ అధిపతిని. ఈ సృష్టికర్త, ఆ స్థితి కారకుడు, ఆ లయ కారకుడూ, ఆపై నేనే కదా ప్రప్రథముడిని. వీరైనా నన్నే

త్రిలోకాధిపతిగా మన్నిస్తారు కదా! అమరలోక అర్ధ సింహాసనం అలంకరించే అదృష్టం అహల్యకు దక్కనీ!' అన్నాడు దేవేంద్రుడు.

ఆశగా ఆకాంక్షాయుతంగా అంతరంగం నిండా తననే నింపుకుని తనవైపు చూస్తూ అభ్యర్థించిన అమర దేవుడిని చూసి సిగ్గుతో మొగ్గలా ముడుచుకు పోయింది అహల్య.

తొలిచూపులోనే ఇంద్ర వైభవం చూసిన ఆమె కన్ను చెదిరింది.

సృష్టికర్త నిరసనగా చూశాడు.

'భలే బాగుందయయా దేవేంద్రా! నీ పాదాలకి నీవే నమస్కరించుకుని, నిన్ను నీవే దీర్ఘాయుష్మాన్ భవా అని దీవించుకున్నట్లుంది. నీకు నీవే నీ అర్హత ప్రకటించుకుని నిన్నెనిక చేసుకుంటే ఎలా? ఎన్నిక చేయవలసింది చెల్లెలు! లేదా పితామహుడు. అయినా స్వర్గానికి వెళ్ళినా సవతి పోరు తప్పలేదన్నట్లు అహల్యకు శచీదేవి సాపత్నీతం బాధావహం కాదా! అందునా నీకు భార్య ఒకతే! కానీ బహునారీ సుందరుడవు కాదూ నీవు?'

ఇంద్రుడికి చిర్రెత్తుకొచ్చింది.

అహల్య చూపులతో సమ్మతి తెలిపిందని తనలో తాను మురిసిపోతుంటే- బ్రహ్మ అఖిల లోకాలకూ అల్లుడవుతాడని మురిసి కూతుర్ని ఇచ్చి కట్టబెడతాడని తను తలపోతల్లో తల మునకలవుతూంటే మధ్యలో ఈ కలహభోజనుడి అడ్డు పుల్లెమిటీ? అనుకున్నాడు.

'వరుడి యోగ్యతలు పరమేష్టి బాగా నిర్ణయించగలడులే! కాబోయే బావగారితో మేలమాడకు అప్పుడే' అన్నాడు నవ్వుతూ.

ఇంద్రుడి మాటలు నారదుడికి నవ్వు తెప్పించాయి.

అంతలో విశ్వామిత్రుడు అన్నాడు 'సర్వ కారణ కర్తా! సృష్టికి ప్రతి సృష్టి చేసి అపర బ్రహ్మ అనిపించుకుని, వశిష్టుడంతటి వాడితో బ్రహ్మర్షి అనిపించుకున్న ఈ గాధేయుడికి కన్యాదానం చేసి నీ సృష్టిని సార్ధకం చెయ్!'

'గాధేయా! రా గాధేయా! రా - గాధేయా! అని పిలిచి మన్నింపక ముందే పీటెక్కి కూర్చోకు! పితామహులు తగిన వరుణ్ణే ఎన్నిక చేస్తారులే!' అన్నాడు నారదుడు.

'చక్కగా అన్నావు. జడ ముడికీ, మొండి జడదారికీ జగదేక సుందరి సౌందర్యాభిలాషా!' అన్నాడు దేవేంద్రుడు.

విశ్వామిత్రుడు జవాబు చెప్పేలోగా మరో దిక్పాలకులకూడూ ఇంకో మునీ- ఓ దిక్పాలుడు అలా అలా అందరూ అహల్యని అభిలషిస్తూ అర్ధించారు.

బ్రహ్మకి సమస్య పరిష్కరించరానిదిగా కనిపించింది.

'పుట్టక పుట్టక ఓ పిల్ల పుడితే తోబుట్టువు పుట్టీ పుట్టగానే పెద్ద సమస్య పుట్టించిందే!' అన్నాడు నారదుడు.

'నారదా! అహల్యకు అనురూప వరుడ్ని, అన్ని విధాలా యోగ్యుడ్ని అల్లుడిగా నా మన్ననలు పొందగలిగిన మేధావిని సూచించు'

'అటు తిరిగి ఇటు తిరిగి ఇది నా మీదే పడిందా'

'బావగారిని వెతికేది బ్రహ్మవిద్యా! ఇటునుండగా ఎన్నిక చేయడం ఏమంత కష్టం' కల్పించుకుని అన్నాడు మహేంద్రుడు మళ్ళీ.

'వర పరీక్ష ఒకటే సమస్యా పరిష్కార సాధనంగా తోస్తున్నది'

'వర పరీక్షా?' అడిగాడు దేవేంద్రుడు.

'ఔను. వర పరీక్ష ఒకటే మార్గం. పితామహా! పరీక్షలో నెగ్గిన వారికి అహల్యనిచ్చి కన్యాదానం చేయండి! అంతే!'

'ఏమి పరీక్ష? అదీ నీవే సూచించు!' అన్నాడు.

'భూ ప్రదక్షిణం చేసి ముందుగా ఎవరయితే రాగలుగుతారో వారే వర పరీక్షలో నెగ్గినట్టు!'

'భేష్! చక్కని మాట. పరుగు పందెంలో గెలిచిన వారికే పరువాల కుప్ప దక్కుతుంది' పరీక్షకు సమ్మతించి అన్నాడు పరమేష్టి.

'మరి బయలుదేరమా!' అన్నాడు మహేంద్రుడు తొందరపడ్తూ అడిగాడు.

'మరింకెందుకు ఆలస్యం? ఇక్కడినుంచి బయలుదేరి ఇక్కడికే తిరిగి రండి!'

'ఇంద్రా! మాయలూ, మాయోపాయాలు వద్దు. చక్కగా చక్కని రాజమార్గంలో గెలిచి...'

'పందెంలో గెలిచి అందాలరాశి అహల్య పాణిగ్రహణం చేస్తా!' అంటూ కదిలాడు అమరేంద్రుడు అహల్య వైపు దృష్టి నిలుపుతూ. అహల్య ఆరాధనా పూర్వకంగా చూసింది.

ఒకరివెంట ఒకరు. పందెంలో పాల్గొనతలిచిన వారు కదిలి వెళ్ళగా కథ ఏ మలుపు తిరుగుతుందో కన్నె ఎవరి సొత్తు అవుతుందో కడదాకా ఆగి చూసి వెళ్ళాలనే కుతూహలం కలవారు సభ విడిచి నందనవనం ఛాయల్లో విశ్రమించారు. బ్రహ్మ, సరస్వతి, నారదుడు మిగిలిపోయారు.

* * * *

ప్రతీహారి ప్రవేశించి, దశరథ మహారాజుకు వినయంగా శిరసొగ్గి అన్నాడు 'జయము జయము మహారాజా! వంగ దేశం నుండి వెళ్ళిన వేశ్యా బృందం ఋష్యశృంగుల వారిని ఆకర్షించి విభాండక మహర్షుల వారికి ఎరుక కాకుండా తమ అందచందాలతో నాగరిక ఆకర్షణలతో వారిని నగరానికి తీసుకుని వచ్చారట ప్రభూ!

ఋష్యశృంగుల వారు వంగ భూమి మీద అడుగు మోపీ మోపగానే ఎక్కడెక్కడి మేఘాలూ చెలి వివాహానికి విచ్చేసే చెలికత్తెలలా వచ్చి గుమిగూడి కుండపోతగా వర్షించాయట ప్రభూ!

ఆ వర్షాల వల్ల నదులు పొంగాయట. చెరువులు గుంటలు నిండాయట. భూమి కడుపారా వర్ష జలాన్ని తాగి కర్షకానందం కలిగేలా కృషి యోగ్యమైందట ప్రభూ! రోమపాద మహర్షులవారు తమ పుత్రిక శాంతాదేవి గారిని విభాండక కుమారులు ఋష్యశృంగుల వారికిచ్చి కన్యాదానం చేయ సంకల్పించారట.

దైవజ్ఞులు సుముహూర్తం నిర్ణయించి, తమరిని కుటుంబ పరివార సమేతంగా ఆహ్వానించటానికి వాయువేగ మనోవేగాలతో పయనించే గుర్రాలను పూన్చిన రథాలపై విచ్చేస్తున్నారట ప్రభూ! మన వేగులు ముందుగా తెచ్చిన శుభ వర్తమానమిది' తను చెప్పవలసినది చెప్పి శిరస్సు వంచాడు ప్రతీహారి.

దశరథుడికి చెప్పలేని ఆనందం కలిగింది.

వార్తాహరుడి వైఖరి వార్తను విన్నవించిన విధానం ఆ పదాల పొందిక ఆ అక్షర విన్యాసం ఆయనను ఎంతగానో అలరించాయి.

ముఖ్యంగా 'రోమపాద మహర్షుల వారు తమ పుత్రిక' అని ఉభయార్థకంగా ప్రయోగించిన అతని నేర్పరితనానిని దశరథుడు చాలా సంతోషించి తన కంఠసీమ నలంకరించిన ముక్తహారాన్ని బహూకరించాడు.

శిరస్సు వంచి బహుమానం స్వీకరించాడు ప్రతీహారి.

అంతలోనే మరొకడు 'జయము జయము మహారాజా!' అంటూ ప్రవేశించి రోమపాద మహారాజులవారి వసువున విచ్చేసిన పురోహిత బృందం తమ దర్శనార్థం వేచి ఉన్నారు' అని నివేదించారు.

మహారాజు పెల్లుబికిన ఆనందంతో 'సుమంత్రా నీవు స్వయంగా వెళ్ళి వారిని దర్శించి మా మాటగా ఆహ్వానించి వారికి తగిన విడిది ఏర్పాట్లు చేసి మా దర్శనానికి వెంట బెట్టుకుని రావయ్యా!' అన్నాడు.

సుమంత్రుడు 'చిత్తం!' అంటూ సెలవు తీసుకున్నాడు.

## 7

భృగుమహర్షికి వీడ్కోలు పలికి గౌతమ మహర్షి తన శిష్యులకు న్యాయ సూత్రాలు పాఠం చెప్పడం ప్రారంభించాడు.

పాఠం జరుగుతూ ఉంది. వేదిక దగ్గరలో ఉన్న చెట్ల మీద కూర్చుని ఉన్న చిలుకలు కూడా పాఠాలు శ్రద్ధగా వింటున్నాయి. ఆ సమయంలో నారదుడు 'నారాయణ! నారాయణ!' అంటూ గగన వీధి నుండి భువన మండలానికి దిగాడు.

గౌతముడు శిష్యులతోపాటు లేచి వారికి సురమునికి స్వాగతం పలికాడు. అర్ఘ్యపాద్యాదులు సమర్పించి పండ్లు, పుట్టతేనె, పాలు సమర్పించాడు. మధు ఫలాలు స్వీకరించి కొద్దిగా పుట్టతేనె ఆస్వాదించి, కడుపు నిండా పాలు తాగి సంతుష్టితో దీవించాడు దేవర్షి.

'శుభమస్తు! శుభమస్తు!'

గౌతముడు అబ్బురపాటుతో అడిగాడు 'ఏమది దేవర్షీ!'

'గౌతమా! మనకు ఋషి సంప్రదాయ రీత్యా నెయ్యమే గడిచిందిన్నాళ్ళూ! ఇక ముందు....'

'తమతో ఎప్పటికీ నెయ్యమే నడుస్తుంది దేవర్షీ! కయ్యానికి తావే ఉండదు'

'నేనెంత కలహ భోజనుడినైనా మన మధ్య కయ్యాలెందుకు వస్తాయిలే! నేనన‌బోయింది వియ్యం గురించి'

'వియ్యమా?' ఆశ్చర్యంతో అడిగాడు గౌతముడు.

'ఔను! మన సంబంధం మౌని సంప్రదాయమే కాక, ఇచ్చి పుచ్చుకునే సంప్రదాయానికి చేరువ కావాలి!'

నవ్వాడు గౌతముడు. 'బాగున్నది దేవర్షీ బాగున్నది. నేనా బ్రహ్మచారిని. తమరా దేవర్షులు. బ్రహ్మ నిష్టా గరిష్టులు! వివాహమే లేని మనకు వియ్యమెలా అవుతుంది. దేవమునులు తమ మనసులో ఏదో దాచి దోబూచులాడుతున్నట్టున్నారు' అన్నాడు.

పకపక నవ్వాడు నారదుడు.

'బ్రహ్మ తన కరకమలాలతో నీ పదకమలాలు కడిగే అవసరం వచ్చిందయ్య గౌతమా! ఆ అదృష్టం నీవు దక్కించుకుంటే ఆనందించే వారిలో నేను ప్రధముడినవుతాను'

గౌతముడు వింతగా చూశాడు.

'దివ్యర్షీ! ఇది మరీ విచిత్రంగా ఉంది. సంతానమే లేని పరమేష్టికి స్త్రీ సంతానం ఎక్కడిది! ఆయన కాళ్ళు కడిగి కన్యాదానం చేసే అపూర్వ అవకాశం ఎక్కడిది! తమరంతా చిత్ర విచిత్ర వ్యాఖ్యలు చేస్తున్నారు' అన్నాడు.

అంతలో గౌతమాశ్రమంలో గోశాలను పరిరక్షించే శిష్యుడొకడు పరుగు పరుగున వచ్చి 'గురువు గారూ! మన కపిలలో ఈనే లక్షణాలు మొదలయ్యాయి. అంభారవాలు దిక్కులదిరేలా చేస్తున్నది. నిలిచిన చోట కుదురుగా నిలవక తిరుగుతున్నది. మాయ విడవబోతున్నదని చెప్పాడు కాపరి' అన్నాడు.

గౌతమాశ్రమంలో గోసంపదకు కొదవే లేదు. ఎప్పుడూ ఏదో ఆవు చూపుతోనో పాడితోనో ఉంటూనే ఉంటుంది. కానీ కపిల చాల ఏండ్లుగా ఈనలేదు. ఇటీవలే అది ఈననై ఉంది.

గౌతముడు సంతోషించాడు.

నారదుడు ఆ మాటలు విని పరమానందం చెందాడు. 'గౌతమ మహర్షీ తక్షణం మనం కదిలి గోశాలకు చేరాలి. పద!' అని తొందరించాడు.

గౌతముడు మరేమీ అనకుండా కదిలాడు. శిష్యులూ అనుసరించారు. వారు అక్కడికి వెళ్ళేసరికి ఆవు సగం ఈనింది. ఆవు గర్భం నుండి దూడ శిరస్సు వెలికి వచ్చింది. శేష భాగం క్రమక్రమంగా వెలికి వస్తున్నది.

'ఊ! ఆలస్యం చేయకుండా తక్షణమే గోమాతకి ప్రదక్షిణం చేయవయ్య గౌతమా!' అని ఆదేశించాడు నారదుడు.

గౌతముడు ఆ గోమాతకు ముమ్మారూ ప్రదక్షిణించి గోపృష్ఠానికి నమస్కరించి తిరిగి నారదుడి సమీపానికి వచ్చి నిల్చున్నాడు. మరి రెండు ఘడియలకు గోవు తన బిడ్డకు జన్మనిచ్చింది. కోడె జన్మించింది. పశువుల కాపరినీ, గోశాల సందర్శకుడైన శిష్యుడినీ ఆవునూ, దూడనూ జాగ్రత్తగా చూసుకోమని దాని శరీరం శుభ్రం చేసి వేడి నీళ్లతో కడిగి మేత వేయమని ఆదేశించాడు గౌతముడు.

అక్కడ నుండి కదిలి తన కుటీరం చెంతకు వచ్చాడు. ఆయన వెంటనే నారదుడు వచ్చాడు. రసాల వృక్షం నీడలో కూర్చున్నారిద్దరూ! మామిడి చిగుళ్ళు వేస్తున్నది. పూత కొంత పిందెలుగా మారుతున్నది.

కొంత కాయలుగా మారుతున్నవి. మావి చివుళ్ళు వేసి కోయిల కుహూ కుహూ రాగం వినిపించసాగింది.

'శుభం!' అన్నాడు నారదుడు.

'ఏమిటీ మహర్షీ?' అన్నాడు గౌతముడు.

'కళ్యాణమస్తు!' మళ్ళీ అన్నాడు నారదుడు.

'తమరి అసంపూర్ణ విషయ విన్యాసంతో పూర్తిగా బోధపడక అంతరంగంలో ఆలోచనలు కదలాడుతున్నాయి! ఇకనైనా పూర్తిగా చెప్పండి'

'గౌతమా, ఇంద్రలోకంలో ప్రారంభమైన చిన్న సమస్య బ్రహ్మలోకం దాకా వచ్చింది. ఎవరు అందగత్తెలని ప్రశ్నించిన దేవేంద్రుడి ప్రశ్నకు అందరూ తామే అందగత్తెలమనే రీతిలో ప్రతిధ్వనించారు. వారి వారి అభిప్రాయాలు వెల్లడించిన బ్రహ్మర్షుల, మహర్షుల మధ్యా వాదోపవాదాలు చెలరేగాయి. దిక్పాలురూ తగాదాలో తలదూర్చారు.

సమస్యనైతే సృష్టించగలిగాడు కానీ దాన్ని పరిష్కరించలేకపోయాడు మహేంద్రుడు. అందర్నీ వెంట పెట్టుకుని బ్రహ్మ సన్నిధికి వచ్చాడు. విషయం విన్నవించాడు. అంతా విన్న సృష్టికర్త ఇన్ని యుగాలుగా తను సృష్టించిన సుందరీమణుల్లో లోపం లేని స్త్రీ లేదనీ. ఇప్పుడో కన్యను సృష్టిస్తాననీ ఓ యువతీని సృష్టించి 'అహల్య' అని నామకరణం కూడా చేశాడు.

ఆ కన్యామణిని చూసి ఆశ్చర్యపడ్డారంతా! ఇంద్రాది దిక్పాలకులూ, విశ్వామిత్రాది మహర్షులూ అంతా అర్థించగా ఎవరికి కన్యాదానం చెయ్యాలో బ్రహ్మకు పాలుపోలేదు. నన్ను సంప్రదించాడు పితామహుడు.

వర పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణుడైన వరుడికిచ్చి పెళ్ళి చెయ్యమని సూచించాను. భూమండల ప్రదక్షిణా వర పరీక్షలో శుల్కంగా నిర్ణయించబడింది. ఎవరు ముందుగా భూ ప్రదక్షిణ పూర్తిచేసుకుని వస్తారో వారు అహల్యా పాణిగ్రహణ యోగ్యులు. ఎవరు ప్రప్రథములో వారే సృష్టికర్త అల్లుడవుతారు.

'నీవు ఈనుతున్న ఆవుకి ముమ్మారూ ప్రదక్షిణం చేశావు కనుక అది గో ప్రదక్షిణే అయినా భూ ప్రదక్షిణతో సమానం. నీవే మున్ముందుగా బ్రహ్మ నిర్ణయించిన పరీక్షలో ఉత్తీర్ణుడవయ్యావు. ఇది దైవసంకల్పం. బ్రహ్మ నిర్ణయం! నీకు అహల్యతో జీవితం ముడిపడి ఉంది. కనుక తక్షణం బ్రహ్మలోకం వెళదాం పద!'

గౌతముడి మనస్సు ఆనంద తరంగితమైంది. నారద గౌతములు బ్రహ్మ లోకానికి ప్రయాణమయ్యారు.

* * * *

సరస్వతి సృష్టికర్తను చూసి అన్నది 'లేక లేక పుట్టిన ఓ ఆడపిల్లకి- అదీ జగదేకసుందరికి తల్లిదండ్రులమయ్యాం! ఓ అచ్చటా ముచ్చటా లేదు. పుట్టడమే యవ్వనవతిగా పుట్టింది. పుట్టీ పుట్టగానే సమస్యను తెచ్చిపెట్టింది. అవునూ భూమండలంలో అందరూ అనుకుంటారు కదా! బ్రహ్మ ఏనాడో ముడి వేసి ఉంటారని. మరి మన అహల్యకు ఎవరితో ముడి పెట్టారు?'

చదువుల దేవి అడిగిన ప్రశ్నకు చిరునవ్వు నవ్వాడు సృష్టికర్త. అంతే కానీ సమాధానం చెప్పలేదు. అవును అది దేవరహస్యం మరి!

అహల్య ఇద్దర్నీ చూస్తూ ఉండిపోయింది.

ఆమెకు ఇంద్ర వైభవం, విశ్వామిత్రుడి తపో వైభవం కనుల ముందు కదలాడాయి. మహేంద్రుడు తన ముల్లోకాధిపత్యంతో, తన శక్తిసామర్థ్యాలతో మునుముందుగా భూ ప్రదక్షిణం చేసి వస్తాడో, సృష్టికే ప్రతిసృష్టి చేసిన

విశ్వామిత్ర మహర్షి ముమ్మందుగా వస్తాడో అని అనుకుంది.

అంతలో నారాయణ స్మరణం వినిపించింది.

'నారాయణ! నారాయణ!' అనుకుంటూ నారదుడు వచ్చాడు.

ఆ వెనుకనే గౌతమ మహర్షి వచ్చాడు. వచ్చీ రాగానే బ్రహ్మను స్థుతించే మంత్రాలు పఠిస్తూ బ్రహ్మ కనక పీఠం చుట్టూ ప్రదక్షిణ చేసి ఆపై సరస్వతీ ఉపనిషత్తు పఠిస్తూ ప్రదక్షిణ చేశాక 'నమామి యమినీ నాధ రేఖాలంకృత కుంతలామ్' అని ఆయన చేసిన స్థవం శారదాదేవిని అలరించింది.

బ్రహ్మ బ్రహ్మానంద భరితుడయ్యాడు.

'ఏమి నారదా! గౌతమ మహర్షి మా సందర్శనానికి విచ్చేశాడేమీ?'

'పితామహా! వరుల వరులో చివర చేరినా, అందరికీ అగ్రభాగాన నిలిచినట్టు ముందుగా మీ సన్నిధికి చేరుకున్నాడు తండ్రీ!'

'ఏమిటేమిటీ?'

'అవును తండ్రీ! గౌతమ మహర్షి అహల్యా కరగ్రహణానికి విచ్చేశాడు!'

'ఏమంటున్నావ నారదా!'

అదే సమయంలో అహల్య గౌతముడిని చూసింది. గౌతముడు బ్రహ్మనే చూస్తున్నాడు.

'నేను భూలోకం వెళ్ళి ఇక్కడ జరిగిన విషయాలు అన్నీ యధాలాపంగా వినిపించాను. నా మనసులో మరే ఉద్దేశ్యం లేదు. కేవలం ఇక్కడ జరిగిన అహల్య సృష్టి ఆమె సృష్టికోసం జరిగిన కల్లోలం. ఆపై అహల్య వివాహ విషయం. ఇంద్రుడి అభ్యర్థన. తమరు ఏర్పరచిన నిబంధన చెప్పాను అంతే!'

'అంతేనా!'

'అంతే నాన్నగారూ! అంతకు మించి యింకేం చెప్పలేదు'

'మరి గౌతముల రాకకు కారణం?'

'చెప్పానుగా. పోటీపడి, పోటీలో ప్రథమంగా నిలిచి, పోటీలో గెలిచి, పందెం బహుమతిగా అహల్యను స్వీకరించడానికి విచ్చేశారు.'

"అదెలాగ? మునుముందుగా అందరికంటే అతి వేగంగా బయలుదేరిన మహేంద్రుడిని, దిక్పాలురనూ, మరెందరో మునీంద్రులనూ వెనకబెట్టి తాను ఎలా ముమ్ముందు రాగలిగాడు? భూప్రదక్షిణం చేసినట్టు సాక్ష్యమెవరు?'

'నేనే తండ్రీ!'

'నారదా! ఇదంతా ఏదో నీ ప్రణాళికలో భాగంగా ఉంది. ఏదో కారణంగా నీవు కలహం పుట్టించవు కదా!'

'కళ్యాణం జరగవలసిన సమయంలో కలహమా తండ్రీ! అదేమీ లేదు. చెల్లాయికి తగిన వరుడు లభించాడనే సంతోషంతో నేను కల్పించుకుని చెప్పాను. అంతే! మరింకేం ఆలోచనా లేదు. ప్రత్యేక శ్రద్ధా లేదు!'

'నిజంగా గౌతములు భూప్రదక్షిణం చేశారా నారదా!' అడిగింది వీణాపాణి.

'నిజం! నిజం! నిజం! ముమ్మాటికీ నిజం! అయినా నేను అబద్ధం చెపుతానా? తల్లీ! ఎక్కడైనా నిజం చెప్పి- నిష్ఠూరమాడి- కలహబీజం వేస్తాడనే నిందిస్తారు కానీ అబద్ధాలాడి, లేనిపోని కబుర్లు చెప్పి కలహం సృష్టిస్తాడని ఎవరూ అనరు కదమ్మా!'

'ఔనౌను! అదీ నిజమే!' అన్నాడు సృష్టికర్త.

'అప్పుడెప్పుడో వెళ్ళిన వారు ఇంకా రాలేదు. ఈయన అప్పుడే తయారై వచ్చి, ఇప్పుడా మరెప్పుడూ పెళ్ళి అన్నట్లు నిలబడ్డాడు. ఏమిటిది నారదా?'

"ఏముంది తండ్రీ! సూక్ష్మంలో మోక్షం'

'అంటే?'

'అంటే-వింటానికీ వినోదంగానూ, ఔనంటానికి ఆనందంగానూ ఉంటుంది. గౌతముల ఆశ్రమంలో నేను వెళ్ళిన సమయానికి ఓ కపిల ఈనుతూ ఉంది. సగం ఈనిన ఆ కపిలకు మహర్షులు- న్యాయ ధర్మ సూత్రాలను నిర్మించిన

గౌతములవారు ప్రదక్షిణం చేశారు. ఈనే గోవుకు ప్రదక్షిణం భూప్రదక్షిణా పుణ్యాన్ని ఇస్తుందని కదా శృతి! మరి మన నిబంధన భూప్రదక్షిణే కదా! అది నిర్వర్తించిన గౌతములవారు నియమం ప్రకారం అహల్యా పాణిగ్రహణకు అర్హులే కదా తండ్రీ!'

'ఔను! ధర్మం ప్రకారం, నియమం ప్రకారం, గౌతములు చేసింది ధర్మసమ్మతం! వారు వరపరీక్షలో నెగ్గినట్టే!'

గౌతములు చిరునవ్వు నవ్వారు.

'కన్యా వరయతే రూపం! మాతా విత్తం! పితాశ్రుతం అని కదా లోక లక్షణ. వేదవేదాంగ వేత్తయై, న్యాయ సూత్రాలను నిర్మించిన గౌతములు నా దృష్టిలో పరమ యోగ్యులు!'

'పితామహా! మీరు చెప్పిన ప్రకారం రూపహీనుడైనా, పండితుడు కాకపోయినా, ధనహీనుడైనా, ఎవరికీ నచ్చారు కదా! కానీ మనం చేసిన నిబంధన భూ ప్రదక్షిణే కానీ మరేమీ కాదు. పోటీలో పాల్గొనేవారూ పందితుడూ, రూపవంతుడూ, ధనవంతుడూ కూడా అయి ఉండాలని నిర్ణయించలేదు కదా!'

తలూపేడు పితామహుడు.

సరస్వతి చిరునవ్వు నవ్వింది.

'కానక కన్న సంతానాన్ని కానలకే అర్పిస్తున్నారా? అహల్య ఆశ్రమవాసిని అవుతుందా?' అంది.

'అమ్మా!' తొలిసారి నోరు విప్పింది అహల్య. అన్నివిధాలా యోగ్యులయిన వారితో జీవితం అడవిలో అయినా నాకు స్వర్గతుల్యం కదా! తండ్రి గారి నిర్ణయమే నాకు శిరోధార్యం!'

'లెస్స పలికితివమ్మా!' మెచ్చుకున్నాడు నారదుడు. 'పుట్టింటికీ మెట్టినింటికీ కీర్తి తెచ్చేలా నడుచుకో! సృష్టించినందుకు పరమేష్టికీ, స్వీకరించినందుకు గౌతములకూ పేరు ప్రఖ్యాతులను తీసుకురావాలమ్మా!'

హితోపదేశం చేశాడు నారదుడు.

'నారదా!'

'ఏమి సెలవు? పరమేష్టీ'

'మహేంద్రుల వారు వచ్చేవరకూ వేచి ఉండాలా?'

'నారాయణ! నారాయణ! నన్నా అడుగుతారు? నాలుగు వేదాలను ప్రవచించిన వారు, అఖిల ధర్మాలూ ఎరిగినవారు. తమరికి తెలియని ధర్మం ఉందా?'

'అక్కర్లేదనే మా భావన. గౌతములు ముందొచ్చారు! నిర్ణయించిన నిబంధన నెరవేర్చారు. ముందొచ్చిన వారికే కదా కన్యనిచ్చి పెళ్ళి చేస్తామని చెప్పాం. వారొచ్చారు. రానివారికోసం ఆగవలసిన అవసరం లేదు. వెంటనే పెళ్ళి జరిపిద్దాం!'

'బ్రహ్మ వాక్కు వేద శాసనం కదా! అలాగే కానివ్వండి!'

సంకల్ప మాత్రంలో వివాహ వేదిక తయారయింది. సర్వాంగ సుందరంగా వెలసింది కళ్యాణ వేదిక.

సమస్త సంభారాలు, అగ్నిహోత్రంతో సిద్ధమయ్యాయి. పెళ్ళిపీటల మీద గౌతముణ్ణి ఆశీనుణ్ణి చేశాడు నారదుడు. గౌతములు కూర్చోగానే ముత్తైదువలు అహల్యను తెచ్చి కూచోబెట్టారు. క్షణంలో ఆమె సర్వాలంకార భూషిత అయింది. వేద మంత్రాలు వినిపించసాగాయి. గౌతముడు అహల్యను పెండ్లాడాడు. మంగళ తూర్యనాదాలు మిన్నంటాయి.

బ్రహ్మ, సరస్వతి, నారదుడు వధూవరులపై అశీరక్షతలు చల్లి దీవించారు. అహల్య సమేతుడై గౌతముడు అత్తమామల పాదపద్మాలకు ప్రణమిల్లాడు.

అహల్య చేతులు గౌతముడి చేతిలో ఉంచి చెప్పాడు బ్రహ్మ 'గౌతమా! నేటీనుంచీ అహల్య బ్రహ్మ మానస పుత్రికే కాదు. గౌతముడి ఇల్లాలు. ఆమె వల్ల వచ్చే కీర్తి అపకీర్తులు నీవే! ఆమెని లాలించి పాలించి మీ జీవితం సుఖశాంతుల నిలయం చేసుకో!'

'మీ మాట శిరోధార్యం సృష్టికర్తా! అక్షరాలా పాటిస్తాను' ఆనందంగా అన్నాడు గౌతముడు.

అహల్య శిరస్సు నిమురుతూ అంది సరస్వతీ దేవి 'అమ్మా అహల్యా! బ్రహ్మ పథాన్నించి జనపథానికి వెడుతున్నావు. త్రిమూర్తులలో ఆదిరూపుడు అతిశయంగా సృష్టించిన కన్యారాత్నానివి నీవు. నీ గర్భవాసాన మహనీయులు, మహర్షులు జన్మిస్తారు. సకల జగాలూ, యుగయుగాలూ నీ పేరు స్మరించేలా నడుచుకో!'

అహల్య తలూపింది.

అహల్యా, గౌతములు భూలోకానికి ప్రయాణం కాబోతున్నారు.

అప్పుడొచ్చారు ఆఘమేఘాల మీద ముల్లోకాల ఏలిక.

'పరమేష్టీ! నీవు నిర్ణయించిన వర పరీక్షలో నేనే ముందుగా వచ్చేశాను. వేగానికి ప్రసిద్ధుడైన వాయుదేవుడు కూడా నా గమన వేగాన్ని అందుకోలేకపోయాడు. వాహనాలెక్కి వచ్చిన దిక్పాలకులెవ్వరూ నన్నధిగమించలేకపోయారు. నేనే- నేనే ముందు వచ్చాను. అహల్యను ఇచ్చి వివాహం చేయించు. నా త్రిలోకాధిపత్యానికి తగినట్టుగా అంగరంగవైభవంగా వివాహం ఏర్పాట్లు కల్పించు' అన్నాడు దేవేంద్రుడు.

తాను వర పరీక్షలో నెగ్గానన్న గర్వం, అహంభావం అక్షరాక్షరానా తొణికిసలాడుతున్నాయి.

పకపక నవ్వాడు నారదుడు.

ఆ నవ్వుకీ- ఆ నవ్వులోని హేళనకీ ఇంద్రుడు విస్తుపోయాడు.

'ఏమి నారదా! ఏమో వెటకారం! కాబోయే బావగారిని గౌరవించే రీతి అదేనా! అందునా నేను సురనాధుడనే మాట ఏమరుపాటున మరచినట్లున్నావే!'

'అయిన పెండ్లికి మేళం ఎందుకని త్రిలింగ దేశంలో వాడుకలే సురనాధా! నీకంటే ముందుగా భూ ప్రదక్షిణం చేసి బ్రహ్మ సన్నిధికి చేరిన గౌతముడికి అహల్యనిచ్చి శాస్త్రోక్తంగా వివాహం జరిపించి అత్తవారింటికి పంపబోతున్నారు. సృష్టికర్త, ఆయన సతీమణి సరస్వతీదేవి! నీవు చాలా ఆలస్యంగా వచ్చావు. వచ్చినవాడవు విచారించుకోకుండా పెడబొబ్బలు పెడుతున్నావు' అన్నాడు నారదుడు.

నారదుని మాటలు ముగీసీ ముగియగానే బిలబిలా వచ్చేశారు మిగతా దేవతలూ, దిక్పాలురూ మునులూ.

వారూ నారదుడి మాటలు అల్లంత. దూరాన్నుంచి విన్నారు. అమరేంద్రుడే అహల్యా నాధుడవుటాడనీ భావించారు అందరూ. కానీ విధి వైపరీత్యం! బ్రహ్మరాత మరో విధంగా ఉంది.

అహల్య అదృష్టాన్ని ఎవరు మార్చగలరు? తన మానసపుత్రికగా పరమేష్టి గొప్పగా సంభావించినా అమరేంద్రుడి అర్ధ సింహాసనం అధిరోహించగలదని దేవనాధుడు ఆశించినా- అహల్య సౌందర్యాన్ని చూసి అందరూ ఆశించినా అహల్య అదృష్టం మరోవిధంగా ఉంది.

ఇంద్రుడికి పట్టరానంత ఆగ్రహం పుట్టుకొచ్చింది.

'ఏమిటీ నారదా! నువ్వంటున్నది? గౌతముడు మా అందరికంటే ముందుగా భూ ప్రదక్షిణం చేసి వచ్చాడా? పరుగు పందెంలో ముందు వెళ్ళిన వాళ్లం. మమ్మల్ని కాదనే ఎలా వెళ్ళాడు? ఇదంతా మోసం! ఇందులో ఏదో మాయ! ఏం జరిగింది?!'

'అవును. మమ్మల్నందరినీ ఆయాసపెట్టి ఆపై గుట్టుచప్పుడు కాకుండా అహల్యను గౌతముడికి ధారపోస్తే మిన్నకుండిపోతామా? మాకు నిజం తెలియాలి' అన్నారు మిగతా వాళ్ళందరూ.

'శాంతం! శాంతం! ఆవేశంలో, ఆక్రోశంలో ఉచితానుచితాలు మరిచి మాట్లాడటం మహేంద్రుడికి తగదు. పరమేష్టికి పక్షపాతమెందుకుంటుంది? మాయ చేయవలసిన అవసరం, మోసం చేయవలసిన ఖర్మ ఆయనకేం పట్టింది?' అన్నాడు నారదుడు.

'మరి ఏమిటిది?' గర్జించాడు దేవేంద్రుడు.

'భూ ప్రదక్షిణం చేసిన వారికి కదా అహల్యనిచ్చి వివాహం జరిపిస్తానని సృష్టికర్త ప్రకటించింది. గౌతముడికి ఈ విషయం తెలిసింది. ఒక్క దేవతలే పాల్గొనాలని నియమం లేదు. సురసభకు, బ్రహ్మ సన్నిధికి ఆ సమయంలో వచ్చినవారే పందెంలో పాల్గొనాలనే నియమం లేదు. కనుక గౌతముడు తానూ సమయం ప్రకారం భూ ప్రదక్షిణం చేశాడు.'

'నారదా! డొంక తిరుగుడు వద్దు! భూ ప్రదక్షిణం చేశాడు అని రెట్టించి చెప్పకపోతే ఎలా చేశాడో - ఎప్పుడు చేశాడో చెప్పరాదూ?'

'చెపుతాను దేవేంద్రా! సగమీనిన గోమాతకు ప్రదక్షిణం చేస్తే అది భూప్రదక్షిణంతో సమానమని కదా ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. బ్రహ్మ ప్రకటించిన ప్రకారం సమయానికి తన ఆశ్రమంలో ఈనుతున్న కపిల ధేనువుకి ప్రదక్షిణ నమస్కారాలు చేసి భూమండలం చుట్టి వచ్చిన ఫలాన్ని సాధించారు గౌతమ మహర్షి' అన్నాడు నారదుడు.

హతాశుడైనాడు ఇంద్రుడు.

అతనికి గౌతముని యుక్తి కంటే అహల్య వియోగమే భరింపరానిదిగా తోచింది. తన మనస్సులోని ఆవేదనని దాచుకోలేక అన్నాడు.

అతనికి గౌతముని యుక్తి కంటే అహల్యా వియోగమే భరింపరానిదిగా తోచింది. తన మనస్సులోని ఆవేదనని దాచుకోలేక అన్నాడు. న్యాయ సమ్మతమనీ, ధర్మ సమ్మతమనీ ఏ పేరు పెట్టినా ఫర్వాలేదు. చతురాననా! నాలుగు

ముఖలా నాలుగు వేదాలూ ప్రవచించినందులకు న్యాయమే చేశావు. నేను అన్యాయమైపోయాను. కాదా చెప్పండి బ్రహ్మదేవా! అహల్య సృష్టికి కారణం ఎవరు? నేను కాదా? అంతటి అందగత్తె పుట్టుకకు హేతువైన నేను ఆమెను ఆశించడం ధర్మమే కదా! సురాధిపత్య హేతువుగా, త్రిలోకాధిపత్య కారణంగా ఆమెను నాకు ధారపోస్తారని ఆశించాను. కానీ మీరు వరపరీక్ష నిర్ణయించారు. అలాగే కానిమ్మని అందులో పరుగు పరుగున వచ్చాను. ప్రప్రథమంగా వచ్చాను. ఈ రూపవతి దక్కగలదని ఆశించాను. కానీ నేనొకటి తలిస్తే మీరొకటి తలచారు!'

'దేవేంద్రా!'

'స్వర్గాధిపత్యం చేజారిన నాడయినా ఇంత వేదన లేదు. సృష్టికర్తా! దాన్ని మాయోపాయంతోనో, మరో ఉపాయంతోనో, మరొకరి సహాయంతోనో సాధించగలననే నమ్మకం ఉండేది. కానీ ఇప్పుడు...'

ఇంద్రుడు పూర్తి చేయలేదు. అటు తిరిగి-అహల్యవైపు చూశాడు. పరదాలను ఫలాపేక్షతో పరీక్షించడం అతనికలవాటే!

'గత జల సేతు బంధనంగా జరిగిపోయిన దానికి విచారించి లాభం లేదు. కానీ పరీక్షకు అంగీకరించిన తర్వాత ప్రకటించిన ఫలితానికి శిరస్సు వంచవలసిందే!' అన్నాడు విశ్వామిత్రుడు.

దానితో సర్వం సద్దుమణిగింది. ఇంద్రాది దేవతలు తమతమ నివాసాలకు వెళ్ళారు. విశ్వామిత్రాది మహర్షులు తమతమ నెలవులకు వెళ్ళారు. పరమేష్టికి, సరస్వతికి ప్రణమిల్లి గౌతముడు అహల్యాద్వితీయుడై తన ఆశ్రమానికి బయలుదేరాడు. వెళ్తోన్న ఇద్దరినీ చూస్తూ నిట్టూర్చాడు నారదమహర్షి.

## 8

గూఢచారి తెచ్చిన వర్తమానం అంతా రావణుడికి నివేదించాడు ప్రహస్తుడు. అతని మాటలు విన్న రావణుడు పకపక నవ్వాడు.

'ఏమిటేమిటీ? అయోధ్య నగర పాలకుడు దశరథుడు కొడుకుల కోసం పుత్రకామేష్టి చేయాలనుకుంటున్నాడా! చక్కగా ఉంది ఆలోచన! దేవతలంతా వెళ్ళి శ్రీమహావిష్ణువును మొరపెట్టుకున్నారా? ఆపన్నివారకుడు పరమేశ్వరుడు. పరమశివుని ప్రార్థించిన వారికి ఆపదలు ఆమడ దూరం తొలగిపోతాయి.

శుభాన్ని కలిగించేవాడు శివుడొక్కడే! సర్వమంగళ అనే పేరుగల జగజ్జనని పార్వతీదేవికే చెల్లుతుంది.

లక్ష్మి సంపదనిస్తుందే గానీ సర్వమంగళమైన మాంగల్యాన్ని ఇవ్వలేదు. ఎందుకీ దేవగణం విష్ణువుని ఆశ్రయిస్తుందో గదా! శంభుడు అసుర పక్షపాతి అని ప్రసిద్ధి. మనం ఆశ్రయించిన గిరిజా నాథుని కాదనడం వల్లే సురపక్షపాతి అయిన విష్ణువుని ఆశ్రయిస్తున్నారేమో! సరి! సరి! ఎవరి ఇష్టదైవం వారిది. ఎందుకు కాదనాలి మనం? ఆ మహా విష్ణువు తను అవతరించడానికి ఇంకా సమయం ఉందని చెప్పాడటనా!'

తలూపేడు ప్రహస్తుడు.

'ఇంకేం వార్తలు'

'ఒక తమాషా జరిగింది పౌలస్త్యా!'

'ఏమది?'

'మూడు లోకాలను పాలించమని అధికారం అప్పగిస్తే అమరలోకాన్ని దక్కించుకుని తీరిగ్గా కూచుని అమృతం తాగుతూ, అప్సరసల నాట్యం తిలకిస్తూ గానపానాలతో కాలక్షేపం చేసే ఇంద్రుడికి లోకంలో అందరికంటే అందగత్తె ఎవరా అన్న సందేహం వచ్చింది. కట్టుకున్న ఇల్లాలు శచీదేవి చక్కదనాల చుక్క. అయినా అతడి కళ్ళు ఎప్పుడూ పర స్త్రీని పరివేష్టించి ఉంటాయి కదా ప్రభూ!'

'ఔనౌను. కొంగు చూస్తే కోటి విధాలా చలిస్తాడు ఇంద్రుడు. అచ్చెరల మధ్య తిరుగాడుతూ ఉండటంతో అతనికెప్పుడూ ఆడవారి ధ్యాసే!'

'అదొక్కటేనా ప్రభూ! ముక్కు మూసుకుని ఏ ముని కుమారుడు జపం ప్రారంభించినా, ఆ తపస్సు తన పదవిని ఆశించే అని ఆరాటపడతాడు. ఏ రాజయినా, ఋషి అయినా యజ్ఞం ప్రారంభిస్తే అది నూరు యజ్ఞాలకు శ్రీకారమని అతడెప్పుడు నూరు పూర్తి చేసి, శతముఖి అయి తన ఇంద్రత్వాన్ని పొంది తన సింహాసనాన్ని ఆక్రమిస్తాడోనని భయం ప్రభూ!'

కహకహ నవ్వాడు రావణుడు.

'వీరుడికి చావు ఒక్కసారే! పిరికివాడికి అనుక్షణం చావే! ఇంద్రుడంతటి పిరికివారు ఈ రేడు లోకాల్లో ఉంటాడంటావా ప్రహస్తా!'

'పశువుల కాపరి అయినా అతనికంటే ధైర్యవంతుడే ప్రభూ. మేకలమంద మీదకి పులి దూకబోతే తన జంతు సంరక్షణ కోసం కత్తి ఝుళిపిస్తాడు. ఇంద్రుడి వజ్రాయుధం వన్నెలన్నీ అతని చుట్టూ అంగరక్షకుల్లా అశేష దేవగణం ఉంటేనే.'

'ఊ! తర్వాతేం జరిగింది! దేవ సభలో జగదేకసుందరి ఎవరో నిర్ణయమైపోయిందా?'

'ఇంద్రుడు అలా ప్రశ్నిస్తే జిహ్వకో రుచి. పుర్రెకో బుద్ధి అని ఒక్కొక్కరు ఒక్కోపేరు సూచించారట ప్రభూ! తాను వలచింది రంభ...తా మునిగిందే గంగ అని తమ సోదరుడు కుబేర పుత్రుడు నలకూబరుడన్నాడట ప్రభూ!'

రంభ ప్రసక్తి రాగానే రావణుడికి ఆనాటి సంఘటన గుర్తుకొచ్చింది. ఉద్యానవనంలో రంభను చూసి తాను తొందర పడటం, ఆమె అతనూ శృంగార లహరిలో తేలియాడిన తనని శపించడం అంతా క్షణాలమీద గడిచిపోయినట్లు అనిపించింది.

చెదిరిన మనస్సుని చేరదీసుకుని అడిగాడు 'తర్వాత!'

'అలా ఒక్కొక్కరే ఒక్కొక్క స్త్రీని ప్రస్తుతిస్తూ, ఆమె ఒక్కతే జగదేక సుందరి అని వాదించడం మొదలుపెట్టారు. సభ అంతా అల్లరే అల్లరి! సందడే సందడి! దిక్పాలురను కాదనలేక, ముని పుంగవులను తిరస్కరించలేక ఇంద్రుడు సమస్యా పరిష్కారానికి తమ వంశ మూలపురుషుడయిన పరమేష్టి వద్దకు వెళ్ళారట!'

'ముది మది తప్పిన ముదుసలి బ్రహ్మ ఏమన్నాడట?'

'ఇంత వరకూ ఏ లోపమూ లేని అందగత్తెని తను సృష్టించలేదని ఒప్పుకున్నాడట ప్రభూ!'

'వేదజడుడు కదా మా ప్రపితామహుడు. అంతకంటే ఇంకేం అనగలడు? సర్వ మంగళ జగన్మాత కంటే వేరే ఎవరున్నారు? ఐశ్వర్యం ఇచ్చే శోభాసంపన్న శ్రీలక్ష్మి అందగత్తె కాదా? చదువు తెచ్చే వన్నె చిన్నెలతో వన్నెకెక్కిన సరస్వతీ మాతకంటే సుందరి ఎవరున్నారు? ఒకరికొకరు తీసిపోకుండా అందచందాలతో అపూర్వ లావణ్య శోభతో అందానికే అందం తేగల ముగ్గురమ్మల కంటే అందగత్తె ఎవరయ్యా ప్రహస్తా!'

'చిత్తం ప్రభూ! అందగత్తెల్లో అందరినీ మించే అందగత్తెని ఇప్పుడు సృష్టిస్తానని అప్పటికప్పుడు ఓ సుందరాంగిని సృష్టించాడట ప్రభూ!'

'ఏమిటేమిటీ? ఏమిటేమిటీ? అందగత్తెని ఆ క్షణంలోనే సృష్టించినాడా! ఎవరా సుందరాంగి?'

'అహల్య ప్రభూ!'

'అహల్య! అందమైన పేరే! పేరులాగే అందంగా ఉంటుందా! ఎక్కడుండా సుందరి!'

'నిజంగా జగదేక సుందరేనట ప్రభూ! రంభాది అచ్చెరలంతా అచ్చెరువందారట! శచీదేవి మొదలైన వాళ్ళంతా చిన్నబోయారట ప్రభూ!'

'తర్వాత్తర్వాత....'

'ఏ ప్రశ్న కారణంగా అహల్యా సృష్టి జరిగిందో- ఆ ప్రశ్నకి కారకుడు తానే కాబట్టి- మూడులోకాలకూ ఏలిక కనుక తనకిచ్చి పెళ్ళి చేయమన్నాడట ఇంద్రుడు'

'అర్ధ సింహాసనంలో శచీదేవిని, అహల్యనూ వంతులవారీగా కూచోబెట్టుకుని కులుకుతాడటనా సుర నాథుడు?' నవ్వుతూ అడిగాడు రావణబ్రహ్మ.

'విశ్వామిత్రుడు తనకు ధారపోయమన్నాడట!'

'అపర సృష్టికర్త కదా! ఆ ముక్కోపి మునిపుంగవుడు. ఎలా కాదన్నాడు బ్రహ్మ!'

'సమస్యా పరిష్కారం తోచని తమ ముత్తాతగారు తమ తాతగారిని సలహా అడిగారట!'

'ఎవరిని- త్రిలోక సంచారి- కలహా భోజనుడూ- అయిన నారద మహర్షినే!... బావుంది! బావుంది! చక్కని అవకాశం దొరికిందని చిక్కుముడి వేశాడా దేవర్షి?'

'పందెం పెట్టారట ప్రభూ!'

'ఏమిటీ? పందెమే!'

'అవును పరుగుల పందెం...'

'భలే భలే! ఉవిద కోసం ఉరుకులు పరుగులా!'

'అవును ప్రభూ! భూ ప్రదక్షిణం చేసి వచ్చిన వారికి కన్న కూతురినిచ్చి కన్యాదానం చేస్తానని ప్రకటించాడట పరమేష్టి!'

'మంత్రంతోనో, మాయతోనో మహేంద్రుడే ముందువచ్చి మునుముందు నిలిచి ముగ్ధనిమ్మని అడిగాడా ఏమిటి?'

'అదే జరిగింది ప్రభూ...'

'అయితే అహల్య అమరేంద్రుడి అర్ధాంగి...'

'కాలేదు ప్రభూ! అంతకంటే ముందుగానే మహర్షి గౌతములు వచ్చి చేరాడట ప్రభూ! నిబంధనల ప్రకారం భూ ప్రదక్షిణం చేసి వచ్చానని చెప్పాడట! నారదుడు సాక్ష్యం పలికాడట!'

'ఎలా జరిగింది?' కుతూహలంగా అడిగాడు. బ్రహ్మ వంశ సంభవుడు పులస్థ్య బ్రహ్మ సంతానం-రావణబ్రహ్మ.

'గోప్రదక్షిణం భూప్రదక్షిణ తుల్యమనీ, అందునా ఈనుతున్న ఆవుకి అంగ ప్రదక్షిణం చేస్తే సంపూర్ణ ఫలం అని శాస్త్రం చెప్పి ఒప్పించి అహల్యను అర్ధాంగిగా పొందాడట గౌతముడు.'

'మంచి ఎన్నిక! తగిన సంబంధం! యోగ్యుడైన భర్త లభించాడు అహల్యాదేవికి! ఒక గొప్ప వేదాంతి ప్రపంచానికి లభించబోతున్నాడు!'

ప్రహస్తుడు చెప్పాడు 'జడను, ముడినీ చూడగానే చలించిపోయే మహేంద్రుడి కంటే జడముడి అయిన గౌతముడు సర్వ విధాలా తగినవాడు ప్రహస్తా!'

'అందరూ మనసులో అదే అనుకున్నారట ప్రభూ....'

'మనస్సులోని మాట ఎలా తెలిసిందయ్యా!' నవ్వుతూ అడిగాడు రావణుడు.

'మనస్సులోని మర్మం అపుడు కాకపోయిన తర్వాత అయినా ఎవరితోనో ఒకరితో వెల్లడిస్తారు కదా ప్రభూ!'

'ఔనౌను!'

'ఇంకో వార్త ప్రభూ...'

'ఏమదీ?'

'జనక రాజర్షి కూడా ఏదో యాగాన్ని ప్రారంభించాలని సంకల్పించి ముహుర్తాన్వేషణలో ఉన్నారట ప్రభూ!'

'ఎందుకు?'

'వంశాంకురం కోసమేమో ప్రభూ....'

రావణుడు జవాబివ్వలేదు.

'శాంతాదేవినిచ్చి రోమపాద మహర్షి ఋష్యశృంగుల వారిని అల్లుడిగా చేసుకున్నారట ప్రభూ!'

'అన్నీ కళ్యాణ వార్తలే వినవస్తున్నాయే...' నవ్వుతూ అన్నాడు రావణుడు.

## 9

అసదృశంగా వుంది ఆశ్రమ శోభ.

పిల్లగాలులే వెళ్ళి చెవిలో ఊదాయో, గాలి పిల్లలే వెళ్ళి కబురందించాయో కానీ పరమ నైష్టికుడు గౌతమ మహర్షి అహల్యా ద్వీతీయుడై తన ఆశ్రమానికి విచ్చేస్తున్నారనే వార్త అంతటా వ్యాపించింది.

గౌతమమహర్షి ఆశ్రమానికి సమీపంలో మరి కొన్ని ఆశ్రమాలున్నాయి. ఆ ఋషులందరూ గార్హాస్య జీవితం గడుపుతున్నవారే! నియమంగా, నిష్ఠతో మితంగా, సంసార ధర్మాన్ని నిర్వర్తిస్తూ, జప తపాలతో యజ్ఞ యాగాదులతో, అతిథి సేవలతో జీవనం సాగిస్తూ ఉన్నవారే!

వారందరూ- భార్యాసమేతంగా, శిష్య పరివారాన్ని వెంటబెట్టుకుని వచ్చారు. ఆశ్రమాన్ని అందంగా అలంకార శోభితంగా తీర్చిదిద్దారు. కుటీరాల ముందు కల్లాపి చల్లించి రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. ద్వారాలకు తోరణాలు కట్టారు. తలుపులకు ఎర్రమట్టితో అలంకారం చేసి వాటి మీద శుభస్కరమైన శ్రీకారాలు, స్వస్తి కాకారాలు దిద్దారు.

పూల తోరణాలు అడుగడుగునా స్వాగతమిస్తున్నాయి. పూపరిమళాలు అంతటా వ్యాపిస్తున్నాయి.

కోయిలలు కుహూ కుహూ రాగాలు పలుకుతున్నాయి. నెమళ్ళు పురివిప్పి నాట్యం చేస్తున్నాయి. గృహ ప్రవేశం సమయంలో నిర్వహించవలసిన యాగానికి కావలసిన ఏర్పాట్లన్నీ ఒకచోట జరుగుతున్నాయి.

ప్రవేశ సమయంలో సువాసినీ పూజకు కావలసిన వివిధ సంభారాలన్నీ ఒకచోట సమకూర్చబడినాయి. గౌతమమహర్షి శిష్యులు, సహాధ్యాయులు, అతిథులను యధావిధి అర్ఘ్యపాద్యాదులతో అర్పించి వారి వారికి తగినట్టుగా కుటీరాల్లో విడిది ఏర్పాట్లు చేసి మధుర పానీయాలూ, మధుర ఫలాలూ, మృదు మధురమైన తేనె ఆరగింపులు పెట్టారు. తృప్తోస్మి అనుకున్న మునిగణం మధుదాతా సుఖీభవా అని దీవించారు. మనస్సునిండా తృప్తి నింపుకున్న ఆ మునిజనం ఆర్భాటం లేకుండా, ఆడంబరం లేకుండా శాంత చిత్తంతో ప్రశాంత వదనాలతో గౌతమ మహర్షుల కోసం ఎదురు చూడసాగారు.

ఆ సమయం రానే వచ్చింది. మహర్షి గౌతములు, జగదేక సుందరి అహల్యా ద్వితీయులై ఆశ్రమ ప్రాంతానికి విచ్చేశారు. ఒక్కసారిగా వేదగానం నలుదిక్కులా ప్రతిధ్వనించింది. స్వాగత మంత్రాలతో ఆశ్రమం పవిత్రమైంది.

ముత్తయిదువులు, మహర్షులు పూర్ణ కుంభంలో స్వాగతం పలికారు. మునిపత్నులు హారతిచ్చి పసుపూ, సున్నమూ కలిపిన పారాణి నీళ్ళు దిష్టి తీసి స్వాగతం పలికారు.

'కుడి కాలు ముందు మోపి లోపలికి దయచేయండి.'

గౌతములు చిరునవ్వు నవ్వారు. కుడి కాలును ఆశ్రమ ద్వారం దాటి లోపలపెట్టి లోపలకు ప్రవేశించారు. అహల్య కూడా కుడికాలును ముందు మోపి ఆపై లోపలకు ప్రవేశించింది.

ఆ సమయంలో పరమేష్టి పైనుంచి పూలజల్లు కురిపించాడు. సరస్వతీ చతుర్ముఖులు ఇద్దరూ దీవిస్తూ సేసలు చల్లారు. ఆపై వృద్ధ దంపతులు కొత్త జంటని దీవించి పూలు, సేసలు శిరస్సున చల్లారు.

అహల్య గౌతముల ఆశ్రమ ప్రవేశం జరిగిపోయింది.

ఆపై ఇద్దరూ యజ్ఞ సంబరాలు సమకూర్చిన కుటీరం చేరారు. వేదిక వద్దకు చేరి కృష్ణాజినాలపై ఆశీనులయ్యారు.

వేదోక్తంగా హోమం ప్రజ్వలింపజేశారు. గౌతముల సాటి మునులు, శిష్యులు గొంతులు కలిపి వేద మంత్రాలు పఠిస్తూ స్వాహాకారాలు పలుకుతూ ఉండగా గౌతమ మహర్షులు గార్హస్త్య జీవనానికి నాందిగా గృహప్రవేశ హోమం చేశారు. ఆ మీద పరిసర మునివాటికల నుంచి వచ్చిన మునులకు, ముని పత్నులకూ తాంబూలాలు ఇచ్చి వారి ఆశీస్సులు గ్రహించారు.

'సుపుత్రా ప్రాప్తిరస్తు!' అని అందరూ మనసారా దీవించారు.

గౌతముల మోము నిండా వెన్నెలకు దీటైన చిరునవ్వు వెలుగుతూ ఉంది. అహల్య మోములో నునుసిగ్గు దొంతరలు.

## 10

అమరావతి.

బ్రహ్మ సన్నిధి నుండి భంగపడి, నిరాశకు లోనై అమరావతికి తిరిగి వచ్చిన అమరేంద్రుడు ఒంటరిగా నందనోద్యానంలో పారిజాత వృక్షం నీడన నిలుచున్నాడు.

అతని మనసు నిండా వేదన... ఆ వేదనని మించి అహల్యా రూపం ఆవేదననీ అహల్యనూ తోసిరాజంటూ ఆత్మ వేదన. అహల్యా అహల్యా... అప్రయత్నంగా అమరేంద్రుడి నోటివెంట వెలువడింది.

ఈ పాటికి ఆ జడదారి అహల్యను వెంటబెట్టుకుని తన ఆశ్రమానికి వెళ్ళి ఉంటాడు అనుకున్నాడు.

అలా అనుకోగానే అతని మనస్సులో అసూయ కదలాడింది. తనని తను నిందించుకున్నాడు.

సభ ఏర్పాటు చేసి సరసులయిన అందరిముందు అందగత్తెలయిన అచ్చెరలు నాట్యమాడితే చూసి ఆనందించక, అందరిలోనూ అందగత్తె ఎవరు అని తను ఎందుకు అడిగాడు? అడిగితే అడిగాడు. ఎవరో ఒకరి ఎవరి పేరో ఒక పేరును సూచిస్తే దాన్ని అందరూ అంగీకరిస్తే పోయేదానికి, ఎవరికి నచ్చిన సుందరి పేరు వాళ్ళెందుకు చెప్పాలి?

చెపితే అందరి వాదనలు విని విన్న తను సుర నాధుడిగా, సకల లోక పాలకుడిగా తనకు నచ్చిన ఏదో ఒక పేరు చెప్పి- ఎవరినీ నొప్పించకుండా ఒప్పించక తగుదునమ్మా అంటూ తగాదా పరిష్కారానికి ఆ సృష్టికర్త సన్నిధికి మందగట్టుకుని ఎందుకు వెళ్ళాలి? వెళ్లాను పో- ఆ సృష్టికర్త ఇన్ని యుగాలుగా, ఇందరు సుందరీమణుల్ని సృష్టించినవారు ఏదో ఒక పేరు చెప్పి ఆమే జగదేకసుందరి అని నిర్ణయిస్తే ఎవరు కాదనగలిగేవారు? ఎవరు ఎదురు ప్రశ్నించేవారు? కాదు- ఎవరి పేరు చెబితే ఏం జరుగుతుందో ఏం జరుగుతుందో అనుకుంటే...

సుర సుందరీమణులలో సుందరాంగి సరస్వతీదేవి అని ప్రకటించి ఉంటే- ఆయన అర్థాంగి అని అయినా అందరూ అంగీకరించేవారు కదా! అర్థాంగి అందచందాలూ నాలుగు ముఖాలా చూసినా కనిపించి ఉండకపోతే- జగన్మాత పార్వతీదేవి పేరు చెప్పి వుండరాదా! ముక్కంటి కంటి మంటలకు జడిసి అయినా సర్వులూ శిరః కంపన చేసి శిరసావహించి ఉండేవాడు కదా?

కాదు ఎందుకు ఆ త్రిమూర్తులతో పేచీ అనుకుంటే అష్ట దిక్పాలకులున్నారు కదా. వారి పత్నుల పేర్లు ప్రకటించి ఉంటే ఏం పోయేది?

శచీదేవి పేరు చెప్పిఉంటే తనకెంత సంబరంగా, సమ్మతిగా ఉండేది? త్రిమూర్తులు ముగ్గురూ కలిసి సృష్టిస్థితి లయాధిపత్యం కలిగివున్నా, సురనాధుడు తనే కదా! ముక్కోటి దేవతల మొక్కులందే మొదటి వేలుపు తనే కదా!

తన అర్ధ సింహాసనం అలంకరించగలిగిన శచీదేవి జగదేక సుందరి అని ప్రకటించి ఉంటే అది తనకున్న అధికారాలకీ, ఐశ్వర్యాలకీ, అర్హతలకీ మరో అదనపు అందం అయి ఉండేది కదా!

కాదు- అఖిల లోకాధిపతినన్న పక్షపాతంతో ప్రకటించారని అనుకోవడం ఆడిపోసుకుంటారు అనే జంకు వుంటే మిగతా దిక్పాలకులున్నారు కదా- స్వాహాదేవి పేరు ప్రకటించి ఉంటే అది అగ్నికి ఆనందం కలిగించి ఉండేది కదా?

యముడికి భయపడో- అతని అధికారాలన్నీ గౌరవించో అతని అర్ధాంగి పేరు ప్రకటించి ఉండరాదా? వాయువు సర్వలోకాలకూ ప్రాణదాత కదా అని మన్నించి అతని సతిని గౌరవించి ప్రకటించి ఉండరాదా! నిర్రృతిని మన్నించి ఉండకూడదా? వరుణుడి సతిని ప్రకటించి వరుణుడి కీర్తిని మరింత వన్నె తెచ్చి ఉండరాదా?

ఈశానుడున్నాడే- ఆయన పనికిరాలేదా? గుర్తులేదా? ఆయన సఖుడు ఉత్తర దిశానాధుడు- కుబేరుడు ధనం మూలం ఇదం జగత్ అని కదా నానుడి- అందరి అధికారాలూ ఐశ్వర్యం దగ్గరే ముగుస్తాయి కదా- ఆయనని గౌరవించి ఉండకూడదా? ఆయన అర్ధాంగే అందరికన్నా అందగత్తె అని ప్రకటన చేసి ఉండరాదా?

పశ్చిమ దిశానాధుడు- వరుణుడు- ప్రాగ్నాధుడ్ని నేను- దక్షిణాధిపతి యముడు ఉత్తర దిశానాధుడు కుబేరుడు- మేం ఎవరమూ పనికిరాలేదా? ఎవరి పేరూ ప్రకటించకుండా ఎవరేమని తలుస్తారోనని ఆలోచించకుండా ఇంతవరకూ ఏ లోపమూ లేని స్త్రీని సృష్టించనే లేదు. ఇదిగో ఇప్పుడు సృష్టిస్తున్నానని ఆ నలుమోముల మేలుపు అప్పటికప్పుడే అహల్యని ఎందుకు సృష్టించాలి?

సృష్టించాడు పో. సృష్టించే వేళలోనే ఎవరికో ఒకరికి బ్రహ్మ ముడిపెడతాడన్న లోకోక్తి ప్రకారం ఫలానా వాడికి- అదే ఆ గౌతమ మునీంద్రునికే అనుకుందాం- నిర్ణయించానని అతనికే ఇచ్చి చేసి ఉండరాదా! అలా కాకపోతే...

అడిగింది నేను- అవసరం కలిగించింది నేను- అమరాధిపుడ్ని నేను- అన్ని విధాలా అన్ని అర్హతలూ ఉన్నవాడిని నేను. నాకు ఎందుకు కన్యాదానం చేసి ఎందుకు కన్యను అప్పగించి ఉండకూడదు? అనుకుంటే ఎందుకు పందెం ప్రకటించాలి?

పందెం పెడితే అందరూ ఆశపడి అందులో పాల్గొంటారు కదా! కాదు అనుకుంటే ఇదుగిదిగో! వీరు- వీరు- వీరు- పోటీలో పాల్గొనకూడదు. ఈ అర్హతలున్న వారే పాల్గొనాలి. ఈ అనర్హత వల్ల వీళ్ళు పాల్గొనకూడదు అని నిబంధించి ఉండరాదా?

ఊహూ! అవేమీ అనక, ఆనక ఏం జరిగిందోనని ఆలోచించక ఏదో మదికి తోచిన నిబంధన ఆ తంపులమారి నారదుడు నిర్ణయిస్తే దానిని ఆమోదించడం ఎందుకు?

అందులో ఆ గౌతముడే ప్రధముడుగా రావడం ఏమిటీ? హూ! ఇదంతా ఇంద్ర గర్వభంగానికి అందరూ ఆలోచించి పన్నిన పథకం అనుకోవాలి. కానీ అందుకు ఆస్కారం లేదు. కోరి కొరివితో తల గోక్కునే వెర్రి మానవులలాగ ఆ ఆలోచన తన బుద్ధిలోనే పుట్టుకొచ్చింది. బుద్ధిః కర్మాను సారిణీ అని అజనాభదేశంలో అందరూ అనడం నిజమే!

తనిలా అహల్యా విరహంలో అలమటించిపోవాలని తనకై తానే సృష్టించుకున్న ఆనలం ఆ అహల్య... అహల్య... అహల్య... మూడక్షరాల ముచ్చటైన పేరుతో ముప్పది మూడు కోట్ల దేవతాగణాన్ని మునీంద్ర గణాన్ని, ముప్పు తిప్పలు పెట్టిన ముగ్ధ... వాళ్లకేం. వాళ్ళంతా ఎప్పుడో మర్చిపోయి తమ తమ స్థావరాలకి వెళ్ళిపోయారు. తను తన లోకానికి వచ్చినా... తను ఎక్కడ వున్నా మనస్సంతా అక్కడ ఆ అహల్య సుందరాకారం చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంది!

అమరలోక సుఖాలపై ఆశ పుట్టడం లేదు. అమర సుఖాన్నిచ్చే నందనోద్యానం సంచారం మనశ్శాంతి నివ్వడం లేదు. సురపై మనస్సు పోవడం లేదు. సుర భామినుల నృత్యంపై మనస్సు పోవడం లేదు.

ఎలా పోతుందీ? ఆ మనస్సిక్కడ ఉంటే కదా? అది ఆ అందాల సుందరి అహల్య సుందర చరణాల చెంత పడిగాపులు పడుతున్నది. నిట్టూర్చాడు ఇంద్రుడు. అప్పుడు చిరుగజ్జెలు ఘల్లుమన్నాయి.

మృదు మధుర పరిమళాలు గుప్పుమన్నాయి. మగువ పొలుపు తెలిపే మారుతం వీచింది. మరు కాకల పొగిలే దేవేంద్రుడి మనస్సు మరింత వేగింది.

## 11

గౌతమాశ్రమంలో నవ వధూ గృహప్రవేశ సమయంలో జరుగవలసిన విధులన్నీ శాస్త్రోక్తంగా విధి విధాయకంగా జరిగాయి. వృద్ధర్షులు పత్నీసమేతంగా వచ్చి అహల్యా గౌతములను ఆశీర్వదించారు. తదనంతరం విందు భోజనం మొదలయ్యింది.

ఆశ్రమంలో కంచే చుట్టూతా పెంచిన కదళీ వృక్షాలలో వెదికి వెదికి బారడేసి వెడల్పున్న ఆకులను అగ్రం చిరక్కుండా కోశారు గౌతమ శిష్యులు. భోజనం ఎంత కనువిందుగా కనిపించాలో భాజనం (భోజన పాత్ర) అంతకంటే కనువిందుగా కనిపించాలనేది పెద్దల మాట!

అందుకే వడ్డించే ఆహార పదార్థాలు ఏవైనా, ఎన్నైనా, ఎలా ఉన్నాసరే వడ్డన చేయడానికి అరటిఆకు వాడి అరటి ఆకులో ఆహార పదార్థాలు వడ్డిస్తే అది విందుకొచ్చిన వారికి మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

బారడేసి వెడల్పున్న అరటి ఆకులలో ఎన్నెన్నో ఆహార పదార్థాలు వడ్డించారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో వరి సమృద్ధిగా పండుతుంది.

అక్కడి నుండి తెచ్చిన బియ్యంతో వండి వడ్డించిన అన్నం చూడగానే కడుపు నింపేంత కమనీయంగా ఉంది. మల్లె మొగ్గలాగ తెల్లగా సన్నగా మెతుకు మెతుక్కీ అంటూకోకుండా ఆస్వాదయోగ్యంగా కనిపిస్తోంది అన్నం.

మూడేసి వ్యంజనాలు, మూడేసి పొడి కూరలు, పప్పు, దప్పళం, పాయసాన్నాలు, పాయసాలు, భక్ష్యాలు, చోష్యాలు, లేహ్యాలు విస్తరి నిండుగా వడ్డించారు.

విందు ఇవ్వడానికి భరద్వాజుడు అజనాభదేశంలో సుప్రసిద్ధుడు. మనుషులు, మానవ నాథులు, మునులు, ఋషులే కాదు. దేవతలు కూడా భరద్వాజుడి విందంటే కడుపులు పెంచుకుంటారట. ఆ పేరు వింటేనే అందరికీ నోరూరుతుందట!

అయితే ఈనాడు గౌతమమహర్షి వివాహ సందర్భంగా ఏర్పాటైన ఈ విందు భోజనం భారద్వాజుడి విందుని తలపించడం కాదు. మరిపించేంత గొప్పగా తయారయింది. గతంలో గానీ వర్తమానంలో గానీ రాబోయే కాలంలో గానీ మరెవ్వరూ ఏర్పాటు చేయలేనంతగా ఈ విందు ఏర్పాటు చేయబడింది.

ఎందుకంటే- విందు ఇస్తున్నది సాక్షాత్తూ సృష్టికర్తలైన బ్రహ్మ అల్లుడు గౌతములు. ఆశ్రమంలో అడుగిడుతున్నది అహల్య. ఆ పరమేష్టి ఏకైక పుత్రిక అందాల రాశి. జగదేక సుందరి. సృష్టి ఆరంభించి ఇన్ని కోట్ల సంవత్సరాలు గడిచాయి. యుగాలు మన్వంతరాలు గడిచాయి. అయినా ఇన్ని సంవత్సరాలు ఒక లోపంతో గడిచిపోయాయి!

అదేమిటంటే అందరికంటే అందగత్తె ఎవరూ లేకపోవడం. ఏ లోటూ లేకుండా ఎవరూ తనకు సాటి రాకుండా తనకు తానే సాటిగా నిలువగలిగే సుందరీమణి లేనేలేదిన్నేళ్ళూ!

ఇన్నేళ్ళకి ఆ ఇంద్రుడి సంకల్పబలమా అన్నట్లు అహల్యను సృష్టించాడు బ్రహ్మ! ఆ బ్రహ్మ మెచ్చి నిర్ణయించి మరీ పెళ్ళి అరిపించాడు గౌతములతో. గౌతమ మహర్షి కంటే ఉత్తమ ఋషి ఇంకెవరు?

అట్టి గౌతముల అర్ధాంగిగా అరుదెంచింది అహల్య! అందుకే యీ అపూర్వమైన విందు. ముని బాలకులు, ముని పత్నులు, ముని కన్నెలు, పదేపదే పంక్తుల మధ్య తిరుగుతూ, అడిగిందే అడుగుతూ, వడ్డించిందే కొసరి కొసరి వడ్డిస్తూ, విందారగించేవారికి బ్రహ్మ మరిన్ని 'కడుపు'లు ఇవ్వలేదే అన్న కొరత అనుభూతమయ్యేలా విందు జరిపారు.

ఒక మునీంద్రుడు పాయసం వడ్డిస్తే 'చాలు కడుపు నిండిపోయింది. ఇంకొక్క గరిటెడు ఊహూ! ఉద్ధరిణుడు కూడా లోపలికి పోదు' అని తిరస్కరించాడు. పక్కనే ఉన్న మరో ఋషి నవ్వాడు.

అంతలో మరో బ్రహ్మచారి భక్ష్యాలు తీసుకుని వచ్చాడు. అతని వెంట పాలు, నెయ్యి పట్టుకుని ఇద్దరు మునికన్నెలు వచ్చారు.

భక్ష్యాలు చూడగానే విస్తరిలోని పదార్థాలన్నీ అటూ ఇటూ జరిపి విస్తరి మధ్యలో ఖాళీ చేశాడు. పాయసం పట్టదన్న మునీంద్రుడు భక్ష్యాలు పదీ పన్నెండు వడ్డించి, గోకర్ణం నెయ్యి కుమ్మరించారు. వాటిని ఆ నెయ్యిలో బాగా మెదిపాడు ముని. పాలున్నాయి అంటూ ఓ ముని కన్య అంది.

'మరో వాయి పాలతో!' అన్నాడు మునీంద్రుడు.

ఇదంతా గమనించిన పక్కనున్న ఋషి నవ్వాడు.

'నవ్వకయ్యా మునీశ్వరా! కడుపులో పాయసం అర ఖాళీ లేదన్నాను. అంతేకానీ భక్ష్యాల అరఖాళీ లేదన్నానా ఏమిటీ? చూస్తుండు ఇలాగే చిత్రాన్నాల అర, చారు అర, పెరుగు అర, ఆయా వాటితో నింపేస్తాను. బ్రహ్మ సృష్టి విచిత్రం తమకు తెలియదా ఏం?' అన్నాడు ఆ మునీంద్రుడు.

అతని చమత్కారానికి అందరూ నవ్వారు.

'నవ్వకండి! పొరపోతుంది' అన్నారు ఒకరు.

'పొరపోతే ఒక అర ఖాళీ అవుతుంది! ఆ ఖాళీలో మరికొంత పదార్థం నింపొచ్చు' అన్నాడు ఆ మునీంద్రుడు.

దాంతో మళ్ళీ నవ్వులు విరిశాయి. అలా నవ్వుల్తో పరాచకాలతో ముగిసింది విందు.

విందు తర్వాత నవనవలాడే తమలపాకులతో తాంబూల సేవనం జరిగింది. కర్పూర సువాసనలు, కస్తూరి గుబాళింపులూ నలువురి నోటా మరింత వాసికెక్కాయి.

## 12

చిరుగజ్జెల మ్రోతతోపాటు చిరు చిరు నడకల ధ్వని, ఆపై రెట్టింపు కస్తూరి మేళవించిన తాంబూల సేవనంతో గుమాళించే మగువ పొలుపు-అటూ తిరిగాడు దేవేంద్రుడు.

'మహేంద్రులకు నమస్కారం!'

శిరసు వంచి వినమ్రంగా నమస్కరించి, ఘటించిన చేతులు అలాగే ఉంచి నిలుచుంది.

ఇంద్రుడు చిరునవ్వు నవ్వాడు.

'త్రిలోకాధినాథులు దీర్ఘాలోచనలో ఉన్నారు!'

చిరునవ్వే సమాధానం అయ్యింది.

'తమరింకా ఆ సుందరిని మరిచినట్లు లేదు'

'మరిపా! హూ! ఎంత మాటన్నావ్? అహల్యను మర్చిపోవడమా! ఆ అందాల సుందరి రూపం గుండెల్లో శాశ్వత ముద్ర వేసింది. ఆ రూపం ఇక్కడ శాశ్వతం! ఆ సోయగం ఇక్కడ శాశ్వతం. మానవులు అదృష్టవంతులు. అలసటతోనో, నిద్రతోనో కనులు మూసుకోగలరు. కమ్మని రూపాన్ని అంతరంగంపై చూసుకోగలరు. అమరులకా అదృష్టం లేదు. రెప్పపాటెరుగని అనిమేషులం కావడం వల్ల మాకు కన్ను మూతపడదు. కల లేదు. కలలో కాంతను కన్నారా కాంచడమూ లేదు. అయినా అహల్య రూపం అప్రతిమానంగా మా కళ్ళెదుటే నర్తిస్తుంది'

'ఆ మాట మీ నోట వినాలనే అలా పలికాను' గుంభనంగా నవ్వుతూ అందా యువతి.

ఇంద్రుడు నవ్వాడు.

మేలి ముసుగు చాటున- మోమెత్తి చూపకుండా- శిరసు వంచి మాట్లాడుతున్నదా యువతి.

ఇంద్రుడు- ఆమె ఎదురుగా నిలుచుని ఉన్నా, ఆమెపై దృష్టి నిలపకుండా ఎటో చూస్తూ మాట్లాడుతున్నాడు.

తన మాటలకి ఇంద్రుడు సమాధానంగా నవ్వడం విందామె.

పెదవులు కదిలీ కదలకుండా నవ్వు వెలికి వచ్చీరాకుండా నవ్వుతూ ఇంద్రుడలా నవ్వగానే- కొంత చొరవ తీసుకుందామె.

'తమకోసం తనువువేర్పడినా- తన కోసం తమంతవారు బరిలోకి దిగి భూప్రదక్షిణం చేసి వచ్చినా - ముక్కోటి దేవతల ఒక్కమాటతో శాంతించగల తమరు తమకంతో తన కోసం పరమేష్టినే ప్రశ్నించినా- ఆ సుందరి తమవైపు ఓ చూపు విసిరిందా? తమరిని క్రీగంటనయినా చూసి ఒక్క పలుకైనా పలికిందా! పలికితే ముత్యాలు రాలేవా? రత్నాలు జారేవా? అంత ఆర్భాటం జరిగినా అమరేంద్రులు తమరు వాదిస్తూ ఉన్నా తనని కల్పించిన ఆ చతురాననుడు జడధారికి ధారబోస్తే, అదే తన దారంటూ వెళ్ళిపోవడం భావ్యంగా ఉందా ప్రభూ!'

'సుందరీ!' గర్జించాడు ఇంద్రుడు.

ఆ గర్జనకి ఆ యువతీ భయపడింది.

'ఇంకేం మాటాడక! అహల్యను ఇంకొక్క మాటన్నా మేం సహించం! ఆమె అప్పుడు పితృ పరాధీన! ఆమెకు స్వయంవర అవకాశం లేదు! శుల్కంగా తండ్రి ఏర్పరచిన నియమాన్ని, నిబంధనని ఎవరు పూర్తిచేశారని ఆమె తండ్రి భావిస్తే- అతనికిచ్చి కన్యాదానం చేస్తే- అతడే తన ప్రత్యక్షదైవంగా భావించ వలసిన కులీన ఆ అహల్య! కన్నవారికి, కట్టుకున్నవారికీ పేరు ప్రఖ్యాతులు తేగల గుణశాలి ఆమె!'

'మహేంద్రులకి ఇంకా మమత తీరలేదు' చిన్నగా నవ్విందా యువతి. కోరి కల్పించుకున్న సుందరి.

'కోరికలు తీర్చకుండా చేజారిపోయినా మక్కువ ఎక్కువైందే తప్ప, మమత ఏమాత్రం తగ్గలేదు ప్రభూ!'

'ఏమంటివే! ఏమంటివే! జగజంత్రీ! మహేంద్రుడు మక్కువ పడతాడే కానీ మోహించడే! నేను అహల్యను ఆశించింది ఆమె అందచందాలు కోరి కాదు. ఆమె అనురాగాన్ని ఆశించాను. అంతటి అందగత్తె, అందచందాలను ఆస్వాదిస్తే అమరేంద్రుని వైభవానికి యోగ్యంగా ఉంటుందనే భావించాను.

కానీ ఆమెని మోహించి వివశుడ్ని కాలేదు. అహల్య పుట్టీ పుట్టకముందే మా అంతరంగ దేవాలయంలో అర్చామూర్తిగా వెలిసింది.'

క్షణం ఆగాడు ఇంద్రుడు.

'సుధర్మంలో ధర్మాసనాశీనులమై ధర్మాధర్మ విచక్షణతో ధర్మాధికారంతో ధర్మాన్ని నిలిపే మహేంద్రులం. మోహానికి, మోసానికీ, అధర్మానికీ, అన్యాయానికీ ఆమడ దూరంలో ఉంటాం!'

నవ్వింది 'జగజంత్రి' ఆ మాటలకు.

'నవ్వులాట కాదే నవలామణీ, నిజం!'

'నిజం ప్రభూ! ప్రభువులు చెప్పిందంతా నిజం'

'మా పాలనపై విశేష గౌరవం ఉండే త్రిమూర్తులు మమ్మల్ని అమరాధిపతుల్ని చేశారు'

'ప్రభువులు పడతి మాట మరిచి ప్రస్థుతిలో పడిపోయారు'

'హు! ఏ క్షణాన అహల్యా సృష్టి జరిగిందో- ఆ క్షణంలోనే ఆమె మా మనసులో నిలిచింది. ఇక మరుపు లేదు. మైమరుపే తప్ప!'

'తమరికి అహల్యని చూడాలని లేదా?' చప్పున అడిగింది.

'చూడాలని లేదా! కథంతా విని కథానాయకుడికి కథానాయిక ఏం కావాలని వరస అడిగినట్లుంది నీ ప్రశ్న. తపస్సు చేస్తున్నాను.'

'తపిస్తున్నారా?'

'నువ్వు వ్యంగ్య వైభవం వెల్లి విరిసేలా అలా అడిగినా అది నిజమే! నేను ఆమె కోసం తపిస్తున్నాను. నిజం!'

'తమ తపస్సు ఫలించినా గమనించడం లేదా తమరు?'

'ఫలితమా!' చప్పున అటు తిరిగి ఆమెని సూటిగా చూశాడు.

అహల్య! అహల్య! అహల్య! ఇంతసేపూ తమతో సంభాషించింది అహల్యా!

'తను వలచి, వలపు ఫలించేలా వలపించుకోవాలని కోరిన అహల్య తనను వెదుక్కుంటూ తన లోకానికి వచ్చి తన వనానికి వచ్చి తన సన్నిధిలోనే నిలిచి తనతో సంభాషిస్తూ ఉన్నా తను గమనించలేకపోయాడా!

'అహల్యా!' సంభ్రమంలో పిలిచాడు. పిలుపువెంట ఆమె చెంతకు చేరాడు.

ఆ యువతి తలెత్తి కనులారా మహేంద్రుడిని చూసి నవ్వింది.

ఆ నవ్వులతో వెన్నెల విరిసినట్లయింది. తన జన్మ, తన తపన ఫలించింది అనుకున్నాడు ఇంద్రుడు. చప్పున ఆమె భుజాలపై చేతులు వేసి లాలనగా చూశాడు.

* * * *

అహల్య గౌతముల కౌగిలిలో ఒదిగిపోయింది. అపరంజి బొమ్మ అహల్య తన కౌగిలిలో ఒదిగిపోగానే మహర్షి గౌతములు ఆమె ముఖాన్ని పైకెత్తి చుబుకం పట్టి ఆమె కళ్లలోకి చూస్తూ చిరునవ్వు నవ్వాడు.

'దేవీ!' ప్రేమగా పిలిచాడు ఆయన.

'స్వామీ!'

'ముల్లోకాల ఏలికకు పట్టని అదృష్టం ఈ మునిపుంగవునికి దక్కింది.'

'ఒక స్త్రీని పెండ్లాడటం అదృష్టమా స్వామీ!'

'ఒక స్త్రీ కాదు. నువ్వు స్త్రీ మాత్రురాలివి కాదు అహల్యా! పరమేష్టి వర పుత్రువి! నీ పుట్టుకకు ముందు ఎంతో గాథ ఉంది. సకల సృష్టిలోనూ లేని ఏ లోతూ లేని స్త్రీ సృష్టించవలసిన పరిస్థితి వచ్చింది. అన్ని లోకాలలోనూ నిన్ను పోలిన అందగత్తె లేకుండా నిన్ను సృష్టించారు మా మామగారు!'

చిరునవ్వు నవ్వింది అహల్య.

'తమరు వేదవేదాంగ వేత్తలు. మహర్షులలో మన్నన పొందినవారు. తమ ధర్మ సూత్రాలతో న్యాయ సూత్రాలతో సకల లోక ప్రసిద్ధి పొందినవారు. తమ పాద సేవా భాగ్యం లభించడం నా అదృష్టం స్వామీ!'

'చతురాననుడి పుత్రివి. అంతకంటే ఇంకేం అనగలవులే! అహల్యా మన ఈ తొలిరాత్రి నీ పుట్టుకను గురించి నేను ప్రస్తావించడానికొక కారణం ఉంది'

'చెప్పండి స్వామీ!'

'నువ్వు వేదాధ్యయనం చేయాలి! సృష్టికర్త అందాలన్నీ రాశి పోసి నిన్ను పోతపోశాడే కాని సమస్త విద్యలనూ ధారపోయలేదు. స్త్రీలు చదువు నేర్వాలి. అహల్యా! వేదాలు, వేదాంగాలు, శాస్త్రాలు చక్కగా అభ్యసించాలి. మగవారిలాగే మగువలూ అన్ని విద్యలూ నేర్వాలి. మాతృమూర్తి విద్యావతి అయితే సంతానమూ విద్యావంతులవుతారు అహల్యా! నిన్ను నేను చదివిస్తాను.'

'ధన్యోస్మి స్వామీ!'

అహల్య భర్త పాదాలకు నమస్కరించింది.

గౌతములు ఆమెని లేవదీసి గుండెల్లో పొదుపుకున్నారు. రుద్రాక్ష మాలికలు అహల్యకు గుచ్చుకున్నాయి.

## 13

'అహల్యా! అహల్యా!' ఆర్తిగా గుండెల్లో పొదుపుకున్నాడు ఇంద్రుడు.

'ప్రభూ!'

'ప్రభువును కాదు అహల్యా! పాద దాసుడ్ని. సురలోకం వద్దు. సురాధిపత్యం వద్దు. నాకు నువ్వే కావాలి అహల్యా!'

'ప్రభూ!'

'ఔను! అహల్యా! నువ్వు గౌతముడి వెంటే వెడుతూంటే నా సర్వాధికారాలూ ఆయన హోమాగ్నిలో వేసే తృణంతో సమానం కావనిపించింది. అఖిలలోక పాలన అమరలోక నినాదం. అంతా వృథా! వృథా! అనిపించింది. నిన్ను చేపట్టలేని అధికారం వ్యర్థం అనిపించింది. రాక్షసులు మా లోకంపై దండెత్తి వచ్చి మమ్ములను జయించి మా లోకంలోని అచ్చెరలను చెరపట్టినట్లు- నిన్ను ఆ మహర్షి నుండి బలాత్కారంగా పొందాలనిపించింది.'

'ప్రభూ!'

'కానీ- పెద్దరికం అడ్డు వచ్చింది.'

'ప్రభూ!'

'అవును. మా పెద్దరికం కాదు. పరమేష్టి పెద్దరికం. గౌతముల పెద్దరికం అడ్డు వచ్చాయి.'

'ప్రభూ!'

'కానీ ఆ బ్రహ్మ ఆయనకి నిన్ను ధారపోస్తే నువ్వు నన్ను వెదుక్కుంటూ రావడం నా అదృష్టం దేవీ!'

'ప్రభూ!'

అప్పుడే నీ చూపులు నాపై వలపుని చెప్పకనే చెప్పాయి. అందరికంటే ముందు భూ ప్రదక్షిణం చేసి వచ్చాననీ, అమరేంద్రుడననీ నన్ను నీవు గుర్తించి చూసిన తొలిచూపు ఒక్కటే చాలు అహల్యా!

అన్నింటికంటే మిన్నగా అభిషక్తుడిని చేసినట్లుగా భావించాను!'

'ప్రభూ!'

'కదలకు అహల్యా! నిన్ను కోరి కోరి నీవు దొరక్క విరహంలో వేగి వేగిపోయిన ఈ గుండెలకు నీ స్పర్శతో శాంతిని కల్గించు. నీకోసం పరితపిస్తూ నీరాక కోసం నిరీక్షిస్తూ రెప్ప పాటు లేక నిలిచిపోయిన నాకు- నువ్వే కరుణించి కనికరించి నా చెంతకు వచ్చిన అదృష్టాన్ని చెరగనీకు'

'ప్రభూ!'

'అవును. ప్రభువునే! అఖిల లోకాలకూ ప్రభువును. అచ్చెరలకు ప్రభువును. మహర్షులకు ప్రభువును. మానవులకు ప్రభువును. కానీ నీకు ప్రభువును కాను అహల్యా! పతి కాలేకపోయిన అదృష్టహీనుడ్ని! నన్ను 'ప్రభూ' అని కించపరచకు!'

'ప్రభూ! ప్రభూ! నేను ప్రభూ. కనులు విప్పి చూడండి. నేను అహల్యను కాను...'

ఆశనిపాతం లాంటి ఆ మాటలు వినీ వినగానే ఇంద్రుడు చలించిపోయాడు. అప్రమత్తుడయ్యాడు.

కళ్ళు తెరిచి చూశాడు.

అప్పటికే కౌగిలి వీడిన ఆమె- దూరంగా నిలుచుంది. ఆమె దూతిక. ఇంద్రుడి ఆంతర్యం ఎరిగిన దూతిక.

శచీదేవి అలిగినా, ఆగ్రహించినా, పతిని మన్నించకపోయినా శచీదేవిని ఇంద్రుడి యెడల ప్రసన్నం చేసే ఆంతరంగిక చెలి.

అన్య వనితలన్నా, అందమైన అతివలన్నా ఆశపడి అందం వెంట అహరహం వెంటపడే ఇంద్రుడంటే శచీదేవికి కోపం రానిదెప్పుడూ? అందుకే శచీదేవి మనస్సుని మళ్ళించే పని ఆమెకే! చప్పున నమస్కరించింది.

'తమరు ఒంటరిగా ఉన్నారనీ, అన్య మనస్కంగా ఉన్నారనీ, ఏదో తెలియని ఆవేదన తమని నిరంతరం వేధిస్తున్నదనీ శచీదేవమ్మగారు చెప్పారు. తమ దిగులుకి హేతువు తెలుసుకుని తమ దిగులు తీర్చే గురతర బాధ్యతని నా మీద మోపారు. అందుకే నేను ఇక్కడికి సాహసించి రాగలిగాను. తమరు అహల్యా చింతనలో చిక్కిపోయారని చెప్పకనే చెప్పుకున్నారు.'

'ఊ!' అన్నాడు ఇంద్రుడు.

'నన్ను విశ్వసించండి ప్రభూ! తమ గుండెల నిండుగా నిండుకున్న అహల్యాదేవి గురించి శచీదేవి గారికి తెలియనివ్వను. నేను అమ్మగారిని అంతరంగిక దాసినే! కానీ తమరి ఏలుబడిలోని దాన్ని. తమకే నమ్మిన బంటును. ఇంతకాలం తమపై ఆగ్రహించిన అమ్మగారిని ప్రసన్నం చేసే బాధ్యత నేను మోశాను.

ఇప్పుడు ప్రయత్నించి ఆ అహల్యమ్మగారు తమ యెడల ప్రసన్నం అయ్యేట్లు చేసే బాధ్యత స్వీకరిస్తున్నాను. ఆడవారి మనసెరిగి అతికినట్లు బొంకి ఒప్పించగల నేర్పున్న నాకది అసాధ్యం కాదనుకుంటున్నాను!'

'దూ.. తి.. కా...'

'మన్నించండి మహేంద్రా! అన్ని లోకాలకూ అధినాధులై- అందరినీ శాసించగల మీరు ఒక అబల, ఒక మానవ కాంత కోసం యిలా పరితపించడం చూడలేను! నయాన్నో, భయాన్నో, సామంతోనో, దానంతోనో ఆమె మనసు మార్చగలను. ఆ ప్రయత్నంలో విజయం సాధించి ప్రభువులకు మనశ్శాంతి చేకూర్చగలను. అని నమ్మినదాన్ని నేను. చేజారిన తమ సుఖాన్ని తమ చేతులకు అమృత ఫలంగా అందించే ప్రయత్నం చేస్తాను.'

'ఊ!'

'ప్రభూ! స్త్రీలు చల చిత్తులు. చపల చిత్తులు. అందునా బ్రహ్మకూతురిగా సృష్టింపబడి- దేవేంద్రాది దేవతలు తనని పెండ్లాడాలని భూప్రదక్షిణ పుణ్యం కోసం పరుగులెత్తి- చివరికి ముక్కు మూసుకుని జప తపాల్లో మునిగే ఒక జడదారికి ధారపోయబడి అసంతృప్తితో అడుగులు వేసిన ఆడదాని మనసు మార్చటం ఎంతసేపు ప్రభూ?'

'దూతికా...'

'నన్ను నమ్మండి. నాపై భారం మోపండి. మీరు నిశ్చింతగా ఉండండి! అహల్య మీ కౌగిట్లోకి వచ్చే సుముహూర్తం కోసం నిరీక్షించండి. ఈలోగా మీ శచీదేవమ్మగారి మనస్సుని శాంత పర్చండి.'

నవ్వాడు ఇంద్రుడు.

'ప్రభువులు తప్పుగా అర్థం చేసుకున్నారు. తమరిని శచీదేవి మందిరానికి సాగనంపడానికి ఈ మాటలు చెప్పడం లేదు! మీరు అహల్యపై మనస్సు నిలిపి అన్నిటా అన్యమనస్కంగా ఉండటం చూసి భరించలేక నా దౌత్యంపై నాకు గల అచంచల విశ్వాసంతో చెప్పిన మాట అది!'

సంతృప్తిగా నవ్వాడు ఇంద్రుడు.

'ఇదిగో! ఈ పగడాల దండ బహుమతిగా పుచ్చుకో!'

ఇంద్రుడిచ్చిన పగడాల దండ మెడ నిండుగా అలంకరించుకుని అమరేంద్రుల ఆదరంతో లభించిన 'ఈ పగడాల దండ అహల్యని ఆకర్షించి తీరుతుంది. పగడాలకున్న శక్తి సామాన్యమా!' అంది చిరునవ్వుతో.

ఇంద్రుడు నవ్వుతూ మందిరం వైపు సాగేడు.

## 14

గౌతమాశ్రమంలో తొలిరేయిలాగే తొలి రోజులు చాలా హాయిగా, ప్రశాంతంగా గడిచిపోతున్నాయి.

అహల్య- భర్త గౌతములతో పాటే వేకువనే లేచి నదీ స్నానం కోసం ఆయన వెంట నడిచేది. శిష్య గణం వారిని అనుసరించేది. స్నానంతోపాటు అందరూ సంధ్యా వందనాదులు పూర్తి చేసుకునేవారు.

అహల్యకు సంధ్యావందనం వారం తిరక్కముందే స్వరయుక్తంగా వచ్చేసింది. గాయత్రి ఆవాహనలో ఆమె మనస్ఫూర్తిగా ధ్యానంలో మునిగిపోయేది. పరిసరాలు, ప్రకృతి మర్చిపోయేది.

ఆ రోజు అందరితోపాటే ఆమె కూడా నదీ స్నానానికి బయలుదేరింది. అందరూ సంకల్పసహితంగా స్నానం చేస్తున్నారు. స్నానానంతరం యధావిధిగా సంధ్యావందనాదికాలు పూర్తవుతున్నాయి. ఎవరికివారు వారి ఇష్ట దైవాన్ని, ఇష్ట మంత్రాన్ని ప్రార్థించి జపిస్తున్నారు.

అప్పుడు వచ్చాడు విశ్వామిత్రుడు.

బ్రహ్మర్షి విశ్వామిత్రుడు తానూ నదీ స్నానం చేసి, యధావిధిగా సంధ్యావందనాధికాలను పూర్తిచేసుకున్నాడు.

ఆపై- నదీ తీరం దాటి ఆశ్రమానికి వచ్చేదారిలో ఓ చెట్టు కింద వితర్దిక మీద విశ్వామిత్రుడు ఆశీనుడైనాడు.

ఆయన పక్కనే గౌతములు అహల్య నిలుచునే ఉంది. ముని జనం శిష్యగణం అంతా ఆశ్రమానికి వెళ్ళిపోయారు.

విశ్వామిత్రుడు నవ్వుతూ అన్నాడు. 'సరస్వతీ పుత్రిక అయినా, పరమేష్టి మానసపుత్రిక అయినా గురు ముఖతః చదవందే చదువు రాదన్న మాట బాగా రుజువైంది గౌతమా! తమరు అహల్యకు అక్షర స్వీకారం జరిపించి చక్కని పనిచేశారు. ఆడవారూ చదువుకుని విద్యావంతులు కావాలయ్యా! అప్పుడే సమాజం చక్కగా ఉంటుంది.'

గుతములు చిరునవ్వు నవ్వారు.

'అర్ధాంగి అనే పదానికి సరైన అర్ధం తిరిగి నిరూపించాలనేది నా సంకల్పం మహర్షీ! నిజానికి ఈ చరాచర సృష్టిలో అర్ధాంగి అనే పదానికి సరైన అర్ధం ఆ సర్వమంగళ ఒక్కరే! పరమేశ్వరుడిలా అన్నీ సగం సగం పంచి ఇచ్చి అర్ధ దేహమిచ్చి అర్ధాంగిని చేసుకున్న వారింకెవరున్నారు?'

'మంచి మాట!' తృప్తిగా అన్నాడు విశ్వామిత్రుడు. భార్య కూడా భర్తతో సమానమే. భర్త అంటే భరించేవాడు కదా! వైవాహికంగానే కాక అముష్మికంగా భరించేవాడని కదా పరమార్ధం. భార్య అంటే భరించేది. భర్త సంతానాన్ని గర్భంలో ధరించి భరించడమే కాదు. అతని కీర్తిని, అపకీర్తిని కూడా భరించేది అని పరమార్ధం. సహధర్మచారిణి సర్వవిధాలా భర్తకు తులతూగాలి. అప్పుడే ఆ జంట ఆదర్శ ప్రాయమౌతుంది.

విశ్వామిత్రుల వారి అభిప్రాయం విని గౌతములు తలూపారు.

'గౌతమ మహర్షి! తమరు అహల్యకు సంధ్యావందనం ఉపదేశించారు. వేదాలు పలికిస్తున్నారు. న్యాయ సూత్రాలు పఠింపజేస్తున్నారు. ఆమె వైదుష్యం మరింత జ్వాజ్వల్యమానం కావటానికి ఆమెకు నేను గాయత్రీ ఉపదేశిస్తాను. సంధ్యావందనాంగంగా ఆమెకి తమరు గాయత్రీ ఉపదేశించడం వేరు. నా మంత్రోపదేశం వేరు కదా!'

'నిస్సందేహంగా మహర్షీ!' అన్నాడు గౌతముడు. తమరు గాయత్రీ మంత్ర ద్రష్టలు! గాయత్రీ రూప కల్పనను దర్శించిన మహర్షులు! లోకానికంతా గాయంత్రిని పరిచయం చేసిన ధన్యులు. తమరి ద్వారా అహల్యకు ఆ మంత్రోపదేశం జరగడం అద్భుతం!'

విశ్వామిత్రుడు అహల్యవైపు చూశాడు.

ఆమె వచ్చి పునః ప్రమాణాలు సమర్పించింది.

విశ్వామిత్రుడు గాయత్రీ మంత్రాన్ని ముమ్మారు పలికించారు. నేత్ర నిమీలితయై మంత్రోపదేశం పొందుతున్న అహల్యకు సాక్షాత్తూ గాయత్రీమాత కనిపించింది. విశ్వామిత్రుడు ఎంతో సంతోషించాడు.

'మహర్షీ! ఇన్నాళ్ళూ గాయత్రీమాత ఆవాహనలో ధ్యాన శ్లోకం పఠించే సమయంలో శ్లోకంలో వర్ణించిన మూర్తి కనిపించేది. అమ్మ కనిపించినంత ఆనందం కలిగేది. పంచముఖాలతో, పంచ వర్ణాలతో దర్శనమిచ్చినట్లు భాసించేది. కానీ ఈనాడు సాక్షాత్కారం కలిగింది.'

అహల్య మాటలు విని విశ్వామిత్రుడు చాలా సంతోషించాడు.

'అహల్యా! గాయత్రీని మించిన మంత్రం లేదన్నారు మన వాళ్లు. నగాయత్ర్యాః పరం మంత్రం అనేది అక్షర సత్యం. గాయత్రిని ఉపాసించు. గాయత్రీని ఉపాసిస్తే లభించనిది లేదు. ఏది కావాలన్నా అది అరచేతి స్వర్గంలాగ లభిస్తుంది. గాయత్రీని మరిస్తే ఏదీ లభించదు. గాయత్రీని స్మరిస్తే సర్వం లభిస్తాయి. గాయత్రీ లేనిదే సృష్టి లేదు. సృష్టిలో చైతన్యం లేదు.'

విశ్వామిత్రుడి మాటలకు గౌతముడు ఎంతో సంతోషించాడు.

'మహర్షీ! మంత్ర ప్రభావాన్ని మంత్ర ద్రష్టలైన తమరు ఎంతో చక్కగా వివరించారు. మీ మాటలు వింటే లోకం బాగుపడుతుంది. వినలేదా చెడిపోతుంది.'

'గౌతమా! గాయత్రీ మంత్ర ప్రభావం ఇంకా ఉంది. లోకంలో ఎవరూ తెలుసుకోలేని పరమ రహస్యం చెపుతాను విను. గాయత్రి తనను జపించిన వాడినే కాదు, ఆ కుటుంబాన్నే రక్షిస్తుంది. అంతేకాదు గాయత్రిని జపించే అర్హత లేని జనాలను నీ మంత్రం కాచి రక్షిస్తుంది. ఒక గ్రామ వాటికలో వంద కుటుంబాలు ఉంటే అందులో ద్విజత్వం పొంది గాయత్రీ ఉపదేశం పొందగలిగినవారు ఏ ఐదారుగురో ఉన్నా చాలు. వారు నియతిగా నిష్టగా నిర్మల చిత్తంతో ధ్యానిస్తే ఆ మంత్ర ప్రభావం ఆ గ్రామాన్ని రక్షిస్తుంది.'

గౌతముడు అమితానందంతో అన్నాడు 'బ్రహ్మర్షీ! శివజటాజూటం నుంచి గంగను దించి భూ లోకంలో పారించి ఆ నదీ పరీవాహక ప్రదేశంలో పంటలు పండిస్తే ఎంత పుణ్యమో అంతకు కోటి రెట్లు పుణ్యం తమకు దక్కుతుంది. గాయత్రీ మాతను దర్శించి లోకానికి ప్రసాదించి తమరు మహోపకారం చేశారు. అందుకు ప్రతిగా సంధ్యావందనంలో తమ పేరు 'గాయత్ర్యా గాయత్రీ ఛందో గాధీ పుత్రో విశ్వామిత్ర ఋషిః' అని చేర్చి సంకల్పించాలి. ఇది నా అభిలాష!'

'తథాస్తు! అలాగే సవరిస్తాం!' అన్నాడు విశ్వామిత్రుడు.

గౌతముడు మహర్షిని తమ ఆశ్రమానికి ఆహ్వానించి కదిలాడు. అహల్య అనుసరించింది.

## 15

విశ్వామిత్రుడి వల్ల తిరిగి బ్రహ్మోపదేశం పొందిన అహల్య ఆ మంత్ర పునశ్చరణలో నిమగ్నమైంది. విశ్వామిత్రుడు ఆనాడు గౌతముల ఆతిథ్యం పొంది తిరిగి వెళ్లగానే, అహల్యను పిలిచి గౌతముడు అన్నాడు.

'అహల్యా! మంత్రశక్తి అపారమయినది. దానికి పరిమితి లేదు. జపించే కొద్దీ, తపించే కొద్దీ అది విశేష ఫలితాలనిస్తుంది. ఏ మంత్రానికయినా అందులో ఎన్ని అక్షరాలున్నాయో అంత సంఖ్యలో జపం చేయడం ముని నిర్దేశం. పదుల్లో చేసే నిత్య జపం రక్షా కవచంలా పనిచేస్తుంది. వందల్లో చేసే జపం సురసురభిలా కోరినవన్నీ తీరుస్తుంది. అక్షర సంఖ్యకు తగినన్ని వేల జపం చేయగానే ఇష్టకామ్యార్థ సిద్దీ, అక్షర లక్ష జపం పూర్తి చేయగానే మంత్ర సిద్ధీ వర్తిస్తాయి. మంత్రం కామధేనువు వంటిది. కోరడమే తరువాయి కోరికల వర్షం కురిపిస్తుంది.

అహల్య భర్త మాటలు విని మననం చేసుకుని అంది.

'స్వామీ! నేను ముందుగా అక్షర సహస్రం పూర్తి చేస్తాను. ప్రతినిత్యమూ అక్షర శతం జపిస్తాను'

చిరునవ్వులు చిందించాడు గౌతముడు 'ఏమి కోరి జపం ప్రారంభిస్తున్నావో?'

సిగ్గుతో తల దించుకుంది అహల్య.

గౌతముడికి ఆమె మనస్సు తెలిసిపోయింది. 'ఇల్లాలా! మన దాంపత్య యాగానికి ఫలం త్వరలోనే సిద్ధిస్తుంది. నీ కడుపున విశేష ప్రజ్ఞావంతుడు జన్మిస్తాడు. అతడి జ్ఞానం అపారం! విదేహరాజు జనకరాజర్షి వంటి వారి ప్రశంసకు పాత్రుడవుతాడు. అయోధ్యాధీశులు దశరథ మహారాజు ఇక్ష్వాకు వంశ కీర్తి ప్రతిష్ఠా హేతువు. ఆయనకిప్పుడు సంతానం లేదు. అయితే త్వరలో లోకోత్తర పురుషుడు జన్మించనున్నాడు. ఆ ఇక్ష్వాకు కుల తిలకుడి మర్యాద మన్ననగా పొందగలుగుతాడు. మన వంశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తాడు' అన్నాడు.

అహల్య భర్త పాదాలు సున్నితంగా స్పృశించింది.

'ధన్యురాలిని. నా పుట్టుకే విశేషమనుకున్నాను. కానీ నా కడుపున జన్మించబోయేవాడూ అదృష్టవంతుడవుతాడనీ, అశేష ఖ్యాతి ఆర్జిస్తాడనీ వినడం నాకు ఎంతో సంతోషంగా ఉంది' అంది వినయంగా.

'బ్రహ్మ మానస పుత్రీ!' ప్రేమగా పిలిచాడు గౌతముడు. 'ఈ చరాచర సృష్టిలో విలువ లేనిదీ, వ్యర్థమైనదేదీ లేదు. మా మామగారు సృష్టికర్త బ్రహ్మదేవుడు దేన్నీ వృధాగా సృష్టించడు కదా! ఏదో ప్రయోజనమే ఉంటుంది. గరిక పోచను కూడ గణపతి పూజలో వినియోగిస్తాం కదా దేవీ!

అలా ప్రతిదీ ప్రయోజనకరంగా, ప్రతిదాన్నీ ఏదో ఒక ఉపయోగకరంగా సృష్టించే బ్రహ్మ పనిగట్టుకుని సృష్టిలోని అందాలన్నీ ఒక చోట రాసి పోసి నిన్ను నిర్మించాడంటే నీ పుట్టుకకు ఎంత పరమార్థం ఉండాలి? ఎంత ప్రయోజనం ఉండాలి? ఏ స్త్రీ జన్మ అయినా ఫలించేది మాతృత్వం వల్లనే! కన్న సంతానం తనకన్న అధికులు కావాలని ప్రతి తల్లీ దండ్రీ ఆశిస్తారు. మనమూ అంతే!'

అహల్య ఆమోదకరంగా తలూపింది.

నాటినుంచి ఆమె గాయత్రీ మంత్రాన్ని పరమ నిష్ఠతో, ఏకాగ్రతతో జపించసాగింది. జప సంఖ్యా ఇరవై నాలుగు వేలకు చేరుకుంది. అహల్య ముఖంలో దివ్య తేజస్సు తొణికిసలాడుతున్నది.

* * * *

ఒకనాడు ప్రదోష పూజకు పూలు తాజాగా సేకరించాలని సాయంకాలం పూట పూలు తుంచుకుంటున్నది అహల్య. వెదురు వేళ్ళతో అల్లిన బుట్టలో పూలను తుంచి వేస్తున్నది. తమ ఆశ్రమానికి చుట్టూ పెరిగిన వెదురు నరికినప్పుడు

వ్యర్థంగా పడి ఉన్న వేళ్ళతో ఆ బుట్టను అల్లింది. ఆ బుట్టను చూసిన ఆశ్రమ వాసినులు ఆమెనెంతో గొప్పగా మెచ్చుకున్నారు.

వెదురు చీల్చి చిన్న చిన్న వేళ్ళుగా తీర్చి వాటితో అందంగా బుట్టలు అల్లడం ఆశ్రమ వాసినులకు క్రీడగా పరిణమించింది.

గౌతములు అహల్యను అభినందించారు.

భర్త మాటలు గుర్తుకొచ్చాయి ఆమెకు. 'అహల్యా! సాటి ముని పత్నులలో 'సమానానాం ఉత్తమం' అనే పేరు ప్రతిష్టలను పొందావు. పూజలు నిర్వహించడంలో, వ్రతాలు చేయడంలో, నోములు నోచడంలో నువ్వు నీకంటే పెద్ద వారి మెప్పును కూడా పొందావు. ఇదంతా....'

'ఆ దేవి గాయత్రీ అమ్మవారి కరుణా కటాక్షం' అంది.

'నీ వినయం నీ ప్రజ్ఞకు వన్నె తెస్తున్నది.'

భర్త మాటలు గుర్తొచ్చి మరోసారి నవ్వింది అహల్య.

'నవ్వమ్మా నవ్వు! నీ నవ్వులన్నీ నవరత్నాలై ఆ బుట్టలో రాలి అది నిండితే ఆర్థిగా వచ్చిన నా దోసిలి నిండా కొన్ని రత్నాలు రాలితే నా జన్మ ధన్యమైందనుకుంటాను'

పూజకు పూలు సేకరిస్తూ, మనసులో మగని స్మరిస్తూ పరవశిస్తున్న అహల్య ఆ కొత్త ధోరణి, ఆ కొత్త పిలుపు, ముఖ్యంగా ఆ కొత్త కంఠం విని ఉలిక్కిపడింది. ఉలికిపాటుతో చప్పున అటు చూసింది.

అక్కడ సురలోక సౌందర్యం నిండుగా దండిగా ప్రతిబింబించే ఓ యువతి చూడగానే స్నేహం వరదల్లే ప్రవహించేటట్లు చేయగల చిరునవ్వు, ప్రసన్న వదనం, మంచితనం, మూర్తీభవించినట్లుండే చూపులు. ఎన్నడూ చూడలేదామెని. పరిసర ఆశ్రమాలలో ఉండే మునికన్నెలూ, ముని పత్నులూ ఆశ్రమానికి వచ్చి వెళ్ళడంతో వారంతా పరిచయమే. కానీ ఈమెనెన్నడూ చూడలేదు.

అసలీ రూపమే కొత్తగా ఉంది. మునికన్నెలకూ, ఋషి పత్నులకూ భిన్నంగా ఉంది! జానపదురాలు కాదు. నగర వాసినీ కాదు. ఏ రాజాంతఃపురంలోనో అసూర్యంపశ్యగా మెలిగే సుందరి కావచ్చునేమో! లేక గరుడ, గంధర్వాది, యక్ష జాతి వనితయేమో! ఎవరైతేనేం సుప్రసన్న వదన- సురుచిరముఖి- సుందరి.

'ఏమిటమ్మా ఆ ఆశ్చర్యం? ఎవరని చూస్తున్నావా నన్ను? నన్ను నువ్వెప్పుడూ చూడలేదులే! అందరిలో కొందరే అందగత్తెలు. ఆ కొందరిలో ఇంకొందరే సుందరీమణులు. సుందరీమణుల్లో సుందరీమణిగా సురలోకంలో సృష్టించబడి నరలోకంలో నివసిస్తున్నావని తెలిసి చూడటానికి వచ్చాను' అందా యువతి.

అహల్య చప్పున తేరుకుంది.

'ఎవరైతేనేం! ఎక్కడి నుండి విచ్చేస్తేనేం! మా ఆశ్రమానికి విచ్చేశావ్! నీకు అతిథి మర్యాదలు జరపడం మా ధర్మం! రా! లోపలికి వెళదాం! అర్ఘ్యపాద్యాదులతో అర్పించి ఆపై సుఖాసీనురాలిని చేసి మా కందమూలాది పదార్థాలో- మా కందఫలాలో- ఏవో నీకు ఆరగింపు చేస్తాం!' అంది అహల్య నవ్వుతూ.

అహల్య నవ్వుని చూసి ఆమె నివ్వెరపోయింది. ఏమా చిరు దరహాసం! సమస్త లోకాలనూ శాసించగల ఠీవీ, దర్పం- సర్వ జనులనూ మైత్రితో బంధించగలిగిన ఆత్మీయత- అనురాగం అందులో ఉన్నాయి.

బహుశః ఈ నవ్వుని చూసే- యీ సుందర దరహాస వదనాన్ని చూసే- మా సురనాధుడు ఈమె ప్రేమలో పడిపోయాడు. అఖిల లోకాధిపత్యం యీ అతివ చిరునవ్వు ముందెంత అనుకునే ఈమెపై మక్కువ పెంచుకున్నాడనటం నిక్కువం. అహల్య నవ్వుల విలువలు నిర్ణయించడంలో నిమగ్నమయింది ఆమె.

'ఏమిటమ్మా! అలా చూస్తున్నావ్!' అడిగింది అహల్య.

చప్పున ఆ మైకం నుంచి తేరుకుందా యువతి.

'నిన్నే చూస్తున్నాను' అంది.

'నన్నా!'

'అవును నిన్నే! అమరలోకంలో జరిగిన అల్లరి- ఆపై అందరి మన్ననలూ అందుకునే మహేంద్రుడి ఆలోచన. అటుపై బ్రహ్మ లోక ప్రయాణం. అక్కడ సృష్టికర్త అయిన వ్యాఖ్యానం. ఆపై నిన్ను సృష్టించడం.

అంతా విని ఆగలేక నిన్ను చూద్దామని- చూసి తరిద్దామని- జన్మ సార్ధకం చేసుకుందామని- వచ్చాను. విన్న మాటలో పూచిక పుల్లంత కూడా అబద్ధం లేదు. అతిశయోక్తి లేదు. అమరేంద్రుడన్న మాట అక్షరాల నిజం'

'ఎవరో ఏదో అంటారు. ఇంకేదో చెపుతారు. అయినా ఆ పుట్టువుకయినా ఏదో ఒక హేతువు ఉంటుంది. కారణం లేనిదే కార్యం ఉండదు కదా ఎక్కడా?' అంది అహల్య మళ్ళీ నవ్వుతూ.

మళ్ళీ పువ్వులు విరిసినట్లయింది.

ఆమె అహల్య మాటలు విని ఆశ్చర్యపోయింది. ఆ నెమ్మదితనానికి, ఆ గాంభీర్యానికి అద్భుత పడింది.

'అమరేంద్రుడన్న మాట అక్షరశః నిజం' మళ్ళీ తనలో అనుకున్నట్లుగా అంది.

'నన్ను పొగడడానికే వచ్చి ఉంటే ఆ పని తీరిగ్గా ఓపిగ్గా చేయవచ్చు. ముందు మా ఆశ్రమ మర్యాద మేరకు మేము నిన్ను గౌరవించాలి! పద' అంది ఆత్మీయంగా అహల్య.

'ఏమీ తొందరలేదు లేవమ్మా అహల్యా! నీకైనా ఆ పూవులు కోసి పూజకు అమర్చడమే కదా ఇప్పటి పని! అయినా పూవులు పూజకే తప్ప మరోరకంగా ఉపయోగించడం తెలియదా నీకు. అహ! మీకు మీకంటే మీ ఆశ్రమ వాసులకు?'

'అదేమిటీ? పూవులకు రెండే కదా ఉత్తమ స్థానాలు! సిగలో అలంకరించుకోవడం! పూజలో ఉపయోగించడం. మరింకేం ఉంటుందీ?' అడిగింది అహల్య.

పకపక నవ్వింది ఆ యువతి.

'అంతేనమ్మా! అంతే! ఆశ్రమ వాసులకు తెలిసేదంతే!'

'తెలియకపోతే తెలియజెప్పరాదా!'

'చెపుతా! చెపుతా! చెప్పాలనే కదా వచ్చాను!'

'ఏమిటమ్మా విచిత్రం! చూడాలని వచ్చానంటావు. చెప్పాలనీ వచ్చానంటావు. ఆశ్రమానికి విచ్చేసిన అతిథి అభ్యాగతులకు స్వాగత సత్కారాది సేవలు చేసి ఆపై ప్రసన్నవేళలో రాకకు పరమార్థమేమో తెలుసుకోవడం మా ఆచారం. అందుకే ఎందుకొచ్చావమ్మా అని అడగలేదు' అంది అహల్య పెదవులు విచ్చీ విచ్చకుండా నవ్వుతూ.

మళ్ళీ ఆ నవ్వులకు ముగ్ధురాలయింది ఆ యువతి.

'అమరేంద్రుడన్నది అక్షరాశః నిజం' మళ్ళీ అంది ఆమె. 'నిజంగా జగదేక సుందరివి నువ్వు!' ఆ మాటలకు మాటలు కలుపుతూ అంది. అంతటితో ఆగకుండా మళ్ళీ అంది. 'దేవతలూ, మునులూ ఈ అందం కోసం పరుగుపందెంలో పాల్గొన్నారంటే పాల్గొనరూ! పాల్గొనకుండా ఎలా ఉండగలరు?'

అహల్య నవ్వుతూ అంది 'ఏమమ్మా! పనిగట్టుకుని నన్ను సాగనంపడానికే వచ్చావా!'

'ఆడది మెచ్చిందే అందం. ఔను, నిన్ను చూసి కళ్ళున్నందుకు సార్ధకం చేసుకుని, నీతో మాట్లాడి జన్మ ధన్యం చేసుకుని, నీ మైత్రి సంపాదించి పుట్టుక సార్ధకం చేసుకోవాలని వచ్చాను!'

అలా ఎదుట నిలుచుని ముఖాన్నే పొగడుతూ ఉంటే అహల్యకెలాగో ఉంది. ఆమె ఆత్మీయత నిండిన మాటలు ఆనందాన్ని కలిగిస్తూనే ఉన్నా- వినడం వీనుల విందుగానే ఉన్నా- ఏదో ఇబ్బందికరంగా ఉంది.

'నీకిది వింతగా అనిపించిందా?'

'ఏం కాదమ్మా! ఆ దివిలో జన్మించిన అందరి నోటా ఇదే మాట! ఆ దివి నుండి భువికి దిగివచ్చేశాక చూడవచ్చిన ప్రతివారి నోటా ఇదే మాట. వినీ వినీ...'

'విసుగ్గా ఉందా?'

'విసుగెందుకూ?' తెల్లబోయినట్లు ప్రశ్నించింది అహల్య.

'వినగా వినగా విసుగు, తినగా తినగా విసుగు. ఇది లోక సహజం కదా!'
'ఏమో! నాకయితే విసుగనిపించటం లేదు.'

'బ్రతికించావు. నాలోని ఆశను బ్రతికించావు. చాలు చాలు. అందం గురించి అందరూ అన్నమాటే అంటూ నన్ను విసిగించకు. వేరే ఏదైనా మాట్లాడు. లేదా త్వరగా సెలవు తీసుకో అంటావేమోనని చాలా భయపడ్డాను.'

'ఎందుకంటాను! వచ్చిన అతిథిని గౌరవించడం మా ధర్మం. నచ్చినా నచ్చకపోయినా అతిథిని మన్నించాలి. 'అతిథి దేవోభవా అని కదా ఆర్యోక్తి!'

'నేనూ నిజంగా దేవజాతినేలే!' అంది మెల్లగా.

'అంటే.. అంటే....'

'నేను మానవ జాతి స్త్రీనీ కాదు. ఈ భూలోకపు వాసినీ కాదు'

'మరి యక్ష కన్యవా?'

'యక్షిణి అనుకుంటున్నావా? ఎందుకు?'

'అందగత్తెలందరూ యక్షులో- గంధర్వులో- కిన్నెరలో- దేవతలో- అయి ఉండాలి కదా! అందుకని అలా అడిగాను'

'ఆ కోవలో ఆఖరి కోవ నాది. మాది అమరావతి' అంది.

'స్వర్గలోక వాసివా? స్వర్గం నుంచి....'

'పనిగట్టుకుని నిన్ను చూడాలని వచ్చాను'

'నిజమా?' నవ్వుతూ అడిగింది.

'నిజం గాక నిజంకాని మాట నా నోట వస్తుందా ఆహల్యా!'

'అమృతం తాగే నోట అనృతం ఎలా వస్తుందిలే! ఇంతకూ నీపేరు చెప్పనే లేదు'

ఇంద్ర సఖి!' చప్పున అంది. 'ఇంద్రాణి ఆంతరంగిక సఖిని. శచీదేవి మనస్సు తెలుసుకుంటూ. శచీ నాధుడి ఆంతర్యం ఎరుగుతూ వారి కనుసన్నలలో నేను మెలుగుతూ ఉంటాను. అదే నా విధి. ఇంద్ర ఇంద్రాణుల సన్నిధిని నేను నర్తించడమే నా కర్తవ్యం.'

'ఇంద్ర సఖి...'

ఆ మాటలు వినగానే ఉలికిపడింది అహల్య. అయినా క్షణంపాటు మళ్ళీ మనస్సు నిశ్చలమైంది.

'నిన్ను చూడాలనే వచ్చాను అహల్యా!' తొలిసారి పేరుపెట్టి పిలిచింది ఇంద్రసఖి.

ఆ మాటలు ఎంతో ఆనందాన్ని కలిగించాయామెకు. 'సఖీ!' అని ప్రీతితో పిలిచింది అహల్య. 'నేను నిన్నలా పిలుస్తాను. ఔను అలాగే పిలవాలనిపిస్తున్నది. సఖీ! ఎంత మధురమయిన పేరు! పూర్తి పేరుతో పిలిచేకన్నా ఇలాగే పిలుస్తా!' అంది.

'సఖీ! ఇంద్రసఖి!' తనలో అనుకున్నట్టుగా అంది. తర్వాత అహల్యను చూస్తూ అంది. 'ఎంత బాగుంది నీ పిలుపు! యుగయుగాల నుండీ చేస్తున్న చెలిమి కలిమి బలిమి లాగ ఉన్నదమ్మా చెలీ! నీ నుంచే ఆత్మీయత, అనురాగం, ఆప్యాయత ముప్పేటలుగా పుట్టుకొచ్చాయా అన్నంత కమనీయంగా ఉంది నీ పిలుపు.'

అహల్య నవ్వింది.

'నీ నవ్వులోనూ ఎంత నాజూకు! ఎంత నవ్యత! అహల్యా! పదేపదే నిన్ను చూడాలని ఉంది. మనసైనప్పుడల్లా మహేంద్రుని సన్నిధి నుంచి నీ పెన్నిధికి వచ్చేయనా! ఎంత! తృటిసేపు! అక్కడ అనుకుంటే ఇక్కడ దిగేస్తాను. మా వేగం మనోజవం కదా!'

అహల్య ఇంద్ర సఖి చేతులు పట్టుకుంది. ఆప్యాయంగా హత్తింది 'అంతకంటేనా సఖీ! బ్రహ్మ మానసపుత్రినైనా బ్రహ్మర్షి సముల ధర్మపత్నినైనా వెనుకా ముందూ ఎవరూ తోబుట్టువులు లేనిదాన్ని కదా నేను!

మానవలోకంలో తల్లీ తండ్రీ అమ్మ వదినా అక్కా బావా అన్నా తమ్ముడూ అక్క చెల్లీ అని ఆత్మీయత వొద్దు లొరిసి ప్రవహించే బంధాలున్నాయమ్మా! అవేమీ నాకు దక్కలేదు కదా! అన్నగారున్నారంటే ఆయన త్రిలోక సంచారులు! ఇప్పుడిక్కడుంటారు. మరొకప్పుడు మరో లోకంలో ఉంటారు. లోక కళ్యాణార్థం త్రిలోకాలూ తిరుగుతూ ఉంటారు కదా! ఆ లోటు తీరేదెలా అని అనుకుంటుండే దానిని. నా తలపోతలు వెతలుగానే నిలిచిపోతాయేమోనని నాకు బాధగా ఉండేది. కానీ ఆ దేవుడే దయతలచి నాకు నిన్ను పంపించాడు. నువ్వు నాకు దైవమిచ్చిన సోదరివి!'

గుండె నిండా వరదలా పెల్లుబికిన ప్రేమ నిండిన వాక్యాలుగా వెలువడిన అహల్య ఆంతర్యం గమనించి ఇంద్రసఖి ఆశ్చర్యపోయింది. ప్రేమ అనే మాట ఈ పృథ్విలో ఎంత బలంగా ఉంటుందో తెలుసుకుని నివ్వెరపోయింది. తమ లోకంలో ఎంత వెదికినా కనిపించని ఆ ప్రేమ ఈ భూలోకంలో అడుగడుగునా ప్రత్యక్షం కావడం చూసి అబ్బురపాటు చెందింది.

'అహల్యా!'

ఇంద్రసఖి మనసారా పిలిచింది. గుండెనిండా ప్రేమ నిండిన తృప్తితో పిలిచింది.

'సఖీ!'

'ఇది ఇంద్రుడిచ్చిన వరం కాదు. ఆ లోకంలో ఆడుతూ పాడుతూ ఉన్నవారికి వారు అపురూపమైన ఆభరణాలూ అవీ ఇస్తూంటారులే! అలాంటిది కాదిది. సృష్టికర్త అనుగ్రహం ఇది. నాపై పూర్తి కటాక్షంతో ఇచ్చిన వరం!'

'ఏమిటిది సఖీ!' అహల్య నవ్వుతూ అడిగింది.

'నీ చెలిమి' అంది ఇంద్రసఖి.

అంతలో 'అమ్మ! అమ్మా!' అంటూ వచ్చిందో బాలిక. ఎవరమ్మా యీ చిన్నారి? అడిగింది.

'నా కూతురు సఖీ!' వచ్చిన చిన్నారిని ఎత్తుకుని ముద్దాడుతూ అంది.

'నీ కూతురా?' ఆశ్చర్యపోయిందామె 'ఏమి విచిత్రం! నిన్నలా సృష్టి చేశాడు బ్రహ్మ! ఇలా గౌతములకిచ్చి పెళ్ళి చేశాడు. ఇంద్రలోకం అంతా నీ గురించి చెప్పుకుంటూంటే చప్పున నేను నీ గురించి వచ్చాను. అంతలో ఇంత కూతురా? నమ్మను! నమ్మలేను! యీ పాపాయి ఆశ్రమంలో మరో ముని తనయా? లేక గౌతములవారికి ఇంతకు ముందే సంతాన ప్రాప్తి కలిగిందా! పెంచిన ప్రేమతో పాపాయి నిన్నలా హత్తుకుపోతున్నదా?'

'అవన్నీ నీ ఊహలు సఖీ! ఈ చిన్నారి నేను కన్నపిల్లే! గౌతముల వారికి అంతకు ముందు పెళ్ళి కాలేదు. సంతానమూ లేదు. ఇది నా గర్భవాసాన జన్మించిన బంగారు కొండ! అంజన దీని పేరు' కూతుర్ని మళ్ళీ ముద్దాడుతూ అంది అహల్య.

'నమ్మను. నమ్మలేను! నమ్మనుగాక నమ్మను. నిన్ను చూస్తే నిన్ననో మొన్ననో పెళ్లయిన దానిలా ఉన్నావు! నీవు బిడ్డ తల్లివి అంటే నేను నమ్మను!' అంది విభ్రాంతితో ఇంద్రసఖి.

'తొలి సంతానం లక్ష్మీదేవిలా అవతరించిందని నేను మేమంతా ఆనందపడుతున్నాం. మా భూలోకంలో మొదట ఆడపిల్ల జన్మిస్తే లక్ష్మి కటాక్షంగా భావిస్తాం సఖీ! అయినా నేను కన్నబిడ్డనెత్తుకుని ఇది నా బిడ్డే అంటున్నా నమ్మనంటున్నావ్! ఏమిటీ కారణం?'

అహల్య మాటలు విని అబ్బుర చెందింది. క్షణంసేపు దిగ్భ్రాంతిలో ఉంది.

'నిజమా! నిజమా! నిజమే చెపుతున్నావా? అయినా నాతో అబద్ధం ఆడవలసిన అవసరం ఏమున్నదిలే! అహల్యా! నిన్నూ నీ సోయగాన్నీ చూస్తే నీవు మాతృత్వం పొందిన మహిళలా లేవు. ఇంకా పోలివోని యవ్వనంలో కన్యలా ఉన్నావు. నిజం నీవింకా కన్యవే!'

పకపక నవ్వింది అహల్య.

'అవును నేను కన్యనే! అది మా తండ్రి నాకిచ్చిన వరం!'

'అయినా ఇదెలా సంభవం? కొన్ని పొద్దులే గడిచాయి. అంతలో యింత... అహల్యా! సద్యోగర్భ ప్రసవమా అంజన?' సందేహిస్తూ అడిగింది ఇంద్రసఖి.

'కాదమ్మా ! ఈ లోకంలోని అందరు స్త్రీల లాగే నవమాసాలూ నిండుగా మోసి కన్నాను. బ్రహ్మలోకంలో సృష్టింపబడ్డా, మానవ లోకంలో కదా నా మనుగడ! అన్నీ మనుషులలాగే జరిగిపోతాయి.'

'అయినా ఇదెలా జరిగిందో....'

'నీవు ఇంకా భ్రమ నుంచి తేరుకోలేదమ్మా! ఇక్కడ ఆరు నెలలు ఒక ఆయనం! ఉత్తరం- దక్షిణం అని. అవి రెండూ గడిస్తే ఒక హాయనం. అంటే ఒక సంవత్సరం. అలా మాకు ఒక సంవత్సరం గడిచిపోతే మీకు ఒక పగలు. రెండేళ్ళు అయితే ఒక దినం. అలా లెక్కించుకో. అక్కడెన్ని దినాలు గడిచాయో దానికి రెట్టింపు సంవత్సరాలు గడిచిపోయాయి. నీకు లెక్క తెలీకపోతే చెప్తా విను! ఆరేళ్ళు గడిచాయి...'

అది విని అనుకుంది ఇంద్రసఖి 'మూన్నాళ్ళు... అవును. మూన్నాళ్ళు' అవును. తనలో తను అనుకుంది 'అవునమ్మా! లోకాంతర యానం వల్ల వచ్చిన తిప్ప ఇది! మరి నే వెళ్ళిరానా? మళ్ళీ నేను తిరిగి వచ్చేసరికి మీ లోకంలో ఎన్నేళ్ళు గడిచిపోతాయో! ఇంకెందరు సంతానం పుట్టుకొస్తారో నీకు?' అంది ఇంద్రసఖి.

'ఇలా వెళ్ళి అలా వచ్చేస్తూ ఉండు! నీకేం నీవు ఇంద్రసఖివి! నీది మనోజపం! మారుత తుల్య వేగం కదా!' అంది అహల్య.

ఇక మాటలు రెట్టించ లేదు ఇంద్రసఖి. ఇంద్రుడికి అహల్య సంతానవతి అని చెప్పి, అతని మనసు మార్చాలనే తొందర్లో సెలవు తీసుకుంటూ వెళ్ళిపోయింది. గగనానికెగసే ఆమెనే చూస్తోంది అహల్య.

ఇంద్ర సఖి భూలోకం నుంచి వచ్చీరాగానే, ఇంద్రుణ్ణి దర్శించుకుని తను భూలోకం వెళ్ళి అహల్యను కలుసుకుని ఆమెతో మాట్లాడి ఆమె అభిమానాన్ని సంపాదించుకుని ఆత్మీయురాలి అహల్య సఖిగా తిరిగివచ్చిన విషయం తన ప్రభువైన ఇంద్రుడికి చెప్పాలని ఎంతగా ఉవ్విళ్ళూరిందో అంతగా నిరాశకు లోనైంది.

ఆమె ఇంద్రలోకం చేరేసరికి అక్కడ ఇంద్రుడే లేడు. ఆయనా తదితర దిక్పాలురూ, దేవతలూ, ఋషులు, అందరూ కట్టగట్టుకుని విష్ణు సందర్శనార్థమై వెళ్ళారు. ఎందుకంటే...

లంకానగర పాలకుడైన పౌలస్త్యబ్రహ్మ- రావణ బిరుదాంకితుడు భూలోకంలోని వన వాటికల్లో నివశిస్తూ ముక్కు మూసుకుని విష్ణునామ సంకీర్తనలలో ముప్పొద్దులా గడిపే మునులను, సాధువులనూ హింసిస్తున్నాడు. వారు చేసే యజ్ఞ యాగాదులను భగ్నం చేస్తున్నాడు, చేయిస్తున్నాడు. పతివ్రతల చెర పడుతున్నాడు. అతని ధాటికి లోకమంతా తల్లడిల్లిపోతున్నది.

అతని బాధ భరించలేని ఋషులంతా పనిగట్టుకుని దేవేంద్రుడి సన్నిధికి వెళ్ళి మొరపెట్టుకున్నారు యజ్ఞాదులు చేసి హవిస్సులు అర్పించేది ఇంద్రాది దేవతలకే కదా! తమ దీక్ష కొనసాగడం లేదని, తమ జీవనానికి భంగం వాటిల్లుతూ ఉన్నదని, ఏం చేయడానికీ పాలుపోని స్థితిలో ఉన్నామని మొరపెట్టుకున్నారు.

ఇంద్రుడికి కాళ్ళూ, చేతులూ ఆడలేదు.

రావణుడి శక్తి ముందు అష్ట దిక్పాలుర బల సంపన్నత ఏమీ పనిచేయలేదు. బ్రహ్మ ఇచ్చిన వరాలలాంటివి. శివుడు మెచ్చి ఇచ్చిన వరం- నరవానరుల చేత తప్ప- మరొకరి చేత చావు లేదనే వరం వల్ల మరీ విజృంభించాడతను.

రావణుడు అతనికి కుమారుడు జన్మించబోయే నవగ్రహాధిపాలితమైన జాతక చక్రాన్ని తనకిచ్చివచ్చిన రీతిలో- అతడు మహాజ్యోతిర్విద్యావేత్త కనుక- రూపొందించుకుని అలా గ్రహాల్ని శాసించి కదలక మెదలక నిలిచేలా చేశాడు.

అప్పుడే తామెవరూ అతన్నేమీ చేయలేమనే విషయం స్పష్టాతి స్పష్టంగా నిర్ణయమైపోయింది.

తేలిపోయిన బలంతో విషయం తేలిపోయాక ఇక విచారించి ఫలమేమిటి? ఆజ్ఞ మీరిన శని కాలు విరగ్గొట్టి అతన్ని శాశ్వతంగా కుంటివాడిని చేసి మందుడనే పేరు నిర్ధారించాడు కదా!

అందుకని- తన వద్దకు వచ్చిన ముని జనాన్ని తనలోకంలో ఉన్న దేవగణాన్ని వెంటబెట్టుకుని విష్ణు సన్నిధికి వెళ్ళి పురుషసూక్తం పఠించి ఆయన్ని ప్రసన్నుడిని చేసుకుని విన్నవించుకున్నాడు.

వారితో పాటు భూదేవి వెళ్ళింది.

తనా భారం మోయలేకున్నానని, ఆ రాక్షసుని తప్పించమనీ ప్రార్థించింది. పాల సముద్రంలో శేష శయ్యపై విలాసంగా శయనించి శ్రీదేవి పాదాలు వొత్తుతూ వుంటే హాయిగా వున్న విష్ణువు చిద్విలాసంగా నవ్వాడు.

'కాలం కర్మం కలిసి రావాలి. రావణుడి పాపం పండాలి! అప్పుడే నేను అవతారం ఎత్తుతాను. అయోధ్య నగరాధీశుడైన దశరథుడు సంతానం లేక పరితపిస్తున్నాడు. ఆయన సంతానంగా మేం జన్మిస్తాం.

మేం అంటే నేను కౌసల్య కడుపున శ్రీరామచంద్రమూర్తిగా, ఈ ఆదిశేషుడు సుమిత్ర గర్భాన లక్ష్మణుడిగా, శంఖు చక్రాలు భరత శతృఘ్నులుగా కైకేయి సుమిత్రల గర్భాన జన్మిస్తారు.'

'నాతో పాటు దేవగణం, ఋషిగణం అంతా భూలోకం వస్తారు. ఈ శ్రీమహాలక్ష్మి మిథిలా నగరాధీశుడైన జనక మహారాజు ఇంట వెలుస్తుంది. అయోనిజగా జన్మించే సీత రావణ వినాశనానికి హేతువవుతుంది. అంతవరకూ ఓపిక పట్టకా తప్పదు. ఆ బాధలను ఓర్చకా తప్పదు' అన్నాడు.

కష్టాలకు ఒక తుది వుంటుందీ అంటే అదే పెద్ద సుఖంగా భావిస్తారు అందరూ. కష్టాలు గట్టెక్కుతాయంటే ఏనాటికైనా సరే కష్టాల కడలి గట్టెక్కగలమనే విశ్వాసంతో సుఖాపేక్షతో కష్టాన్నీ, కష్టకాలాన్నీ సుఖంగా గడిపేస్తారు అందరూ. అదీ దేవ మానవ సహజ లక్షణం.

శ్రీమహా విష్ణువు అలా సెలవివ్వగానే నారదమహర్షి ఆనందంతో విష్ణునామ సహస్రం పఠించాడు. అతనితో దేవతలంతా గొంతు కలిపారు.

ఇక వెళ్ళండి అన్నట్లు శ్రీమహావిష్ణువు చిరునవ్వులు చిందించాడు.

వెంటపెట్టుకు వెళ్ళిన దేవతలు ఋషిగణంతో స్వర్గం చేరుకున్నాడు ఇంద్రుడు. మునులంతా తిరిగి భూలోకం వెళ్ళిపోయారు. అలా వచ్చి తిరిగి వెళ్ళినవారిలో గౌతమ మహర్షి కూడా ఉన్నాడు. కానీ ఇంద్రుడికి తనున్న బాధలో గౌతముడి చరిత్ర అహల్య కథ ఏదీ గుర్తుకు రాలేదు. తిరిగి వచ్చిన ఆ పగటి పూట ఇంద్రసఖి కనిపించేదాకా గుర్తే రాలేదు. ఆమె కనిపించగానే అంతా గుర్తొచ్చి నందనవనంకేసి నడిచాడు.

రోమపాద రాజర్షి తమ నగర రాజ్యానికి విచ్చేసిన ఋష్యశృంగమహర్షికి అఖండ స్వాగతం ఏర్పాటు చేశాడు. అడవిలో జటాజూటధారిగా అయిన తండ్రిని, తోటి మునులనూ జంతువులనూ మాత్రమే చూసిన ఆ యువ మహర్షి- విభాండకుడు తను తప్ప మరేమీ లోకం విషయాలూ తెలియకుండా కొడుకును పెంచిన కారణంగా- తొలిసారి తమ ఆశ్రమ పొంత్రాలకు వచ్చిన రాజ నర్తకినీ వారి చెలికత్తెలనూ చూసి అబ్బురపడి వారితో చెలిమి కట్టి వారివల్ల ప్రభావితుడై నావ ఎక్కి అది పయనించే విషయం కూడా తెలుసుకోలేని ముగ్ధత్వంతో మొహంతో నగర ప్రాంతాలకు వచ్చీరాగానే ఆ జనాన్నీ ఆ జీవనాన్నీ ఆ మేడలనూ ఆ మిద్దెలనూ పశువులనూ శిశువులనూ పరీక్షగా చూస్తూ ఆశ్చర్యపడుతూ వారినడిగి విషయాలను తెలుసుకుంటూ వారిలో కలిసిపోయాడు.

నగర వీధుల గుండా పయనించి రాజాంతఃపురం ప్రవేశించగానే ఆయనకు ప్రధాన ద్వారం వద్దనే అఖండ స్వాగతం లభించిందాయనకు. పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. బ్రాహ్మణోత్తములు, రాజ పురోహితులూ రోమపాదుడు స్వయంగా ఆయన కాళ్ళు కడిగి స్వాగతం పలికారు.

మళ్ళీ యీ పాదాలను కన్యాదాన సమయంలో కడిగితే తన జన్మ తరిస్తుందనుకున్నాడాయన. అక్కడ కొడుకు కనిపించక ఆందోళన చెందుతున్న విభాండకుడికి విషయం వివరించి ఆయన్ని శాంతపరిచి, ఆయననూ నగరానికి పిలుచుకుని వచ్చారు. సాదరంగా సగౌరవంగా స్వాగతం పలికారు.

విభాండకుడు వైశాలీ నగరాన్ని చేరుకునే వేళకే ఋష్యశృంగ మహర్షి రాజాంతపురంలో విడిదిచేసి నగర జీవితానికి, నాగరిక లక్షణాలకూ అలవాటుపడి ప్రకృతి గురించి సృష్టి గురించి ప్రజా జీవనాన్ని గురించి తెలుసుకున్నాడు.

ఋష్యశృంగుడు రాజ్యంలో పాదం మోపీ మోపగానే, పెళ్ళికి విచ్చేసే పెద్దల్లాగ ఎక్కడెక్కడి మేఘాలూ వాయు వేగంతో వచ్చి వైశాలినీ జలమయం చేశాయి. వర్షం దేశ ప్రజలందరికీ హర్షదాయకమయింది.

ఆ గతించిన విషయాలన్నీ విభాండక మహర్షికి వివరంగా విన్నవించుకుని తమకూ, తమ రాజ్యానికీ ప్రాణభిక్ష పెట్టి ప్రజలను కరువు రక్కసి కరకు కోరల నుంచి రక్షించిన ఋష్యశృంగమహర్షికి కృతజ్ఞతగా తన కుమార్తెనిచ్చి పెళ్ళి చేస్తాననీ కోరి ఆయన అంగీకరించగానే దశరధమహారాజుకి వర్తమానం పంపి వారు వైశాలికి దయచేయగానే శాంతాదేవిని ఋష్యశృంగుడికి ఇచ్చి వివాహం జరిపించారు.

అప్పుడు దశరధుడు పుత్రకామేష్టి చేయాలనే కోరికను వెలిబుచ్చాడు. తగిన సమయం వస్తుందనీ తనంతట తానే వర్తమానం చేసి వస్తాననీ, అయోధ్యలో ఆ యాగం జరిపించగలననీ అన్నాడు ఋష్య శృంగుడు.

అవన్నీ జరిగి చాలాకాలమైంది.

ఇప్పుడా గతమంతా దశరథుడు తన మనస్సులో మళ్ళీ తలపోశాడు. ఆయనకు వశిష్టులవారు శ్రీ మహా విష్ణువు ఇంద్రాది దేవతలకు చెప్పిన విషయాలన్నీ వివరంగా చెప్పారు. యాగం జరుగుతుందనీ యజ్ఞ పురుషుడు ఫలితాన్ని ప్రసాదిస్తాడనీ తత్ఫలితంగా దశరథుడికి ఒక్కరు కాదు ఇద్దరు కాదు నలుగురు కొడుకులు జన్మిస్తారనీ చెప్పాడు.

అవతార పురుషుడు తన కొడుకుగా పుడతాడని తెలియగానే దశరథుడి ఆనందానికి హద్దు లేకపోయింది. 'ఇన్ని సంవత్సరాలు కొడుకులు లేకుండా జీవితం గడిచిపోయింది. ఇంకెన్నాళ్ళయినా ఇంకెన్నేళ్ళయినా వేచి ఉంటాను. గురుదేవా! కులాన్నుద్ధరించే కుమారుడు వంశాన్నుద్ధరించే తనయుడిగా శ్రీమహా విష్ణువే జన్మిస్తాడంటే అంతకంటే నా జన్మకు ధన్యత ఉందా? ఈ దశరథుడికి జన్మ సార్ధకమైంది మహర్షీ!' అన్నాడు.

దశరథుడి బ్రహ్మానందాన్ని చూసి బ్రహ్మర్షి వశిష్టుడు కూడా బ్రహ్మానందభరితుడైనాడు. ఇక్ష్వాకు కుల దీపకుడిగా రఘు వంశ పయః పారావార రత్నంగా జగన్నాటక సూత్రధారి జన్మిస్తే ఆయనకు గురువుగా కుల గురువుగా తన తపస్సు తన జన్మ తరించినట్లే! ఏ మహర్షికీ లభించని గౌరవం అనుకున్నాడు వశిష్ట మహర్షి.

* * * *

బ్రహ్మానంద సబ్రహ్మచారులయిన ఆ ఇరువురూ మౌనంలో మునిగి ఆశ్రమ వాటికలో పెంచిన పూలచెట్ల నుండి పూలను కోసుకుని పూజకు బయలుదేరింది అహల్య.

ఆమెకు అప్పుడెప్పుడో యిలాగే పూలు కోసుకుంటుండగా దేవలోకం నుండి వదిగి వచ్చానని ఇంద్రసఖి తనతో మాట్లాడి తనతో స్నేహం నెరిపి ఎప్పుడంటే అప్పుడు ప్రత్యక్షమై వచ్చి మాట్లాడి చూసి వెళతానన్న మాటలు గుర్తుకొచ్చాయి.

'ఎన్నేళ్ళయింది ఇంద్రసఖి వచ్చి వెళ్ళి? ఇదిగో వస్తానని వెళ్ళింది. మళ్ళీ రాలేదు. అయినా తన వెర్రి గానీ ఆ ఇంద్రలోకంలో ఆ దేవేంద్ర వైభవంలో ఆ శచీపురంధరుల సన్నిధిలో తను గుర్తుకు వస్తుందా?' అనుకుంది.

## 18

హిమవత్ పర్వత సానువుల మీదుగా వెళుతున్నది పుష్పకవిమానం. అందులో విశ్రాంతిగా చేరగిలబడి ప్రకృతిని పరిశీలనగా చూస్తున్నాడు లంకేశ్వరుడు.

ఎగుడుదిగుడు కొండలు- ఆ కొండలన్నీ శ్వేత వస్త్రంతో కప్పినట్లుగా తెల్లని దట్టమైన మంచు. పర్వత సానువుల నుంచి లేలేత ఎండకే కరిగి నీరై ప్రవహించే మంచు నీళ్ళు, జలపాతాలు. ఎక్కడో పుట్టి కిందికి జారి

ప్రవహిస్తున్నట్లుగా నదీ ముఖంగా సాగే నదులు.

అక్కడక్కడా పెరిగిన దట్టమైన పొదరిళ్ళు. ఎత్తయిన చెట్లు. ఏనుగులు మొదలైన జంతువులు. లేళ్ళ వంటి సాధు మృగాలు. పరిశీలనగా చూస్తున్నాడు రావణబ్రహ్మ.

అటు లంక నుంచి బయలుదేరి- ఆ దక్షిణాగ్రం నుంచి ఈ ఉత్తర గిరిశిఖరాల వరకూ పయనిస్తూ ఎన్నెన్నో నదులు, ఎన్నెన్నో నగరాలు, మరెన్నో తటాకాలు, సస్యశ్యామలమైన పొలాలు, దట్టమైన అడవులు చూస్తూ వస్తూ ఉన్నా ఈ రమణీయకతే వేరనుకున్నాడు మనసులో.

అవును. ఎందరు దేవాధిదేవతలున్నా పరమ మహేశ్వరుడు స్థాణుమూర్తి రుద్రుడు గిరిజానాధుడు ఆ శంభుడు- ఆ శంకరుడూ- ఆయన వంటి దైవం మరెవరున్నారు? అసలు శివుడితో పోల్చదగినవారా వారంతా? వారితో శివుడిని పోల్చవచ్చా? నిజంగా అది పాపం! శాప కారణం.

అలాగే ఎన్ని కొండలున్నా ఎన్ని నదులున్నా ఎన్ని దేవాలయాలున్నా పరమశివుని దేవాలయం ఈ హిమాలయంతో సాటి ఏదీ రాదు. ఈ గంగా నదితో సాటి ఏ నదీ లేదు. అందుకే కదా ఈశానుడీ ఉత్తర దిగ్భాగంలో ఈ హిమాలయాలలో విడిది చేసేది.

శివుడు చిత్తాన తోచగానే లంకేశ్వరుడి చిత్తం మళ్ళీ శివుడి చరణాలను స్మరించింది. తాను అశువుగా ఆర్తిగా ఆవేదనతో ఆ పరమశివుని స్తుతించిన స్తోత్రం గుర్తుకు వచ్చింది.

రావణుడి మదిలో ఒక విధమైన ఉత్తేజం పొంగుకువచ్చింది. కంఠమెత్తి ఆ స్తోత్రం అంతా పఠించాడు. ప్రార్థన శ్లోక పఠనం పూర్తికాగానే పరమశివుడే ప్రత్యక్షమైనట్లుగా అనిపించింది.

'శివా! శంకరా! నీలకంఠా! నిజభక్త వశంకరా!' అంటూ అప్రయత్నంగా శివుడిని స్మరించాడు. అఘస్మరహరుడు కనుల ముందు పార్వతీ సమేతంగా కనిపించినట్లు భాసించింది. మనస్సు మరింత సేద తీరింది.

పుష్పక విమానం తన మందగతిని తాను సాగిపోతూనే ఉన్నది. ఆనందం నిండిన మనస్సుతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న హిమవత్ పర్వత సానువుల్ని చూస్తున్నాడు రావణుడు. అప్పుడు- అక్కడికి చాలా క్రిందలో- కొండల మధ్య ఓ ఆశ్రమ వాతావరణం కనిపించింది. దానికి కొంత దవ్వులో వితర్ధిక- దానిపై ధ్యాన ముద్రలో తపోనిష్టలో ఉన్న ఒక స్త్రీ.

గగనంలో ఎత్తున ఎగురుతూ ఉన్న గద్ద కింద భూమ్మీద ఉన్న పిల్లవాడి చేతిలోని పిండి వంటను లేదా తల్లిని చూసి దూరంగా చిన్న చిన్న కాళ్లతో ఎగిరెగిరి ఆడుకునే కోడి పిల్లనూ నిశిత దృష్టితో చూసి, అమిత వేగంతో రివ్వున నేలకు

దిగి ఆ పదార్థాన్ని లేదా ఆ పిల్లను నోట కరుచుకుని తిరిగి అదే వేగంతో పైకి ఎగిసిపోతుంది.

రావణుడి దృష్టీ అలాంటిదే. అంత ఎత్తున అంతరాళంలో ఎగురుతున్న పుష్పక విమానంలో కూర్చుని ఉన్న రావణుడికి ఆ తపోనిష్ఠాగరిష్టురాలు స్పష్టంగా కనిపించింది. అతని సంకల్పమాత్రంతో పుష్పకం కిందకి దిగసాగింది.

క్రమ క్రమంగా నేలను చేరుకుని ఓ సమున్నత స్థానంలో ఆగింది. రావణుడు పుష్పకం నుండి కిందకు దిగి అటుగా నడిచాడు.

ఆమె మౌన ముద్రలో నిమీలిత నేత్ర అయి ధ్యానంలో ఉంది.

ఆ విశాలమైన ఫాలభాగాన దివ్య తేజస్సు- నుదుట దిద్దిన కుంకుమ సాక్షాత్తూ శివుడి ఫాల నేత్రంలా భాశిస్తూ ఉంది. వినీల కేశపాశం వీపంతా కమ్ముకుని మరింత కిందకు సాగి వితర్ధికను కమ్ముకున్నది.

మూసిన ఆ కనులు ఆ కర్ణాంత విశాలంగా ఉన్నాయి. చెవులు శ్రీకారాలకి ఆకారం దిద్ది తీర్చగలవి అన్నట్టున్నాయి. నాసిక ధృడ చిత్తాన్ని కఠోర నియమాన్ని ప్రతిబింబిస్తున్నది. శ్వాసను క్రమబద్ధీకరించి అంతర్ముఖి అయి ధ్యానిస్తూ ఉన్నదామె.

ఆమె ధ్యాన సముద్రా ముద్రిత సౌందర్యం రావణుడి కన్ను చెదిరేలా చేసింది. మనస్సంతకుముందే చెదిరింది. నిగ్రహం అంతకు పూర్వమే చెదిరింది. ఆమె సౌందర్యానికి దాసుడైపోయాడు రావణుడు. మనస్సు చిక్కబుట్టుకోలేక- నిగ్రహాన్ని నిలుపుకోలేకపోయాడు. 'సుందరీ' అంటూ పిలిచాడు.

ఆమెకా పిలుపు వినిపించలేదు.

## 19

నందనం వనం ప్రవేశించిన మహేంద్రుడిని అల్లంత దూరాన్నే చూసిన యక్షులు, గంధర్వులు, కింనరులు, కింపురుషులు, సిద్ధులు, సాధ్యులు, దేవతలూ చప్పున అక్కడి నుంచి కదిలి అదృశ్యమయ్యారు.

ముల్లోకాల యేలిక తను ముచ్చటపడి అచ్చెరగణం అందచందాలను ఆస్వాదించడానికో, అచ్చర లేమలతో ముచ్చటించడానికో లేక శచీదేవితో వన విహారం సలపడానికో అదేదీ కాకపోతే ఒంటరిగా ఉద్యానవనంలో తిరుగాడుతూ కల్పవృక్షచ్ఛాయలో సేదతీరుతూ కల్పవృక్ష ఫలాన్ని ఆరగిస్తూ మందాకినీ సలిత శీతలత్వాన్ని అనుభవిస్తూనో సమయం గడపడానికి విచ్చేస్తాడు.

ఆయన ఏకాంతాన్ని అభిలషిస్తూ వస్తే ఆ ఏకాంతానికి భంగం కలిగితే సహించలేడు. తీవ్ర శాపానికో కోపానికో గురికాక తప్పదు. శాపమంటే లోక బహిష్కరణే! అందుకే ఆ మహేంద్రుడు అల్లంత దూరాన నందనోద్యాన ముఖుడయి వస్తూంటే అందరూ తొలగిపోతారు.

ఇంద్రుడు మహేంద్ర దర్పంతో నందనోద్యానం ప్రవేశించాడు. పై నుంచి వీచే పిల్ల తెమ్మెరలకు పరవశించాడు. వైకుంఠం వెళ్ళి వచ్చిన వ్యగ్రత అంతా క్షణాల్లో మాయమయింది. ఇంద్రసఖి మనస్సులో ప్రవేశించింది. ఆ వెంటనే ఇంద్రసఖి గుర్తుకురాగానే అహల్య... అహల్య వృత్తాంతం అంతా గుర్తుకువచ్చింది. మనస్సంతా చేదు తిన్నట్లయింది.

'అహల్యా! అహల్యా!' అనుకున్నాడు.

ముల్లోకాల ఏలిక తను- ముగ్గురు మూర్తుల తర్వాత సమస్త లోకాలకూ అధినేత తను- తన ఆయుధం వజ్రాయుధం. వజ్రాయుధం సాటిలేని ఆయుధం.

తన ఏనుగు ఐరావతం- ఆ తెల్ల ఏనుగు ఏనుగులన్నింటిలోనూ శ్రేష్ఠతనం. తన సభ సుధర్మ. అలాంటి సభ ఆ విష్ణువుకే లేదు. మరి ఇంకొకరి మాట ఎందుకు తలవాలి?

తలవాల్చి తదితర దేవతలంతా తన చరణాలకు ప్రణమిల్లుతున్నారు. ఏ యజ్ఞంలో అయినా సరే 'ఇంద్రాయ స్వాహా' అనక తప్పదు. అంతటి గొప్ప పదవి తనది. అంతటి గొప్ప శక్తి తనది. అంతటి గొప్ప పేరు ఉంది తనకు.

కానీ కానీ అవన్నీ ఇప్పుడు వ్యర్థం అనిపిస్తున్నాయి. అహల్య అందం ముందు అవన్నీ దిగదుడుపే కదా!

ఆ అహల్య కోసం తను ఇలా వగచి, వంతల పాలవుతున్నాడు! మరి ఆ అహల్య ఎలా ఉందో తాను వెళ్ళి సర్వం చక్కగా కనుక్కుని వస్తానన్నది ఇంద్రసఖి. హూ! ఇంద్రసఖి! పేరెంత చక్కగా పెట్టుకున్నది? తన దాసి, తన దూతి, తన శచీదేవికి చెలిమి కత్తె.

దాని పేరేమిటో! ఎన్నడూ పేరు గురించి తలచి పిలవాల్సిన అవసరం రానేలేదు. భూలోకం వెళుతూ తను ఇంద్రసఖిగా పరిచయమవుతానన్నది. వెళ్ళింది. వచ్చింది. ఏం వార్త తెచ్చిందో?

అసలు ఆ అహల్యకు తను గుర్తున్నాడా?

ఆ గౌతమాశ్రమంలో నిత్యం వచ్చీ పోయే జడదారులతో, వారికై చేసే సేవలతో ఆపై గౌతముడి సేవలో అప్పుడు సత్యలోకంలో జరిగిన సంగతులు నెమరు వేసుకునే తీరిక ఉంటున్నదా తనకు?

'ప్రభూ!'

ఆ పిలుపుకి తన ఆలోచనల్లోంచి బయటపడి చూశాడు ఇంద్రుడు. ఎదురుగా దూతి. ఆమెని చూడగానే ఇంద్రుడి ఆశలు ఆలోచనలు ఉవ్వెత్తున ఎగిశాయి.

'ఏమే! ఏమయిందే సఖీ! సఖీ ఏమన్నదే. తాను క్షేమమా! మా క్షేమం అడిగిందా? ఆమె సుఖంగా ఉందా? మా సుఖ సంతోషాల గురించి ఏమన్నా అడిగిందా? ఆశ్రమంలో ఆమెకెలా సాగిపోతున్నది?

మేమిక్కడ అమర భోగాలు అనుభవిస్తున్నాం. తను అక్కడ ఎలా ఉందో? మాకు పట్టు పీతాంబరాలు. తనకో! ఏమో! నార చీరలు కట్టుకుంటున్నదా? అయినా దూతికా! పట్టు చీరల్లో ఉన్నా, నార చీరల్లో ఉన్నా అహల్య అందమే అందం. అవును కదే! మేమిక్కడ రమ్య భర్మ్య హర్మ్యాలలో నివశిస్తున్నాం.

ఆమె అక్కడ కుటీరంలో నివసిస్తున్నది కదూ! మా వైభోగం వైభవం అంతా ఆమె కాలిగోటి అందానికి తులకావే చెలీ! అవునే! ఆమె సుఖ సంతోషాలతో శాంతంగా ఉందా? ఉలకవేమే! పలకవేమే!'

ఇంద్రుడలా ఏకధాటిగా అమర కవివరుని వాగ్ధాటికి వన్నె తెచ్చేలా అడిగితే - ఇంద్రసఖి వినయంగా వినమ్రంగా అంది 'ప్రభూ! వారు మానవులు. అందునా ఋషులు. వారు నాగరీకులు కారు. వారికి నగర జీవనం నచ్చదు.

అడవుల మధ్యలో ఆశ్రమ వాటికలు నిర్మించుకుని కందమూలాలు తెచ్చుకుంటూ అడవుల్లో దొరికే కాయలూ ఫలాలూ తేనెలూ స్వీకరిస్తూ తపస్సే తమ ధర్మంగా, విశ్వ శ్రేయస్సే తమ ధ్యేయంగా జీవనం సాగిస్తారు. అలా దశాబ్దాలు గడిపేస్తారు. శతాబ్దాలు జీవిస్తారు. వారికీ అమరావతిలో అమర సుఖాలు పొందే మనకూ పోలికెక్కడ ప్రభూ!'

ఇంద్రసఖి మాటలు వినగానే ఇంద్రుడి ఉత్సాహం అంతా పొంగే పాలపై నీళ్ళు చల్లినట్లు ఇంకిపోయింది. అతని ఆలోచనల్లో అహల్య- ఆమె జీవనం వేరయినా ఋషి జీవనం అతనికి తెలియనిది కాదు.

కానీ అహల్య అలా జీవిస్తుందంటే అతనికి చేదు తిన్నట్లయింది.

'ఏమన్నదే అహల్య!'

'ఏమంటుంది ప్రభూ! అందని ఫలాలకు అర్రులు చాస్తుందా?'

'ఆ ఏమంటివే? ఏమంటివే?'

'అయినింటి ఇల్లాలు ఎలా జీవిస్తోందో తను అలా జీవిస్తుంది ప్రభూ! తల్లిదండ్రులు కన్యాదానం చేసి ఏ వరుడికిచ్చి పెళ్ళి చేస్తారో జీవితాంతం ఆ వరుడితో కలిసి బ్రతకడమే భూలోక నారీ ధర్మం కదా ప్రభూ! వారి మనస్సుల్లో మరో ఆలోచనకే తావుండదు. వారేం దేవతలా? ఆశయాలనూ అన్య మార్గాన తీర్చుకోదలచటానికి?'

'అహల్య ఆంతర్యమేమిటే?'

'ప్రభువులు తొందర పడుతున్నారు. నేను వెళ్ళి ఆమె పరిచయం సంపాదించుకుని వచ్చాను. మైత్రికి నారు పోసి వచ్చాను. అది సాగి తీగయి పూసి పరిమళించాలి కదా ప్రభూ!'

'ఎప్పుడే! ఎప్పుడే! ఎప్పుడెప్పుడా అని మా మానసం తొందరిస్తూంటే, నీవు ఎంత నెమ్మదిగా జవాబులు చెపుతున్నావే?

'కార్యం సాధించాలి కదా ప్రభూ! ఇప్పుడే గురిపెట్టి నారి సారించి బాణం విడిచాను. అది తగిలి తలూచాలి కదా ప్రభూ!'

నా తొందర నీకేం తెలుసే సుందరీ!

'తెలియకనే భూలోకం వెళ్ళి వచ్చానంటారా ప్రభూ!'

'మాటలు నేర్చావు కదే!'

'నేర్పులాడిననే కదా తమరు నన్ను దూతికగా ఎన్నుకున్నారు'

'భళా మాటల పుట్టవే నువ్వు!'

'మాటల్లో పెట్టాను అహల్యాదేవిని. ఆమె మనస్సు కదిలి కరిగి నీరు కావాలి. ఆ జలాల్లో తమరు క్రీడించాలి!'

'అబ్బ! ఆశల గుర్రంపై ఆరోహించిన మాకు లేని జవ సత్వాలనిచ్చి మాకు మనోవేగాన్ని కలిగిస్తున్నాయే! ఏమీ భూలోకం వెళ్ళనా! వెళ్ళి గౌతమాశ్రమం చేరనా! చేరి ఆశ్రమ ద్వారం చెంత నిలువనా! నిలిస్తే అహల్య అర్ఘ్యపాద్యాదులనిచ్చి ఆహ్వానించేనా!'

'వెళ్ళండి! వెళ్ళండి! వెళ్ళి ఆశ్రమం ముంగిట్లో నిలవండి! అర్ఘ్యపాద్యాదులు అందుకోండి! తమరిదే ఆలస్యం!'

'ఏమే? అట్లు మాట్లాడెదవేమే?'

'మరి ఏమి చెప్పను ప్రభూ! తమరలా ఇంద్ర వైభవంతో వెళితే అహల్యానాధుడు శ్రీశ్రీశ్రీ బ్రహ్మ శ్రీ యుతులు గౌతములవారు స్వాగతం పలికి అర్ఘ్యపాద్యాదులను అర్పించి, ఆపై అతిథి మర్యాదలు నిర్వహిస్తారు. త్రిలోకాధినాధులు దివి నుంచి దిగి భువికి వచ్చి ఆశ్రమం ముంగిట్లో నిలిస్తే ఆహ్వానించక అగౌరవిస్తారా స్వామీ!'

ఇంద్రుడికది నిజమే అనిపించింది.

'అవును! తను వెళితే ఎవరు మాత్రం స్వాగతించరు?' అనుకున్నాడు.

మరి గౌతముడి కనుగప్పి అహల్యకు మాత్రమే కనిపించి నేను ఆమెను పలుకరించి ఆమె తనపై రాగ వర్షం కురిపించి తనియించే మార్గం!

మార్గం తోచని మహేంద్రుడు ఇంద్రసఖి వైపు చూశాడు. ఆ దూతి చప్పున అంది 'ప్రభూ! మీరు ప్రభూ! మనసు మళ్ళించుకోండి! శచీదేవిగారు ఒంటరిగా దయ చేస్తున్నారు. వారు వచ్చిన తర్వాత తమ చిత్తం పరాయత్తమై తమరు పరాకు చిత్తగిస్తే చాలా ప్రమాదం!'

ఇంద్రుడు ఉలికిపడ్డాడు. అటు తిరగ్గా శచీదేవి మందగమనంతో వస్తున్నది. ఇంద్రసఖి మాటమార్చి చెప్పసాగింది.

## 20

'సుందరీ!'

ధ్యాన ముద్రలో మునిగి ఉన్న ఆమె అపూర్వ సౌందర్యాన్ని కనులారా ఆస్వాదిస్తూ పిలిచాడు లంకేశ్వరుడు. అతడు ఎన్నెన్నో లోకాలు తిరిగాడు! ఎందరెందరో సుందరీమణులను చూశాడు. మండోదరి వంటి మహా పతివ్రతను తొలిసారి చూసినప్పుడు అతని మనసు ఇలాగే తొందరించింది. ఆమెను తన అర్ధాంగిగా చేసుకుని ఆనందించాడు.

అప్సశిరోమణి అయిన రంభను చూసినప్పుడు తన సోదరుడు నలకూబరుడు మన్నించే మగువ అనే మాట మరిచాడు. అందం చేసిన తొందరపాటు రంభ శాపాన్ని తెచ్చింది. అప్పుడిలాగే మనస్సు తొందరించింది. మళ్ళీ ఇదిగో- ఇప్పుడు- ఈ చంద్రవందన కనిపించీ కనిపించగానే మనసు కలవరపడుతున్నది.

'సుందరీ!'

మరింత దగ్గరగా వెళ్ళి తమకంతో పిలిచాడు. లంకేశ్వరుడి శ్వాస తమకం వల్ల వేడి సెగలు కక్కుతున్నది. ఆ గాలికి ఆమె చప్పున కనులు విప్పింది.

ఆ రెండు కళ్ళూ సాక్షాత్తూ రుద్రుడి మూడో నేత్రం ద్విగుణీకృత క్రోధంతో ద్వంద్వమైనట్లుగా నిప్పులు కక్కుతున్నాయి.

కనులెదుట కనిపిస్తోన్న కన్యకామణి కమనీయ సౌందర్యాన్ని కనులతో తాగుతూ మత్తెక్కిన రావణుడి కళ్ళకి- ఆమె నేత్రారుణిమలు రోషకషాయిత లక్షణంగా కాక- వలపు వేడిమి ఫలితంగా అనిపించాయి.

'ఎవరు నువ్వు? ఒంటరి దానవా? జంటగున్నావా? నీ తోడెవరు? నీ నీడెవరు? నీవు పితృ పరాధీనవా? మాతృ పాలితవా? ఓహ్! ఏమి నీ సౌందర్యం. దివిజ భామినుల సోయగాలూ, దివ్య సుందరీ మణుల విన్యాసాలూ, రాక్షసాంగనల రమణీయతలూ, మానవ స్త్రీల మనోహరత్వం. సర్వం పరిశీలించిన నాకు ఎక్కడా యీ సోయగాలు కనువిందు చేయనే లేదు. సుందరీ! ఎందుకింత ఆలస్యం! రా! లేచిరా! నా పాణిని అందుకుని పాణిగ్రహణం పూర్తిచేసి నన్ను నీ అనన్య సామాన్య ఆనంద సౌందర్య వాహినిలో ఓలలాడించు.'

'దుష్టుడా!'

ఆ పలుకులకు తృళ్ళిపడ్డాడు రావణుడు.

'ఎవడవురా నీవు? పరమ శివుని చరణ సన్నిధి వంటి ఈ హిమాలయంలో నిశ్చల నిర్వికార నిర్వి కల్పసమాధిలో తపస్సు చేసుకుంటున్న నన్ను, నా తపస్సు భంగపరిచి కారుకూతలు కూస్తున్నావు. ఎంత సాహసం! రాక్షసుడివా? యక్షుడివా? గంధర్వుడివా? మీకయితేనే యీ చలచిత్తం. యీ ప్రలాపం'

పక పక నవ్వాడు రావణుడు.

'సుందరీ! అందగత్తెలు ఆగ్రహించినా అందం మేనే అది. నేనెవరినో పోల్చుకోలేకపోయినా నా జాతి లక్షణాన్ని నిర్వచించి నా జాతిని చక్కగా పోల్చుకున్నావ్! అయినా నేనెవరైతేనేం! మగవాడిని. నువ్వు స్త్రీవి! సుందరివి! రా! నన్ను వరించి, నా వలపు తీగలు సవరించి ప్రణయగీతం ఆలపించు.'

'వాచాలుడా! తపోనిష్టలో ఉన్న అబలతో మాట్లాడవలసిన రీతి ఇదా?'

'అబలవా! అతివా! నీవు అబలవా! హా! హా! ఎంత అందం! ఎంత సోయగం! ఏమి శరీర పుష్టి! ఇంత బలిమి కలదానవు. నీవు అబలవా! చాలు! చాలు! మాటలు కట్టిపెట్టి మా మనస్సుని కనిపెట్టి మమ్ము వరించు!'

'కాముకుడికి సర్వం భ్రాంతిగానే ఉంటుంది. వెళ్ళు! ఇక నీతో మాట్లాడినా పాపమే!'

మరింకేం ప్రస్తావనకు చోటివ్వకుండా నారాయణ స్మరణలో మునిగిపోయిందామె.

రావణుడిక ఆగలేకపోయాడు. ప్రతిఘతిస్తే బలత్కారంగానైనా సరే ఆ పసిడిబొమ్మ అందాలను ఆస్వాదించాలనుకున్నాడు. మాటలతో తిరస్కరించి మౌనం వహించి ముని కన్యలా తపస్సులో మునిగేసరికి వంటింటి కుందేలు ఎక్కడికి పోతుందిలే అనుకుని మరో అడుగు ముందుకు వేసి ఆమె భుజంపై చేయి వేశాడు.

అగ్నిలో ఆజ్యం పోయగానే భగ్గుమన్నట్లు చప్పున కళ్ళు తెరిచిందామె. చప్పున లేచి నుంచుని 'మూర్ఖుడా! నన్ను చెరపట్టదలిచిన నిన్ను క్షమించను. నీ వినాశననికి హేతువవుతాను. ఏ అందమైతే నిన్ను శలభంలా చేసిందో, ఆ అందం అగ్నిలోనే నువ్వు భస్మమవుతావు. నీ ఇంటపుట్టి, మళ్ళీ నీ ఇంటికే వచ్చి, నిన్ను మూలబలంతో సహా నిర్మూలనమయ్యేలా చేస్తాను. ఇవి వేదవతి శాప వాక్కులు!' అంటూ తపోగ్నిలో క్షణంలో భస్మమయింది.

తనని శపించి తనని దూషించి తనని తనే దహించుకుని, బూడిదైన వేదవతి భస్మ రాశిని చూస్తూ నిట్టూర్చాడు. రావణుడు మరో శాపం అనుకున్నాడు. ఆ భస్మరాశినే పవిత్రంగా స్వీకరించి కదిలాడు.

* * * *

శచీదేవిని మంద గమనంతో మందహాసంతో చేర వచ్చింది. ఆమె మహేంద్రుని సమీపించగానే దూతిక మెల్లి మెల్లిగా వెనక్కి నడుస్తూ తప్పుకుంది. శచీదేవిని చూసి మందహాసం చేశాడు ఇంద్రుడు.

'స్వామీ! వైకుంఠం నుండి వచ్చీ రాగానే విశ్రాంతి మందిరానికి విచ్చేయకుండా ఉద్యానవనానికి విచ్చేశారేమిటీ? అన్ని ఆపదలూ త్వరలో అణగారిపోతాయని అందుకు తాను మళ్ళీ అవతరిస్తున్నానని చెప్పారట కదా శ్రీమహా విష్ణువులు. ఇంకెందుకు స్వామీ ఆ దిగులు?' నిట్టూర్చాడు దేవేంద్రుడు.

'దేవీ! ఆ రావణుడి అత్యాచారాలకు మేర లేదు. అతని దుర్మార్గాలకూ అంతు లేదు. అతడి పాప ఫలం పండితేనే గానీ అతన్నేం చేయలేం. ఆయన అయోధ్యలో జన్మించి మానవుడిగా అవతరించి, పెరిగి పెద్దవాడైన తర్వాత కదా రావణ

సంహారం! ఈ లోగా రావణుడు స్వర్గంపై దండెత్తడని నిశ్చయమేమిటీ? స్వర్గాన్ని ఆక్రమించుకుని తానే ఇంద్రుడిగా దేవనాథుడిగా అటు ఏడు, ఇటు ఏడు, మొత్తం భూభువర్లోకాది పధ్నాలుగు లోకాలకూ తానే ప్రభువుగా ప్రకటించుకోడనే నమ్మకం ఏమిటీ?' అన్నాడు దిగులుగా.

'ఇన్ని సంవత్సరాలుగా మన లోకంపై దండెత్తి మిమ్మల్ని ఓడించి యీ సింహాసనాన్ని చేజిక్కించుకోని రావణుడు ఇప్పుడు దండెత్తుతాడని భయమెందుకు స్వామీ?'

'రాక్షసుల బుద్ధులు ఏ క్షణానికి ఎలా మారతాయో ఎవరు చెప్పగలరు దేవీ! మేం వారి జ్ఞాతులం కదా! దాయాది మాత్సర్యం వారి రక్తనిష్ట గుణం!'

'కానివ్వండి! కానున్నది కాక మానదు. ఏదో ఆపద రాగలదని ఇప్పటినుంచే చింతించడం ఎందుకు స్వామీ!'

'చింత కాదు! ఆలోచన!'

'ఆలోచన అధికమైతే అదే చింత. అదే దిగులు!'

'ఇక ఆలోచనలకు స్వస్తి!'

'ఏమిటి స్వామీ?'

'తమరొచ్చారు కదా!'

'వస్తే....'

'అర్ధాంగి చెంతనే ఉంటే ఆలోచనలెలా వస్తాయి? అవి అంతర్ధానమైతేనే కదా ఆనందం!'

శచీదేవి నవ్వింది. ఇంద్రుడు శచీదేవి చేయి అందుకుని అటు కల్పవృక్షం వైపు నడవసాగాడు.

## 21

ఆశ్రమంలో శిష్యులకు విష్ణుసహస్రనామం నేర్పుతున్నాడు గౌతమమహర్షి. రావణుడి బాధలను సహించలేక దేవాధి దేవతలంతా శ్రీమహావిష్ణువుకు మొర పెట్టుకుని ఆయన అభయం ఇచ్చాక అప్పుడు నారదుడు తన మధురమైన కంఠంతో గానం చేసిన విష్ణుసహస్రనామ స్తోత్రం అందరూ తొలిసారి వింటున్న అనుభూతి చెందారు.

మంత్రాలు ఎప్పుడో సృష్టించబడి ఉంటాయి. వాటిని మహర్షులు దర్శిస్తారు. ఆ మంత్రాధి దేవతను దర్శిస్తారు. దానిని లోకానికి అప్పుడు వెల్లడిస్తారు. వారు మంత్ర ద్రష్టలే! కానీ మంత్ర సృష్టికర్తలు కారు.

అలాగే విష్ణుసహస్రనామావళి కృతయుగం నుంచీ వస్తున్నది. మహర్షుల స్మృతి పథంలో నిక్షిప్తం చేయబడి శిష్యులకు పాఠంగా వినిపించబడుతూ ఉంది. ఈ త్రేతాయుగంలోనూ అదే ఆచారం కొనసాగుతూంది.

కానీ- వైకుంఠంలో నారదుడు విష్ణుసహస్రనామం పఠించాక అది మళ్ళీ అందరికీ గుర్తు చేసినట్లయింది.

ఆపదలను పోగొట్టేది, అనుకున్న పని అనుకూల పడేలా చేసేది- సానుకూలమై, సత్వర ఫలితాల నిచ్చేది, సమస్త కార్యసాధనకు సులువైనదీ, సూక్ష్మ మైనదీ అయిన విష్ణు సహస్రనామ పారాయణం మహిమంతా అందరికీ గుర్తుకు వచ్చింది.

దేవర్షి నారదుడు లోక కళ్యాణార్థం ఎన్నెన్నో చేస్తూంటాడు. అది ఆదిలో కొందరికి కంటిగింపుగా ఉన్నా చివరికి అది కంటికింపుగానే పరిణమిస్తుంది. మనస్సుకి ఆహ్లాదాన్ని చేకూరుస్తుంది. ఏది ఏమైనా ఆయన కోరేది సర్వలోక సంక్షేమం. ఎంతయినా సృష్టికర్త కుమారులు కదా!

ఆ విష్ణుసహస్రనామాన్ని విద్యార్థుల చేత కంఠస్థం చేయిస్తూ, ఒక్కో నామం విశిష్టతనూ- ఆ పేరులోని అంతరార్థాన్ని చక్కగా వ్యాఖ్యానిస్తున్నారు గౌతమమహర్షి.

'స్వరయుక్తంగా పాడాలా గురువర్యా!' అడిగాడు ఓ శిష్యుడు.

'సామవేదంలో చెప్పిన సంగీత గమకాలు సరిగమపదని లతో స్వరబద్ధం చేసి చదవాలా?' మరో శిష్యుడు అడిగాడు.

చిరునవ్వు నవ్వారాయన 'ఇది మంత్రం కాదు. సామం కాదు. గానం చేయడానికి ఇది స్తోత్రం. భగవంతుడి సహస్రనామావళి ఇది. దీన్ని స్తోత్రం చేస్తే చాలు! ఆర్తితో పఠించే వాడికి ఆత్మవేదనే ఒక రాగాన్ని కల్పిస్తుంది. దానికి ప్రత్యేక స్వర రచన లేదు.'

'వీటిని పఠిస్తే ఏదైనా సాధించవచ్చా గురువర్యా?'

మరో శిష్యుడడిగిన ప్రశ్నకి మందస్మితంతో అన్నారు 'ఏదైనా అంటే ఏమిటీ? దాని అంతరార్థం! చిరంజీవిగా చిరంజీవి కావాలనా? లేక కైలాసానికో, వైకుంఠానీకో, సత్య లోకానికో సంకల్పమాత్రంగా సాగి పోవాలనా? ఖేచర

గమనం కావాలనా? రాజ్యాధిపత్యం సిద్ధించాలనా?'

సిగ్గుపడ్డాడు శిష్యుడు. అవేవీ కాదన్నట్టు తలూపాడు.

'సాధ్యాసాధ్యాలుంటాయి. దుస్సాధ్యాలుంటాయి. అసాధ్యాలుంటాయి' మృదువుగా అన్నారు గౌతములు. శ్రమించి సాధించవచ్చు. కొన్ని కొన్ని సులువుగా సాధ్యపడతాయి. మరికొన్ని కష్ట సాధ్యాలు. కొన్ని సాధించలేం. అమరత్వం మన సొత్తు కాదు. అమరలోక గమనం అందరి సొత్తూ కాదు. మోక్షం సాధించవచ్చు. విద్యలు సాధించవచ్చు. అనారోగ్యం కలిగితే ఆరోగ్య భాగ్యాన్ని పొందవచ్చు.'

శిష్యులు వింటున్నారు.

'దీర్ఘకాలం వ్యాధులతో బాధపడే వారికి ఆ వ్యాధి నయమవుతుంది. ఆగర్భ దరిద్రుడైనా సరే యీ విష్ణుసహస్రనామాన్ని అనునిత్యం పారాయణం చేస్తూ, ప్రతి శుక్రవారం లక్ష్మీ పూజ చేస్తూ, లక్ష్మీ అష్టోత్తరం సాయంవేళ పఠిస్తే ఐశ్వర్యం సిద్ధిస్తుంది.'

గౌతముడు చెపుతుండగా మొదట ప్రశ్నించిన శిష్యుడు ఆత్రంగా వింటున్నాడు. గౌతముడు ఆగాడు.

'గురువర్యా!'

'ఏం శిష్యవర్యా!'

గౌతముల చమత్కారానికి సిగ్గుపడ్డాడు శిష్యుడు.

'తల వంచుకునే పనేదయినా చేస్తేనే తల వంచుకోవాలి. లేనప్పుడు ఎందుకా సిగ్గు?'

'పెద్దల ముందు పెద్దరికం ప్రదర్శించడం సిగ్గు తెప్పించింది గురువర్యా!'

'సరే! ఏమిటి నీ సందేహం?'

'దేన్నయినా సాధించవచ్చా అని అడిగాను. ఇష్టకామ్యాలూ సిద్ధిస్తాయా?'

'అంటే?'

'ఆధిపత్యం- ఐశ్వర్యంతో పాటు సిద్ధిస్తుందా?'

'ఆహా!'

'రాజ్యాంగ సభలో స్థానం లభిస్తుందా?'

'ఆహా! అయితే ఆ సభలో స్థానం లభించాలంటే విద్యార్హత ఉండాలి కదా!'

'అదే నా ప్రశ్న గురుదేవా!'

'అంటే విష్ణుసహస్రనామ పారాయణం వల్ల విద్యలు లభిస్తాయా అని కదా నీ సందేహం?'

'ఓరి బుద్ధిమంతుడా! నిష్టతో పారాయణం చేయగలిగిన బుద్ధిమంతుడికి చదువెందుకు రాదురా! ఆత్రమతీ! మందబుద్ధిమంతుడికి విద్య అబ్బదు. కానీ శ్రమించే వాడికెందుకు విద్యలు ప్రాప్తించవు?'

'మందబుద్ధి మంతులకు ఆ మందతనం పోతుందా?'

గౌతముడు క్షణంపాటు ఆలోచించాడు 'కొడుకు కోసం తండ్రి దీక్షగా పఠిస్తే వాడికి ఆ మందబుద్ధితనం పోతుంది. అందులో సందేహం లేదు!'

శిష్యుడు తలూపేడు. క్షణం ఆగి అన్నాడు 'గాన విద్య సిద్ధిస్తుందా గురుదేవా?'

'లభిస్తుంది! సాధనతో అన్నీ సమకూరుతాయి. కమ్మని కంఠం రాకపోవచ్చు. కానీ పాండిత్యం వస్తుంది. శాస్త్రవేత్త అవుతాడు. అందుకు సందేహం లేదు. అయినా లలిత కళలు, గానం, శిల్పం, నృత్యం, కవిత్వం మొదలయినవి పాండిత్య మాత్రంతో శోభించవు. వాటిలో నేర్పరితనం రావాలి. మేలిమి కావాలి. అప్పుడే వన్నెకెక్కేది.'

శిష్యుడు తలూపేడు.

'కల్పవృక్షం, కామధేనువు, చింతామణి, అవన్నీ స్వర్గలోక వాసులకు సొమ్ము. కోరినవన్నీ వారికి వాటి ద్వారా సిద్ధిస్తాయి. భూలోక వాసులకు అవన్నీ- కల్పవృక్షం, కామధేనువు, చింతామణి, కలగలిసిన సుస్వరూపం ఈ విష్ణుసహస్రనామం. చాలా, ఇంకేమైనా వివరణ కావాలా?'

తెలిసిందన్నట్లు అంతా తలూపేరు.

గౌతములు ఆ పూటకు పాఠం చాలించేరు. 'సహనా వవతు. సహనౌభునక్తు. సహవీర్యంకరవావహై తేజస్వినావధీతమస్తు' గురుదేవులతో పాటు శిష్యులందరూ కమ్మగా పఠించారు.

ఆ రాత్రి గౌతములు, అహల్యా ఆశ్రమంలో ఏకాంతంలో ఉన్నారు. అహల్యాదేవి మనసారా భర్తను సేవించింది. గౌతములు ఋతు ధర్మాన్ని అనుసరించి, మనసెరిగి ఆమెతో సరస సల్లాపాలు సాగించి శయ్యాసుఖాన్ని పరిపూర్ణంగా పొందాడు. స్వాతివానలో ముత్యపు చిప్ప చినుకును స్వీకరించింది.

* * * *

గౌతముడు కుటీరం తలుపులు తీసుకుని బయటికి వచ్చారు. అక్కడ- కోసల రాజ్యంలో రాజ్యాంగ వేత్తల నిర్ణాయక సభలో పండిత ప్రతినిధి- న్యాయ వైశేషిక విద్య అభ్యసించిన ఆయన శిష్యుడు- ఓ చెట్టు కింద కూర్చుని, గురువుల రాక కోసం నిరీక్షిస్తున్నాడు.

గౌతములు బయటికి రాగానే ఆ శిష్యుడు తన ప్రవర- అంగీరస బార్హస్పత్య భారద్వాజ త్రయార్దేవ ప్రవరాన్విత భారద్వాజస గోత్రోద్భవస్య అశ్వలయన సూత్రః ఋక్ శాఖాధ్యాయీ శ్రీధరశర్మ అహంభో అభివాదయేత్- అంటూ ప్రవర చెప్పుకుని సాష్టాంగ నమస్కారం చేశాడు.

గౌతములు వేదాశీర్వచనం చేశారు.

శిష్యుడు లేచి నుంచున్నాడు 'గురుదేవా! రావణుడి దుశ్చర్యలు క్షణ క్షణానికీ ఎక్కువవుతున్నాయి. రక్షణ లేని ఆశ్రమాలపై రాక్షసుల దండయాత్రలు ఎక్కువైపోయాయి. యజ్ఞయాగాదులు జరగనివ్వకుండా చేస్తున్నారు. ఆశ్రమ జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నారు. విశ్వామిత్ర, భరద్వాజ మొదలయిన మహర్షుల ఆశ్రమాలు, తమ ఆశ్రమం, వశిష్టుల వారి ఆశ్రమం తప్ప సాధారణ మహర్షుల ఆశ్రమ జీవనం దినదిన గండంగా ఉంది. గడ్డాల వారు కనిపిస్తే చాలు వారిని రకరకాలుగా హింసిస్తున్నారు. రాజులు ఏమీ చేయలేకపోతున్నారు. రాక్షస మాయని నిగ్రహించలేక పోతున్నారు. సాంఘిక జీవనం కూడా భద్రత చెడింది. ఆలయాల్లో అర్చనలు కూడా సక్రమంగా సాగడం లేదు.

శివాలయాల్లో ఆరు యామాలలోనూ మహా రుద్రాభిషేకాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. వైష్ణవ దేవాలయాలలో దీపారాధనకు కూడా కొరత ఏర్పడిపోయింది. ఈ గుళ్ళలో ధూప దీప నైవేద్యాలు తగ్గిపోయి, శివాలయాల్లో అభిషేకాలూ, ఆరాధనలూ పెద్ద ఎత్తున జరిగిపోతున్నాయి.

చిన్న చిన్న రాజ్యాల ప్రజలు, ప్రభువులూ ఇప్పుడీ దానవ బాధ నుండి విముక్తి లభిస్తుందా అని మనసులో నారాయణ జపం చేస్తున్నారు.

పురాణ వేత్తలు త్వరలో దశరధ మహారాజుల వారు త్వరలో పుత్ర కామేష్టి నిర్వహిస్తారనీ, ఆ యాగ ఫలంగా వారికి కుమారుడు జన్మిస్తాడనీ, శ్రీమన్నారాయణాంశలో జన్మించి, ఆ పురుషోత్తముడూ, కౌసల్యా తనయుడు, ఆ దాశరథీ, ఆ రాఘవుడు, అయోధ్యా ధీశుడు యీ బాధలన్నింటినీ రూపుమాపడానికి ఆ దశకంఠుడి రూపుమాపుతాడనీ చెపుతున్నారు. అందరూ ఒళ్లంతా కళ్ళు చేసుకుని నిరీక్షించే ఆ శుభ ఘడియ ఎప్పుడెప్పుడా అని జనమంతా ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.'

శ్రీధరశర్మ చెప్పినదంతా విన్నారు గౌతములు. గంభీరంగా తలూపారు. ఏమీ చెప్పలేదు.

'వెళ్ళి సహాధ్యాయులతో కలిసి విశ్రాంతి తీసుకో! నారాయణ స్మరణం చేస్తూ నిద్రపో! ప్రశాంత చిత్తంతో స్మరించు! కమ్మని నిదుర నీ కనులమీదికి వచ్చేస్తుంది! శ్రీధరా! నీది విశిష్ట జన్మ. అందుకే నిన్ను అయోధ్యాధీశుల సన్నిధికి పంపాను. సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడు నడయాడబోయే ఆ అంతపురంలో తిరుగాడుతూ తరువాతి కాలంలో లక్ష్మీదేవి రూపిణి అడుగిడబోయే ఆ సౌధాలలో తిరుగుతూ నీ జన్మ మరింత పవిత్రవంతం అవుతుంది.'

'ధన్యుణ్ణి గురుదేవా!'

'శుభం! ఈ పుణ్యఫలంగా నువ్వు శ్రీశ్రీశ్రీ భగవాన్ వేదవ్యాస మహర్షుల మహా భాగవతానికి చక్కని వ్యాఖ్యానం రచిస్తావు. ఆ అదృష్టం నీకే దక్కుతుంది. ఈ జన్మలోనో, పై జన్మలోనో అది నీ చేతనే యీ పేరుతోనే పూర్తవుతుంది. ఎప్పుడా అన్నది ఆ స్వామి కటాక్షం. నీవిక భాగవతాన్ని నిత్య పారాయణం చేయి.'

శ్రీధరశర్మ గురువులకు పాదాభివందనం చేసి విశ్రాంతికి వెళ్ళాడు.

## 23

పరమేష్టి చేతిలోని జపమాల కదులుతున్నది. బ్రహ్మ అంగుళులు దాన్ని కదిలిస్తున్నాయి. నాలుగు ముఖాలా నాలుగు వేదాలూ పఠిస్తున్నాడు బ్రహ్మ. సరస్వతి వీణని పలికిస్తున్నది. వీణ హఠాత్తుగా ఆగింది. చదువుల తల్లి భర్త వైపు చూసింది.

'ఏమి దేవీ! మనసులోని ఏదో ఆలోచన నీ ముఖదర్పణంలో ప్రతిబింబంలా కనిపిస్తున్నది. ఏమా ఆలోచన?'

'ప్రభూ!' మెల్లిగా అన్నది సరస్వతి. కడుపున కనకపోయినా కన్నారా కన్న సంతానం అహల్య! ఏ తల్లికయినా కొడుకుపై కన్నా కూతురిపైనే మక్కువ ఎక్కువ అనడం చతుర్ధశ భువనాల్లోనూ ప్రసిద్ధి! మన మానస పుత్రుడు నారదుడు అన్ని లోకాలూ తిరిగి వస్తుంటాడు. తన చిన్నారి చెల్లెలికి ఆర్షేయ పౌరుషాలకు తగినట్లుగా ముని తల్లజుడైన గౌతమ మహర్షిని ముడిపెట్టాడు.

'మీరు పెట్టిన నియమం, నిబంధన తనేర్పరచినవే కదా! నలుమోముల వేలుపు మానస పుత్రుడు కదా తను. అందుకే నాలుగ శిరస్సులలోని విజ్ఞానం అంతా అతని ఒక్క తలలోనే నిక్షిప్తమైందా అన్నట్లుగ తెలివితేటలు ప్రదర్శిస్తూంటాడు. సామాన్యుడా తను?'

ఆ నారదుడు వెతికి వెతికి గౌతముణ్ణి ఎన్నిక చేసి ధర్మసూక్ష్మం చెప్పి తరుణిని పట్టే తరుణోపాయం చెప్పి గౌతముడ్ని వెంట పెట్టుకుని వచ్చి దగ్గరుండి తమచేత కన్యాదానం చేయించాడు.

ఇవన్నీ తమకి తెలీదని- పునరుక్తి దోషానికి వెరవకుండా చెప్పడం లేదు. అఖిల ప్రాణి కోటిని సృష్టించడం లోనూ, వారి వారి తలరాతలు రాయడంలోనూ క్షణమైనా తీరికలేని తమకు మన కుమారుడిని గురించి ఆలోచించడం మరిచిపోయి ఉంటారని గుర్తు చేస్తున్నాను.

కుమారుడు నారదుడు ఆగమ్మ కాకిలా తిరిగిన చోట తిరక్కుండా, సకల లోకాలూ తిరుగుతూ ఉంటాడు. బ్రహ్మచర్య దీక్షా వ్రతుడు. అఖిల సృష్టి మన సంతానం అనుకుని తృప్తిపడుతూ ఉండటం వల్ల నారదుడికి పెళ్ళీ, సంసారం, పిల్లలూ లేరనే బాధ కాస్త తగ్గినా, వేదన వేదనగానే ఉంటుంది కదా!

కానీ అహల్య విషయం అలా కాదు కదా స్వామీ! ఆడపిల్ల అడవి పిల్ల అయిపోయింది. కానక కన్న సంతానం కానకే అంకితమైంది.

అల్లుడు గారు అఖండ మేధాశాలి అయినా ఆయన నిర్మించిన న్యాయ సూత్రాలు జగద్విఖ్యాతం.

ఆయన జీవితం అవశ్యమనుసరణీయం. ఆయన ధర్మనిష్ట అప్రమేయం! అనన్య సామాన్యం! అప్రతిమానం!

కానీ నా కుమార్తెను అక్కడ ఎలా ఉన్నదీ, ఎలా జీవిస్తోంది, ఏం చేస్తోంది, ఎలా కాలక్షేపం అవుతున్నది అన్నది మీరు విచారించారా?

నా ముంజేతి చిలుక ద్వారా కొన్ని విషయాలు తెలిశాయి. ఎవరో ఎక్కడో ఏమిటో అనుకుంటూ ఉంటే అహల్య అనే మాటలు విని మన అమ్మాయి కథ కదా అని మరింత శ్రద్ధతో విని నాకు మనవి చేసింది.

అమ్మాయికి అంజన జన్మించింది. ఆ పిల్లకి ఎనిమిదేళ్ళు రాగానే అష్టవర్షాభవేత్ కన్యా అనే అజనాభ దేశ సంప్రదాయం ప్రకారం, అందునా ఆంధ్ర దేశ సంప్రదాయం ప్రకారం పెళ్ళి చేశారట అంజనకి!

మన చిన్నారికి అప్పుడెప్పుడో విశ్వామిత్రమహర్షి బ్రహ్మోపదేశం చేశాడట! గౌతములు అహల్యకు చదువు సంధ్యలు నేర్పించారట! చాలా శాస్త్రాలూ అభ్యసించిందట అమ్మాయి. ఇవే కాక ఇంకెన్నో విశేషాలు అవన్నీ తమ చెవులకు వినవస్తున్నాయా? ఎనిమిది చెవులున్నా వినిపించినా వినిపించుకోనట్లే ప్రవర్తిస్తున్నారా తమరు!

బ్రహ్మ చెముడని ఆంధ్ర దేశంలో అంటారని నారదుడు చెప్పాడులే! ఎంత మొర పెట్టినా వినిపించుకోని వ్యక్తి విషయంలో అలా అంటారట! తమకు గుడి కట్టించి పూజించకపోయినా నుడి కడలిలో తమ నామధేయం సొగసుగా వినిపిస్తూనే ఉంటుంది. బ్రహ్మసొచం, బ్రహ్మ యజ్ఞం, బ్రహ్మశ్రీ, బ్రహ్మర్షి బ్రహ్మజ్ఞానం, బ్రహ్మ జెముడూ యిలా ఎన్నెన్నో...

'వాణీ!' ఆమె మాటలకు అడ్డొస్తూ పిలిచారాయన. ఏమిటన్నట్లు ఉంది సరస్వతీదేవి చూపు.

బ్రహ్మ చెప్పసాగాడు.

* * * *

కల్ప వృక్ష ఛాయల్లో కొద్దిసేపు సేదదీరిన తర్వాత..

'ప్రభూ!'

'ఏమిటి దేవీ!'

'దివిజ గంగలో స్నానాలు చేద్దామా!'

వింతగా చూశాడు మహేంద్రుడు.

'అవును ప్రభూ! తమతో జలకేళి వల రాచకేళి కదా!'

'చమత్కారవతివవుతున్నావు దేవీ!'

'సకల లోకాల ఏలిక నా చెంతనుండగా ఎవరూ నా సరిరారిక అనుకున్న పిదప దేవేంద్రులవారి అర్ధ సింహాసనం అధిష్టించే మహాభాగ్యం నా ఒక్కదానికే అనుకున్న తరువాత మతి చమత్కృతం కాక మరేమవుతుంది?'

నవ్వాడు ఇంద్రుడు.

'ఇవన్నీ సృష్ట్యాది నుంచి ఉన్నవే కదా దేవీ! ఇప్పుడు కొత్తగా సిద్ధించిన విశేషమేముంది దేవీ?'

'చిక్కక చిక్కక ఇన్నాళ్ళకి తమరితో ఏకాంతం చిక్కడం ప్రభూ! ఏ కాంతలూ లేని ఏకాంతంలో తమ సన్నిధి నా పెన్నిధి అనుకుంటే అంతకన్నా ఆనందం కలిగించే విషయం నాకు ఏముంటుంది ప్రభూ?'

'మనం ఉన్నప్పుడు మరే కాంత రాగలదు దేవీ!'

'ఏమో! బహు వల్లభులు కదా తమరు!' చమత్కారంగా అంది.

'అసూయ అయినా అందంగానే ఉంటుంది'

'ఆడవారికి అసూయ ఆరో ప్రాణం అన్నారట ఎవరో! ఎవతి ఓర్వగలదు ప్రభూ సవతి పోరు. నిజం' అంది.

'పరమేష్టికి ఒక్క యిల్లాలు. ఈ ఇంద్రుడికి ఒకతే ఇల్లాలు! ఒకటే ఆయుధం! వజ్రాయుధం! ఒకే ఏనుగు! ఐరావతం!'

'కానీ మీరు పోల్చిన తొలి వేలుపు ఆ పరమేష్టి భార్య ఒకతే. కానీ ఆయనతో కలిసి ఏర్పడిన మూర్తి త్రయంలో మిగిలిన విష్ణువుకూ, శివుడికీ భార్యలిద్దరు కదా స్వామీ! అందుకని త్రిమూర్తులలో ఇద్దరికీ ఇద్దరేసి ఉండగా త్రిలోకాధిపతికి నాకు మాత్రం తక్కువ ఉండాలా? అని మీరు ఆలోచించకపోవడం నా మహద్భాగ్యం కదా స్వామీ!'

నవ్వేడు ఇంద్రుడు.

'అచ్చెర మచ్చెకంటులు అహరహం సేవిస్తున్నా, తమకు అన్య కాంతలపై మక్కువ అనీ, కొంగు తాకితే చాలు కొనగోట స్వర్గం నిలిచినట్లు భావిస్తారనీ, గిట్టని వారనుకుంటూ ఉంటారనీ, తమకి నా ధ్యాస - నా ప్రేమ తప్ప మరేమీ అక్కరలేదనీ ఇంద్రసఖి చెవినిల్లు కట్టుకుని చెపుతూ ఉంటుంది ప్రభూ!'

'ఇంద్రసఖి...'

'అవును నా కూతురి చెలిమికత్తె ఇంద్రసఖి...'

'అవునవును! ఇటీవల ఆమె వృత్తాంతమేదయినా చెప్పిందా?'

'ఏ వృత్తాంతం ప్రభూ?'

'స్పష్టంగా యిదని కాదు. ఏదయినా అహ! మరేదయినా!'

'అహ! అంటే గుర్తొచ్చింది. అహల్యని సృష్టించాడట కదూ! ఆ ముది మది తప్పిన ముసలివేలుపు! ఆ బ్రహ్మకి ఏదో రిమ్మ తెగులు పుట్టుకొస్తే పుట్టుకొచ్చి పుట్టించాడనుకోండి! ఆ తంపులమారి నారదుడికేం పోయే కాలం? పోటీ ఏమిటీ? గెలుపేమిటీ? కన్యాశుల్కం ఏమిటీ? చివరికి యీన మోచి నక్కల పాలు చేసినట్లు అడవుల పాలు చేయడం ఏమిటీ?'

ఇంద్రుడేం అనలేదు. మౌని అయ్యాడు. అహల్య పేరు చెవి సోకగానే ఇంద్రుడి మనస్సు నిండా అహల్య అందమే నిండిపోయింది.

శచీదేవి ఆగింది. భర్త ముఖం పరిశీలనగా చూసింది.

'తిరిగి ప్రభువులకు ఏదో ఆలోచన కలిగినట్లుంది. అనవసర ప్రసంగం చేశాను. ఆ బ్రహ్మ ఏంచేస్తే మీకేమిటీ? లీలా విలాసాల వేళ లోక వృత్తాంతం ప్రస్తావించడం నాదే తప్పు! పదండి జల క్రీడలకు దిగుదాం!'

ఇంద్రుడు కదిలాడు.

సురగంగలో మునకు వేస్తూ ఇంద్రుడూ శచీదేవీ క్రీడించసాగారు. ఓలోల అనుకుంటూ ఆమె నీటిలో మునిగి ఎక్కడో తేలుతూ ఉంటే ఆమెని అందుకోలేక మునకలు వేస్తూ, తేలుతూ ఉంటే ఆమెని అందుకోలేక మునకు వేస్తూ ఓలలాడటం ప్రారంభించాడు ఇంద్రుడు. అతని మనసు తాత్కాలికంగా గంగా స్నానంలో నిమగ్నమైంది.

## 24

అయోధ్యా నగరంలో పుత్రకామేష్టికి కావలసిన సంభారాలన్నీ సమకూర్చబడుతున్నాయి. విశాలమైన యజ్ఞ వాటిక తయారైంది. పందిళ్ళు వేశారు. పచ్చని తోరణాలు ఏపూట కాపూట కొత్త శోభ వచ్చేలా అలంకరిస్తున్నారు.

సూర్యోదయం కాక మునుపే అరవిచ్చిన పూవులన్నీ సేకరించి మాలలుగా తీర్చి కూర్చి తోరణాలుగా వేలాడదీస్తున్నారు. దేశంలోని ఎక్కడెక్కడి పూలు అయోధ్యా నగరానికి చేరుకుంటున్నాయి.

పూలతోపాటే ఫలాలూ వస్తున్నాయి. అరటి ఆకులు విస్తారంగా వస్తున్నాయి. ఎక్కడెక్కడి మగ్గాల్లోనో తయారైన అరుదైన జరీ పంచెలు, పట్టు వస్త్రాలు అన్నీ అయోధ్యా నగరానికి చేరుకుంటున్నాయి.

ఆంధ్ర ప్రదేశం మొదటినుంచీ నేత పనితనంలో మొదటనే ఎన్నదగిన స్థానంలో ఉంటున్నది. చిన్ని పెట్టె, అరచేతిలో ఉంచదగినంత చిన్ని పెట్టెలో మడిచిపెట్టి అందివ్వగల మంచి నేతచీర నేయగల నేర్పరితనం ఆంధ్రుల సొత్తు.

యజ్ఞ సమయంలో అయోధ్య రాణులు ముగ్గురు కౌసల్యా, సుమిత్ర, కైకేయి దరించడానికి అనువైన చీరలు ఆంధ్రదేశం నుంచే వచ్చాయి. అలాగే దశరధమహారాజు కట్టుకునే పట్టు పుట్టాలు కూడా ఆంధ్రదేశం నుంచే వచ్చాయి.

ఏయే ప్రాంతాలలో ఏయే వస్తువులు విస్తారంగా పండుతాయో అక్కడి నుంచి వాటిని తెప్పించి భారీగా తెప్పించమని మంత్రి సుమంత్రులవారు ఆజ్ఞాపించారు. వ్యవసాయిక విషయాలను పరిశీలించే మంత్రి ఆయా ఉద్యోగులను సమావేశపరిచి దేనికీ లోటు లేకుండా అన్నీ పుష్కలంగా లభించేలా సేకరించమని ముదలకించారు.

యాగం నెల రోజులకు ప్రారంభమవుతుందనే విషయం వశిష్టులవారు, విభాండక మహర్షి, రోమ పాదులవారు మరికొందరు జ్యోతిష్యవేత్తలు కలిసి ప్రకటించగానే ఆ విషయం వార్తాహరుల ద్వారా, గూఢాచారుల ద్వారా, ఇతర ప్రాంతాలకు చేరకముందే పిల్ల వాయువులే మంద మందంగా వీస్తూ, పల్లెపల్లెలో ఆగి ఆగి, ఇంటింటి వద్దా మోగి మోగి, వార్తానందంతో తూగి తూగి, అందరికీ అందజేయాలనే తపనతో వేగి వేగి, ఉత్సాహంతో ఊగి ఊగి, నిలువలేక కదలలేక, నడక మందగించి సాగిపోయారు.

ఎక్కడెక్కడి జనం అయోధ్యకు అభిముఖంగా సాగివస్తున్నవి.

అజనాభ దేశంలోని మునులు, ఋషులు, తపస్వులూ, యోగులూ, సిద్ధులూ, సాధువులు అందరూ అయోధ్యకు సాగి వస్తున్నారు.

వశిష్టులు, విశ్వామిత్రులు, స్వయంగా నిర్దేశిస్తూ యాగాన్ని జరిపిస్తున్నారనీ, ఋష్యశృంగమహర్షి ఆ యాగానికి బ్రహ్మగా నిర్వహిస్తారనీ తెలియగానే ముని వాటికలన్నీ ఖాళీ చేసి సతీ సుత శిష్యసమేతంగా తరలి వచ్చారు.

నెలరోజుల నుంచీ వచ్చే జనంతో, ఋత్విక్కులతో, మహర్షులతో, కళాకారులతో అయోధ్య పుర వీధులు మారుమోగిపోతున్నాయి. ధర్మసత్రాలు చాలడం లేదు. అతిథులకు వసతి కల్పించడం తమ జన్మ భాగ్యంగా భావించి అందరూ వచ్చినవారికి స్వాగత సత్కారాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతి ఇల్లూ ఒక ధర్మశాలగా మారిపోతున్నా వచ్చేవారికి వసతులు చాలడం లేదు. నగరంలోని విశాలమైన మైదానాల్లో గుడారాలు ఏర్పాటుచేసి అక్కడే భోజన భాజనాది కార్యక్రమాలకు అన్ని వసతులూ కల్పిస్తున్నారు రాజోద్యోగులు. అవీ చాలడం లేదు.

అప్పుడిక నగర బహి ప్రదేశాల్లో సుందరంగా పెంచిన ఉద్యానాల్లో వసతులు కల్పించసాగారు. మహర్షులకూ వారి శిష్యులకు తగిన తాత్కాలిక వసతి గృహాలు నిర్మితమవుతున్నాయి.

అవన్నీ పూర్తయి కాకముందే పుణ్యాహవచనం జరిపించి వాటిలో మహర్షులకూ అర్ఘ్యపాద్యాదులూ సమర్పించి సాదరంగా ఆహ్వానించి విడిది చేస్తున్నారు.

అంతఃపురంలోని మహానసంలో అరవై ఘడియలూ వంటావార్పూ సాగిపోతూనే ఉన్నది. బళ్ళతో సంభారాలు. వంట కట్టెలతో ఎడతెరిపి లేకుండా వస్తూనే ఉన్నాయి. జిహ్వకో రుచి. ఏ ప్రాంతం వారికి ఆ ప్రాంతపు వంటకాలు ఇష్టం. వారికి తగినట్టుగా వారు మెచ్చేట్టు ఆయా వంటకాలు తయారు చేస్తున్నారు.

కొందరికి కొత్త కొత్త వంటకాలపై మోజు. అలాంటి వారికి ఆయా రకాలు తయారుచేసి వడ్డిస్తున్నారు. పెద్దల సంరంభాలకు అంతు లేదు. పిల్లల ఉత్సాహాలకి అడ్డు లేదు. పగలూ రాత్రీ అనే తేడా లేకుండా వినోద కార్యక్రమాలు సాగిపోతున్నాయి.

వైశాఖ జ్యేష్ఠ మాసాల్లో ఎండలు మండిపోతుంటాయి. కానీ ఇనకుల తిలకుడిగా శ్రీమహావిష్ణువు అయోధ్యలో రఘువంశంలో జన్మించనున్నాడనీ, ఆయన అనుజులుగా శ్రీవారి శంఖం, చక్రం, శ్రీవారి శేషపానుపూ అవతరించనున్నాయనీ, ఇక ఈ త్రేతాయుగంలో రాక్షస బాధ ఉండనే ఉండదనీ, ప్రజలంతా సుఖ శాంతులతో జీవిస్తారనీ తెలిసిన సూర్యుడు తన చండ ప్రచండ కిరణాలలో వేడిని తానే తగ్గించుకుంటూ, మబ్బు చాటున వెలుగుతూ వాడిని క్రమబద్ధం చేసుకుంటూ వేసవి పగలు కూడా వెన్నెల రేయి అనిపించేలా చేస్తున్నాడా అన్నట్టున్నాయి పగళ్ళు.

అందువల్ల పగటికీ రేయికీ పెద్దగా తేడా తెలియటం లేదు. రత్న దీపాలు, తైల దీపాలూ అఖండంగా వెలుగుతూ చల్లని వెలుగును వెదజల్లుతున్నాయి. నృత్య, గాన, కథా విశేషాలతో రాత్రుళ్ళు, విందు భోజనాలతో పగళ్ళూ, గడిచిపోతూ కాలం తెలీకుండా చేస్తున్నాయి.

ఎక్కడ చూసినా ఆనందం. ఎక్కడ చూసినా ఉత్సాహం. ఎటు చూసినా విందు వినోదాలు. అటు మామూలు జనంలోనూ, ఇటు రాజాంతఃపురంలోనూ రాజ్యోద్యోగులలోనూ సందడే సందడి.

వీధులు దాటి విను వీధులన్నీ సుస్వర పూరితమై, వేదనాదాలతో ప్రతిధ్వనిస్తున్నాయి. నాలుగు వేదాల్లోనూ పండితులైన బ్రాహ్మణోత్తములు ఉదాత్త మదాత్త స్వరాలతో వేద పఠనం చేస్తున్నారు. ఆ మధుర నాదం సుమధుర సంగీతంలా అంతటా వ్యాపిస్తున్నది.

యాగానికి కావలసిన ప్రశాంత వాతావరణం ఏర్పడింది. అయోధ్యలో అణువణువూ శ్రీమన్నారాయణమూర్తి ఆగమనానికి వలసిన రీతిలో అందచందాలు సంతరించుకున్నది. ప్రతి అణువూ పరమాత్ముడి పద నృత్యంతో పునీతం కావడానికి తొందర పడుతున్నది.

ఋష్యశృంగుల వారు రాబోయే శుభ ఘడియ రానేవచ్చింది.

## 25

మిథిలా నగర రాజాంతఃపురంలో జనకరాజర్షి ప్రాతఃకాలం నుంచీ ఎవరికోసమో ఎదురు తెన్నులు చూస్తున్నాడు.

ప్రతి అర ఘడియకూ ఎవరో ఒకరు వేగం వచ్చి ప్రధాన వేగుకు సమాచారం అందించి వెళుతున్నారు. అతడు సహాయ మంత్రికి విషయం విన్నవించుకుంటున్నాడు. అతడు మంత్రికి ఆ మంత్రి శిరః ప్రధానికీ వర్తమానం తెలియజేస్తున్నారు. ఆయన ఘడియ ఘడియకూ మహారాజుకు నివేదిస్తున్నాడు.

రాజర్షి అయిన జనకుడు వ్యగ్రత చెందకుండా స్థిర చిత్తంతో శాంత భావంతో వింటూ తలూపి తిరిగి నిరీక్షిస్తున్నాడు.

మిథిలా నగర పొలిమేరకు రానే వచ్చాడు. యింతటి నిరీక్షణకూ కారణభూతుడైన ఆ మహర్షి. ఆయన రాక అంచెలంచెలుగా జనకుడికి క్షణాలమీద నివేదించబడింది. వెంటనే కదిలాడు జనకుడు.

ఆయన వెంట మంత్రి, పురోహిత, సేనానాయక, దండనాథ, పుర ప్రముఖులు, మహా రాణీ, దాస దాసీ జనం అంతా కదిలారు. నగరికి నగరే కదిలి వచ్చినట్లయింది.

మహా రాజోచితమైన ఆ స్వాగతానికి ఆ మహర్షి ఎంతో సంతోషించాడు. పాద్యం సమర్పించాడు.

జనక రాజర్షి అర్ఘ్యం అందించాడు. ఆ పైన తడిసిన ఆ మహర్షి పాదాలను తన ఉత్తరీయంతో అద్దాడు జనక రాజర్షి. ఈ సేవలతో ఆ మహర్షి మరీ సంతోషించాడు.

'బ్రహ్మర్షీ! తమరు వస్తున్నట్లుగా తమ శిష్యులు నివేదించిన క్షణం నుంచీ తమ రాక కోసం తనవంతు కనులు చేసుకుని నిరీక్షిస్తున్నాము. తమరు మా పొలిమేరలోకి రాగానే యదార్థమైన స్వాగతం సమర్పించుకోవాలన్నది నా కోరిక! అలాగే తమరిని యధావిధిగా అర్చించి ఆహ్వానం పలుకుతున్నాం. తమరి రాకతో మా మిధిలా నగరమే తరించింది. మా జన్మ తమ పాదదర్శనం తోనే ధన్యమైంది' అన్నాడు జనకుడు.

'రాజర్షి సత్తమా!' నిండు గుండెతో పిలిచాడు ఆ మహర్షి. 'ఇది వినయానికే వినయం నేర్పించే తమ వినమ్ర వచనం. అంతేగానీ ఈ అజనాభదేశంలో, రాజ లోకంలో నీ వంటి నిర్మల జీవనుడు లేడు. మహర్షి లోకంలో నీవంటి మహిమాన్వితులు అరుదు! అందుకే నీవు రాజర్షివయ్యావు! ప్రజా పాలన కేవలం ప్రజాసేవకే తప్ప, ప్రజల చేత సేవలందడానికి కాదు. రాజరికంతో వచ్చే అట్టహాసాలతో- ఆడంబరాలతో, డాంబికాలతో, మిధ్యా గౌరవాలతో జీవించడమూ కాదు అని విశ్వసించే ప్రజా పాలకుడివి నువ్వు! నువ్వు ఆదర్శమూర్తివి! నీ ఆతిథ్యం పొందడం మా అదృష్టం' అన్నాడు.

జనకుడు అంజలి ఘంటించాడు.

'మౌని కులాలంకారా! మహానుభావా! గాధినందనా! తమ వచనం తమకు మాపై గల అవ్యాజాను రాగాలకు గుర్తు! తమ చిత్తం మా భాగ్యోదయం. అర్థించినా ఎవరి అంతఃపురంలోనూ అడుగిడని తమరు తమకై తాము దయచేయడం, ఈ జనకుడి జీవితంలో ఏదో మహత్తర శుభ సూచకంగా భావిస్తున్నాను. తమరు మా అంతఃపురానికి దయచేయవలసిందిగా, మేం యధావిధిగా చేసే సేవలు స్వీకరించవలసిందిగా అభ్యర్థిస్తున్నాం'.

విశ్వామిత్రుడు ఎంతో సంతోషించాడు. జనకుడు దారితీయగా ఆయన వెంట విశ్వామిత్రుడు కదిలాడు. వారిని అనుసరించి మంత్రులూ, పురోహితులూ, దండనాధులూ నడిచారు.

విశ్వామిత్రుడు అంతఃపురం ప్రవేశించాడు. జనకుడు విశ్వామిత్రుడు ఇద్దరే నిలిచారు. అందరూ వెలుపలికి వెళ్ళిపోయారు.

'జనక రాజర్షీ! లోక కంటకుడైన రావణాసురుడి బాధల నుండి సమస్త మానవాళిని, దేవతలనూ రక్షించడానికి దశ కంఠుడిని శిక్షించడానికి శ్రీమన్నారాయణుడు అయోధ్యా నగరిలో అవతరించనున్న విషయం అన్ని లోకాల్లోనూ తెలిసిన విషయమే!

దశరధుడితో ఋష్యశృంగమహర్షి త్వరలోనే పుత్రకామేష్టి చేయిస్తున్నాడు. ఆ యాగంతో తృప్తి చెందిన దేవతలు స్వాహావధూవల్లభుడి ద్వారా యాగ ఫలాన్ని అందించనున్నారు. తత్ఫలితంగా శ్రీమన్నారాయణమూర్తి అయోధ్యలో నరుడిగా జన్మిస్తాడు'.

విశ్వామిత్రుడి మాటలు విని, మంత్రం విన్నవాడిలా తలూపాడు జనకుడు. ఈ విషయం తనకూ తెలిసిందన్న సూచనగా ఆయన తలూపగానే విశ్వామిత్రమహర్షి మళ్ళీ అన్నాడు.

గత యుగాల్లో, కాలాల్లో శ్రీమహావిష్ణువు ఎన్నో అవతారాలు ధరించాడు. వాటికీ, ఈనాటి అవతారానికీ ఎంతో వ్యత్యాసం ఉంది. శ్రీమన్నారాయణుడు నరుడిగా జన్మించి ఒక ఆదర్శ మానవుడిగా జీవించనున్నాడు.

మరి అన్ని సంవత్సరాలు శ్రీమహాలక్ష్మి స్వామివారి వియోగాన్ని భరిస్తూ వైకుంఠంలో ఉండగలదా. ఊహూ! అందుకే ఆమె భూలోకంలో మానవ కాంతగా జన్మించనున్నది. కానీ ఆ తల్లి గర్భావాస క్లేశం అనుభవించరాదు. అందుకే అయోనిజగా అవతరించనున్నది!

జనకుడు ఉత్కంఠతో వినసాగాడు.

అయోధ్యాధీశుడితో వియ్యమందదగిన రాజ వంశంలో ఆ తల్లి వెలుస్తుంది. వియ్యానికయినా, కయ్యానికయినా సమాన స్థాయి కావాలి కదా!'

శిరస్సు ఊపాడు జనకుడు.

బ్రహ్మర్షి విశ్వామిత్రుడంతటి వాడు విషయాన్ని వివరిస్తూ ఉంటే మధ్యలో మాటలు కలపడం జనకుడి లాంటి రాజర్షికైనా తగదు కదా!

'రఘువంశం పునీతం కాబోతున్నది. పుత్రులు లేరు లేరని వగచిన దశరధుడికి కోరిక కూడా తీరబోతున్నది. మానవజన్మ ఎత్తనున్న శ్రీమహావిష్ణువు అందరు మానవుల లాగానే పెళ్ళి, సంసారం, సంతానం అనే అనేక బాంధవ్యాలకు బందీ కానున్నాడు. ఆయన కాళ్ళు కడిగి కన్యాదానం చేయతగిన భాగ్యశాలి ఎవరా అన్నది సమస్త లోకాల్లోనూ చర్చనీయాంశమయింది'.

విశ్వామిత్రుడు చెపుతున్న మాటలు వింటున్నాడు జనకుడు.

'నేను గాయత్రిని దర్శించిన ఋషిననీ మీకు తెలుసు. ఆ తల్లి దయవలన నాకు ఆ వంశమేదో! ఆ పునీత రాజ్యమేదో తెలిసింది!' అన్నాడు విశ్వామిత్రుడు చిరునవ్వుతో.

'సెలవివ్వండి బ్రహ్మర్షీ! ఆ దేవరహస్యం నాకు తెలిసినా చిక్కు, ఇక్కట్లు లేవని తమరు భావిస్తే తెలియపరచండి'

'రాజర్షీ! తమరి జీవితం, తమరి జీవనం అన్ని లోకాల్లోనూ విదితం! తమరికావిషయం తెలియచెప్పాలనే తాపత్రయంతో నేను వచ్చాను'

'సెలవివ్వండి బ్రహ్మర్షీ!'

'ఆ అదృష్టవంతుడివి నువ్వే! ఆ రాజ వంశం మీదే! ఆ పుణ్య భూమి మీదే! శ్రీమహాలక్ష్మి పద చిహ్నాలతో నీ అంతఃపురం మరో వైకుంఠం కానున్నది.

'ధన్యోస్మి బ్రహ్మర్షీ! ధన్యోస్మి!' చెప్పరాని సంతోషంతో అన్నాడు జనకుడు.

'నా జన్మ సార్ధకమైంది. మా మిధిలా నగరం పావనం కానున్నది! సాక్షాత్తూ ఆ శ్రీమహాలక్ష్మియే మా వంశంలో అవతరించడం మా భాగ్యం! శ్రీమహావిష్ణువును అల్లుడిగా పొందగలిగిన అదృష్టానికి నా మనసు పొంగిపోతున్నది'.

'కాని ఆ తల్లి ఎలా అవతరిస్తుందన్నది ఆ మహాతల్లికే తెలుసు! లేదా ఆ త్రిమూర్తులకు తెలుసేమో! మరెవ్వరికీ తెలియదు రాజర్షీ!'

'స్వామీ! ఎలా అవతరిస్తేనేం. ఎప్పుడు అవతరిస్తేనేం ఆ తల్లి నా మందిరంలో అవతరిస్తుంది. ఆ లక్ష్మి, ఆ పద్మాలయ, ఆ పద్మహస్త, ఆ క్షీరసాగర కన్యక ఈ జనక రాజపుత్రి అనిపించుకుంటుంది.

అవతరించనున్న ఆ విష్ణువు, ఆ రాఘవుడు నా అల్లుడవుతాడు. అంతకంటే కోరదగినదేముంది బ్రహ్మర్షీ! తపః ఫలితంగా శ్రీవైకుంఠంలో శ్రీమన్నారాయణమూర్తి దర్శనం లక్ష్మీ సమేతంగా లభిస్తుంది.

అలాంటిది ఆ దంపతులు నా ఇంటిలో కూతురుగా, అల్లుడుగా తిరుగాడుతూ ఉంటే కళ్ళారా చూసే భాగ్యం లభించడం ఎన్ని జన్మల పుణ్యఫలం కావాలి! అంతేనా? నేనొక్కడినేనా ధన్యుణ్ణి! నా అంతఃపుర స్త్రీలు, నా దాస దాసీ జనం, నా సేవకులూ, నా మంత్రులూ, నా అనుచరులూ, నా మిధిలా నగర వాసులు అందరూ అదృష్టవంతులు! స్వామీ! ఈ త్రేతాయుగంలో, ఈ పాదంలో జన్మించిన వారందరూ పుణ్యజీవులే! శ్రీమహా విష్ణువు యీ భూలోక వాసులపై అనన్యమైన ప్రేమను వర్షించడానికి అవతరిస్తున్నాడు స్వామీ!'

జనకుడి వినయ వచనాలు, ఆనందం కళ్ళారా చూసిన బ్రహ్మర్షి, బ్రహ్మానంద సబ్రహ్మచారి అయ్యాడు. లేచాడు.

'ఇక మేం సెలవు తీసుకుంటాం!'

'అప్పుడేనా మహర్షీ! తమరు మా ఆతిథ్యం స్వీకరించి...'

'జనక రాజర్షీ! ఈ రహస్యాన్ని తమ చెవిన వేసిపోవాలనేదే మా కోరిక. అది నెరవేరింది. ఇక ఈ అవతార పురుషుడి జననం కోసం ఈ అవతారమూర్తి అవతరణ కోసం వేచి ఉండడమే మాకు మిగిలింది' కదిలాడు విశ్వామిత్రుడు.

జనకుడూ తన రీతిలో ఆయనకు వీడ్కోలు పలికాడు.

## 26

సరస్వతి అలా నిష్టూరంగా అనగానే చతుర్ముఖుడు చిరునవ్వు నవ్వి చెప్పసాగాడు.

'సరస్వతీ! భూలోకంలో అజనాభదేశంలో ఆంధ్రదేశం ఓ భాగం. అక్కడ ఓ నదీ తీరంలో మన అహల్యా గౌతములు నివసిస్తున్నారు. అక్కడ ఓ సామెత ఎప్పుడూ జనంలో వాడుకగా ఉంటుంది. 'పొద్దుపోక పనీపాటూ లేక తీరి కూర్చుని ఏవేవో మాటలు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు.

పొద్దు అంటే సూర్యుడులే! ఆ సూర్యుడు ఉదయిస్తున్నట్లు భాసించి, అస్తమిస్తున్నట్లు భ్రమింప జేస్తాడు. అతడు వెలిగే కాలం పగలు! లేని సమయం రాత్రి. ఆ రెండు కలిస్తే ఒక రోజు! అలాంటి పొద్దులు ముప్పై అయితే ఒక మాసం! అలాంటి మాసాలు ఆరయితే ఒక ఆయనం. రెండు ఆయనాలు ఒక సంవత్సరం. వాటికి పేర్లున్నాయి. వారాలకూ పేర్లున్నాయి. గ్రహాలతో  ఏర్పడ్డాయి అవి. చంద్ర గమనాన్ని, నక్షత్రాల్ని గమనించి మాసాలకు చైత్రాది నామకరణం చేశారు'

సంవత్సరాలు ప్రభవాదులు. అవి మన మానస పుత్రుడైన నారదుడి గాథతో ముడిపడి ఉన్నాయి.

అవి అరవై! అవి మళ్ళీ తిరిగి రాగానే ప్రభవతో మొదలు! అది కాల చక్రం. ఇంతకూ ఇంత ఎందుకు చెప్పుకొచ్చానంటే? ఆ లోకంలో పొద్దుపోక సుద్దులు చెప్పుకుంటారట! మనకు అలా కాదు కదా! కనీసం నాకు అలా జరగదు కదా! క్షణం రెప్ప పాటు కాలం నేను విశ్రమించేందుకు వీల్లేదు కదా! నేను విశ్రమిస్తే ఈ సృష్టే ఆగిపోతుంది.

శివుడు రుద్రుడై, లయ కారుడై లోకంలో ఉన్న అన్ని జీవుల్ని తనలో లయింప జేసుకుంటాడు. ఆయన తాండవం చేసినా, లాస్యం చేసినా కార్యక్రమం ఆగదు. జీవులు తమ కర్మబద్ధులై తామే లయిస్తారు.

కానీ- సృష్టి అలా కాదు కదా! నేనే సృష్టించాలి కదా దేవీ! నిర్విరామంగా సృష్టిస్తూ క్షణం ఆలోచించే తీరిక దొరకని నాకు మన అమ్మాయి గురించి ఆలోచించే అవకాశం ఎక్కడ?

ఏ జీవుడి గురించి గత జన్మ ఫలాన్ని బట్టి ఆ జీవికి ఈ జన్మలో ఏం జరుగుతుందో వాళ్ళ ముఖాన రాసి సృష్టించి లోకం పైకి వదిలేయాలి. క్రిమిజన్మ అయినా- కీటక జన్మ అయినా- పశుజన్మ అయినా- మానవ జన్మ అయినా వాళ్ళ వాళ్ళ తలరాతలు వారికి వ్రాసి పంపెయ్యాలి కదా!

అయినా దేవీ! ఒక అహల్య ఏమిటి? నేను సృష్టించే వాళ్ళందరూ నా సంతానమే కదా! వాళ్ళ బాగోగులు వాళ్ళ తలరాతల మీద- ఆ తలరాతలు వాళ్ళ గత జన్మ సుకృతాలు. దుష్కృతాల మీద ఆధారపడి ఉంటాయి కదా! మరి వాళ్ళందరి గురించీ ఆలోచించే తీరిక మనకెక్కడిది?

బ్రహ్మ అలా అనగానే సరస్వతి చిన్నగా నవ్వింది.

'ఎంత చదువు చదివారండీ!' అంది.

'చదువుల దేవతవి కదా! అందుకే అంత చదివాను!'

'బ్రహ్మాండ పురాణం అంత చెప్పారు'

'అంత చెప్పినా ఆవగింజంతైనా అర్ధమయిందా?'

'ఆవగింజంటే గుర్తుకొచ్చింది. ఆంధ్రదేశంలో ఇలా అనుకుంటారట కదా! ఆవగింజంత బూడిద పూసుకుంటే గుమ్మడి కాయంత వెర్రి పుట్టుకొస్తుందట! నిజమేనా?'

'అక్కడి మాటల అర్థాలు ఇక్కడ అడిగితే ఎలా దేవీ! అయినా వాగ్దేవివి. నీకు చెప్పాలా నేను!'

'తమరు వేదపఠనంలో ఘనాపాఠీలు కదా!'

'వేదాల సంగతి ఎందుకులే! మనమ్మాయి మాట విను. అహల్య సుఖంగా జీవిస్తోంది. ఆనందంగా ఉంది. కూతురికి పెళ్ళి చేసింది. కేసరి వల్ల అంజనకు కుమారుడు కూడా కలిగాడు'

'అహల్య కూతురు అంజన... ఆమె భర్త కేసరి!'

'ఆమె కుమారుడు అంజనీ తనయుడు. ఆంజనేయుడు...'

'ఇవన్నీ మీకెలా తెలిశాయి?'

'నీకు నీ ముంజేతి చిలుక చెపితే, నాకు నా వాహనం హంస చెప్పింది!' అన్నాడు.

'దానికెలా తెలుసునట!'

'మందాకినీలో విహరిస్తూ ఉంటే అప్సరసలు అనుకుంటూ ఉంటే విందట!'

బ్రహ్మ నవ్వుతూ అన్న మాటలకు సరస్వతి కూడా నవ్వింది.

'విషయాలన్నీ వివరంగా తెలిశాయి. కాబట్టి మనం వెళ్ళి చూడక్కరలేదంటారు అవునా!'

'మనం వెళ్ళక్కరలేదనలేదు. వెళ్ళే తీరిక లేదంటున్నాను'

'అయితే నేను వెళ్ళి చూసి రానా?'

'వెళ్ళు! వెళ్ళు! కూతురి ఇంటికి వెళ్ళి అల్లుడుగారు చేసే సపర్యలు అందుకుని, కూతురు చేసే మర్యాదలు స్వీకరించి ఆనందించి తిరిగిరా! ఈలోగా సృష్టి ఆగిపోతుంది. అదంతే!'

తెల్లబోయింది సరస్వతీ దేవి 'అయితే నేనెప్పటికీ ఇక్కడి నుంచి కదిలేందుకు వీల్లేదా?' అంది.

'ఊహూ! వాణీ చతురాననులు, శివ పార్వతులూ, లక్ష్మీ నారాయణులూ ఒంటరిగా ఉండరు. వాళ్ళు కలిసే ఉండాలి. అందుకే నేను కదా శ్రీమహావిష్ణువు భూలోకంలో నరుడిగా అవతరించబోతూంటే శ్రీమహాలక్ష్మి కూడా అవతరిస్తూ ఉంది'

'అయితే దాశరథి నుదుటి రాత కూడా తమరే రాస్తారా?'

జవాబివ్వలేదు బ్రహ్మ.

'అత్తగారి అదృష్ట గీత కూడా తమరి చేతిపైనే...?'

'ష్! అలా అనకు. మా అమ్మగారు అయోనిజగా జన్మిస్తారు. ఆవిడ భాగ్యరేఖ నిర్ణయించేంత వాడినా నేను?'

సరస్వతి మౌనం వహించింది. బ్రహ్మ తిరిగి సృష్టిపై దృష్టి నిలిపాడు.

* * * *

'నారాయణ! నారాయణ!'

'నారదా నీకెన్నిసార్లో చెప్పాను. నా ఆగర్భ శత్రువును నా ఎదుటే స్మరిస్తావా! ఈ రావణుడి పేరు వింటే ఏడేడు పదునాలుగు లోకాలూ దద్దరిల్లిపోతాయి. మా జ్ఞాతులు దేవతలు, యక్ష, కిన్నెర, కింపురుష గంధర్వ దేవయోనులూ, నా నామ స్మరణతో గజగజ వణికిపోతున్నారు. ఈ అఖిల చరాచర జగత్తులో నా ధాటికి ఎదురు లేదు. నా ఆజ్ఞకు తిరుగులేదు. కానీ నువ్వు...'

మధ్యలోనే ఆగిపోయాడు రావణుడు.

పక పక నవ్వాడు నారదుడు.

'అది హేళనా!'

'నారాయణ! నారాయణ! నిన్ను అవహేళన చేస్తానా మనవడా! నా నారాయణ స్మరణతోనే నువ్వు ఉలుకులికి పడుతూంటే నాకు నవ్వొచ్చింది. అందుకు నవ్వాను! అంతే! ఏనుగుకు ఎలుకను చూస్తే భయమంటే వింతగా ఉండదూ! అలాగే రాక్షేశ్వరుడికీ నారాయణ స్మరణ అంటే భయంగా ఉందంటే...'

'భయమా! నాకా! ఏమంటున్నావు నారదా!'

'అవును నీకే. లేకపోతే నారాయణ స్మరణ నీలో...'

'నాలో భయాన్ని కలిగించలేదు దేవర్షీ! శత్రునామ సంకీర్తనం నాలో చికాకును పుట్టిస్తున్నది'

'నారాయణుడు నీకు శత్రువా!'

'ఆహా దేవతలంతా మాకు శత్రువులే కదా! జ్ఞాతిశ్చేదనలేన కిమ్మని కదా సామెత! వారంతా అసురవైరులు! మేం సురవైరులం! మా దృష్టి సృష్ట్యాది నుంచీ ఇంద్రపదవి మీదా- అష్టదిక్పాలుర మీదే! వారికీ అంతే! మేం తపస్సు ప్రారంభిస్తే దాని ఫలితంగా సురాధిపత్యం సాధిస్తామని భయం! అందుకే మా తపస్సుని భగ్నం చేస్తారు. ఈ పగకంతా మూల పురుషుడు ఆ విష్ణువు. మేం విష్ణుద్వేషులం! శివభక్తులం!'

'మీది వైర భక్తి రావణా!'

'నీ సమర్థనపై మాకు విశ్వాసం లేదు. ఎప్పటికయినా వైకుంఠంపై దండెత్తి అతన్ని జయించడమే యీ కైకసిసూనుని జీవిత లక్ష్యం!'

'నువ్వు దిక్పాలురందరినీ పాదాక్రాంతులను చేసుకున్నావు కదా!'

'ఆ దిక్పాలురు, ఆ విష్ణువు - ఆ బ్రహ్మ - మా మహేశ్వరులు నియమిస్తే పదవిని దక్కించుకున్న పిరికి పందలు.'

'ఆ మహేశ్వర భక్తితో అఖిల లోకాధిపత్యం సాధించుకోవచ్చు కదా రావణా!'

'ఇప్పుడు నేనే కదా సర్వలోకాధినేతను'

'మరి త్రిమూర్తులు...'

'పరమేశ్వరుడు మాకు పరమ పూజ్యుడు. బ్రహ్మ... ముక్కు మూసుకుని నాలుగు ముఖాలతో వేదాలు పఠిస్తూ లోకసృష్టి చేసే ఆ విధాతతో మాకు చిక్కులేదు'

'ఉన్నదల్లా మా చేతికి చిక్కక మమ్మల్ని ముప్పు తిప్పలు పెట్టే ఆ నారాయణుడి వల్లనే కదా!'

'అవును...'

'నారాయణ! నారాయణ! పిలిస్తే పలికే ఆ శ్రీహరితోనా మీ వైరం! భక్తజన సులభుడు ఆ వైకుంఠునీతోనా మీ వైరం! రావణా! ఒక్కసారి ఓం నమోనారాయణాయ అంటే...'

'చాలించు నారదా! అసందర్భ ప్రలాపం! వైరి నామ శ్రవణమే మాకు కర్ణకఠోరం... అలాంటిది నువ్వు పనిగట్టుకుని ప్రస్తుతించడం క్షమార్హం కాదు! పితామహ వర్గంలోని వాడివని మన్నించి వదిలేస్తున్నాం. ఇక వచ్చిన పనేమిటో చెప్పి

తక్షణం వెళ్ళిపో. మమ్మల్ని రెచ్చగొట్టి మా కోపానలంలో భస్మం కావద్దు'

'ఈ కనరు- వినరు- మూర్కొనరు- అని ఆంధ్ర దేశంలో అంటూ ఉంటార్లే!'

'ఆ ఆంధ్రులు విశ్వామిత్రుడి సంతతి కదా! తామస గుణంలో తమంతవారే వారూనూ. కదిలిస్తే కత్తి దూస్తారో.. పలకరిస్తే పైబడి కొడతారో అన్నట్లుగా వుంటార్లే!...'

'మళ్ళీ దారి తప్పుతున్నావు దేవర్షీ!'

'నిన్ను దారికి తెచ్చుకోవాలనే ఈ జడదారి తపన!'

'ఊ!'

'ముక్కోటి దేవతలు కట్ట కట్టుకుని వైకుంఠం వెళ్ళిన విషయం నీకెరుకేనా రావణా!'

'అదెప్పటి మాతగ కృతయుగం నాటి మాట ఈ త్రేతా యుగంలో చెపుతున్నట్టు వుంది'

'కాలం విలువ తెలియని వారికి అలాగే ఉంటుందిలే!'

'సరే! ఆ విషయం ప్రహస్థుడి ద్వారా తెలుసు! అయితే?'

'ఆ శ్రీమన్నారాయణుడు నరుడిగా అవతరించి...'

'నా అవతార పరిసమాప్తి చేస్తానని వారికి చెప్పి ఊరట కల్గించాడు సరే! అదీ తెలుసు! అయితే...'

'అతడు దశరథుడి కుమారుడిగా కౌసల్య గర్భవాసాన జన్మించనున్నాడు'

'ఊ!'

'ప్రతి అవతారమూ దుష్ట శిక్షణకూ శిష్ట రక్షణకూ...'

'చాలు... చాలు... మీ దృష్టిలో దుష్టులంటే రాక్షసులు. శిష్టులంటే దేవతలూ... అంతేనా?'

'కానీ ఈ అవతారం నీకోసమేనట రావణా!'

పగలబడి నవ్వాడు రావణుడు.

లంకేశ్వరుడి నవ్వును చూస్తుండిపోయాడు నారదుడు.

నవ్వి నవ్వి అలిసినట్లు ఆగి అన్నాడు రావణుడు 'నాకు నరుల వల్లా, వానరుల వల్లా తప్ప మరెవరి వల్లా మరణం లేదని నీకు తెలీదా నారదా?'

'అందుకే శ్రీమహావిష్ణువు నరుడిగా అవతరిస్తున్నారు'

'నరుడు... హూ! నరులు. దానవ సందర్శన మాత్రాన పై ప్రాణాలు పైనే పోయే పిరికిమానసులు. వారా... సమస్త లోకాలనూ నిజ భుజ బలంతో నిర్ధూమధామం చేయగలిగిన యీ దశకంఠుడ్ని నిర్జించేది.

కలగంటున్నారా మీ దేవతలు నారదా! ఆ వైకుంఠుడు ఒక్క నరుడిగా కాదు. వేలవేల నరులుగా వచ్చినా ఈ పౌలస్త్యుని జయించలేడు. ఆ విషయం మరువద్దు...'

'గత వైభవాన్ని తలుచుకుని ప్రకృతాన్ని మరిచేవాడు అవివేకి రావణా! గతం వేరు. ఇప్పటి విషయం వేరు...'

'హూ! నీకు ఎంత చెప్పినా యీ రావణుడి బలం, బలగం విషయం అవగతం కాదులే! సరే! మీ దేవుడూ నరుడిగా పుట్టబోతున్నాడు. అందుకు దశరథుడు యజ్ఞం చేస్తున్నాడు. ఋష్యశృంగుడు విచ్చేసి పుత్ర కామేష్టి చేయిస్తున్నాడు. నారదా! ఈ విషయాలన్నీ నా చారుల ద్వారా తెలుసుకుంటూనే ఉన్నాను. నీవు యిప్పుడు చెప్పేదేమిటో చెప్పు?'

'శరణాగత వత్సలుడు ఆ శ్రీమన్నారాయణుడు....'

'అయితే ఆ పుట్టబోయే శిశువుని యిప్పటి నుంచే ప్రస్తుతించి శరణం తవ చరణం అని భజన చేయమంటావా?'

'అది అన్ని లోకాలకూ శుభ దాయకం రావణా!'

'అలా కాకపోతే...'

'లంకా నాశనం, రాక్షస సంహారం...'

'కానీ విధికృతం అదే అయితే అలాగే కానీ...'

'కానీ నువ్వు పట్టిన కుందేటికి మూడే కాళ్లంటావు కదా!'

రావణుడు జవాబివ్వలేదు.

'ఇప్పుడు కాకున్నా ఎప్పటికయినా నువ్వు ఆ ఇనకుల తిలకుడి పాదాక్రాంతుడివి కాకపోతే...'

'నారదా!' గర్జించాడు రావణుడు. 'వైరి వీరులను పాదాక్రాంతులను చేయడం తప్ప, శత్రువుల శిరస్సులతో బంతాడటం తప్ప తుచ్ఛప్రాణాల కోసం శాత్రవ పాదాభివందనం ఎరుగడు ఈ రాక్షసేశ్వరుడు'

నారదుడు మళ్ళీ నారాయణ స్మరణం కావించాడు 'నారాయణ! నారాయణ! ఇక నేను పోయి వత్తునా రావణా!'

తర్జనితో దారి చూపుతూ నీదే ఆలస్యం అన్నట్లు చూశాడు రావణుడు.

'తెలియని వారికి తెలియ చెప్పవచ్చు. తెలిసిన వారికి మరింత తెలియ చెప్పవచ్చు. కానీ తెలిసీ తెలియని మూర్ఖులకు తెలియ చెప్పడం ఈ బ్రహ్మ మానస పుత్రుడి తరంకాదు సరికదా! ఆ బ్రహ్మ తరం కూడా కాదు' అంటూ నిష్క్రమించాడు నారదుడు.

అలా వెళుతున్న దేవర్షినే చూస్తూ ఉండిపోయాడు రావణుడు. అతని మనస్సులో ఏవేవో ఆలోచనలు. ఒక్కసారిగా ఆలోచనలను పారద్రోలి... శివస్తుతి చేయసాగాడు రావణుడు.

శివనామ స్మరణతో అతని మనసు క్రమ క్రమంగా శాంతి చెందసాగింది. తిరిగి ఎప్పటిలాగే తన స్థిర చిత్తంతో పంచాక్షరి మంత్రం జప పరాయణుడయ్యాడు రావణుడు.

## 28

ఇంద్రుడు మందాకినిలో ఇంద్రాణితో విహరించి వచ్చాక శచీదేవి తన అంతఃపురం వైపు నడిచాక ఇంద్రుడొక్కడే తన భవనంలో ఒంటరిగా ఉన్న వేళ- ఇంద్రసఖి అక్కడికి మలయ మారుతంలా విచ్చేసింది.

ఇంద్రసఖిని చూడగానే ఇంద్రుడికి ఉద్వేగం ఎక్కువైంది. ఏమేమో అడగాలని అనుకున్నాడు. కానీ ఆగలేక ఆపలేని తమకంలో తన మనసంతా ఆమె ముందు విప్పి అహల్యా సందర్శనానికి ఏర్పాటు చేయమని అడగాలనుకున్నాడు.

మదిలో మెదిలే అన్ని ఆలోచనలూ ఒక దానిని ఒకటి తొందరించి ఏమీ అడగలేకపోయాడు.

'ప్రభూ! వినయ విధేయతా పూర్వకంగా పిలిచింది ఇంద్రజ. ఏమిటన్నట్లు తలాడించాడు ముల్లోకాల ఏలిక.

'ప్రభూ తమరిక్కడ యిలా విరహంతో వేగిపోతూ ఉండండి. అక్కడ కాలం గడిచిపోతూ ఉంటుంది. కాల ప్రవాహంలో కొట్టుకునిపోయే ఆ మానవులు మానవ సహజమైన మరుపుతో అన్నీ మర్చిపోతారు.

అక్కడి ఆచారం ప్రకారం పెళ్ళయిన యువతికి అత్తవారిల్లే స్వర్గం. తమరు స్వర్గానికి రప్పించుకుందామనుకున్నా, స్వర్గ సుఖాలు అందిస్తామనీ ఉవ్విళ్ళూరించినా అవన్నీ అడవి కాచిన వెన్నెలే అయిపోతాయి.

బ్రహ్మ కూర్చిన భర్తతో, బ్రహ్మ రాసిన బ్రతుకుతో సర్దుకునిపోయే ఆ స్త్రీలు సర్వం పతిదేవుడే అనుకుంటారు. పతియే ప్రత్యక్ష దైవం. కన్నవారికన్నా కట్టుకున్నవారే మిన్న. అతనితో జీవితమే కైవల్యం. అదే వైకుంఠం. ఆ ఇల్లే కైలాసం. సర్వం సంసారమే అనుకుంటారు వాళ్ళు. అది వారి ధర్మం. అది వారి నీతి. అది వారి నియమం. ఈ లోకానికీ ఆ లోకానికీ నక్కకూ నాగలోకానికీ ఉన్నంత వ్యత్యాసం ఉంది. అందుకు వారిని తప్పుపట్టనవసరం లేదు. అది వారి జీవన రీతి'

ఇంద్రుడు నిట్టూర్చాడు. లోక లోకానికీ ఒక నీతి ఉంటుంది. ఏ లోకం జీవన శైలి ఆ లోకానిది. ఒక దానితో మరొక దానికి పోలికేమిటి? స్వర్గలోక జీవన విధానం కైలాసంలో ఉంటుందా? అక్కడ కట్టే వస్త్రాలూ, తాగే అమృతం, ధరించే నగలూ...

అక్కడ రమ్మంటే ఎలా వస్తాయి? కైలాసంలో విభూది వారికి విభూతి. అదే వారికి ఐశ్వర్యం. ఆ శివుడికి పాములే ఆభరణాలు. యముడి సామ్రాజ్యం గురించి అనుకోవడం ఎందుకూ?

స్వర్గంలో కేరింతలు వినిపిస్తూ ఉంటాయి. నరకంలో ఎప్పుడూ అక్కడ హాహాకారాలు! ఆక్రోశాలూ! ఆక్రందనలూ! శోకాలూ!

మరి భూలోకం విషయాలే వేరు. ఇంద్రుడి మనస్సులో తారాడుతున్న అభిప్రాయాలను పరేంగితజ్ఞలా కనుగొన్నదా అన్నట్లు అంది ఇంద్రసఖి.

'అవును ప్రభూ! భూలోకంలో విషయాలే వేరు. వారి జీవిత కాలం పరిమితం. బాల్యం, యవ్వనం, కౌమారం, వార్ధక్యం వారి జీవితాలను పాలించి చివరికి వారిని మృత్యువు నోట నెడతాయి.

మనం అలా కాదు. మనం త్రిదశులం. మనం ఎప్పుడూ ముప్పది ఏండ్ల వయసులోనే ఉంటాం.

మనకు అమృతపానం వలన వార్ధక్యం లేదు. మరణం లేదు. జరణమరణ బాధలననుభవించే మానవులు వారేది అనుభవించినా ఆనందించినా ఆ వృద్ధాప్యం వారిని ఆక్రమించుకుని, శరీరాన్ని లొంగదీసుకునే దాకానే.

ఆ జర ప్రాప్తిస్తే యింకేం ఉంది? నవ యవ్వనంతో మిసమిసలతో అంగాంగపు పొంగులతో అలరించిన సౌందర్యం కాస్తా తొలగిపోతుంది. కేశ సంపద తన వైభవం కోల్పోయి ఫలితమవుతుంది. అంతవరకూ అందాన్నిచ్చిన అందాల పలు వరుస జారి భ్రష్టమై ఊడిపోయి నోరు బోసి నోరవుతుంది. యవ్వన సంపద తన ప్రాధఌు కోల్పోయి మెత్తబారి జారి- ముడతలు పడుతుంది. నడుం వంగిపోతుంది. మందగమనంతో మందగించిన నడక ఇక శాశ్వతంగా మందగించి కుంటుబడుతుంది. ఊతలేనిదే నడవలేని స్థితి వస్తుంది.

మిల మిల మెరిసే కనులలో కాంతి నశించిపోతుంది. చూపు తగ్గిపోయి అంధత్వం సంక్రమిస్తుంది. నిరాశా నిస్పృహలకు లోనై- నిరాదరణ పాలై- మరణం కోసం నిరీక్షిస్తారు సామాన్య జనం' ఆగింది ఇంద్రజ.

అదంతా వినగానే ఇంద్రుడుకి మనస్సంతా చేదు తిన్నట్లయింది. అమృతం తాగిన నోట హాలాహలం చిందినట్లయింది. భూలోక జీవనం ఇలా ఉంటుందా? అప్పుడెప్పుడో యుగ యుగాల లక్షణాలు చెపుతూ కలియుగ లక్షణాలను వర్ణించారు మహర్షి. అంత భయంకరంగా ఉంది ఈ వర్ణన.

తన వలపుల ఏలిక అహల్య... ఆ అహల్య కూడా భూలోక వాసిని. ఆమెకు ఈ లక్షణాలన్నీ వర్తిస్తాయా? ఆమె గౌతమ పత్ని. ఋషి పత్నిగా ఆశ్రమ జీవనం గడుపుతోంది. ఆమెకూ ఈ లక్షణాలూ తప్పవా?

ఆమె బ్రహ్మ ఏరి కోరి సృష్టించిన యువతి! ఆయన చేత కన్యగా వరం పొందిన సౌభాగ్యవతి.

ఆమెకూ యీ లక్షణాలన్నీ వచ్చేస్తాయా? ఆమె కూడా ముదిమితో బాధపడుతుందా? ఊహూ!

ఆ ఊహే చేదుగా ఉంది. ఆ భావనే విషతుల్యంగా ఉంది. తల విదిలించాడు ఇంద్రుడు.

'సఖీ!' పిలిచాడు ఆర్ధ్రంగా.

'ప్రభూ! ఆ పిలుపుకి నోచిన వారు వేరే ఉన్నారు' చప్పున అంది ఇంద్రసఖి.

'నన్ను త్వరపెడుతున్నావే దూతీ!'

'కాలం ఎవరికోసమూ ఆగదు ప్రభూ! నిరీక్షణలో సంవత్సరాలు గడిచిపోతున్నాయి'

'మేం విరహంతో వేగిపోతున్నామే!'

'నాకు అలా అనిపించడం లేదు ప్రభూ! క్షమించండి. ప్రభువ్వారిచ్చిన చనువుతో ఇంత మాట అనగలిగాను. అందుకు నన్ను శపించినా యీ పైలోకం నుంచి కింది లోకానికి నెట్టి వేసినా ఆనందంతో అంగీకరిస్తాను. కానీ ప్రభువులు తమకి తాము ఎంతటి ఆనందాన్ని దూరం చేసుకుంటున్నారో గ్రహిస్తే చాలు!'

'చాలు! చాలు! ఇక మేం బయలుదేరుతున్నాం!'

'ఆగండి ప్రభూ! లేడికి లేచిందే పరుగని ఆ ఆంధ్ర దేశంలో అంటారని అహల్యాదేవి చెప్పింది. తమరిలా ఆఘమేఘాల మీద బయలుదేరి వెళితే అక్కడ ఆశ్రమంలో ఆమె ఎలా ఉందో. ఆమె స్థితి ఏమిటో! గతి ఏమిటో! వారి కాలమానం ప్రకారం నేను వెళ్ళివచ్చి ఎన్నేళ్ళయిందో! ఏయే సంఘటనలు జరిగాయో ఏమో. ఇవన్నీ తమరు లెక్కించకుండా వెళితే...'

'అవునవును! కొన్నింటికి సుముఖం కాదు. రాయబారమే రమణీయం. సరే! నువ్వు వెళ్ళి రా... నీవిటు రాగానే నీ ద్వారా విషయాలు తెలుసుకోగానే నేను బయలుదేరి వెళ్ళి- ఆమె ముంగిట ఆమె పాదాల చెంత వాలతాను. సరేనా!'

'ఆశ్రయానికి చరణాలే శరణం ప్రభూ!' అంటూ నవ్వి అదృశ్యమైంది ఇంద్రసఖి.

## 29

గౌతమమహర్షి ఏకాంతంలో ఏదో ఆలోచిస్తున్నారు. అహల్య ఒంటరిగా శాక పాక సముపార్జనలో నిమగ్నమయింది.

ఆమెకు మొన్ననే అంజన గురించిన కొంత వర్తమానం అందింది.

కూతురి ముచ్చట చూసి రావాలనే సామాన్యమైన కోరిక ఆమె మదిలో మెదిలినా, నిత్య సత్రయాగంలా సాగుతుంటే విద్యాదానం- అన్నదానం కార్యక్రమంలో ఆమెకి ఆశ్రమం వదిలి కాలు కదిపే అవకాశమే లేదు.

అటు అతిథి అభ్యాగతుల సేవ, ఇటు విద్యార్థులకు తగిన సదుపాయాలు- వాటి మధ్య తన జపం- తన తపం- తన అధ్యయనం- ఆమె ఇటీవలనే న్యాయ సూత్రాలను నేర్వడం ప్రారంభించి అదో లోకమైపోయిందామెకు. పనిలో ఉన్నా, పాటులో ఉన్నా ఆమె శాస్త్రాన్ని మననం చేస్తూనే ఉంటుంది. ఇప్పుడూ అంతే! మంచి మంచి కూరలు ఏరుతూ ఉన్నా మదిలో మననం సాగుతూనే ఉంటుంది.

'ఎలా ఉన్నావు అహల్యా!'

ఎలుపు విని చప్పున తలతిప్పి చూసింది అహల్య.

ఇంద్రజ! ఆమెను చూడగానే అహల్యలో రెండు భావాలు మేము మేము అంటూ తొందరించి గుండెను ఊపేశాయి.

ఒకటి- ఎన్నాళ్లకెన్నాళ్ళకు ఆమెను చూశాననేది. మరోటి- ఇన్నేళ్ళుగా తానెందుకిటు తొంగి చూడ లేదని.

ఆ రెండు భావాలను చదివేసిందానిలా అంది ఇంద్రజ 'ఏమ్మా కోపమా! ఇన్నేళ్ళూ ఏమయ్యానని, ఎందుకు రాలేదని కోపమా! చెప్పాగా! మేం అనిమిషులం. మా నిముషాలు మీకు రోజులో మాసాలో, మాకూ మీకూ లెక్క కుదరదు. మీ సంవత్సరం మీ పితృ దేవతలకే ఒక పగలు, మా లెక్కకెక్కడ కుదురుతుంది?'

అహల్య అదోలా చూసింది. చూసి చూసి యిలా అంది నిష్ఠూరంగా 'నీవు ఇప్పుడే చెప్పావుగా! పితృ దేవతలకొక లెక్క ఉంటుందని. అలాగే మీ లోకంలో మీ లెక్క కూడా! ఆ పద్ధతిలో అయినా నన్ను చూసి పలకరించి ఎంతో కాలమయిందని అనిపించలేదు కదూ! గగనానికీ యిలకూ బహుదూరం అనిపించిందా? మనస్సుండాలే గానీ మార్గం ఉండదా?'

పక పక నవ్వింది ఇంద్రసఖి. నవ్వుతూ నవ్వుతూ ఆమె అహల్య వద్దకు వచ్చింది. సమీపంలో చూసి అహల్య అందానికి ఆశ్చర్యపోయింది. బ్రహ్మ సృష్టించడం- తమ సత్యలోకంలో- కాబట్టి ఈమెకు దేవ కాంతల లక్షణాలు వచ్చాయా! అనుకుంది.

'ఏమిటలా చూస్తున్నావ్!'

'నిన్నే! నీ అందాన్నే! నీ మేని సోయగాలనే! నీ మేని మెరుపునే! నీ కనుతుదల విరిసే విరుపునే! నీ పెదవిపై కదలాడే నవ్వునే! ఆ అరక్షణంలో కనిపించీ కనిపించకుండా మిలమిలలాడే నీ పలువరుస!'

'చాలు చాల్లేవమ్మ! అంత దూరం నుంచి పనిగట్టుకుని వచ్చింది నన్నూ నా అందాన్నీ పొగిడేందుకేనా!'

'మరింకెందుకనుకున్నావు?' నవ్వుతూ అంది ఇంద్రసఖి.

'ఇంకేంపనీ లేదా ఇక్కడ?'

'వచ్చిందే నిన్ను చూడాలని. నీతో ముచ్చటించాలని. ఏళ్ల కొద్దీ దప్పిగొన్నవాడు ఎంత పిపాస ఉన్నా సరే ఏటి నీరంతా తాగలేడు కదా! మీ లోకంలో అయినా ఎంత ఆకలిగా ఉన్నా రెండు చేతులతో భుజించలేడు కదా! ఎంత గుండె నిండుగా కోరిక ఉన్నా దానికీ పరిమితి ఉంటుంది కదా! అది తీరేదాకా ఇంతే!'

'అంత కోరిక ఉంటే యింత ఆలస్యం దేనికీ?' సూటిగా అడిగింది అహల్య.

ఆ ప్రశ్నకి ఉలిక్కిపడింది ఇంద్రసఖి. ఇదే ప్రశ్న తనను కాక తన ప్రభువునే నిలదీసి ప్రశ్నించినట్లు అనిపించింది.

అవును, ఏం జవాబు చెప్పగలదు?

'మాకంటే యీ లోకంలో ఎన్నో కార్యాలు. మేం ఆశ్రమ వాసులం. ప్రతీదీ సంతరించుకోవాలి. యజ్ఞమో! యాగమో! తలపెడితే సమీప రాజ్యాన్నేలే రాజులను ఆశ్రయించి అవసరమైనవన్నీ తెచ్చుకోవాలి. ఒక్క జప తపాలు మాత్రం మా ఇష్టం. వాటికి ఎవరినీ ఆశ్రయించనక్కర్లేదు. ఏ వేళకేది లభిస్తే దాన్నే తింటూ జీవిస్తాం. ఏ నార చీరలో ధరిస్తాం. కాబట్టి వాటికోసం ఎవరినీ యాచించనక్కర్లేదు.

మిగతా దేనికయినా నేలనేలే రాజుల్ని ఆశ్రయించవలసిందే కదా! మీకా అవసరం ఏముంది! అమృతం తాగినవాళ్ళు కదా! అన్నపానాల అవసరం లేదు. అలాగే వస్త్రధారణ. నగలు- ఇంకేం ఉంది. నిత్యం నృత్య గాన వినోదాలలో తేలియాడటమే కదా!

మరి కొంపలు మునిగే రాచకార్యాలేవో ఉన్నట్లు చెపుతున్నావే? మనస్సుంటే మార్గం ఉండదా! పైగా నీవు కామచారివి. సంకల్ప మాత్రంగా అక్కడినుంచి ఇక్కడికి రాగలవు. మాకు అలా కాదు కదా!'

అహల్య అలా అడగ్గానే- ఇంద్రసఖి క్షణంపాటు విభ్రాంతికి లోనయ్యింది. అయినా దేవకాంత కాబట్టి అనిమేషత్వం సహజం కాబట్టి అహల్య ఆ విషయం గుర్తించలేదు.

గలగలా పారే సెలయేరులా నవ్వింది ఇంద్రసఖి 'అహల్యా! నా నివాసం ఇంద్రలోకం. సత్యలోకం కాదు వైకుంఠమూ కాదు. ఈ రాక్షసులున్నారే వీళ్లంతా విష్ణుద్వేషులు! వైకుంఠం వారికి గిట్టదు. విష్ణువు పేరును కానీ, ఆయన పేరుకి పర్యాయ పదం కానీ పలకరు. పలికితే సహించరు. నిజానికి వాళ్ళ బద్ధశత్రువు విష్ణువే అయినా వాళ్లు దండెత్తేది ఇంద్రుడి పైకి. జయించేది ఇంద్ర లోకాన్ని. పారద్రోలేది అక్కడి సుర రాజును, దేవతలను! వాళ్ళు వైకుంఠం పైకి దండెత్తరు. విష్ణువుకి ఎవరు ప్రీతికరమో, వాళ్ళపైకి దండెత్తుతారు. నిజమే అనిపిస్తుంది. నిన్ను బాధించేకన్నా నీకు

అత్యంత ప్రీతిపాత్రమైన వాళ్లను బాధిస్తే నీవు పడే బాధ ఎక్కువ! తల్లిని కొడితే ఆ తల్లి పడే బాధకన్నా ఆ తల్లి కన్న సంతానాన్ని కొడితే ఆ తల్లి పడే బాధ పదింతలు! వందరెట్లు! వెయ్యింతలు! సహస్రాధికమైన ఆ బాధని గుణించలేం! అలాగే ఇదీనూ.

పేరుకి స్వర్గం అనీ- స్వర్గ సుఖం అని భ్రమే గానీ, అక్కడ అనుక్షణం భయమే! మా సుర రాజుకు ఏ లోకంలో ఎవరు తపస్సు ప్రారంభించినా భయమే! ఆ తపో బలంతో- ఆ తపస్సులకు మెచ్చి ముందూ వెనుకా ఆలోచించకుండా శివుడో బ్రహ్మో ఇచ్చే వరాలకు అడ్డూ అదుపూ లేకుండా రాక్షసులు ఎక్కడ తన పదవిని ఆక్రమిస్తారో, ఎక్కడ తన లోకాన్ని కొల్లగొడతారోనని ఎప్పుడూ భయమే!

ఇక ఇప్పుడు చెప్పు. మేం సుఖంగా ఉన్నామా? నువ్వన్నట్లు అమృతం తాగుతూ అచ్చెర మచ్చెకంటుల ఆట పాటలతో వినోదిస్తూ ఎల్లకాలం గడుపుతూ ఉంటామా?'

ఇంద్రసఖి మాటలకు అహల్య నవ్వేసింది.

'ఏమ్మా! నా మాటలు నవ్వులాటగా ఉన్నాయా?'

'ఊహూ! యిక్కడ అనుకుంటూ ఉంటారులే! ఎంత చెట్టుకు అంతగాలి అని. రాక్షస బాధ మాకే కాదు. మీకూ ఉంది. మామూలు నరులకే కాదు. మునులకు కూడా ఉందిక్కడ! మా తపస్సు మా జపం మా యజ్ఞ యాగాదులు భంగపరుస్తూ ఉంటారు! ఏదో ఒక రోజున రాక్షస బాధ తొలగిపోతుందని మేము ఆశతో జీవిస్తూ ఉంటాం.

మేమూ అంతే! బలిసిపోయి ప్రబలిపోయి దుర్మార్గం పండిపోయిన నాడు శ్రీమన్నారాయణుడే వాడ్ని హతమారుస్తాడులే అనే ఆశతో ఉంటాం. సరే! స్వర్గానికి వెళ్ళినా సవతి పోరు తప్పలేదన్నట్లు మీ స్వర్గంలోనూ యిలాంటి బాధలే ఉన్నాయన్న విషయం ఒప్పుకుంటాను. కానీ విశేషాలేమయినా ఉంటే చెప్పరాదూ!'

'ఒకటే విశేషం! రావణ సంహారానికి రాఘవుడిగా అవతరిస్తాడట ఆ వైకుంఠవాసి!'

'ఇక్కడా అలాంటి వార్తలే వినవస్తున్నాయి. విభాండక మహర్షుల వారి పుత్రుడు ఋష్యశృంగ మహర్షుల వారు దశరథ మహారాజుల వారితో పుత్రకామేష్టి చేయిస్తారనీ- ఆ యాగఫలంగా ఆ దేవదేవుడు అవతరిస్తాడనీ అనుకుంటున్నారు. ఇంకా ముహూర్తాలు నిర్ణయించలేదట!'

'కాలం కలిసిరావాలిగా దేనికయినా!'

'అవునవును!'

'దేనికయినా సమయం సందర్భం కలిసిరావాలిగా!'

'అవునవును!'

'దేనికయినా అదృష్టం ఉండాలిగా!'

'అవునవును!'

'అదృష్టం ఉండాలి అనడానికి మీ దాంపత్యమే గొప్ప ఉదాహరణ!'

తెల్లబోయి చూసింది అహల్య 'అదేమిటీ? అవతార విషయాల నుంచి అదృష్టరేఖల ప్రస్తావన నుంచి మా దాంపత్య విషయాలకి దూకేశావేమిటీ?'

'ప్రబల ఉదాహరణ కాదూ మీ జీవితం! నీ పుట్టుకకి మూల కారణం మా దేవరాజు. నిన్ను ఇంత అందాల సుందరిగా ఆ బ్రహ్మ రూపు దిద్దడానికి హేతువు మా త్రిలోకాధిపతి అయినా పందెంలోనూ ప్రధముడుగా వచ్చినా అదృష్టం మహర్షి గౌతముల సొత్తుగా ఉంది. కాబట్టి ఈ జగదేక సుందరి మా సుర రాజుకు దక్కలేదు. ఆయన సురాధిపత్యం, ఇంద్రలోక పాలన అన్నీ ఈ జడదారి అదృష్టం ముందు తేలిపోయాయి. అండపిండ బ్రహ్మాండాలు పట్టనంత అధికారంకన్నా ఆవగింజంత అదృష్టం మిన్న అని ఋజువు చేశాయి'

అహల్య ఏమీ అనలేకపోయింది.

'ఆనాటి నుంచీ మా దేవనాధుడు తన దురదృష్టానికి వగచని క్షణం లేదు.'

ఆ మాట విని అహల్య తెల్లబోయింది.

'నీ యీ అడవి కాపురాన్ని తలుచుకుని విచారించని క్షణం లేదు'

'ఇంద్రసఖీ!'

'నన్ను చెప్పనీవమ్మా తల్లీ!'

ఆమె మాటలు సాగనివ్వ లేదు అహల్య 'వద్దు! కులకాంతల ముందు పర పురుషుల ప్రసక్తీ! ఆ పర పురుషుడు ఈ కుల కాంతల గురించి చేసే ప్రస్తావనా కూడనివే- ఆ విషయం వదిలేయ్!'

'ఏవమ్మా! మీరు భూలోక వాసులేనా?' నిష్టూరంగా అడిగింది ఇంద్రసఖి.

ఆ ప్రశ్నకి ఆశ్చర్యపడి 'అదేం ప్రశ్న?' అంది అహల్య.

'మీకేదయినా రాక్షస బాధో, మరేదో కలిగితే మీమీ రాజులకి చెప్పుకోరా? వారు వచ్చి తీర్చరా?'

'ఊ!'

'ఆ రాజులు అప్పుడప్పుడూ మీ ఆశ్రమాలకి వచ్చి మిమ్మల్ని దర్శించుకుని మీ యోగక్షేమాలు విచారించుకోరా?'

'ఈ అజనాభదేశంలో ఎన్నో రాజ్యాలున్నాయి. కోసల దేశం మీది! మీ సమీప దేశం మిథిల. అలాగే ఎన్నెన్నో రాజ్యాలు. ఇది భూలోకం. ఇలాంటి లోకాలు స్వర్గ మర్త్య పాతాళాలకు ప్రభువు మా ఏలిక. ఆయన ఏలుబడిలోని వాళ్ళు మీరు. ఆయన మీ యోగ క్షేమాలు విచారిస్తే తప్పా?'

అహల్య మాట్లాడలేదు. కొద్దిసేపు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

'మా ప్రభువే- తానే స్వయంగా వచ్చి నీ కాపురం ఎలా ఉందో విచారించి వెళ్ళాలని కుతూహల పడ్డాడు. నేనే ఆపాను'

చప్పున ఇంద్రసఖి ముఖంలోకి చూసింది అహల్య.

'సరే! నే వెళ్ళి వస్తానమ్మా! నేనక్కడ ఉండకపోతే ఆయనకి క్షణం తోచదు. శచీదేవమ్మకి అసలే తోచదు' అంది ఇంద్రసఖి.

'అప్పుడేనా!' ఏదో కొరత కలిగినట్లుగా అంది.

'ఇప్పుడు వెళ్ళి మళ్ళీ ఎప్పుడంటే అప్పుడు, మళ్ళీ మళ్ళీ వచ్చిపోతుంటానులేవమ్మా! లేదా మా ప్రభువులే వచ్చి పలకరించి వెళతారు!'

'దే... వ... నా... ధు... లా?'

'ఊ!' అంటూ అదృశ్యమైంది ఇంద్రసఖి.

అహల్య అలాగే నిలుచుండిపోయింది.

* * * *

గౌతమాశ్రమంలో అదృశ్యమైన ఇంద్రసఖి స్వర్గం చేరుకోగానే తన ప్రభువు సన్నిధికి కదిలింది. దారివెంట ఎవరెదురుపడినా పలుకరించలేదు. సాటి చెలిమికత్తెలు ఎదురయి చిరునవ్వు చిందిస్తే తిరిగి చిరునగవుతో మన్నించి ముందుకు సాగింది. ద్వార పాలకులను మందస్మితంతో మన్నించింది.

అలా సాగి సాగి...

తన ప్రభువు సన్నిధికి చేరి వినయంతో నమస్కరించింది.

మహేంద్రుడు సింహాసనం లాంటి పీఠంపై అలవోకగా ఆశీనుడై విశ్రాంతిననుభవిస్తున్న వాడల్లా- ఆమెను చూడగానే నడుం నిక్కించి కూర్చుని- కనులలో కాంక్ష అంతా ప్రతిబింబించేలా చూశాడు.

'ప్రభూ! తొలకరి చినికింది! నేల పదునయింది! ఇక తమరు వెళ్ళి వలపుని విత్తడమే తరువాయి! అది తక్షణమే మొలకెత్తి ననలు సాగి తీగలుగా సాగి పూచి ఫలిస్తుంది. అహల్యాదేవి తమరు తననెలా తలుచుకుంటున్నారో తెలుసుకున్నది'

ఒక్కొక్క పదంలోని ఒక్కొక్క అక్షరం మన్మథుడి పదునైన బాణంలా దేవేంద్రుడి మనస్సులో నాటింది.

ఆయన నోట మాట రాలేదు.

కళ్లలో కాంక్షతో పాటు ఆనందాన్ని వర్షించాయి.

'ప్రభూ! తమరు ఒళ్లంతా కళ్ళు చేసుకుని చూసినా అహల్యాదేవి అందం చూడటంలో తమకు తమకం తీరదు. తనివి ఉండదు'

'భళా!' అన్నట్లు చూశాడు మహేంద్రుడు. చప్పున పీఠం నుంచి లేచాడు దేవేంద్రుడు.

వెళ్ళి రండన్నట్లు తల వంచి నమస్కరించింది ఇంద్రసఖి.

ఇంద్రుడు అక్కడ మాయమయ్యాడు.

## 30

అహల్య ఒంటరిగా అలాగే నిలుచుంది.

ఇంద్రసఖి అదృశ్యం కాగానే ఆమె మనసు చలనం కోల్పోయినట్లుగా అయింది.

ఏమీ తోచని స్థితిలో కొంతసేపు నిలబడి ఆపై - మనస్సుని నిగ్రహించుకుంది.

ఏ ఆలోచనలూ లేని మనస్సుతో కుటీరం వైపు నడిచింది.

'అహల్యా!'

పిలుపు విని ఆగిపోయిందామె. వెనుతిరిగి చూసింది.

గౌతములు!

మూర్తీభవించిన శాంతంలాగ, రూపు కట్టిన తపస్సు లాగ, అవతరించిన న్యాయం లాగ, పరిపూర్ణ మానవుడి లాగ, ధీర ప్రశాంత గంభీరతలు ఆకారం దాల్చినట్లుగా...

'అహల్యా!'

'చెప్పండి!; అన్నట్లుగా చూసింది అహల్య.

'ఇప్పుడే జపం ముగించాను. ఆ జపం చేస్తూండగా ఏదో మాయ కమ్మినట్లు అయింది. ఆ మాయ మైకంలా అనిపించింది. మాగన్నుగా నిద్ర వచ్చినట్లయింది'

జప వేళలో నిద్ర వచ్చినట్లు అనిపించడం సామాన్య ధర్మమే! గ్రంథ పరిశీలనలో, జప సమయంలో అలా జరగడం మామూలే! కానీ ఆ సమయంలో ఎన్నడూ కలలు రావు?

ఆయనకు కలలే రావు. అలాంటిది ఆ కొద్దిపాటి సమయంలో వచ్చిన కలలో కలతపడే విషయం కనిపించింది. కలతే రావు. వాటి వల్ల ఎన్నడూ మనస్సు కలత చెందలేదు. కానీ విచిత్రం!

'నేడు కల లాంటిది వచ్చింది. కలతా కలిగింది!'

ఆయన మాటలు విని అహల్య ఆందోళన చెందింది.

'ఏమిటి స్వామీ అది! ఎప్పుడూ ప్రశాంత చిత్తంతో ఉండే మీరు కలత చెందడమా!' అంది ఆందోళనగా.

చిరునవ్వు నవ్వారు గౌతములు.

'అదంతా కల- కలత ప్రభావం. క్షణికం మాత్రమే! దాన్ని గురించి ఆలోచించి చింతించడం లేదు. దానికి పరిహారం మాత్రం ఆలోచించాను'

'కలేమిటి స్వామీ!'

'ఎవరో ఓ దివ్యుడు దివి నుంచి భువికి దిగివచ్చి మన ఆశ్రమ సమీపంలోని నదిలో మునిగి స్నానాలు చేశాడట! అతని మైలతో ప్రవాహం మకిలి అయిందట! అది పారి నేలను తడిపిందట! అంతటా మైల వ్యాపించిందట! అది పైరుగా ఫలించి విష ఫలాలు ఇచ్చిందట! అంతలో కల చెదిరింది మనస్సు కలత చెందింది' ఆగాడు గౌతమమహర్షి.

అహల్య మనస్సు ఆందోళన చెందింది.

'దీనికి పరిహారం ఆలోచించాను'

'ఏమిటి స్వామీ!'

'అఘమర్షణ స్నానం'

'అంటే!'

'సర్వమనఃపాప ప్రాయశ్చిత్తం కోసం చేసే సంకల్ప స్నానం. ఆపై సువాసినీ పూజ. ఆర్షజన పాద పూజ'

'చిత్తం!'

'దీనికి సంకల్పించి శిష్యులతో పరిసర ఆశ్రమ వాసులైన మౌనులనూ, ఋషులనూ, వారి వారి పత్నులనూ మన ఆశ్రమానికి ఆహ్వానించమని చెప్పి పంపాను'

'వారి రాక ఎప్పుడు'

'రేపు పౌర్ణమి నాడు!'

'అఘమార్షణ స్నానాదులు'

'నేటి నుంచే దీక్ష... మనం నదికి వెళ్ళి స్నానాలు చేసి సంకల్పిద్దాం'

తలూపిందామె.

'అన్నిటికీ శిష్యులకు ఆజ్ఞలు చేశాను'

తలూపింది మళ్ళీ.

'ఆశ్రమాన్ని సంప్రోక్షిస్తాను'

తలూపింది.

'దీనికి హేతువేమో నా దృష్టికి అందడం లేదు. దివ్య దృష్టిని వ్యర్థం చేయడం నాకిష్టం లేదు' అన్నారాయన.

అహల్య ఏమీ అనలేదు.

గౌతములు యింకేమీ అనకుండా కదిలారు.

గౌతముల ఆదేశం మేరకు ఆశ్రమమంతా పుణ్యాహవచనంతో పవిత్రమైంది. గౌతములు, అహల్య కొంగు ముళ్ళు వేసుకుని ముక్తి స్నానం చేసి వచ్చారు. ఆశ్రమంలో ఓ వితర్ధికపై కూర్చుని జపంలో మునిగిపోయారు.

అహల్య ఒంటరిగా కుటీరంలో కుశాసనంపై శయనించి ఉంది. హఠాత్తుగా ఇంద్ర చాపం మెరిసినట్లయింది. వేళ గాని వేళ మెరుపు మెరవగానే అహల్య ఉలికిపడి కళ్ళు తెరిచింది. క్షణ కాలం దిగ్భ్రాంతి...

కుటీరం అంతా పరిశీలనగా చూసింది. ఏమీ కనిపించలేదు. ఏదో తెలియని ఆందోళనలో మునిగి పోయింది.

'అహల్యా!'

మృదువుగా వినిపించింది పిలుపు. వలపు బరువుని మోస్తున్నట్లుగా- తలపు తెలుపు పిలుపులాగా వినిపించింది.

అహల్య అటూ ఇటూ చూసింది. ద్వారం వైపు చూసింది. ఎవరూ లేరు. ఎవరూ లేకుండా పిలుపెలా వినిపించింది? అహల్యలో ఆందోళన స్థానంలో భయం చోటు చేసుకుంది. బెదిరిన లేడికళ్ళలా కనులు చలిస్తున్నాయి.

'అహల్యా!'

మళ్ళీ వినిపించిందా పిలుపు.

'ఎవరు! ఎవరు మీరు? కనిపించకుండా వినిపించేది ఎవరు? ఎందుకిలా నన్ను భయపెడుతున్నారు?' అంది అహల్య.

'భయపడకు అహల్యా! నేను నీ శత్రువును కాను. నీవు కావలసిన వాడినే! నీకు కావాసిన వాడినే!'

జవాబుగా చల్లగా మెల్లగా చెవి వద్ద వినిపించింది.

మరీ భయపడి తలతిప్పి చూసిందామె. ఏముంది? శూన్యం... ఎవరూ లేరు. ఏమిటిది? తను భ్రమలో ఉందా? మనస్సు చెదిరిందా! ఎన్నడూ లేనిది ఏమిటీ ఈ వేళ...

'అహల్యా! జగదేక సుందరీ!'

తర తర లాడింది అహల్య.

'దయ చేసి కనిపించండి! కనిపించకుండా వినిపిస్తూ ఉంటే కలతగా ఉంది. భయంగా ఉంది. పవిత్రమైన మా ఈ ఆశ్రమంలో భూతమో! ప్రేతమో! పిశాచమో! ప్రవేశించిందా అని అనుమానం కలుగుతోంది. ఇదంతా నిజమా! భ్రమా!'

మృదువుగా నవ్వినట్లు వినిపించింది అహల్యకు.

'భయపడకు. ఇది భూత ప్రేత పిశాచ వాణి కాదు వాణీపతి ముద్దుల బిడ్డా! నేను నీ వాడినే...'

'పాపము శమించుగాక! నా వారు శ్రీవారు శ్రీ గౌతమ మునీంద్రులు. నువ్వెవడవో రాక్షసుడివి...!'

'రాక్షసుడిని కాను. రాక్షసులు నాకు కాని వారు'

'రాక్షస వైరి తప్పక దేవతా స్వరూపుడే కావాలి. దివి నుంచి భువికి దిగివచ్చిన దేవతలు మానవులతో ఇలా చెరలాడవచ్చా? దయ ఉంటే అనుగ్రహించాలి లేదా...'

'నీ దయ కోసం వచ్చిన వాడికి నిన్ను దయ చూసే శక్తి ఎక్కడిది అహల్యా! జగదేక సుందరీ! హిరణ్యగర్భుని మానస పుత్రికా! భయం విడనాడి నన్ను పలుకరించు!'

మనిషి కనిపించడం లేదు. కానీ మాట వినిపిస్తోంది. అడిగిన వాటికి సమాధానం లభిస్తోంది. మాటలో మృదుత్వం ఉంది. ఆప్యాయతా ఉంది. దానితో అహల్య మనసులో తొందర తగ్గింది. ఆందోళన తగ్గింది. మౌనం వహించింది.

ఆ ప్రశ్నకు జవాబు లేదన్నట్లు 'అహల్యా!' మళ్ళీ ఆర్తి. అంతా మూడక్షరాలైనట్లుగా పిలుపు. ఎదురుగా ఉంటే జవాబుగా ముఖం చూడవచ్చు. పక్కగా ఉంటే అటు తల తిప్పొచ్చు.

వెనుకగా ఉంటే వెను తిరిగి చూడొచ్చు. కాని ఎక్కడున్నదీ తెలియకుండా అంతరిక్షం నుంచి ఆకాశవాణి వినిపించినట్లు పలుకరిస్తే సమాధానించేదెలా?

'అహల్యా! దివిలో సృష్టించబడ్డావు. దివిజులందరికీ తలమానికమైన ఇంద్రుడికి హేతువుగా పుట్టు వందావు. ఎందరెందరో నీకోసం పోటీ పడ్డారు. నిన్ను నీ సృష్టికర్త ఈ అరణ్యంలో- ఈ ఆశ్రమంలో- జప తపాలే జీవిత ధర్మంగా జీవించే గౌతముడికి కట్టబెట్టారు. ఓ అందమా! ఓ చందమా! సుఖమా! సంతోషమా! ఏముందిక్కడ!' అని అంటున్న ఆ స్వరాన్ని అధిక్షేపిస్తూ...

'చాలించు నీ ప్రసంగం' కఠినంగా అంది అహల్య. హద్దు మీరి మాట్లాడవద్దు. నన్నూ- నా నాధుడినీ నా ఆశ్రమ జీవితాన్నీ అధిక్షేపించే హక్కు నీకెవరిచ్చారు? తగుదునమ్మా అంటూ మా కుటీరం ప్రవేశించి కనిపించే ధైర్యం లేక ముఖం చాటేసి కాని మాటలు మాట్లాడుతున్నావు. మాయావీ! నువ్వెవరయితేనేం? తక్షణం ఇక్కడి నుంచి వెళ్ళిపో! కాక ఇక్కడే ఉండి వినరాని మాటలాడితే నా కోపానికీ, మా వారి శాపానికీ గురికాక తప్పదు'

క్షణంపాటు నిశ్శబ్దం.

'మన్నించు అహల్యా! నన్ను మనసారా మన్నించు!'

అహల్య మౌనం వహించింది.

'నీ మన్ననా! మర్యాదా! ఆతిథ్యం ఆప్యాయతా ఆశించి వచ్చాను. నా ఆత్రంతో అంతరంగం చక్కగా వెల్లడించ లేకపోయాను. ఆవేశంతో ఆలోచన మందగించింది. ఆవేదనలో మాట జారింది. క్షమించమని వేడుకుంటున్నాను'

అహల్య తిరిగి మౌనాన్నే ఆశ్రయించింది.

'అహల్యా!'

'పేరుపెట్టి పదే పదే పిలుస్తున్నావు. ఒక ముని పత్నిని గౌరవించే తీరు ఇదేనా?'

క్షణకాలం మౌనం. తిరిగి అహల్య ప్రశ్నించింది 'పర స్త్రీని పలుకరించే తీరు ఇదేనా?'

జవాబు లేదు.

'మైత్రి ఆశించి వచ్చిన వారి మాట తీరు ఇదేనా?'

దానికీ జవాబు రాలేదు.

'దివి నుంచి భువికి దిగివచ్చిన నీకు యింకా దిగజారి పాతాళం చేరి ఆ పాతాళ వాసుల్లాగ రాక్షస తత్వం వచ్చినట్లుగా ఏమిటీ ఈ మర్యాద ఎరుగని మాట తీరు?'

'అహల్యాదేవీ!' ఆ పిలుపులో ఆవేదన ధ్వనించింది 'నీ విషయంలో తొలి నుంచీ నాకు నిరాశే ఎదురవుతూ ఉన్నది. అన్నిటా అపజయమే వరిస్తున్నది'

'ఏమిటా మాటలు?'

'అవును. నీ సృష్టికి కారణమై నీకోసం అందరితోనూ కలిసి పరుగు పందెంలో పరుగెత్తే దౌర్భాగ్యానికి లోనై, అందులోనూ ఓటమి పాలై అరచేతిలో లభించిన ఆమ్ర ఫలం అందని మావి పండై ఆశలన్నీ అడియాశలయి తీరని కోరికతో దహించుకు పోతున్న నాకు మాట తీరు మరుపుకు రావడం కూడా సహజమే కదా దేవీ!'

అహల్య జవాబివ్వలేదు.

'నిన్ను మాటలతో కష్ట పెట్టినందుకు నన్ను క్షమించు'

ఆమె తిరిగి మౌనాన్నే ఆశ్రయించింది.

'అహల్యా దేవీ! నీ మనస్సు గాయపడింది. ఆవేదన తీరేలా చేస్తాను. అప్పుడైనా ఆగ్రహం మరిచి... అనుగ్రహించి అదే నా మనస్సు గ్రహించి అనుగ్రహిస్తే...'

అహల్య ఆ పలుకులు వినగానే మనస్సు శిలలా అయింది. ఆలోచన నశించింది. స్తబ్దత ఆవహించింది.

'అహల్యా దేవీ! ఇంటికి వచ్చిన వారిని అతిథి మర్యాదలతో అర్ఘ్యపాద్యాదులిచ్చి గౌరవించడం ఆర్ష సంప్రదాయం. ఆశ్రమ సంప్రదాయం. నేను వచ్చాను. వచ్చినట్లు తెలియజేశాను. పలుకరించాను. మాటకు మాట కలిపాను. కానీ పలుకుల్లో నీ మనస్సు నొచ్చేలా ధ్వనించాను. ఆతిథ్యానికి బదులు ఆగ్రహ ఫలం పొందాను. అందుకు పరిహారంగా నా సేవలందుకో...'

మాటలు పూర్తయి కాకముందే అద్భుతం జరిగిపోయింది. అంతా ఇంద్రజాల ప్రభావం. ఊహూ! మహేంద్రజాల ప్రభావం. కుటీరం అంతా రకరకాల పూమాలలతో అలంకరింపబడింది. తలెత్తి చూస్తే పై కప్పు నుంచి పూమాలికలు వేలాడుతున్నాయి.

వెలుగు మాత్రం ప్రసరిస్తూ కంటికి ఖేదం కలిగించకుండా చల్లని వెన్నెల కంటికి సైదోడన్నట్లుగా రత్న మాణిక్యాలు కాంతులు విరజిమ్ముతున్నాయి. బైటంతా పగటి సూర్యుడి ప్రభావం, లోపలంతా చలువ రేని సామ్రాజ్యం.

ఆ కుటీరంలో పడమటి వైపు పడక మంచం! హంసతూలికా తల్పం! మంచానికి నలువైపులా అలంకరించిన చట్రంతో లోపలి వ్యక్తులు కనిపించకుండా తెర. దాని చుట్టూ పూలమాలలు జాల్వారుతున్నాయి. నలు దిశలా గోడలకి నిలువెత్తు దర్పణాలు.

తన కళ్ళకెదురుగా అంతా మంత్రించినట్లుగా, మాయ చేస్తున్నట్లుగా క్రమక్రమంగా మారిపోతున్న వాతావరణం. చూస్తూ ఉంటే ఆశ్చర్యానికి లోనై ఆ అద్భుతాన్ని తిలకిస్తూ ఉన్న అహల్య కొంచెం అటు తిరగ్గానే నిలువెత్తు దర్పణంలో ఓ అందాల సుందరి ప్రత్యక్షమైంది.

హఠాత్తుగా అక్కడ స్త్రీ మూర్తిని చూడగానే అది దర్పణమనీ, అందులో ప్రతిబింబాలు కనిపిస్తాయనీ, అవి గానీ ఆ ముకురంలో చూసుకుంటూ ముఖ సౌందర్యానికి మెరుగులు దిద్దుకుంటూంటారని కానీ తెలియని- ఏనాడు దర్పణంలో ముఖం చూసుకుని ఎరుగని అహల్య ఆ స్త్రీ మూర్తిని చూసీ చూడగానే ఎవరా అని ఆశ్చర్యపోయింది.

ఆ అందాల సుందరి దేవ భామలా ఉంది. ఆ సోయగాల రాశి దివ్య వనితా మణిలా ఉంది. ఆమె శిరోజాలు అందంగా తీర్చిదిద్దబడ్డాయి. పూమాల శిరస్సులో తురుమబడి ఉంది.

ముఖం తేజోవంతంగా ఉంది. కళలు కురుస్తూ ఉంది. కళ్ళు కనుబొమ్మలు తీర్చిదిద్దబడ్డాయి. ముఖానికి ఏదో లేపనం పూసి- ఆపై ఏదో పుప్పొడి అద్దినట్లు చెక్కిళ్ళు రాగ రంజితమయ్యాయి.

వస్త్రధారణ అపూర్వం. అవి నిజంగా దేవతలు ధరించ తగ్గవే! పాలమీగడ వంటి రవిక. నీలి సముద్రం వంటి చీర. దానిలో కనీ కనిపించని రీతిలో గాగరా! మెడ నిండా అమూల్యాభరణాలు. చెవులకు కర్ణాభరణాలు. పాపిట సింగారాలొలికే బొట్టు!

నడుముకు పస తెలిసేలా బంగారు వడ్డాణం. ఆ కాంతి కాంచన దీప్తులు వెదజల్లేలా దానికి పొదిగిన వజ్ర వైఢూర్యాలు. చేతులకు రత్నాభరణాలు. కాళ్లకు అందెలు, కడియాలు! వేళ్ళకు అంగుళీయకాలు. కాలి వేళ్లకు చుట్లు. పిల్లండ్లు.

చూపు తిప్పుకోలేక దేవతా స్త్రీలా అనిమేష అయింది అహల్య.

రెప్ప వాల్చకుండా అలాగే చూస్తుండిపోయింది. ఏమీ కదలిక లేని మనసుతో ఆమెనే చూస్తున్న అహల్యకు మళ్ళీ మాట వినిపించింది.

'ఎలా ఉంది దేవీ!'

చప్పున ఊహల్లోంచి వెలికి వచ్చింది.

'ఎలా ఉంది దేవీ! రంగాలంకరణ'

ఏమి చెప్పగలదామె?

'ఎలా ఉంది దేవీ! అంగాలంకరణ!'

వినిపిస్తూ కనిపించకుండా తత్తరపడుతున్న ఆ మూర్తి కోసం అటూ ఇటూ చూసిందామె.

'ఏమీ దేవి మాట్లాడవా?'

ఏమి మాట్లాడాలి? అందుకే మూగతనం వహించింది అహల్య 'నిన్ను నీవు దర్పణంలో చూసుకున్నావా? దేవీ?'

'అది అద్దం! అందం గురించి అది అబద్ధం చెప్పదు. బింబానికి ప్రతిబింబాన్ని ప్రతిఫలిస్తూ మూర్తిని సాక్షాత్కరింప చేస్తుంది. కళ్ళారా చూసుకో అహల్యా... దేవీ!'

ఉలికిపడింది! భయపడింది! తత్తరపడింది! తడబడింది. తనా! తనేనా! తనేనా! ఆ ప్రతిబింబంలో కనిపించేది? తనదేనా ఆ కనిపించే ప్రతిబింబం! ఇది నిజమా! కలా? మాయా? కల్పనా? చిత్త విభ్రమా?

'చూసుకో అహల్యా! నిన్ను నీవు తనివితీరా చూసుకో!'

చప్పున తల తిప్పింది అహల్య.

'నిన్ను నీవు చూసుకుంటే అసూయగా ఉందా అహల్యా!'

ఆమె మాట్లాడలేదు.

'అందులో ఎంతందంగా కనిపిస్తున్నావో అంత సుందరంగా అంతకంటే సుకుమారంగా- అంతకు రెండింతలు వయ్యారంగా ప్రత్యక్షమయ్యావు. ఆనాడు బ్రహ్మలోకంలో ఆ సృష్టికర్త నిన్ను సృష్టించిన తొలి క్షణంలోని రూపం అది. ఇప్పుడెలా ఉన్నావో తెలుసా! ఊహూ! నీకు తెలీదు. ఇప్పుడు చూసుకో!'

'నిత్యం నదీ స్నానాలతో, పూజలతో, జపాలతో ఆశ్రమ జీవనం గడుపుతున్న నీవు ఎలా ఉన్నావో నీకు తెలీదు. ముఖాన బొట్టు దిద్దుకోవడం కూడా చూపుడు వేలు నేర్పే తప్ప, చూసి తిలకం దిద్దుకునే తీరు నీకు తెలీదు కదా! ఇప్పుడు అద్దంలో చూసుకో!'

మాటలు ముగిశాయి.

మంత్రించినట్లు మహేంద్రజాలం ప్రదర్శించినట్లు అద్దంలో రూపం మారిపోయింది. ఆ నగలు లేవు. ఆ నగలు తెచ్చే వగలు లేవు. ఆ తలకట్టూ లేదు. అది ఇచ్చే అందం లేవు. ఆ వస్త్రాలు లేవు. అవి తెచ్చే నిగారింపులూ లేవు. ముఖాన ఉదయించే సూర్యబింబం లాంటి బొట్టు! నార చీర- నార రవిక- జడ ముడి. కాసెపోసి కట్టిన చీరలో కనిపించే బిగువులు.

ఆశ్రమ వాసిని అందాలు కనువిందులే కానీ కళ్ళు చెదిరి మనసు చెదిరే విభ్రమాలు ఉండవు. ఇది మేలిమి బంగారం. నువ్వు చూసింది మెరుగుపెట్టి అరగదీసి సింగారించిన రంగారు బంగారు బొమ్మ.

'ఎంత తేడా ఉందో చూశావుగా!'

అహల్య జవాబు చెప్పలేదు.

'అహల్యా! ఆ సోయగం చూసి మతి చెడి గతి చెడి నీ ముంగిటికి వచ్చిన వలపు బిచ్చగాడిని నేను'

'ఎవరు నీవు?'

'నేనెవరైతేనేం. నీ ఆరాధకుడిని'

'నువ్వెవరో చెప్పుకోలేని బలహీనుడివా?'

'నీ అందానికి దాసోహం అన్నవాడిని. నీ అందాలకు బందీ అయిన వాడిని. నీ వాడిని కావాలని తపించే దాసుడ్ని'

'అప్రస్తుతం! ఏమిటీ దుడుకుతనం?'

'దుడుకుతనమో, దుందుడుకుతనమో ఎన్నాళ్ళిలా! ఎన్నేళ్ళిలా! విరహంతో వేగిపోను. అందుకే సాహసించి నీ సన్నిధికి వచ్చాను. మనసు విప్పి నీ పాదాల ముందు పరుస్తున్నాను. నా మనస్సును గ్రహించి ఆగ్రహించక అనుగ్రహిస్తే

అదృష్టవంతుల్లో అదృష్టవంతుడినవుతాను'

'ఛీ. పరువైన ఇల్లాలితో- అందునా ఋషి సత్తముని అర్ధాంగితో, ఆశ్రమవాసినితో మాట్లాడే తీరు ఇదా? ఎవరు నువ్వు? కనిపించి మరీ మాట్లాడు... ఆపై తక్షణం అడుగు తీసి ఆశ్రమం వదిలి వెళ్ళు. లేదా మునీంద్రుల కోపాగ్నికి బలి అవుతావు. శాపాగ్నిలో భస్మమవుతావు!' కఠినంగా అంది అహల్య.

క్షణం నిశ్శబ్దం.

'కోపాగ్నికి గురై శాపాగ్నికి ఇంధనమైనా సరే! నా మనస్సులోని మాట చెపుతున్నాను. నేనెవరినో నా అధికారమేదో, నా లోకమేదో నేనెందుకు చెప్పుకోవాలి? నేనో శరణార్థిని. కంతుని వింత వింత బాణాల తాకిడికి తట్టుకోలేక నీ చరణాలు శరణు జొచ్చిన నీ ప్రేమికుడివి. వియోగంతో విరహంతో వేగేకన్నా శాపానికి గురి కావడమే మేలనుకుంటున్నాను.

దయచేసి నన్ను అలరుల శయ్యకు దయచేయమని ఆహ్వానిస్తావో, లేక నిర్దయగా ఇలా వెడలమని మునీంద్రుని శాపానికి గురిచేస్తావో నీ ఇష్టం. అంతా నీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి నిలిచాను. వలచిన వాడికి వలపుల పూలమాల వేస్తావో- తిరస్కారాల ఛీత్కారాల సత్కారమే చేస్తావో నీ ఇష్టం' గుండె గొంతుకలో ప్రతిధ్వనించేలా అన్నాడు.

* * * *

ఆశ్రమంలో చెట్టు కింద నిర్మించుకున్న వితర్ధికపై- ఓ చలువ రాతిపై- కృష్ణాజినంపై- పద్మాసనా శీనుడై కూర్చున్న గౌతముల మనస్సుకు- అంతా ఏదో భ్రాంతికి లోనవుతున్న భావన! ఏదో మాయ కమ్ముతున్నట్లు అనిపించింది.

నిర్మల చిత్తంతో తదేక ధ్యానంతో చేస్తున్న జపం- మధ్యన ధ్యానం చెడి- మనసు కదులుతున్నా మంత్రాక్షరాలు- సాగుతూ ఉన్నాయి. మనస్సుని కేంద్రీకరించలేకపోతున్నాడాయన.

కనులు మూసుకుని- పద్మాసనుడై ఏకాగ్రతతో తిరిగి మనసుని నియమించాడాయన. మనసు కుదుట పడింది. కానీ మరోసారి మెరుపు మెరిసింది. బహిరాకాశంలో కాదు. దహరాకాశంలో మెరిసింది ఆ మెరుపు. మనస్సుని మరీ కేంద్రీకరించాడాయన. చిత్తం ధ్యాన మార్గానికి మళ్ళింది.

తిరిగి జపం కొనసాగింది. అంతలో మళ్ళీ తటిల్లత- ఆ కాంతులలో మనో నాయన విభ్రమంగా ఉంది తిరిగి మనస్సు కదిలింది. ఆలోచనల తీగలు సాగింది.

'ఏమిది? ఎందుకా మెరుపు. మబ్బులు లేని ఆకాశంలో మెరుపు మెరవడం ఏమిటీ? అది మనస్సులో భద్రంగా ముద్రితమైనట్లు తిరిగి తిరిగి మెరవడమేమిటి?'

గౌతములకు ఏదీ తోచలేదు. అన్యథా శరణం నాస్తి! త్వమేవ శరణం మమ! తల్లీ గాయత్రీ! నువ్వే కటాక్షించాలి. నగాయత్ర్యాః పరం మంత్రం అన్నారు ఋషులు. చిత్త విభ్రమం తొలగించు తల్లీ!

మనసారా ప్రార్థించి తిరిగి గాయత్రీ జపం ప్రారంభించాడు గౌతమ మహర్షి! ఒకటి రెండు మూడు నాలుగు... దశ హాయత్రీ జపించే వరకే ఆయనకు బాహ్య విషయాలు గుర్తున్నాయి. తర్వాత జపమే జపం... నిశ్చల చిత్తం..

## 32

'రూపం కనిపించకుండా- మాయతో మహిమతో నా మనస్సునీ, నా ఆశ్రమాన్నీ అపవిత్రం చేయాలనుకుంటున్న మాయావీ! ఎవరు నీవు? పవిత్రమైన ఈ ఆశ్రమ ప్రాంతాలలోకి ఎలా రాగలిగావ్! ఎంత ధైర్యం ఉండాలి నీకు? గౌతముల ఇల్లాలి మనస్సే చెదరగొట్టాలని నీవు చేస్తున్న ప్రయత్నం వృధా! వృధా! వృధా!'

మృదువైన నవ్వు. తెరలు తెరలుగా అలలపై తేలివచ్చే పిల్లగాలి లాంటి నవ్వు.

'చూశావా దేవీ! తొలకరి చినుకులతో భూమి వ్యవసాయానికి యోగ్యమైనట్లుగా నా మాటలతో, నా విన్నపంతో, నా ప్రేమతో, నా విలసనంతో నీ మనస్సులో నాకు కొద్దిగా స్థానం చిక్కింది. అందుకే మాట్లాడావు. మాటకు మాట కలుపుతున్నావు. మనస్సులో ఏ మూలో నా మీద కొద్దిగా అభిమానం పాదు చేసుకుంది. అందుకే ఈ విధంగా మాట్లాడావు'.

అహల్య జవాబివ్వలేదు. అతడు చేసిన ఆరోపణ గురించీ ఆలోచించలేదు.

'నేనెవరో ఎరిగించుకోనా అహల్యా!'

ఆమె దానికీ జవాబివ్వలేదు.

'నీ పుట్టుకకు కారణమయిన వాడిని. నువ్వు అవతరించగానే అయోనిజమైన నిన్ను అర్ధాంగిగా స్వీకరించాలని తహతాహ లాడినవాడిని. నిన్ను నాకే ధారపోయమని నిన్ను సృష్టించిన ఆ బ్రహ్మనే ముమ్మందుగా అభ్యర్థించిన వాడిని. నీవు గౌతములకు దక్కావని- నీవు ఆ మహర్షి సొమ్ము అయ్యావనీ, ఆ నారదుడు చెప్పగానే నా ప్రాభవం- నా అధికారం- నా యోగ్యత- నా సర్వం వ్యర్థమని నన్ను నేను కించపరచుకున్నవాడిని...'

అతనలా చెపుతూంటే ఆమెకి సర్వం గుర్తుకొచ్చింది. ఆనాడు ఆమెకి బ్రహ్మ సభలో జరిగిన ప్రతి ఘట్టం వివరంగా విశదంగా స్మృతికి తగిలింది ఒక్క క్షణం.

అంతలో మళ్ళీ చెప్పసాగాడు అతను.

'ఇప్పటికే నేనెవరో నీకు తెలిసి ఉండాలి. అయినా ఇంకా కుల గోత్రాలూ, పేరూ, ఊరూ చెప్పమంటే చెపుతాను'

అహల్యకు అతనెవరో తెలిసింది. చప్పున అంది 'రూపం కనిపించకుండా ఏమిటీ సంభాషణ?'

ఆ మాటల్లో ప్రసన్నత లేదు. కాఠిన్యమూ లేదు. తిరస్కారం లేదు. ఆహ్వానం లేదు. కేవలం పొడి మాటలు.

'నేను నేనుగా సాక్షాత్కరించాలా!'

తలూపిందామె.

క్షణం పాటు మళ్ళీ మెరుపులు. కనులు మిరుమిట్లు గొలిపే మెరుపు. కళ్ళను చెదరగొట్టే వెలుగు.

అహల్య కళ్ళు మూసుకుంది. ఆమె మనసు నిలకడ గలిగిన కడలిలా ఉంది.

'ప్రత్యక్షం కమ్మని- కనిపించమని కనులు మూశావేం దేవీ!'

కొరడా ఝుళిపించినట్టుందా పిలుపు. చప్పున కళ్ళు తెరిచింది. ఎదురుగా ముక్కోటి దేవతల మొక్కులందే వాడు. మూడు లోకాలనూ ఏలేవాడు. తన ఆజ్ఞను అంతటా పాలించే వాడు. శచీనాథుడు- అమృతాశనుడు మహేంద్రుడు- తన దర్పం అంతా వెల్లడి చేసే అలంకరణతో తన ఆధిపత్యం ప్రకటితమయ్యే కిరీటంతో- ఏరణాన్నయినా జయాన్నిచ్చే వజ్రాయుధంతో- పట్టు పీతాంబరాల ధగ ధగలతో- తానై ప్రసాదించిన ఆ కుటీర రమణీయ అలంకరణ మధ్య- నక్షత్ర రాశి మధ్య నిశాపతిలా నట్టనడిమింటి భానుడిలా వెలుగు వెల్లువలా...

మహేంద్రుని చూసిన అహల్య కన్ను చెదిరింది. క్షణ కాలం విభ్రమం. అప్రయత్నంగా కనులు మూసుకుంది. శరీరమంతా ఏదో మాయ కమ్మినట్లయింది.

మహేంద్రుడి రెండు కళ్ళూ ఒళ్ళంతా తడుముతున్నట్లయింది. ఒక జుగుప్స- ఒక ఏవగింపు- ఒక వికారం ఓ మైమరుపు మిశ్రమ భావ సమ్మేళనంలో అహల్య మనస్సు రాయిలా అయింది.

ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు ఇంద్రుడు.

'అహల్యా!' ఆప్యాయంగా పిలిచాడు మళ్ళీ.

ఆ పిలుపు విని- సహించలేక- మళ్ళీ కళ్ళు తెరిచింది. 'దేవరాజా!' స్థిర కంఠంతో పిలిచిందామె.

ఆ పిలుపు వలపు తలపుల తలుపు తట్టినట్లై 'నన్ను-నన్నేనా నన్నేనా అహల్యా! నన్ను గుర్తించావా దేవీ!' అని సంభ్రమంతో అడిగాడు.

కానీ- అహల్య ఆ సంభ్రమాన్ని గుర్తించలేదు.

'తమరికిది తగదు. మూడు లోకాలకూ ఏలిక మీరు. ధర్మ సంరక్షణ తమ కర్తవ్యం. నీతి నియమ సంరక్షణ తమ ధర్మం! తమరే పాడితప్పి చరిస్తే డివి నుంచి దిగివచ్చి భువిలోని ఒక ఇల్లాలిని వరిస్తే - ఇక ధర్మానికి దిక్కేది? నీతికి నియమానికీ నిలకడెక్కడ?'

మహేంద్రుడి మనసు రప రప లాడింది. 'హూ స్థాయి తగ్గి, మనసోగ్గి తన సింహాసనం దిగి భూలోకానికి దిగివచ్చి చేతులొగ్గి ప్రార్థిస్తే- నీతి వాక్యోపదేశం చేస్తుందా! ఇది వినడానికా నేనొచ్చింది?' అనుకున్నాడు.

'మీరు ఇంతసేపూ కనిపించకుండా వినిపించింది ఇప్పుడు అంతా పూర్తిగా అర్థమవుతున్నది.

'చాలు దేవీ! నా ఆర్తిని అర్థం చేసుకున్నావా? అంతే చాలు. ఆపై నీ చిత్తం. నా భాగ్యం!'

ఆ మాటలు విననట్టుగా అందామె 'నా సృష్టి ఎలా జరిగిందో, నా తండ్రి నన్ను సృష్టించవలసిన అవసరం ఎందుకు కలిగిందో, నన్ను సృష్టించగానే ఏం జరిగిందో నాకు తెలుసు. కానీ స్వామీ!' ఆగింది అహల్య 'ఆడదాన్ని నేను. అస్వతంత్రురాలిని. కోరిన వారిని వరించే హక్కు మాకు లేదు. కన్నవారో, పెంచిన వారో, ఎవరికి కన్యా ధారపోస్తారో వారినే వరించటం- వారినే సేవించడం మా స్త్రీల కర్తవ్యం'

మహేంద్రుడు వినసాగాడు.

'ఒకరితో ముడిపడిన తర్వాత మా జీవితం అంతే! మరో మాట లేదు. మరో ఆలోచన లేదు. జీవితాంతం వారినే నమ్ముకుని సేవించి తరించాలి!'

'అహల్యా!'

అడ్డొస్తూ పిలిచాడు మహేంద్రుడు.

'పర స్త్రీని నన్నలా పిలిచే హక్కు నీకు లేదు!'

'నీకు సాంప్రదాయబద్ధంగా పెళ్ళి జరిపాడా మీ తండ్రిగారు?'

నవ్విందామె. దానికి జవాబిలా అన్నది 'హోమాగ్ని వెలుగుతూండగా- వేద మంత్రాల మధ్య నా పెళ్ళి జరిగింది కదూ!'

దానికీ సమాధానం చెప్పలేదు. తెలిసినవారికి తెలిసిన విషయం చెప్పడం ఎందుకన్నట్లు మౌనం వహించింది.

'ఆ మంత్రాలు నువ్వు విన్నావా?'

దానికీ అంతే!

'అందులో తొలుదల్త నిన్ను నవగ్రహాధినాథుడనైన నాకు- ఇంద్రుడికి కన్యాదానం చేసి ఆపై మరింత ముందుకు సాగి- ఆ తర్వాత నిన్ను- నీ సృష్టికర్త- ఆ పరమేష్టి గౌతములకు కన్యాదానం చేసి ఉంటారు. తెలుసా?'

తెల్లబోయింది.

'అలా మొట్టమొదట ధారపోసింది నాకే తెలుసా?'

నిర్ఘాంతపోయిందామె.

'మొదట నాకు కట్టబెట్టాకే నిన్ను ఆయనకిచ్చాడు తెలుసా?'

నివ్వెరపోయిందామె.

'మరి నీ భర్త ఎవరు?'

దిగ్భ్రాంతి చెందింది.

'నాకు నీపై హక్కు లేదా? అధికారం లేదా?'

నిశ్చేష్ట అయింది అహల్య.

'నువ్వు నా పాలనలోని దానివి. నాకు దానం చేయబడిన దానివి. నీ ఆలనా పాలనా నాది. నువ్వు నన్ను సేవించుకోవాలి. నన్ను అర్చించాలి. నన్ను ఆనంద పరచాలి. తెలుసా?' నవ్వుతూ అన్నాడు ఇంద్రుడు.

అహల్య వెలవెలబోయి నిలబడింది. నోట మాట రాక!

* * * *

'ప్రభువులు ఎక్కడున్నారే?' విశ్రాంతిగా తల్పంపై శయనించిన శచీదేవి అడిగింది హఠాత్తుగా.

ఇంద్రసఖి ఆ ప్రశ్న వినగానే ఉలికి పడింది. ఏమి జవాబివ్వాలో తెలియక కొద్దిసేపు మౌనం వహించింది.

ఇంద్రసఖి నుంచి జవాబు రాకపోవడంతో అటుగా ఉన్న శచీదేవి ఇటు తిరిగి చూసింది. ప్రశ్నార్థకంగా మళ్ళీ చూసింది.

'తమరే ఇంతదాకా వారితో మందాకినిలో జలకాలాడి వచ్చారు కదమ్మా!'

చప్పున స్ఫురించిన మాట అనేసింది.

నిశితంగా చూసింది శచీదేవి 'ఎప్పటి మాటే అది!' అన్న అర్థం స్ఫురించింది అందులో.

'లే! వెళ్ళు! ప్రభువులు ఎక్కడున్నారో కనుగొని తోడుకొనిరా! ఆలోచనా మందిరంలో ఉన్నా, బృహస్పతుల వారితో ఏకాంతంగా చర్చిస్తూ ఉన్నా, తదితర దిక్పాలురతో కలిసి మంతనాలాడుతున్నా సరే అమ్మగారిని దర్శనం ఇవ్వాలని మనవిచేసి తోడుకుని రా!'

'ఏమిటమ్మా అంత తొందర!' మెల్లిగా నవ్వుతూ అడిగింది ఇంద్రసఖి.

'ఊ!' గద్దించినట్టుగా అంది శచీదేవి.

'అమ్మా! మహేంద్రులు అచ్చెరలతో గాన వినోదంలో మునిగి ఉంటే?'

'తేల్చి - తోడుకుని రా!'

'ఒకవేళ రంభాది నర్తకీమణులతో నృత్య విలాస విభ్రమాదులు ఆనందిస్తూ ఉంటే!'

'ఆపి - ఆపై తోడుకొని రా!'

'మునులతో కలిసి వైకుంఠం బయలుదేరుతూ ఉంటే?'

'ఏమిటే యీ తలా తోకా లేని ప్రశ్నలు - వెళ్ళు యీ ఏడేడు పద్నాలుగు లోకాల్లోనూ ఎక్కడున్నా తక్షణం మా సన్నిధికి తోడుకుని రా!' ఆజ్ఞాపించింది శచీదేవి.

ఇంద్రసఖి చప్పున కదిలింది. భయం భయంగా కదిలింది. ఆమెకు ఇంద్రుడు ఎక్కడికి వెళ్ళిందీ తెలుసు! అందుకే ఆ భయం.

## 33

నవ్వుతూ నుంచుని ఉన్న మహేంద్రుడిని, ఆ మహేంద్రుడి వైభవాన్ని చూస్తూ నిలబడిపోయింది అహల్య.

'ఊరకే అన్నానులే అహల్యా! అధికారంతో అంతరంగంలో అనురాగమయ స్థానం సంపాదించుకోగలమా చెప్పు! నేను వలపు బిచ్చగాడిలా వచ్చి అధికార దర్పం వెలార్చే రాజ ప్రతినిధిలా మాట్లాడాను మన్నించు!'

అహల్య దానికీ జవాబు చెప్పలేదు.

'అహల్యా! నేను శచీనాథుడిని. నా శచీదేవి పరమ సౌందర్య రాశి! నేను స్వర్గాధిపతిని. నా లోకంలో అడుగుకయినా అందగత్తెలయిన రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ, ఘృతాచి మొదలైన సుందరాంగులు తారసిల్లుతూ ఉంటారు. వారు సౌందర్య సీమలో సౌందర్యాధి దేవతలు. తెలుసా!'

అహల్య వింటూ ఉంది.

'వారంతా నా కను సన్నలలో మెలుగుతూ ఉంటారు. వారినెవ్వరినీ కాదని నీ చరణాలే శరణం అంటూ ఎందుకొచ్చానో తెలుసా?'

అహల్య జవాబివ్వలేదు.

'అన్ని లోకాలలోని అందగత్తెలందరిలోనూ ఏదో ఒక లోపం ఉంది. ఒకరికి రంభ అందంగా కనిపిస్తే, కొందరికి జఘురాలిగా కనిపిస్తుంది. తిలోత్తమ జగదేక సుందరి. కొందరి దృష్టిలో ఆమె నలుపు అని నిరశించేవారూ ఉన్నారు. అలా ఒకరి మెప్పుదల పొందిన స్త్రీ మరొకరి మెప్పును పొందటం లేదు. అన్నట్లు అందరిలో సుందరి ఎవరని వాదన పుట్టాకే కదా! ఆ వాదనకి జవాబుగా నువ్వు పుట్టావు!' మెచ్చుకుంటున్నట్లుగా అన్నాడు ఇంద్రుడు.

అహల్య యీ మాటా నిర్వికారంగానే విన్నది.

'నేనింతగా వికారానికి లోనయ్యానూ అంటే! ఎంత విచారానికి లోనై ఉంటానో ఆలోచించు దేవీ!'

'ప్రభూ! మహేంద్రా! త్రిలోకాధినాధా!' మృదువుగా చెవులకు వినిపించింది.

పరవశించిపోయాడు ఇంద్రుడు.

'ఏమేమి! ఏమేమీ! ఏదీ మరోసారి పిలు!'

'ప్రభూ! మహేంద్రా! త్రిలోకాధి నాధా!'

'పిలు! అలానే మళ్ళీ మళ్ళీ పిలు. ఎంత కమ్మగా ఉంది నీ పిలుపు. అహల్యా! అహల్యా!' తత్తరపాటుతో అన్నాడు ఇంద్రుడు.

ఆ మాటలకి నివ్వెరపోయింది అహల్య. ఆమెకేమీ అర్థం కాలేదు.

'ప్రభూ!'

'ఊ!'

'మహేంద్రా!'

'ఊ! అలా పిలువు అహల్యా! నీ పిలుపే చాలు అనేంత కమ్మగా పిలుస్తున్నావు. పిలువు! ఎంత తీయగా ఉంది నీ పిలుపు. వీనుల విందుగా మనస్సుకు మనోజ్ఞంగా ఉంది. అహల్యా! నేనెంత అదృష్టవంతుడిని!'

'ప్రభూ! ప్రభూ! మిమ్మల్ని అహల్యా దేవి పిలవడం లేదు. నేను తమ దూతిని.శచీదేవమ్మగారి ఇష్ట సఖిని. ఇంద్రసఖిని!' భయం భయంగా వినిపించింది తన ఉనికిని తెలియజేస్తూ ఇంద్రసఖి.

మాయ తొలగింది. చిత్త భ్రమ తొలిగింది. ఆ పిలుపు విని వేయి వరాల పెట్టుగా, దశ సహస్ర వాంఛా ఫలసిద్ధిగా శత సహస్ర విషయ వాంఛా సిద్ధిగా భావించిన ఇంద్రుడికి అది 'వజ్రాయుధం' దెబ్బలాగా అనిపించింది. తన వజ్రాయుధంతో శత్రువులను రెండుగా ఖండించడం వేరు! ఆ వేటే తనే అనుభూతించడం వేరు కదా! పర్వతాల రెక్కలు ముక్కలయ్యేలా వజ్రాయుధంతో నరకడం వేరు! అదే తన కోరిక రెక్కలు ముక్కలయ్యేలా ఖండించడం వేరు కదా!

ఒకరికి ఏది బాధగా ఉంటుందో చేసేవాడికి తెలీదు. అదే తనకు సంప్రాప్తించినప్పుడు కదా ఆ బాధ లోతు తెలిసేది. ఇంద్రుడు ఆ బాధని భరించలేకపోయాడు. నిరాశను పెంచే ఆ మర్మాఘాతానికి తట్టుకోలేక పోయాడు. అప్పుడు సలిపే పుండుపై కారం చల్లినట్లుగా అంది ఇంద్రసఖి.

'తమరిని ఎక్కడున్నా, ఎవరి చెంతనున్నా, ఎంత వ్యగ్రతతో ఉన్నా, తన పిలుపును వినిపించి తమరిని తన సన్నిధికి చేర్చమని శచీదేవి గారి ఆజ్ఞ! ఎక్కడున్నా సరే తన సందేశం తెలియజేయమని ఆజ్ఞాపించారామెగారు. కానీ తమరెక్కడుంటారో పంపిన నాకు తెలుసు కదా! అందుకే ఇక్కడికి అదృశ్య రూపంలో సంకల్ప మాత్రంతో విచ్చేశాను. ఇక సెలవు! బయట వేచి ఉంటాను'

ఇంద్రసఖి ఎలా వచ్చిందో అలా వెళ్ళింది. తనేం చెప్పిందీ ఇంద్రుడికి మాత్రమే వినిపించేంత మెల్లగా చెప్పి అహల్యకు వినిపించకుండా జాగ్రత్త పడింది.

తిరిగి కుటీరంలో ఇద్దరే మిగిలారు. అహల్య ఇంకా భ్రాంతిలోనే ఉంది.

'అహల్యా! నేను దేవకార్యం వల్ల తక్షణం నా లోకానికి వెళ్ళవలసి ఉంది. వెళుతున్నాను. కానీ కోరిక తీరకుండా వెళుతున్నాను. నీ స్నేహ హస్తం అందుకోకుండా వెళుతున్నాను. కానీ మనస్సులోని కోరికలను ఆపుకోలేక నిన్ను దృశ్యాదృశ్యంగా స్పృశించి వెళతాను.

మేం దేవతలం. శరీరం లేకుండా స్పృశించగలం. మీకు మా స్పర్శ తెలుస్తుంది. మా శరీరం కనిపించదు. మేం కామచారులం! ఏ రూపమైనా ధరించగలం! ఎక్కడికైనా వెళ్ళి రాగలం! మేమే కాదు, రాక్షసులకి కూడా ఈ శక్తి

ఉండటం వల్ల వాళ్ళూ మాలాగ వచ్చి పోగలరు. పిశాచ రూపులకు ఈ శక్తి ఉంటుంది. అహల్యా! వెళ్ళొస్తాను... మళ్ళీ వస్తాను!'

ఒక బలమైన వాంఛ శరీరాన్నంతా తడిమినట్టయింది. ఒక చండ మారుతం చుట్టముట్టినట్లయింది.

కోరిక ఇంత బరువా! కోరికకు ఇంత బలమా? అనుకుంది అహల్య.

'నా స్పర్శకు ఫలితం వుంటుంది. అదేమిటో నీకు త్వరలో తెలుస్తుంది. మరి సెలవా!' అంటూ దేవేంద్రుడు వెళ్ళిపోయాడు.

అహల్య బరువైన మనస్సుతో నిలబడిపోయింది. ఆ బరువు క్రమంగా క్రిందికి జారుతూ గర్భాశయం చేరినట్లయింది.

కుటీరం నుంచి వెలుపలికి వచ్చాడు ఇంద్రుడు. బయట అదృశ్యరూపంలో ఉన్న ఇంద్రసఖి కన్పించింది. ఇద్దరూ ఆకాశ గమనం చేయసాగారు.

'ఏమే! ఏమన్నావే అప్పుడు?'

ప్రశ్నించాడు ఇంద్రుడు. ఎప్పుడూ? ఏమన్నదీ? ఆమెకు గుర్తుకు రాలేదు.

'ప్రభూ! తమరు నన్ను మన్నించాలి. ఆంధ్ర దేశంలో విన్న సామెతలాగ పానకంలో పుడక లాగ వచ్చాను. నన్ను దయ చూడండి. తప్పును మన్నించండి'.

'అదేం లేదులే! పానకంలో ఉంటేగా నువ్వు పుడకవయ్యేది! పానకం తయారయ్యేదేమో! ఆ అహల్య మానవ స్త్రీగా - మానినిగా పతివ్రతగా తన ధర్మం చెపుతూ ఉండింది. అదికాదు నువ్వు భూలోకవాస స్త్రీల గురించి, పురుషుల గురించీ ఏమేమో చెప్పావు. అదీ ప్రశ్నిస్తున్నాను'

ఆమె మౌనంగా అనుసరిస్తూ ఉంది.

'వృద్ధాప్యం వస్తుందన్నావ్! తల తెల్లబడుతుందనీ, చూపు మందగిస్తుందనీ, నడుం వంగిపోతుందనీ శరీరంలోని జవసత్వాలన్నీ తగ్గిపోతాయనీ చెప్పావు కదే!'

'చిత్తం!'

'కానీ అహల్యలో ఏ మార్పూ లేదుకదే!'

'అవును ప్రభూ!'

'తొలినాడు బ్రహ్మ సన్నిధిలో మేం చూసినప్పుడు ఎలా ఉందో, ఈనాడు మేం చూసినప్పుడూ అలాగనే ఉంది! వస్త్రాలంకరణలో మార్పు తప్ప- కట్టూ బొట్టులో మార్పు తప్ప- మరేం మార్పూ లేదు!

'అవును ప్రభూ!'

'ఆమెకో కూతురు కలిగిందనీ - ఆమె పేరు అంజన అనీ చెప్పినట్టు గుర్తు!'

'చిత్తం ప్రభూ!'

'ఆ ఛాయలేవీ లేవు! మానవ స్త్రీలకు కలిగే మార్పులూ లేవు! నీవు నిజం చెప్పావా? అబద్ధం చెప్పావా?'

'ప్రభూ! అమృతం తాగే నోట అనృతం వస్తుందా? అందునా అమరాధిపతులకు అబద్ధం చెప్పి భరించగలనా?'

'మరేమిటే యీ విచిత్రం?'

'అది ఆమెకు బ్రహ్మ ఇచ్చిన వర ప్రభావం ప్రభూ!'

'వరమా?'

'అవును ప్రభూ!'

'ఏమిటే ఆ వరం?'

'ఆమెను కన్యగా దీవించారు ప్రభూ!'

'అంటే!'

'పెళ్లయినా - ప్రసూతి అయినా ఆమె కన్యత్వం పోదు ప్రభూ! అది బ్రహ్మ ఇచ్చిన వరం!'

'ఆహా!'

'అవును ప్రభూ!'

'వారూ అమరులతో సమానం అయ్యారన్నమాటే కదా!'

'చిత్తం! వారిలో ఒకరు అమరేంద్రుల గురుపత్ని, మరొకరు బ్రహ్మకు మునిముని మనుమడైన వాని భార్య. యిక ఈమె, ఆయన గారు ఏరి కోరి సృష్టించిన స్త్రీ కదా!'

'ఊహూ!'

'ఎన్నటికీ- దేవ పారిజాతం లాగ వాడని వసి వాడని గంధం వీడని- చెట్టున ఉన్నా తుంచినా తారుణ్యం లావణ్యం తగ్గని- ఆ పూవు లాగ వుంటారన్న మాట!'

ఏవేవో ఊహించుకుంటూ మహేంద్రుడన్న మాటలకు ఇంద్రసఖి జవాబివ్వలేదు. అంతలో అమరావతి ప్రవేశించారు ఇద్దరూ. ఇంద్రుడు ఇంకేం మాట్లాడలేదు. తన సౌధం వైపు సాగిపోయాడు.

## 34

ఇంద్రుడు అదృశ్యం కాగానే అక్కడ కుటీరంలో అతని మాయ వల్ల ఏర్పడ్డ అలంకరణ అంతా కూడా మాయమైపోయింది. అలాగనే అహల్య కట్టుపుట్టాలూ కూడా మారిపోయాయి. ఆ 'ఇంద్రజాలం' తొలగ్గానే పూర్వ కుటీరం- వెనుకటి అహల్య- మిగిలిపోయారు.

ఇంద్రుడు అక్కడికి వచ్చినట్టు గానీ, ఆమెతో మాట్లాడినట్టు గానీ ఎవరికీ తెలియలేదు. కుటీరం బైట- ఆశ్రమంలో- చెట్టు కింద తపస్సు చేసుకునే గౌతముడికే తెలియలేదు.

ఇంద్రుడు వెళ్ళిపోయిన తర్వాత ఏదో బరువు తనకు సంక్రమించినట్లనిపించింది ఆమెకు. అదేమిటో అప్పుడామెకు తెలియలేదు.

ఇంద్రుడు- అతని వెంట ఇంద్రసఖి వెళ్ళిపోయాక, అహల్య ఒకతీ అలాగే ఉండిపోయిందక్కడే- ఆలోచిస్తూ!

కొన్నాళ్లకి గౌతముడికి తెలిసింది. అహల్య గర్భవతి... కాలం గడిచింది...అహల్యకి కొడుకు కలిగాడు.అబ్బాయి జన్మించిన లగ్నం గుణించాడు గౌతముడు. బాలుడు 'ఇంద్ర' అంశతో జన్మించాడు.

గౌతముడు అతనికి పేరుపెట్టాడు.

భూలోకంలో గడిచే కాలానికీ- స్వర్గలోకంలో దేవతలకి గడిచే కాలానికీ ఎంతో తేడా ఉంది. ఇక్కడి ఏళ్ళు అక్కడి రోజులు కూడా కావు!

'మనకి సూర్య చంద్ర గమనంలో కదా కాల గణనం జరుగుతున్నది! వాళ్ళకి సూర్య చంద్రులు అక్కడే ఉంటారాయే! వాళ్లకి కాలం జరగడం తెలీదు' చమత్కారంతో అన్నాడో ముని బాలుడు!

మిగతా వాళ్ళంతా ఆ మాటలకు నవ్వేశారు.

ఇంద్రాంశలో అహల్యకు కొడుకు పుట్టాక కొంతకాలం అతని ఆలనా పాలనతో గడిచిపోయింది. ఇక్కడిలా ఉంటే- అక్కడ ఆ లోకంలో దేవతలంతా తిరిగి ఇంద్రుడి సన్నిధికి వచ్చారు. భూలోకంలో రావణుడు విజృంభించి ముని జనాన్ని, జనాన్ని నానా హింసలు పెడుతున్నాడు.

దేవతలను తృణీకరిస్తున్నాడు. యజ్ఞ యాగాదులు సాగనివ్వడం లేదు. మహా మహా మహర్షులు విశ్వామిత్రాది మహర్షులే యజ్ఞాల మాట తలపెట్టడం లేదు. అక్కడంతా శ్రీమన్నారాయణుడు అవతరించే శుభ ఘడియ కోసం ఎదురుచూస్తున్నారు.

తన వద్దకు వచ్చిన దేవతా గణానికి ధైర్యం చెప్పాడు ఇంద్రుడు 'బ్రహ్మ చెప్పాడు! నారాయణుడే స్వయంగా చెప్పాడు! ఆయన భూలోకంలో అయోధ్యా నగర రాజ్యంలో దశరథుడి నోముల పంటగా అవతరిస్తాడు. అదెప్పుడో మనమంతా వేచి ఉండి చూడవలసిందే! అంతవరకూ రావణుని బాధలు కానీ, మహిరావణుని బాధలు గానీ భరించక తప్పదు!'

ఇంద్రుడి మాటలు విని దేవగణం తిరిగి వెళ్ళారు!

ఇంద్రుడు ఒక్కడే మిగిలిపోయాడు. అప్పుడొచ్చింది శచీదేవి! ఆమెను చూసి సాదరంగా ఆహ్వానించాడు ఇంద్రుడు. ఇప్పుడు ఆమెను చూడగానే అప్పుడామె తనని అహల్యా సన్నిధిలో ఉన్నవాడిని ఉన్నట్టు పిలిపించిన విషయం గుర్తొచ్చింది.

ఆనాడు ఇంద్రసఖి- అహల్యకు వినిపించనంత మెల్లిగా తన దేవేరి పంపిన సందేశం- దేవనాధుడికి విన్నవించగానే ఆఘమేఘాలమీద వచ్చాడు ఇంద్రుడు. దారిలో ఇంద్రసఖితో ముచ్చటిస్తూనే వచ్చాడు.

అమరలోకం చేరగానే గమనం ఆగింది.

ఇంద్రసఖి ముందు నడవగా- ఇంద్రుడు శచీ మందిరం వైపు సాగాడు. ఆయన్ని శచీదేవి  శయన మందిరం దాకా తీసుకువెళ్ళి, ఆయన లోపలికి వెళ్లగానే ఆమె ఆగిపోయింది.

అప్పుడు- ఇంద్రుడు మందిరం ప్రవేశించగానే శచీదేవి లేచి నుంచుంది. ఆమెను చూసి మందహాసం చేశాడు ఇంద్రుడు.

'దేవి గారు అతి ప్రసన్నులయినట్లు కనిపిస్తున్నది. తమరిలా హఠాత్తుగా పిలవనంపడానికి కారణం ఏమిటో తెలుసుకోవచ్చునా! కొద్దిసేపు క్రితమే కదా తమరితో మందాకినిలో విహరించింది. ఆ విహారాలు చాలించి ఇక్కడికి వచ్చి మీరు మీ మందిరంలోకి ప్రవేశించాకే కదా మేమటు వెళ్ళింది! అంతలోనే ఇంద్రసఖిని పిలిపించి పంపించి మమ్మల్ని వెతికి తోడి తెమ్మనడం ఎందుకో తెలుసుకోవచ్చా!

తమ ప్రసన్న సన్నిధానం మాకెప్పుడూ సంతోషదాయకమే! ముల్లోకాల పాలనలో- దాయాది- రాక్షసుల దైత్య ప్రవర్తనతో వారివల్ల ఏర్పడే అరాచకంతో చికాకు చెందే మాకు మీరు కలిగించే కల్పించే సేవలు మాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి.

చికాకును చింతను పారదోలతాయి. అన్నీ ఆ క్షణంలో మరిచి మైమరిచి సుఖిస్తాం. అయినా కలతతో పిలిపించారో కలవరపాటుతో పిలిపించారో తెలుసుకోవాలి కదా!' ఆగాడు ఇంద్రుడు. శచీదేవి నవ్వింది.

'ఇంద్రసఖి వర్తమానం తెచ్చిందే గానీ విషయం వివరించ లేదు!'

మృదు మందహాసాలు వెలయించిందామె.

అతనూ నవ్వేడు. అహల్య సన్నిధి నుంచి వదిలి రావడం- ఆమెను వదిలి రావడం వల్ల ఏర్పడిన మనో వ్యగ్రత శచీదేవి చిరునవ్వులు చూశాక మాయమైంది.

తీరని కోరిక కలిగించిన అసంతృప్తి తొలగి పోగానే ఆప్యాయంగా పలకరించాడు.

'దేవీ! శచీదేవీ! ఏమిటి ఈ ఆహ్వానంలోని ఆంతర్యం?' శచీదేవి మళ్ళీ నవ్వింది. అదే జవాబు అన్నట్లుగా మరింత ముందుకు కదిలాడు ఇంద్రుడు. ఆమెను సమీపించాడు. ఆమె భుజాలపై చేతులు వేశాడు. సూటిగా ఆమె కళ్లలోకి చూశాడు. రెప్పపాటెరుగని దేవ కాంత కదా శచీదేవి! భర్త అలా చూడగానే తనూ ఆయన కళ్లలోకి కళ్ళుపెట్టి చూసింది.

ఇంద్రుడు చూపులు కలిసి శచీదేవిని నిలువెల్లా తడుముతున్నట్లు చూశాడు. ఆ చూపుల్లో వేనవేల కోరికలు.

'ప్రభువులకు రెండు కళ్ళు చాలనట్లున్నది'

నవ్వుతూ అంది శచీదేవి.

'వేయి కళ్ళుంటే బావుండుననిపిస్తోంది దేవీ!'

'వేయి కనులు చాలునా! వేయి బాహువులు కావలెనేమో!'

'పరిష్వంగానికా వలదు! రెండు బాహువుల బిగి కౌగిలికే తమ తనువు కందిపోతుందేమో అన్నట్లు ఉంది కదా! చూపులతో చూసి చూసి ఆనందించాలని వేయి కనులు వుంటే బావుండుననిపించింది'

'తమరికి వేయి కళ్ళు ఎలా పుట్టుకొస్తాయి స్వామీ! చిత్రంగా లేదూ కోరిక!' ఆశ్చర్యంగా అడిగింది.

'ఒళ్ళంతా కళ్ళయితే గానీ వేయి కళ్ళూ కావేమో! ఆ సృష్టికర్తని వరమడిగి తెచ్చుకోనా దేవీ!'

'వద్దు లెండి. ఆ రెండు కళ్ళ చూపుల తూపులకే ఓర్చుకోలేక పోతున్న నేను అన్ని కన్నుల బారికి ఆగలేను'

'అవునవును! అతిశయోక్తి అతిశయోక్తిగా ఉంటేనే అలకారం అందగిస్తుంది. కానీ నిజమైతే అందమా చందమా!'

'ప్రభూ!'

'సెలవివ్వు దేవీ!'

'మందాకినీలో విహరించి వచ్చిన మనం విలాసంగా ఆనందించి వినోదించవద్దా!'

'చెప్పు దేవీ! వీణానాదన వినాలని ఉందా! రంభాది అప్సరసల అందమైన నాట్యం చూసి వినోదించాలని ఉందా!'

'అవేవీ వద్దు ప్రభూ! వారి నృత్యం చూసి చూసి విసుగెత్తుతున్నది!'

నవ్వేడు ఇంద్రుడు.

'తినగా తినగా గారెలు చేదని ఆంధ్రదేశంలో అంటారని నారదుడు చెప్పాడులే! అక్కడ దేనికైనా ముఖం మొత్తితే అలా హేళన చేస్తారట! తీపి గారెలు తినగా తినగా ఆ తీపి భరించలేక విసుక్కుని ఇక చాలంటారట!'

'మళ్ళీ మట్టుకోరా! ఆ మధుర పదార్థాన్ని!' చెక్కిలిపై చేయి నొక్కుకుంటూ అడిగిందామె.

ఆ చలద్భంగిమ చూసిన ఇంద్రుడికి మనసు చెదిరి ఆమె చెక్కిలి తన చేత్తో నొక్కి అన్నాడు విలాసంగా.

'బావుంది తమ మాట! అదంతా తాత్కాలిక వైరాగ్యం. మళ్ళీ మామూలే!'

'హూ!'

'అలాగా మీకు నాట్యం రుచించలేదేమో!'

'ఊహూ!'

'సరి! మీరు మరేం కావాలో అడగండి!'

'అడిగితే' ఆర్ద్రోక్తిలో ప్రశ్నించింది.

'ఆవశ్యం తీరుస్తాను'

'విని ఊహూ అంటేనో!'

'ఏడేడు పద్నాలుగు లోకాల ఏలిక అర్ధాంగివి నువ్వు! నీ మాట అంటే నా మాటలో సగం మాట కదా!

అర్ధాంగి అనే మాటకు అర్ధమా అన్నట్లు ఆ పార్వతీ పరమేశ్వరులు అర్ధనారీశ్వరులు అయ్యాక ఎవరి భార్య అయినా ఇక భర్తలో సగం అన్నట్లుగా అర్ధాంగి అనే మాట రూఢి అయింది కదా! ఇంతటి అధికారి భార్యకు అంతో ఇంతో అధికారం వుండదా! ఆమె మాట విని ఊహూ అంటే ఆమె అధికారాన్ని ధిక్కరించినట్లే కదా!'

'అధికారమా?' ఆశ్చర్యంగా అడిగింది శచీదేవి.

'ఆహా! భర్తకూ భార్యకూ మధ్య గల అనుబంధంలో భార్యకు భర్తపై అంతో ఇంతో అధికారం సంక్రమిస్తుందిలే!' నవ్వుతూ అన్నాడు ఇంద్రుడు.

'తమరికన్నీ నవ్వులే! నేనేదో కోరిక కోరతానంటే దానికింత కథ చదివారు. పదునాలుగు లోకాలు- పాలన- ప్రభుత్వం- అర్ధాంగి- అధికారంలో సగం... ఏమి మాటకారులు ప్రభూ తమరు'

'సరే వేదన తెచ్చే వాదన ఎందుకు... అదో... అదేమిటో తమరు తమ అంతరంగంలోని కోరికని ఆంతర్యం విడిచి విన్నవిస్తే...'

'విన్నపాలు అన్నీ మిన్నేటి పాలు కావు కదా!'

'మాట విరుపుతో మనసుకి వెరుపు తెస్తున్నారా తమరు!'

'ఎంత మాట!'

'ఎంత మాటో మనసులోని వింత మాట చెప్పండి స్వామీ!'

'చెప్పడానికేముందీ. చెప్పొచ్చు! తమరు వీనులరా విననూ వచ్చు! కానీ తీర్చాలి కదా తమరా కోరిక...'

'మనస్సులోని కోరిక మనస్సులోనే ఉండగానే మాట పెదవి దాటి బయటికి రాకుండానే ఎలా! పోనీ తమ మనస్సులోకి తొంగి చూడనా! అలా కోరికేమిటో తెలుసుకుని తీర్చేస్తాను!'

'వద్దు! వద్దు!' వారించింది శచీదేవి.

ఆ తొందరపాటుకి నవ్వొచ్చింది ఇంద్రుడికి.

'నవ్వులాటగా ఉందా తమకి!'

'ఊహూ! ఆనందంగా ఉంది! ఆ ఆనందంతోనే నవ్వొచ్చి నవ్వాను!'

'ఊ నన్ను చూసి నవ్వేరు అనుకున్నాను'

'నిన్ను చూసి నీ సోయగం చూసి- నీ మాటలు విని- నీ మాటల్లోని మాధుర్యాన్ని గుర్తించి నవ్వాను'

'ప్రభూ! అయితే మరి కోరనా?'

'కోరుకో దేవీ... అయినా కోరడం ఏమిటీ! మహేంద్రుడి పత్నివి! మమ్మాజ్ఞాపించండి. ఇక్కడే ఇప్పుడే ప్రత్యక్షమయ్యేలా తెప్పిస్తాను'

'మహేంద్రజాలం చేస్తారా?'

మహేంద్రజాలం అనే మాట విని ఉలిక్కిపడ్డాడు ఇంద్రుడు. అంతలోనే ఆమె మాటల్లో మరో అర్థం ధ్వనించడం లేదని గ్రహించి ఉలికిపాటుని అణుచుకుని నవ్వుతూ అన్నాడు 'మాయ ఎందుకు?'

శచీదేవి నవ్వింది.

'చెప్పండి దేవీ!'

'ప్రభూ! మనం మానవ లోకానికి వెళ్ళి మహిమాన్వితాలయిన హిమాలయాలు చేరి అక్కడ మలయ మారుతానికి సొక్కి, అక్కడి మానస సరోవరంలో విహరించి ఆ జలకేళి తర్వాత భూలోకాన్ని వీక్షించి తిరిగి రావాలని ఉంది'

అబ్బురపడ్డాడు ఇంద్రుడు.

క్షణంపాటు ఆగి అన్నాడు 'దేవీ భూలోకంలో సుఖ శాంతులు తక్కువైనాయి. మానవులకు రాక్షస బాధ ఎక్కువైంది. రావణుడి దుశ్చర్యలు మితిమీరి పోతున్నాయి. ప్రజలకు భద్రత లేదు. శాంతి లేదు. ఆ లంకేశ్వరుడి ఆటలు కట్టించడానికి నారాయణుడే అవతరించనున్నాడు. అంతవరకూ అతని బాధ అన్ని లోకాలకూ.. లోకాల ఏలికకూ తప్పదు'

శచీదేవి నిట్టూర్చింది.

'నిరాశ చెందకు దేవీ! హిమాలయాల్లో విహరించి వద్దాం! జలకేళి సాగిద్దాం... కానీ ఆలోక ఆలోకనం అని మాత్రం వద్దు!'

శచీదేవి తలూపింది.

## 35

గతం అంతా గుర్తొచ్చి పకపక నవ్వేడు ఇంద్రుడు.

'ఏమి ప్రభూ!'

'నాటి మాటలు గుర్తొచ్చాయి దేవీ!'

'ఏనాటి మాటలు స్వామీ!'

'ఆనాటి మాటలు- అదే మనం హిమాలయాలు చూసి అక్కడ విహరించి మానస సరోవరంలో ఓలలాడి వచ్చిన నాటి మాటలు'

శచీదేవికి అవి గుర్తొచ్చాయి.

ఆమె కూడా నవ్వింది జతగా.

నవ్వులు ముగిశాక అడిగింది 'దేవగణమంతా తమ సన్నిధికి వచ్చారేం ప్రభూ!'

'మొర పెట్టుకోవడానికి. నానాటికీ రావణుని దుశ్చర్యలు మితిమీరిపోతున్నాయి. పెరుగుట విరుగుట కొరకే అంటారట భూలోకం లోని అజనాభదేశంలోని- ఆంధ్రదేశంలో!'

'అబ్బ - అంత వివరణ ఇవ్వాలా? ఆంధ్రదేశం అంటే చాలదా! బ్రహ్మర్షి విశ్వామిత్రులవారు రాజర్షిగా ఉండగా జన్మించిన సంతానంలో ఆంధ్రుడు ఒకడనీ, అతడి పేరుతో ఆంధ్రదేశం వెలిసిందనీ నారదుడు మీతో చెప్పారని నాకు చెప్పారని మీరు మరిచిపోయినా నేను మరిచిపోలేదు లెండి!'

ఆ ధాటికి ఇంద్రుడు నవ్వేడు.

'అలా పెరిగిపోతున్న రావణుని దౌష్ట్యానికి గురైన జనం, ముని జనం తల్లడిల్లిపోతున్నారు. దేవతలకూ బాధగానే ఉంది. అందుకే నా సన్నిధికి వచ్చారు'

'తమరేం చెప్పారు. తరలి బ్రహ్మ వద్దకో ఆ నారాయణుడి వద్దకో వెళదామని చెప్పారా?'

'ఊహూ! అదంతా జరిగిపోయింది కదాగ మళ్ళీ మళ్ళీ వెళ్ళినా అదే సమాధానం. నారాయణుడు నరుడిగా అవతరిస్తే తప్ప ఆ బాధ తొలగదు'

'అదెప్పుడో!'

'దశరధుడి పుణ్యం ఫలించినప్పుడు!'

'అదేమిటీ? మధ్యలో ఆ అయోధ్యాధీశుడెందుకూ?'

'శ్రీమన్నారాయణుడు కొడుకుగా జన్మించబోయేది ఆ దశరధుడికే కదా! సంతానం లేని వంతతో చింతతో సంతతం వగస్తున్నది ఆ దశరధుడే కదా!'

'ఎప్పుడట ఆ శుభ గడియ!'

'బాగున్నది దేవీ నీ మాట! కథంతా విని కధానాయకుడికి కధానాయిక ఏమవుతుందని అడిగాడట ఎవరో!'

'ఇదీ ఆంధ్ర దేశం సామెతేనా?'

'ఎలా గుర్తించావు దేవీ!'

'తమరి నోటంట తరచు వారి జీవితం- వారి మాటలు- వారి సామెతలే వస్తున్నాయి కదా! నారదుల వారికీ మరేంపని లేనట్లున్నది. ఎప్పుడూ ఆంధ్రదేశం వెళ్ళి వస్తుంటారేమో!'

ఉలిక్కిపడ్డాడు ఇంద్రుడు.

ఇంద్రసఖి వెళ్ళి వస్తున్న విషయం పసిగట్టిందా దేవి - లేక తను వెళ్ళి వచ్చిన విషయం తెలిసిందా! అనుకున్నాడు.

కానీ శచీదేవి మళ్ళీ అంది 'నారదులవారు ఒకప్పుడు మీ సన్నిధి నుంచి వచ్చి నాతో చెప్పారు. ప్రభూ! ఆంధ్రుల జీవితం గురించీ, వారి ఆత్మాభిమానం గురించీ, అహమహమిక గురించీ, వారి ఆరంభ శూరత్వం గురించీ చెప్పారు!'

తేలిగ్గా నిట్టూర్చాడు దేవేంద్రుడు.

'ఆయన అవతరించేదాకా అష్టకష్టాలూ తప్పవన్నమాట!'

'అదీ ఆంధ్రుల మాటే కదూ!'

'అవునవును!'

ఆ మాటలకి యిద్దరూ నవ్వుకున్నారు.

* * * *

ఒకనాడు గౌతమమహర్షి నదీ తీరానికి వెళ్ళి దాని వెంబడే నడుస్తూ ఉన్నారు. పక్కనే గలగల పారే సెలయేరు. దాని పరివాహక ప్రాంతంలో సమృద్ధిగా పండుతున్న పైరు. అందువల్ల కంటికి పచ్చగా అందంగా కనిపిస్తోన్న భూమి. వాటి వెనుక దూరంగా కనిపిస్తోన్న కొండలు. మధ్య మధ్య గ్రామాలు. వాటిలో నివసిస్తున్న జనాలు. ఈ నదీ జలాల వల్ల వారు అందరూ అనుభవిస్తోన్న సుఖ శాంతులు. ఆయనకి ఆ నదీ పుట్టుక జ్ఞాపకం వచ్చింది.

సకల విద్యావేత్తయై, మహర్షియై, గౌతముడు తపస్సంపన్నుడైన గౌతముడు గురుకులం స్థాపించి శిష్యులకు విద్యాదానం చెయ్యాలని సంకల్పించారు. నిరంతరం విద్యా బోధనతో కాలం గడిపే గురువులకు చదువుకునే శిష్యులకూ కావలసిన ఆహార పదార్థాలూ, వస్త్రాలూ, అన్నీ ఎలా సమకూరాలి?

వాటి గురించి ఆలోచిస్తూ కూర్చుంటే అధ్యయనం, అధ్యాపనం రెండూ కుంటి నడక నడుస్తాయి. చదివే వారికీ, చదువు చెప్పేవారికీ ఆ అన్వేషణ ఉండకూడదు!

కొందరు మునులకు వారు వారు నివశించే ప్రాంతాన్ని పాలించే రాజులు పుష్కలంగా ధన కనక వస్తు వాహనాదులు పంపుతూ ఉన్నారు. దానివల్ల ఆశ్రమ జీవనం నిర్విచారంగా సాగిపోతున్నది. కానీ అవసరమైనప్పుడల్లా గురువుతో శిష్యులో వెళ్ళి రాజదర్శనం చేయాలి. అర్థించాలి. ఆపై వాటిని సంగ్రహించుకోవాలి.

గౌతముడికి మిథిలా నగరాధీశుడైన జనక రాజర్షిని యాచించడం ఇష్టం లేదు. ఆయన ఎంత రాజర్షి అయినా తనెంత మహర్షి అయినా ఆ విదేహా రాజ్యానికి వెళ్ళి దేహీ అని అడుక్కోవటం ఆత్మన్యూనతే!

అడగందే అమ్మైనా అన్నం పెట్టదు కదా!

తనకేయే అవసరాలుంటాయో వాటిని గుర్తించి పంపేంత ఓపిక తీరిక పాలకులకు ఎక్కడుంటుంది?

స్వయంగా జనక రాజర్షి అందుకు పూనుకోలేరు కదా! మంత్రులు, రాజోద్యోగులు, సేవకులూ చేయవలసిన పనులవి. అందుకని అభ్యర్ధన అది మహర్షులకు ఇష్టం లేదు. మరి బ్రతుకు సాగేదెట్లా? కృషి వల్ల పొలాలలో పంటలు పండించుకోవచ్చును. అదీ ఒక విద్యే!

విద్యార్థి తన విద్య పూర్తికాగానే నిజ జీవితంలో ఆ కృషి వల్ల నిర్వికారంగా బ్రతకవచ్చు. కానీ కృషి వర్షాధారం! వర్షాలు కురవాలి! వరిచేలు పండాలి! దానికి వరుణుడి కరుణ కావాలి. ఇది ధర్మ పరిపాలన లోని నేలే! ఇక్కడ నెలకు మూడు వానలు కురుస్తూనే ఉన్నాయి. కురుస్తాయి. నాలుగు నెలలు అలా వర్షం వస్తూనే ఉంది. కానీ ఆ వర్షాలు ఎల్లప్పుడూ వస్తాయా! రాకపోవచ్చు! కాల గమనం ఎలాంటిదో చెప్పలేం కదా! వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరు చెప్పగలరు?

ఒక వేళ అన్నీ సక్రమంగా సాగినా - సాగిన వ్యవసాయంతో పుష్కలంగా పంటలు పండినా, పండిన ఆ ధాన్యాన్ని దాచుకోవడం ఒక ప్రశ్న కదా! సామాన్య మానవునిలాగ సంసార బంధంలో పడిపోవడమే కదా! అది న్యాయమా? న్యాయ ధర్మ సూత్రాలను నిర్మించిన తను గతానుగతి చక్రంలో యిరుక్కున్న మామూలు మనిషిలాగ బ్రతికెయ్యడమే! ఊహూ! అది కుదరదు! తన ప్రవృత్తికి అది తగదు.

మరేం చెయ్యాలి! నారు పోసిన వాడే నీరు పోస్తాడు. తననింత వాడిని చేసిన ఆ బ్రహ్మనే ప్రార్థిద్దాం. ఆ ఆలోచన రాగానే ఆయన మనస్సు నిర్మలమైంది. నిశ్చలమైంది. తదేక చిత్తంతో పరమేష్టిని గూర్చి తపస్సు చేశాడు.

బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు.

'నాయనా గౌతమా!'

ఆ పిలుపు వినగానే గౌతముడు కళ్ళు తెరిచాడు. ఎదురుగా బ్రహ్మ! నాలుగు వేదాలూ నిలువగా అవతరించినట్లు అనిపించింది. ఆ నాల్గుమోముల వేలుపు కనులెదుట కనిపించగానే పరవశుడైనాడు గౌతముడు. తన తపస్సు ఫలించినందుకు ఎంతో సంతోషించాడు'

గౌతమమహర్షి తన సందర్శనంతో తన్మయుడైన గౌతముడిని చిరునవ్వుతో పలుకరించాడు బ్రహ్మ!

సరిగ్గా అదే సమయంలో అమరావతిలో అచ్చెరల చెరలో ఉన్న ఇంద్రుడు కలవరపడ్డాడు.

## 36

అమర గానాన్ని వింటూ- అచ్చెరల నాట్యాన్ని చూస్తూ అమృతం సేవిస్తూ మధ్యే మధ్యే పానీయం అంటూ అప్సర శిరోమణుల అధరామృతాన్ని సేవిస్తూ రశిస్తూ ఆనందిస్తూ ఉన్న మహేంద్రుడు ఉలికిపాటుతో, కలవరపాటుతో కంగారు పడ్డాడు.

అది నందనోద్యానంలో ఓ ఏకాంత ప్రదేశం.

పూల తీగలతో అందంగా తోటమాలులు తీర్చిదిద్దిన రంగప్రవేశ ద్వారం. నాలుగు వేపులా ఎత్తైన వృక్షాలు! వాటి బోదెలు చక్కగా గుండ్రంగా సుందరాతి సుందరంగా పెరిగేలా చూసుకుంటూ అవి బాగా ఎత్తుకు పెరిగేదాకా బోదెలకు కొమ్మలు రెమ్మలూ పెరగకుండా చూసుకుని చతురస్త్రం ఏర్పడిన ఆ ప్రదేశాన్ని కప్పేసేలా పూల తీగల్ని పాకించి పూలతో నిర్మించిన భవనంలా భ్రాంతి కలిగించేలా పెంచారు.

అక్కడ అప్పుడప్పుడు వినోదిస్తాడు దేవేంద్రుడు.

ఆయన సన్నిధిలో మేనక, ఊర్వశి, తిలోత్తమ మొదలగు ప్రసిద్ధ నర్తకీమణులు మాత్రమే చేరి తమ తమ శృంగారం వొలికే నాట్యాలతో తనూ శృంగారంతో గాత్ర మాధుర్యంతో, గాన మాధుర్యంతో తమ దేవ రాట్టును అలరిస్తూ ఉంటారు.

ఆనందంతో సొక్కి సొమ్మసిల్లవలసిన తమ ప్రభువు.. అలా హఠాత్తుగా కలవర పడగానే వాళ్ళూ కలవరపడ్డారు.

'ఏమి ప్రభూ!' అని అడిగింది మేనక. తమ దేవనాధుడికి ఏ ఆపద వచ్చినా ఆదుకునే తొలి ఇంతి.

అప్సరసల్లో తొలి బంతి ఆమె. పూల బంతిలా ఉంటుంది మేనక. అదీ దేవపారిజాతాల పూబంతిలా ఉంటుంది.

'ఏమైంది ప్రభూ!' ప్రశ్నించింది రంభ! సంరంభంతో సమరంతో సాధించుకోలేని అనేక విజయాలు రంభ వల్ల సాధించాడు మహేంద్రుడు. మహేంద్ర వైభవ ప్రతీకల్లో రంభ ఒకతి! ఆమె లేని నాట్య ప్రదర్శన ఉండదు. గాన వినోదమూ ఉండదు!

'కలవరపాటుకు కారణమేమి ప్రభూ!' అని తన శృంగార సరసితో తన్మయుడ్ని చేసే ఊర్వశి ప్రశ్నించింది.

'ఉలికిపడ్డారేం ప్రభూ!' అని తిలోత్తమ అడిగింది.

నలుగురూ తన ప్రాభవ మంటపానికి నాలుగు స్థంభాల్లాంటి వారు. అష్ట దిగ్గజాలు భూమిని మోస్తూ ఉంటే, దిగ్గజాలను ధిక్కరించే అందమైన నడకతో అందరి మతులూ పోగొట్టే యీ నలుగురు అప్సరసలూ తన వైభవం ప్రాభవం పదవీ, పరువూ నిలబెడుతున్నారు.

వాళ్లలా ప్రశ్నించగానే మహేంద్రుడికి ధైర్యం వచ్చింది. మహర్షుల మనస్సులయినా మహా మూఢ భక్తి శిఖామణులైన రాక్షసుల కఠోర చిత్తాలయినా కదిలించి కరిగించి పాదా క్రాంతులను చేసుకోగల ప్రతిభావంతులు తన ఆస్థాన నర్తకీమణులు. అండగా వీళ్ళుండగా తనకూ తన పదవికీ భంగం ఉండదు అనుకున్నాడు.

ఆ ధైర్యంతో అధైర్యాన్ని పారదోలి- చికాకును వెనుకకు నెట్టి- కలవరాన్ని కాలరాచినట్టు అణిచేసి నవ్వుతో అన్నాడు 'మహర్షి గౌతములు మా కలవరపాటుకు కారణం'

'గౌతమ మహర్షా?'

'గోదావరీ తీర నివాసి గౌతమ మహర్షా?

'న్యాయ సూత్ర నిర్మాత గౌతములా?

'పరమ శాంతుడు ఆ గౌతములా?'

నలుగురూ విభ్రాంతితో నాలుగు విధాలా అడిగారు. వారి ప్రశ్నలు వినగానే మనస్సు చివుక్కుమంది. అయినా 'అవును వారే! ఆయన తపస్సు ప్రారంభించాడు. ఆయనేం విశ్వామిత్రుడిలా ముక్కోపి కాదు. దుర్వాసుడిలా తీవ్రుడూ కాదు. ఆయన ఇంతలో బ్రహ్మ ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకో అన్నాడు అదీ నా కలవరానికి కారణం'

'వరమడిగితే మీకేం నష్టం ప్రభూ!'

'ఏమడుగుతాడో కదా!'

'ఏమడగ్గలడు ప్రభూ! వారికి వారి లోకం సంగతే సరిగ్గా తెలియదు. మరేం లోకాలు చూశారు. స్వర్గం తప్ప. వైకుంఠ జ్ఞానం తప్ప. లోక జ్ఞానం వారికి తక్కువే కదా ప్రభూ!'

దుందుడుకుగా అచ్చెర భామ అలా అనగానే ఊర్వశి వైపు చూసి అన్నాడు 'తప్పు! మహాత్ములను అలా అనకూడదు. వారు లౌకిక వాంఛలకు దూరమే! లౌకిక సుఖాలకు దూరమే! కానీ వారికి లోక వృత్తం, లోక వృత్తాంతం తెలియదు అనుకోకు'

ఊర్వశి ముఖం తిప్పుకుంది. తను తన ప్రభువుని గొప్పజేసి ఆ మహర్షిని తక్కువ చేసి మాట్లాడితే త్రిలోకాధీశుడు తనను మెచ్చక- నొచ్చుకుని తన మనసు నొచ్చేలా మాట్లాడటం ఆమెకి ఆవేదన కలిగించింది.

'మరేమిటి ప్రభూ?' పరిష్కారం ఏమిటన్నట్లు ప్రశ్నించింది.

'నా భయం ఒక్కటే!'

'ఏమిటి ప్రభూ!'

'ఇప్పుడా భూలోకంలో, ఆ అడవిలో ఆ ఆశ్రమంలో ఆయనకు ఏం సుఖం దక్కింది? సుఖాలతో అవసరం లేదంటారా? మరింకేం కావాలి? భోగాలా? అవీ లేవు కదా! వారు వస్తూ వెళుతూ స్వర్గం చూసిన వారే కదా! స్వర్గ సుఖాలు రుచి చూసిన వారే కదా! ఎన్నాళ్ళీ ఆశ్రమ జీవితం! ఈ కష్టాలూ నష్టాలూ ఎన్నాళ్ళు? ఏకంగా ఇంద్ర పదవిని అడిగితే సృష్టికర్త తన తపస్సుకి సంతోషించి విధాత- తననే ఏకంగా ఇంద్రుని చెయొచ్చు. ఆయన కోసం దేవతా విమానం వెళుతుంది. అందులో అధిష్టించి రీవీగా అమరావతికి విచ్చేస్తాడు. అప్పుడు మీరంతా విధాత చేసే విధి విధానాలకు బందీలు కాబట్టి ఆయనకు మందాకినీ జలాలతో కాళ్ళు కడుగుతారు. సుర గంగతో అభిషేకిస్తారు. వింజామరలు వీస్తారు. వెల్ల ఏనుగైన ఐరావతం ఎక్కిస్తారు. సభకు బరాబరులు పలుకుతూ స్తోత్రాలు చేస్తూ తోడ్కొని వస్తారు. బ్రహ్మ ఆజ్ఞ మేరకు నేను ఆ వరకే సింహాసనం దిగి ఉంటాను. ఖాళీగా ఉన్న సురేంద్రపీఠం పైన గౌతములను కూర్చోబెడతారు. నేను దిగులుతో కుంగిపోవాలో- రాక్షసులు ఆక్రమించుకోలేదని ఆనందించాలో- మహర్షులు కదా అని మీతోపాటే నేనూ వారిని సేవించాలో!' ఇంద్రుడు ఆగాడు. అచ్చెరలు తెల్లబోయారు.

సరిగ్గా అప్పుడే గౌతముడు తన కోరికను విన్నవించుకున్నాడు.

## 37

'గౌతమ మహర్షీ!'

సృష్టికర్త అలా పిలవగానే గౌతముడు కళ్ళు తెరిచాడు. సంకల్ప మాత్రంతో సాక్షాత్కరించినట్లు బ్రహ్మ తన ముందు అలా ప్రత్యక్షం కాగానే గౌతముడుకి పరమానందం కలిగింది. ఎన్నో వేల సంవత్సరాలు తపస్సు చేస్తేనే గానీ ప్రత్యక్షం కారు త్రిమూర్తులు. కానీ తనువు కృశించి నశించిపోతుందా అనేదాకా వారి సాక్షాత్కారం సిద్ధించదు! భక్త సులభుడైన శంకరుడైనా, జ్ఞాన సులభుడైన విష్ణువయినా అంతే!

వారు తమ శిష్యుల భక్తి పరాకాష్ట చెందేదాకా భక్తులకు దర్శనం ఇవ్వరు. అలాంటిది పిలవగానే పరిగెత్తుకుని వచ్చినట్టు బ్రహ్మ సాత్కరించరించగానే తన్మయత్వంతో మనసు పులకరించి తబ్బిబ్బయ్యాడు గౌతముడు. మైమరిచి ప్రస్తుతించాడు.

గౌతముడి స్తోత్రాలు విని బ్రహ్మ మరింత సంతసించాడు. 'గౌతమా! నీ నిష్కల్మష జీవనమూ, నీ పాండిత్యమూ, నీ నిర్మల హృదయమూ నన్నెంతో అలరించాయి. నీవు నన్ను సంకల్పించి ధ్యానించగానే నేను వచ్చేశాను. ఏం కావాలో కోరుకో!' అన్నాడు.

వేద పనస ల్లాంటి పసగల ఆ పలుకులు వినగానే మనసంతా ఆనందం నిండిపోయింది గౌతముడికి.

'పరమేష్టి! నేను గురుకులాన్ని నిర్వహిస్తున్నాను. నా చెంత ఎందరో విద్యాభ్యాసం చేస్తున్నారు. నాతో చదువుతున్న వారందరి భోజన భోజనాదుల బాధ్యత నాదే కదా! శిష్యులకు అన్నం పెట్టి చదువు చెప్పడం ధర్మం కదా! చదువుకుంటూ వారు మరొకరిని అన్నానికై అర్ధించడం తగదు కదా! అందుకే వారందరికీ అన్న పానాదులకు లోటు లేకుండా చూసే బాధ్యతను నాపై వేసుకున్నాను'

గౌతముడి మాటలు వింటూ బ్రహ్మ తలూపేడు. ఆయన తలాడిస్తే అది చతుర్వేద సమ్మతమన్నట్లుగా భావించాడు గౌతముడు.

'విద్యార్థుల తిండి కోసం నేనెవ్వరినీ యాచించను?' గౌతముడు ప్రశ్నించినట్లుగా అడిగాడు.

బ్రహ్మ జవాబివ్వలేదు.

'రాజులను ఆశ్రయించాలి. ఇరుగు పొరుగు రాజ్యాలకు వెళ్ళి ఆ రాజన్యులను ఆశ్రయించి- వారు భక్తి శ్రద్ధలతోనే ఇస్తారు. వాళ్ళిచ్చే ధాన్య రాశులను తెచ్చుకోవాలి. చాలా గురుకులాల్లో జరిగిన జరుగుతున్న సంప్రదాయం ఇదే!'

బ్రహ్మ వింటున్నాడు.

'కానీ గౌతమ గురుకులం వారికి ఆ బాధ ఉండరాదని నేను నిర్ణయించుకున్నాను.

బాధ ఏమిటా అన్నట్లు చూశాడు బ్రహ్మ.

'నేనే వెళ్ళాలి. కోసల, మగధకో, అయోధ్యకో, విదేహకో వెళ్ళాలి. నోరు తెరిచి అడగాలి. అడగందే అమ్మయినా పెట్టదని సామాన్యులు మొదలుకుని మాన్యులు కూడా అంటూంటారులే స్వామీ! అవును నిజమే కదా! విడిచి నోరు తెరిచి అడగనిదే నేనెందుకొచ్చానో వారికెలా తెలుస్తుంది?

వాళ్ళ వద్దకు వెళ్ళాలంటే తిథి వార నక్షత్ర యోగాలు అన్నీ కుదరాలి కదా! వార శూలలు పనికిరావు కదా! దగ్ధ యోగాలు అచ్చిరావు కదా! దుర్ముహుర్తంలో బయలుదేరలేం కదా! యమగండ కాలం తగదు కదా! వర్జ్యం వదిలి వెయ్యాలి కదా! ఇన్ని పరిశీలించి బయలుదేరడానికి విద్యార్థులకు అనధ్యయన దినాలు వదలాలి. ఆ రోజులు మా ప్రయాణానికి పనికిరావు కదా! పున్నమ! అమావాస్య, ప్రతిపత్తు యివేవీ కూడా ఆశ్రమం విడిచి అడుగు వెయ్యడానికి అనుకూలం కావు కదా!'

గౌతముడి మాటలు అడ్డుకుంటూ అన్నాడు బ్రహ్మ 'ఎంత చదువు చదివావయ్యా గౌతమా! సరే! నువ్వు వెళ్ళి ఆ రాజులను ఆశ్రయించవు. అడగవు. అలా వారి వద్దకు వెళ్ళావంటే విద్యార్థుల చదువు చెడుతుంది. నీ బాధ నాకు తెలిసింది సరే...'

బ్రహ్మ అలా కల్పించుకుని అనగానే- ఆయన మాటల్లోని చమత్కారం గుర్తించాడు గౌతముడు.

'ఎంత చదువు చదివినా చదువుల తల్లి నాధులైన మీ అంత చదువు చదవగలమా స్వామీ!'

నవ్వాడు బ్రహ్మ. 'నా అధికారం మీ చదువుల తల్లి భర్తగానేనా! మరేం లేదా?'

'ఎందుకు లేదు పరమేష్టీ! తమరు శ్రీమన్నరాయణుడి, పరమశివుడితో సమానంగా ముగ్గురు మూర్తులలో ఒకరు కదా! తమరు లేనిదే సృష్టే లేదు కదా సృష్టికర్తా! మీరు తమరు లేనిదే వేదాలే లేవు కదా! వేదం లేకుంటే విద్యే లేదు కదా! సర్వ వాఙ్మయం వేదం నుంచే పుట్టుకొచ్చింది! తమరిని తక్కువ చేసి మాటలాడగలనా స్వామీ!'

'ఊ! మాటలు మళ్ళీ మార్గాంతరం పట్టాయి. గురుకుల నిర్వహణలో నీ క్లిష్టత ఏమిటో చెప్పు వింటాను!'

'ఇతరులను అర్థించినా అభ్యర్థించినా యాచించడం లాంటిదే కదా! విద్యార్థి విద్యను అర్థించి వస్తాడు మా సన్నిధికి. అతనికి మరో ధ్యాస, మరో కష్టం లేకుండా సర్వం మేమే చూడాలని నిర్ణయించుకున్నాను'

'మంచి నిర్ణయం. గురువు తండ్రి వంటివాడే కదా! శిష్యుడ్ని కొడుకులాగ చూడటం ధర్మమే మరి!'

'అందుకని మా ఆశ్రమ ప్రాంతాన్ని సశ్యానుకూలం చేసి నివ్వరి ధాన్యాన్ని పండిస్తున్నాం. ఆశ్రమంలో చుట్టుపక్కల కూడా కావలసినన్ని కూరగాయలు పండిస్తున్నాం. జీవనం సుఖంగా సాగిపోతున్నది. ఇతరుల ముందు చెయ్యి చాచవలసిన యాచనా దైన్యం లేకుండా జీవితం గడుస్తున్నది'

'వినా దైన్యేన జీవనం... బాగుంది! ఇంకేం చిక్కు?'

'చిక్కంతా ఇక్కడే ఉంది. ధాన్యం చల్లాలన్నా, మొక్కలు, విత్తనాలు నాటాలన్నా అవి పెరిగి పండి కాయాలన్నా, అవి పండాలన్నా తగిన జలం కావాలి కదా! అది వర్షాధారం కదా!'

'అవునవును!'

'మరి వర్షాలు సకాలంలో కురవకపోతేనో!'

'నెలకు మూడు వానలు కురిపిస్తాడు కదా వరుణుడు!'

'అది సర్వ సామాన్యమైన మాట! వర్షం కురుస్తుంది. కురవదు. దానివల్ల ఎలాగైనా అననుకూలతే స్వామీ!'

'దానికి నేనేం చేయనయ్యా! గౌతమా! వర్షానికి అధిపతి వరుణుడు. అతడు దిక్పాలకులలో ఒకడు. వారి అధిపతి ఇంద్రుడు! నువ్వు ఇంద్రుడినో లేదా వరుణుడినో యీ విషయమై అడిగి ఉండాల్సింది' అన్నాడు బ్రహ్మ.

గౌతముడు చిరునవ్వు నవ్వాడు.

'తమరన్నది లోక రీతి- లోక నీతి, కానీ నా ఆలోచన వేరు స్వామీ!'

'అదేదో చెప్పుకుంటే కదా తెలిసేది!'

'చెప్పుకోవాలనే కదా తమరిని ధ్యానించింది'

'చెప్పుకోవడం వివరంగా చెప్పుకుంటే చక్కగా ఉంటుందని యింత ఉపోద్ఘాతం చెప్పుకున్నాను. సరే! కానివ్వు మరి...'

'అందుకని వర్షంపై ఆధారపడకుండా నేను విత్తనాలు చల్లగానే- భూమి వర్ష జలంతో ఆర్ద్రమైనా కాకున్నా దానితో నిమిత్తం లేకుండా- అవి మొలకెత్తి పెరిగి ఫలించేలా వరమివ్వండి స్వామీ!'

బ్రహ్మ నాలుగు ముఖాలతోనూ పక పక నవ్వాడు.

గౌతముడు వింత నవ్వుకు హేతువేమన్నట్లు చూశాడు.

'ఏమీ లేదులే! ఈ విత్తనాలు చల్లడం- పెంచడం- కోయడం - వాటిని తయారించుకోవడం- వండటం యివన్నీ లేకుండా అందరికీ అవసరమైనంత ఆహారాన్ని అహరహం అందించే అక్షయ పాత్రను అడగనందుకు ఆనందించి ఆహ్లాదంగా నవ్వాను!'

బ్రహ్మ మాటలకు గౌతముడు సంతోషించాడు.

'తథాస్తు! నువ్వు ధాన్యం చల్లగానే అది ప్రకృతి ధర్మ బద్ధంగా కాక తక్షణమే మొలకెత్తి- ఆపై క్రమంగా ఫలించాలని వరం అనుగ్రహించాను' అన్నాడు.

'ధన్యోస్మి!' అన్నాడు గౌతముడు ఆనందంగా. బ్రహ్మ అదృశ్యమయ్యాడు.

## 38

ఆ గౌతముడు ఏం వరం అడుగుతాడో- ముదిమిని మది దప్పిన వాడిలా యీ ముసలి బ్రహ్మ ఏం వరం ఇస్తాడో ఏం జరుగుతుందో- తనకూ- తన పదవికీ ఏం ముప్పు వస్తుందోనని భయపడుతూ ఉన్న ఇంద్రుడికి గౌతముడి కోరికా- దానిని బ్రహ్మ ఆమోదించడం తెలియగానే ఆనందంతో నృత్యం చేయాలనిపించింది.

దేవ నాధుడు తలుచుకోవాలే గానీ నృత్యానికేం కొదవ? నర్తకీమణులకేం కొదవ? చుట్టూ ఉండనే ఉన్నారాయే! రంభ, మేనక, ఊర్వశి, తిలోత్తమ, ఘృతాచి యింకా... యింకా... అందరితో రాసకేళీ ఆరంభించాడు ఇంద్రుడు.

* * * *

బ్రహ్మ ఇచ్చిన వరం గౌతముల పాలిట కల్ప వృక్షమే అయింది! ఆ దేవ తరువు కోరినవన్నీ కొంగు బంగారంగా ఇస్తుందిగా! అలాగే ఈ వరమూ ఆయనకి కోరినవన్నీ ఇచ్చేయసాగింది. ఏ ధాన్యమైనా సరే ఆయన అలా భూమిపై చల్లగానే చల్లగా అది మొలకెత్తేది. కాలక్రమంగా పెరిగి పండేది. ఆ పంట సమృద్ధిగా ఉండేది!

ఏ విత్తనమైనా సరే- ఆయనలా భూమిపై విసరగానే అది చక్కగా మొలకెత్తేది. దిన దిన ప్రవర్ధమానంగా పెరుగుతూ కొమ్మ రెమ్మగా సాగుతూ పూచి ఫలించేది. ఆ కాయలు, ఆ ఫలాలు ఆశ్రమ వాసులకు ఆమూలాగ్రమూ రుచులు వర్తించేవి.

శిష్యులకు ఆహారం కొరత లేదు. అలాగే వారి చదువుకూ అక్షపాదుల వారి (గౌతముల పేరే అదీనూ!) భిక్ష అఖండ భిక్ష అయ్యేది. దానితో అటూ ఇటూ అన్ని దేశాల్లోనూ గౌతముల వారి పేరు మారుమోగ సాగాయి.

శిష్యులు తామర తంపరలా పుట్టుకొస్తున్నారు. వచ్చి వారిని చేరదీయడం, చేరదీసిన వారిని ఆదరించడం, ఆదరించినవారికి అఖిల విద్యలూ బోధించడం. ఇదీ ఆశ్రమ ధర్మం.

గౌతముల వారి ఖ్యాతి అజనాభ దేశమంతటా వ్యాపించింది. అజనాభదేశంలోని నగర రాజ్యాలు అయోధ్య, కోసల, మగధ, మిధిల మొదలయిన వాని అన్నింట్లోనూ గౌతముల వారి కీర్తి శరత్కాలంలో వెండి వెన్నెల వ్యాపించినట్లు వ్యాపించింది.

ఆయా దేశాలలో ఆయా రాజులు రాజ్యాధికారులు, ప్రజలు ఎంతో సంతోషిస్తే అసూయ పుట్టుకొచ్చింది. పేరు చెప్పటానికి కూడా గుర్తు మిగలని కొందరు మునులకు గౌతముడి కీర్తి విని కన్ను కుట్టింది. ఈర్ష్య అగ్నిలా రాజుకుని ద్వేషం ఆరని కొలిమిలా రగలసాగింది. కోపం భగ్గున మండే కాలాగ్నిలా ప్రజ్వరిల్లింది.

ఎలాగయినా గౌతముని కీర్తి మాపాలన్న కక్ష వారిలో పుట్టుకొచ్చింది. ఎలా? ఎలా? ఎలా? గౌతముని సాధించేదెలా? గౌతముని ప్రతిష్ట అప్రతిష్టగా మారేదెలాగ? గౌతముని కీర్తి అపకీర్తితో మాసేదెలా? గౌతముని ప్రఖ్యాతి అపఖ్యాతితో కృంగేదెలా?

మాత్సర్య గ్రస్తులయిన మునుల ఆలోచనల్లోంచి ఓ మాయ పుట్టుకొచ్చింది.

అంతే! అందరూ సంతోషించారు! అందరి తపన తీరిపోతుందనీ తమరందరినీ యింతటి వెతకు గురిచేసిన గౌతముడికి తగిన శాస్తి జరుగుతుందనీ ఆనందించారు. వారి మనసు విష వలయంలోంచి ఓ గోవు పుట్టుకొచ్చింది. ఆ మాయా గోవు క్రమ క్రమంగా కదిలి కదిలి గౌతమాశ్రమ ప్రాంతానికి వచ్చింది.

## 39

మెలమెల్లగ వీచే పిల్ల గాలులకి పైరు ఆహ్లాదంగా తలూపుతూ ఉంది. నయనానందకరంగా ఉందా దృశ్యం. కంటికింపుగా కనిపిస్తోన్న తన పంట పొలాలను చూస్తూ గౌతమ మహర్షి పరవశుడయ్యాడు. పంట ఏపుగా

పెరిగింది. ఫలితం దండిగా వస్తుంది. శిష్యులకు కడుపారా పెట్టవచ్చు అనుకున్నాడు.

బ్రహ్మ ఇచ్చిన ఆ ప్రత్యేక వరం వల్ల గౌతమ గురుకులానికి ఆహార సమస్య శాశ్వతంగా తీరిపోయింది. ఇక గురువులకు, శిష్యులకు చింతే లేకపోవడంతో దృష్టి అంతా పాఠాల పైనే కేంద్రీకృతమయింది.

మిగతా ఆశ్రమాల కన్నా గౌతమాశ్రమంలో విద్యాభ్యాసం నిరాటంకంగా నిరాఘాటంగా సాగుతూండటం వల్ల శిష్యుల రాక ఎక్కువైనా బ్రహ్మ ప్రసాదించిన ఆ దివ్య వరం వల్ల ఎవరికీ ఏ లోటు రావడం లేదు.

రావణబ్రహ్మ పుష్పక విమానంలో ఎందరు కూర్చున్నా మరొకరికి చోటు వుంటుందన్నట్లుగా ఎందరు శిష్యులు చేరినా తమ ఆశ్రమంలో మరింకెందరికో స్థానం ఉంటుందని జనం చెప్పుకుంటున్నారు మహర్షీ!

ఓ రోజు తమ గురుకులానికి వచ్చిన ఓ ముని చెప్పిన మాటలు గుర్తుకు రాగా నవ్వుకున్నాడు గౌతముడు.

సరిగ్గా... అప్పుడే ఓ గోవు తచ్చాడుతూ తచ్చాడుతూ అటుగా వస్తోంది. అది పరమశివుడి వాహనం నంది అర్ధాంగిలా ఉంది. సమభాగంలా ఉంది. కామధేనువులా ఉంది. సమస్త సంపదనూ తన పొదుగులో దాచుకున్న గోమాతలా అఖిలైశ్వర్యాన్నీ తనలో నిక్షిప్తం చేసుకున్న భూమాతలా ఉంది.

దానిని చూసి- దాని విశిష్ట రూపాన్ని చూసి ముగ్ధుడయ్యాడు గౌతముడు. సాక్షాత్తూ నందినీ ధేనువును దర్శించిన అనుభూతి పొందాడు.

ఆ గోవు మాయ నడకలు నడుస్తూ పండిన గౌతముల పొలం ప్రవేశించింది. మేస్తూ రంకెలు వేస్తూ కోలాహలంగా నడుస్తూ కొమ్ములతో చూస్తూ వస్తున్న ఆవును చూస్తూ గౌతముడు విభ్రాంతి చెందాడు.

కొద్దిసేపు కర్తవ్య విమూఢుడయ్యాడు. అటు చూస్తే దివ్య ధేనువు. నందిని లాంటి గోవు. ఇటుచూస్తే నోటికందనున్న సస్య లక్ష్మి. గురుకుల విద్యార్థుల నోటి వద్ద ఆహారాన్ని తన నోట పెట్టుకుంటున్న ఆవు దుశ్చర్య ఆపడం ఎలాగ?

అటు పరమ సాధువైన గోమాథగ ఇటు శిష్యులకు నిత్యం సమకూర్చవలసిన ఆహారం. ఏం చేయాలి? ఏం చేయాలి? దాన్ని పొలం నుంచి ఎలా తోలాలి?

గౌతముడికి ఏం తోచలేదు! చిక్కుముడికి పరిష్కారం తోచని గౌతముడికి ఆవును పక్కకు తోలాడమే మార్గంగా కనిపించింది. గౌతముడిలా ఆలోచిస్తూ ఉండగా ఆ గోవు యథేచ్ఛగా పొలం అంతా తిరుగుతూ పంటను తొక్కుతూ- నోట కొరుకుతూ పగ బట్టిన శత్రువు పాడు చేస్తున్నట్టు పొలం అంతా తిరుగుతూ ఉంది.

గౌతముడు కమండలం లోని జలం చేతికి తీసుకున్నాడు. ఆదలింపుగా అన్నాడు. అంటూనే విదిలింపుగా ఆ జలాన్ని విసిరాడు. రెండో మూడో జల బిందువులు ఆ గోవుపై పడ్డాయి.

అంతే! ఖడ్గ ప్రహారమో- శరాఘూతమో తగిలినట్లు ఆ గోవు నేలపై పడిపోయింది. విలవిల తన్నుకుంది. కాళ్ళు కొట్టుకుంటూ కొట్టుకుంటూ తల విదిలిస్తూ విదిలిస్తూ ఆగిపోయింది. తల వాలిపోయింది.

ఇదంతా కనురెప్పపాటు కాలంలో జరిగిపోయింది. ఇదంతా కళ్ళారా చూసిన గౌతముడు నిశ్చేష్టుడైనాడు. క్షణ కాలం దిగ్భ్రాంతికి లోనయ్యాడు. తనెక్కడున్నాడు? ఎటు చూస్తున్నాడు? ఏ దిశా ముఖంగా నిలుచున్నాడు!

ఎదురుగా ఉన్నది తూర్పా? ఉత్తరమా? పశ్చిమమా? దక్షిణమా? దిక్కుతోచలేదాయనకి. క్షణం తర్వాత తెల్లగా ఆ గోవు పడిపోయిన చోటుకి చేరుకున్నాడు. పడిన గోవుని లేపి చికిత్స చేయించాలనుకున్నాడు. కానీ అది విగతజీవి అని చూసీ చూడగానే గ్రహించి నిర్ఘాంతపోయాడు. గోహత్య! గోహత్య!

అదే గౌతముడి మనస్సులో ప్రతిధ్వనించింది.

గోహత్య మహా పాపం! ఆ పాపం తనకు సంక్రమించింది. ఆ పాపానికి నిష్కృతి? ఆ పాపం నుంచి బయట పడేదెలా? ఆ పాప నివృత్తి కానిదే నిత్యానుష్ఠానం ఎలా? భుజించడం ఎలా? శిష్యులకు పాఠాలు చెప్పడం ఎలా? మైల పడిపోయిన తన జన్మకు ముక్తి ఎలా? తనలో తనే తర్కించుకుంటూ ఆశ్రమానికి వచ్చాడు గౌతముడు.

* * * *

ఈ సంఘటన జరగడానికి పూర్వం దేశమంతటా కరువు విలయతాండవం చేస్తోంది. ప్రజలకు ఆహార ధాన్యాలు దొరకడం లేదు. తినడానికి తిండి దొరక్క, తాగడానికి తగినన్ని నీళ్ళు లభించక జనం విలవిల లాడిపోతున్నారు. పాలించే ప్రభువులు ఎక్కెడెక్కడి పాతరలూ తీయించి ప్రజలకు పనులు కల్పిస్తూ ఆహార ధాన్యాలు అందిస్తూనే ఉన్నా- అవి పనిచేసే వారికి మాత్రమే దక్కుతున్నాయి.

కుటుంబంలో ఒకడు పని చేయగలిగితే అతని సంపాదనపై ఆధారపడి జీవించే వాళ్ళు ఐదుగురో ఆరుగురో. అవి వారికి పూటకు కూడా చాలడం లేదు. ఆ మాత్రం దిక్కు కూడా లేని జనాలకు అదీ దొరకడం లేదు.

పశువులకు మేత లభించక పాలిచ్చే జంతువులు ఎండిపోతున్నాయి. చిన్నవీ ముసలవీ తాళలేక తల్లడిల్లి చనిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో గౌతమ ఆశ్రమం సుసంపన్నంగా ఉందనీ- అక్కడ అన్నపానాదులకు లోటుండదని

తెలిసిన మునులు, ముని పత్నులూ, శిష్యులూ అందరూ గుంపులు గుంపులుగా వచ్చేశారు. విచ్చేసిన జనానికి కడుపు నిండా ఆహారం అందిస్తున్నారు ఆశ్రమ వాసులు. కొరత లేని సంపద ఆయె!

అందుకే ఆ మునులకు కన్నుకుట్టి మాయా గోవుని సృష్టించారు. తమకెవ్వరికీ లేని అదృష్టం ఏ ఒక్కరికో ఉండటం నాడే కాదు, ఏనాడూ కూడా సహించనివ్వదు. అసూయ, ఆగ్రహం, ఆక్రోశం, ఈర్ష్య చెట్టాపట్టా లేసుకుని చెరలాడి మనస్సుని, మనిషిని అధోగతిపాలు చేసేస్తాయి.

వాళ్ళు మామూలు మనుషులు కావచ్చు. మహనీయులైన మహర్షులూ కావచ్చు, స్పందన మాత్రం ఒక్కటే. లోకంలో ఎవ్వరి వద్దా లేనిది ఒక్కని వద్ద ఉండటం చూసి ఓర్వలేరు!

విశ్వామిత్రుడంతటివాడే వశిష్టుడి ఆశ్రమంలో సకలాన్నీ క్షీరధారలా కురిపించే నందినీ ధేనువుని తనకిమ్మని- తనకివ్వపోతే బలవంతంగా చెరపట్టి తీసుకెళ్ళడానికి ప్రయత్నించినప్పుడు భంగపడేలా చేయలేదా? అసూయకున్న శక్తి అలాంటిది.

గౌతముడి ఆశ్రమంలో అతని ఆశ్రయంలో ఉండి, కరువు బాధ తప్పించుకుంటున్న మునులే కృతజ్ఞతకు మారుగా కృతఘ్నత ప్రదర్శించి ఆయనపై మాయా గోవును ప్రయోగించారంటే అసూయకున్న శక్తి ఎలాంటిదో అర్థమవుతున్నది కదా!

తమ పాచిక ఫలించినందులకు - గౌతముడికి గో హత్యాపాతకం చుట్టుకున్నందుకు వారందరూ సంతోషిస్తూండగా- ఆది తప్పిన వాడిగా- ఓడి వచ్చినవాడిగా- పాడి తప్పిన వాడిగా సర్వస్వం కోల్పోయిన వాడిగా నిర్వీర్యుడై నిస్పృహతో వచ్చాడు గౌతముడు.

ఆయనలా ఎందుకున్నాడో తెలిసి కూడా తెలియనట్టు నటిస్తూ అడిగారు.

'ఏమయ్యా గౌతమా! ఏమిటలా ఉన్నావు! ఎప్పుడూ విచారమనేది ఎరుగని వాడివి! సంతత సంతోష వార్నిధిలో తేలియాడుతూన్నట్టుండే వాడివి. ఇదేమిటీ? ఈ విచారమేమిటీ? ఆ మోము వెలవెల బోవడమేమిటీ? ఆ! ఏం జరిగింది?'

'జరగకూడనిదే జరిగింది మహాత్ములారా!' విచారంగా అన్నాడు గౌతముడు.

'జరగకూడనిదే జరిగిందా! ఏం జరిగిందయ్యా స్వామీ!' ఆత్రుత అణుచుకోలేనట్టు ప్రశ్నించారు.

'ఘోరం జరిగిపోయింది పావనులారా!'

'ఘోరమా?' నిర్ఘాంతపోయినట్లు అడిగారు.

'అవును ఘోరమే! ఆ తప్పు మామూలు మనుషులు చేస్తే అది ఘోరం. అతి దారుణం. నా వంటి ముని చేయడం పరమ దారుణం!' దీనంగా అన్నాడు.

'పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదుకదా స్వామీ! అయినా సకల న్యాయాలూ తెలిసినవారు తమరు. తమరు చేసిన ఆ తప్పు- తెలిసి చేసినా తెలియక చేసినా దానివల్ల తమకు సంక్రమించిన సమస్త దోషాలూ నశించేందుకు తమరు చేయదగిన ప్రాయశ్చిత్తం ఏమిటో తమరికే తెలుసు కదా! ఇంకెందుకు యీ విచారం?

'ఆత్మహత్య ఒక్కటే శరణ్యం!'

'శివ శివా! అది మరీ ఘోరం కదా మునీంద్రా!'

'హూ! హత్యా నేరం నుంచి తప్పించుకోవాలంటే ఇప్పుడు ఆత్మహత్య ఒక్కటే మార్గం. మరోమార్గం లేదు పుణ్యాత్ములారా! తమరికెందుకీ విచికిత్స! నా వంటి వాడు ఆ పాపం చేశాడంటే కూడా విశ్వసించనంత పుణ్యాత్ములు తమరు! తమరు విన్నా తమకు పాపం చుట్టుకుంటుందేమోనని సంశయిస్తున్నాను!'

'అది మీ పవిత్రతకూ- పవిత్ర జీవనానికి నిదర్శనం! అయినా అదేమిటో సెలవిస్తే- మేమూ ఆలోచిస్తాము!'

'నేను గోహత్యా పాతకానికి ఒడిగట్టాను. నా పంట పొలాల్లో ప్రవేశించి పండిన పైరును మేస్తూ పంటను నాశనం చేస్తున్నదనీ ఆ గోవుపై నీళ్ళు చల్లి పో పో అన్నట్టు పారదోలబోయాను. అంతే! అది అకస్మాత్తుగా నేలకూలి ఆయువు పట్టులో దెబ్బ తగిలినట్లు వెంటనే చనిపోయింది. చేతులారా చేసిన గో హత్యా పాతకం నుంచి విముక్తుడ్ని అయ్యేదెలాగ అనే ఆవేదనతో వస్తున్నాను'

'శివ! శివా! గో హత్య చేశారా! పొలంలోని పైరుని భక్షించడానికి వచ్చిన ఆ గోమాతని హత్య చేశారా! ఎంత పాతకం! ఎంత ఘాతుకం!'

గౌతముడి కళ్ళ వెంట నీరు జలజలా రాలింది.

'అంతా ఒక్క క్షణంలో అలా జరిగిపోయింది. ఇంత ఘోరం జరుగుతుందని నేను అనుకోలేదు! అయినా నీటి బిందువులతో అలా విదిలించగానే అది... అది... దుర్మరణానికి దారి తీస్తుందనుకోలేదు!'

'మంత్ర జలమా అది? మంత్రించి వదిలారా!' సందిగ్ధంగా అడిగారు మునులు.

'ఊహూ! కమండలోదకం అది. దాన్ని మంత్రించి చల్లలేదు!'

'మంత్రించినా మంత్రించకపోయినా అది మహా మహిమాన్వితులయిన తమ చేతి జలం కదా అది! సంతత మంత్ర జపంతో అపవిత్రమైన త్రికరణశుద్ధులు కదా తమరు! మనసా తమరు దాని చర్యలను గర్హించి- క్రియగా జలం చల్లారు. వాక్కు ఒక్కటే లోపించింది. సంకల్పంలో దానిపై కోపం ఉండనే ఉంది కదా! అందుకే అది తమ చేతి జాలం సోకీ సోకగానే మరణించింది.

గౌతముడు కాబోలు అన్నట్లు తపూలేదు! కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

'మరి నిష్కృతి?' అడిగాడు గౌతముడు.

'జలంతో మరణించిన దాని మీద జలాలు ప్రవహించేలా చేస్తే దానికి సద్గతి లభిస్తే తమకు పాప విముక్తి!'

'జాలం ప్రవహించాలా? నది కాదు కదా ఇక్కడ చిన్న నది కూడా ప్రవహించడం లేదు! ఇక్కడ ఏ నదీ లేదు. ఉండినా ఈ కరువు కాలంలో యింకిపోయి ఉండేది. పారే నీరే వుంటే ఇక ఈ కరువు ఎక్కడిది స్వామీ!' ఆందోళనగా అడిగాడు గౌతముడు.

'ఈ భువిలో ప్రవహించే ఏ నదీ నీ కాలుష్యాన్ని- నీ పాపాన్నీ హరించలేదు! దివిజ గంగ ఒక్కటే నీ పాపాన్ని కడిగివేయగలదు' ముక్త కంఠంతో జవాబిచ్చారు మునులు.

'దివిజాపగ- దివిజాపగ- సుర గంగ దివి నుండి భువికి దిగివస్తే- నగర పూర్వులు తరించినట్లు యీ గోవు తరిస్తుందన్న మాట!'

'గోవు కాదు - నీవు తరిస్తావు!'

'అవునవును! ఆవుకు పుణ్యలోకాలు- నాకు పాప విమోచనం' సాలోచనగా అన్నాడు గౌతముడు.

అవునన్నట్లు అందరూ తలలూపారు.

'మహాత్ములారా! నేనీ క్షణంలో యీ ఆశ్రమం విడిచి వెళుతున్నాను. దైవ కటాక్షంతో దివిజ గంగను తెప్పించి- ఆ గోవుపై ప్రవహించేలా చేసి ఆపై నా పాపాన్ని పోగొట్టుకుని తిరిగి యీ ఆశ్రమానికి వస్తాను. అంతవరకూ మీరు ఈ ఆశ్రమాన్ని రక్షిస్తూ కాలక్షేపం చేయండి! విద్యాభ్యాసాలు, వేద పాఠాలు, యజ్ఞయాగాదులు నిర్విఘ్నంగా కొనసాగించండి. సెలవనుగ్రహించండి!'

గౌతముడు వారికి ఆశ్రమ బాధ్యతలు అప్పగించి తపస్సుకు బయలుదేరాడు.

## 40

నాశికా త్ర్యంబకం- అక్కడ శివుడిని గూర్చి తపస్సు ప్రారంభించాడు గౌతముడు. జలాశయంలో స్నానం చేసి సంకల్పం చెప్పుకుని నిష్ఠగా తదేక చిత్తంతో ధ్యాన సమాధిలో మునిగిపోయాడు గౌతముడు. శివుడ్ని మదిలో నిలుపుకున్నాడు. ఆ శివుడు వెండి కొండ మీద గౌరీ సమేతుడై ప్రమథుల నృత్యం చూస్తున్నాడు.

ఉన్నట్టుండి ఉలిక్కిపడ్డట్టుగా కదిలాడు శివుడు.

'ఏమి నాథా?' అడిగింది గౌరి.

'దేవీ! గౌతమమహర్షి నన్ను గూర్చి తపస్సు ప్రారంభించాడు'

'భక్తజన సులభా! పరమేశా! మీరేం నారాయణులా! ఆ విష్ణుమూర్తి అయితే భక్తుల్ని నానా బాధలూ పెట్టి, వారి ఓరిమి నశించేదాకా పరీక్షలు పెట్టి 'అన్యధా శరణం నాస్తి!' అనేలా చేసేదాకా వారికి దర్శనం ఇవ్వడు! తమరలా కాదే! భక్త సులభుడని కదా తమ ప్రకాస్తి! భోలా శంకరులని కదా తమ ప్రసిద్ధి! విష్ణువుని జ్ఞాన మార్గంలో ప్రసన్నం చేసుకోలేనివారే కదా భక్తితో తమ పాదాలాశ్రయించేది!'

నవ్వాడు శివుడు.

'అంతే కాదు స్వామీ! మానవుల అవసరాల్లో అన్న పానీయాలని చెప్పినా మొట్ట మొదట అవసరం నీరే కదా! ప్రాణాధారం నీరు. అన్నం లేకపోయినా కొన్నాళ్ళు జీవించవచ్చు. కానీ జలం గుటికెడయినా పుచ్చుకోకపోతే జనం జీవించలేరు కదా! ఆ గంగ తమ అర్ధాంగి కదా! అందుకే జనం తమరిని ఆశ్రయిస్తూ ఉంటారు!'

'ఈ గౌతముడు ఆ గంగ కోసమే తపస్సు ప్రారంభించాడు'

'అయితే యింకేం! ఎవరి గురించి ఎవరు తపస్సు ప్రారంభించినా తన పదవి కోరేనేమో అని ఇంద్రుడు భయపడతాడు. తమరికా భయం లేదు కదా! ఏ వరం కోరినా అది ఇస్తే తమకేం ముప్పు ఉండదు కదా! గంగని వారికి ప్రసాదిస్తే భూమి ఆర్ద్రమవుతుంది. తడిసిన నేల సశ్యానుకూలమై రసవంతమైన పంటనిస్తుంది. ప్రజలు సుఖిస్తారు. సంతోషిస్తారు. అది ప్రజోపయోగమే కదా స్వామీ!'

'అవునవును!'

'అవునవునంటూ తమరిక్కడ మీన మేషాలు లెక్కపెడుతూ కూర్చుండిపోకండీ! లేవండి! వెండి కొండ గట్టిగా ఉందని తిష్ట వెయ్యక కదలండి! కదిలి ఆ గౌతముడు కోరిన వరమిచ్చి రండి!' అని తొందర పెట్టింది.

పరమశివుడు పరమేశ్వరీ ప్రభోధం విని వెంటనే కదిలాడు.

గౌతముడి ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

గౌతముడు నిశ్చల చిత్తంతో ధ్యానిస్తున్నాడు.

'గౌతమ మహర్షీ!'

పిలుపు వినబడగానే చప్పున కనులు తెరిచి ఎదుట ఆకాశంలో ప్రత్యక్షంగా కనిపిస్తున్న పరమశివుడిని చూసి ఆనందంతో కైమోడ్చి స్తుతించాడు. పరమశివుడు మరింత ప్రసన్నుడైనాడు.

'గౌతమా! ఏం వరం కావాలో కోరుకో!'

'పరమేశ్వరా! పిలిస్తే పలికే దైవమా! నన్నేలిన నా స్వామీ! నిష్కారణంగా గో హత్యా పాపం అంటుకుంది. అది పోవాలంటే ఆ గోవు తిరిగి జీవించాలి! దేవా! మహాకాలా! సృష్టి స్థితి లయల్లో లయకు తమరే అధికారులు. నా పాపాన్ని లయింపజేయి స్వామీ! ఆ గోవును తిరిగి బ్రతికించి నన్ను తిరిగి పాపవిముక్తుడ్ని చేయి స్వామీ!' ఆర్తిగా అడిగాడు గౌతముడు.

పరమశివుడు చిద్విలాసంగా నవ్వాడు 'గౌతమమహర్షీ! నా యీ జటాఝూటం నుంచి నేను గంగను ధారగా వదులుతాను. అది ఇక్కడ పుడుతుంది. నీ వెంట నడుస్తుంది. ఎక్కడ ఆ గోవు మరణించిందో అక్కడికి నీ ఆశ్రమ సమీపానికి తీసుకు వెళ్ళు! ఈ గంగాజాలం ఆ మృత గోవుపై ప్రవహించగానే అమృతత్వం సిద్ధిస్తుంది. అది పునరుజ్జీవనం చెందుతుంది. నీ పాపం నశిస్తుంది'.

పరమ శివుడి మాట వినగానే గౌతముడు ఎంతో సంతోషించాడు 'ధన్యోస్మి దేవా! ధన్యోస్మి! నేను, నా జీవితమే కాదు! ఆ నదీ పరీవాహక ప్రాంతం అంతా తరిస్తుంది. తమరి జడల నుండి విడివడి వడివడిగా సుడులు తిరుగుతూ పరవళ్ళు తొక్కుతూ కడలి చేరేదాకా మార్గ మధ్యంలో అడుగడుగునా అమృత ధారలతో ఆంధ్ర దేశాన్ని తరింపజేస్తున్నది కదా! అదెంత పుణ్యం స్వామీ! పుణ్యానికి పోతే పాపం ఎదురైంది అని కదా సామెత! ఇక్కడ పాపం నశించి పుణ్యం లభించింది స్వామీ!'

శివుడు ప్రసన్నుడై జడ విదిలించాడు!

కొండల పైనుండి మెల్లిగా జాలువారే సెలయేరులా దివిజ గంగా సదృశంగా శివగంగ జటాజూటం నుండి విడివడి కొండపై దూకింది. అక్కడి నుంచి ధారగా సాగింది.

అద్భుత దృశ్యం దర్శించి ఆనందించాడు గౌతముడు. శివుడిని మరోమారు స్తోత్రం చేశాడు. శివుడు అంతర్ధానమయిన తరువాత గౌతముడు తన ఆశ్రమ మార్గం పట్టాడు.

గౌతమి - గౌతముడి చేత కొని రాబడింది కనుక ఆ నదికి గౌతమి అనే పేరు వచ్చింది. అప్పుడే- ఆయన వెంటనంటి నడిచింది.

గౌతముడు నడుస్తూ - అప్పుడప్పుడూ వెను తిరిగి చూస్తూ క్రమేపీ విశాలమవుతోన్న నదీ జలాన్ని చూసి ఆనందిస్తూ పరవశంతో ఆశ్రమ పరిసరాలకు వచ్చాడు.

పొలాల్లో ఆ గోవు అలాగే నిస్తేజంగా పడి ఉంది. గంగ గౌతమిగా అక్కడకు వచ్చింది. ఆ గంగా జలంలో తడవగానే - ఆ జలం గోవుపై ప్రవహించగానే అది ప్రాణం పోసుకుని మెల్లిగా నడుస్తూ వెళ్ళిపోయింది.

గంగ గౌతమిగా పిలువబడి- గోవుని బ్రతికించి- గోదావరిగా అయి మరింత ముందుకు సాగిపోయింది. గౌతమాశ్రమానికి సమీపంగా వంపులు తిరుగుతూ నదీకన్య సొంపులు విరజిమ్ముతూ నృత్యం చేస్తూ వెళ్ళింది.

గౌతముడు ఆనందంతో తమ ఆశ్రమానికి వచ్చాడు.

గౌతముడి అభ్యర్ధన మేరకు ఆశ్రమాన్ని కనిపెట్టుకుని ఉన్న ఆ మునులకు గౌతముడి రాకను- చనిపోయిన ఆ గోవు తిరిగి బ్రతికి వెళ్ళిపోవడాన్ని చూసి ఆనందించారు.

గంగను సాధించి శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించిన గౌతముడిని చూసి అభినందించారు. ఆపై ఆగక 'మాయా గోవును బ్రతికించావు!' అన్నారు. ఆ మాటలను విన్న గౌతముడు తుళ్ళిపడ్డాడు.

'మాయా గోవా?' ఆశ్చర్యంగా అడిగాడు గౌతమ మహర్షి.

'అవును! దేశమంతటా కరువు విలయ తాండవం చేస్తుంటే నీ ఆశ్రమం మాత్రం సుభిక్షంగా ఉంది. నువ్వు విత్తనాలు చల్లితే ప్రకృతి పరిస్థితులపై అవి ఆధారపడకుండా పంట వస్తున్నది. ఫలాలు వస్తున్నాయి. కంద మూలాలు లభిస్తున్నాయి. ఇదంతా ఆ బ్రహ్మ నీకిచ్చిన వర ప్రభావం! అయినా మేము అసూయకు లోనై ఆ మాయ గోవును సృష్టించాము. అది నీ పంట పొలాలను నాశనం చేస్తుందని దానిపై ఆగ్రహంతో నీవు దాన్ని దండిస్తావనీ, మాకు తెలుసు! ఆ మాయా మృగం మరణిస్తుందనీ మాకు తెలుసు! దానివల్ల నీకు గోహత్యా పాతకం చుట్టుకుంటుందనీ తెలుసు! నువ్వు పరితపించి మమ్మల్నే నిష్కృతి అడుగుతావనీ తెలుసు! అందువల్ల లోకానికి ఇంత ఉపకారం జరుగుతుందని మాత్రం మేమూహించలేదు!' అన్నారు విషయమంతా వివరిస్తూ.

గౌతముడికి అంతులేని కోపం వచ్చింది. తను సాటి మునీంద్రులని కరువు కాలంలో ఆశ్రయమిస్తే యింత ఘాతుకానికి ఒడిగడతారా? పిలిచి విందులు చేస్తే కుట్రలు పన్నుతారా! మాయా మృగాన్ని సృష్టించి గోహత్యా పాతకం ఒడిగట్టుకునేలా చేస్తారా! ఎంత కుట్ర! ఎంత దురూహ! ఆగ్రహాన్ని అణుచుకోలేకపోయాడు గౌతమమహర్షి.

'మునీంద్రులారా! మీరు హంతవ్యులు కారు! అలాగనీ మీరు క్షంతవ్యులూ కారు. మీరు చేసిన మోసం, పన్నిన పన్నుగడ పర్యవసానంలో శుభంగానే పరిణమించినా, నన్నెంతో మానసిక వేదనకు గురి చేసింది. పరులను మానసిక వేదనకు గురి చేయడం పాషండ లక్షణం. కాబట్టి మీరు పాషండులుగా పుట్టు వొందుదురు గాక!' అని శపించాడు.

ఆ శాపానికి మునులంతా తరతర లాడిపోయారు. అయితేనేం మహర్షి వాక్కులు అమోఘం. వాటిని మరెవ్వరూ సవరించలేరు! అనుభవించి తీరవలసిందే!

గౌతమీ నదీ తీరాన నడుస్తూ ఉన్న మహర్షికి గతం అంతా గుర్తుకు వచ్చింది 'మునుల దురూహ ప్రజానీకానికి మేలే చేసింది' అనుకున్నాడు గౌతముడు.

## 41

అహల్య ఆశ్రమంలో కుటీరం ముందు నిలబడి తలారబెట్టుకుంటున్నది. తెగ బారెడు కురులు చిక్కు పెడుతున్నవి. వాటిని చిక్కు తీసి సరిచేసుకుంటూ వున్నదామె.

అహల్య అసలే అందగత్తె! ఆపై తలంటు పోసుకుని తలార బెట్టుకుంటున్నది. సహజంగా స్త్రీలు ఎవరయినా తలంటుపోసుకున్న నాడు వారి అందం ద్విగుణీకృతమవుతుందంటారు అందాల రహస్యాలను ఎరిగినవారు బహుశా అందుకే! స్త్రీలని ప్రతి శుక్రవారం, మంగళవారం తలంటుకుని తలారా స్నానం చేయమని ఇళ్ళలోని పెద్ద ముత్తయిదువలు చెపుతూ ఉంటారట!

నింగిలో వెలుగులో ప్రసరిస్తున్నాడు ప్రాతకాల సూర్యుడు. ఆ రేయెండలో తలారబెట్టుకుంటున్నది అహల్య. పిల్లగాలులు మెలమెల్లగా వీస్తున్నాయి. అంజన, ఇంద్రాంశతో జన్మించిన కుమారుడు లోపల ఎక్కడో ఆడుకుంటున్నారు! గౌతములు ఆశ్రమంలో లేరు! గోదావరీ తీరంలో విహరిస్తున్నారు.

ఆశ్రమంలో నివశించే విద్యార్థులు వాళ్ళ వాళ్ళ పనుల్లో మునిగిపోయారు. వంట కట్టెలు వెతికి తెచ్చేవారు. నార చీరలు పిండి ఆరవేసేవారు. ఆశ్రమంలో నివశించే వారికోసం గోదావరి నుంచి మంచి నీళ్ళు మోసి తెచ్చేవాళ్ళు. ఫలాలు సేకరించి తెచ్చేవాళ్ళూ, ఆశ్రమంలో అతిథి అభ్యాగతులకు సరిపడా కాయ గూరలను సేకరించి తెచ్చేవాళ్ళు, మొక్కల సంరక్షణ చేస్తూ, పాదులు తవ్వుతూ నీళ్ళు పోస్తూ, తోట పనులను చేసేవారు, నిర్వర్తించే వాళ్ళు అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు ఉన్నారు.

నింగిలో వెలుగులు చిమ్మే సూర్యుడి కంట పడింది అహల్య. అహ... అహల్య అందం... సంతానవతి అయినా బ్రహ్మ ఇచ్చిన వరం ప్రభావం వల్ల పాలివోని యవ్వనంతో కన్నెలా ఉంది అహల్య అందం. ఆమె అందం భూమ్యాకాశాలు పట్టరానిదిగా ఉంది. జగదేక సుందరి కదా అహల్య!

ఆమెను చూసీ చూడగానే కర్మ సాక్షి మరింత వేడెక్కిపోయాడు. ఆమె అందాలను గమనించేకొద్దీ క్షణ క్షణానికీ తాపం అధికం కాసాగింది. నింగిలో నిలవలేక పోతున్నాడు. తిరుగుతున్న భూచక్రంలా ఆయన మనస్సు నిలకడ కోల్పోతున్నది.

'ఎంత అందం!' అనుకున్నాడు ఇన్నాళ్ళూ. ఇన్నేళ్ళూ తాను పరిశీలనగా చూడలేకపోయినందుకు తనను తానే నిందించుకున్నాడు.

అనంత కోటి జీవరాశులు తన వెలుక్కోసం కాచుకుని ఉంటాయి. తన కిరణావళి ప్రసరిస్తేనే వాటికి జవం, జీవం. వారినందరినీ తన కర స్పర్శతో బ్రతికిస్తాడు. వారికది అవసరం. అది తన విద్యుక్తధర్మం కూడా! అలాగని అందరినీ చూస్తూ పోలేడు కదా! వారికి వెలుగు వేడి అవసరం. కానీ తనకు వాళ్ళవసరం కాదు!

అందుకే అహల్య తన దృష్టి పథం నుంచి తప్పించుకునిపోయి ఉంటుంది. ఇప్పటికయినా మించిపోయిందేమీ లేదు! అసల్లేకుండా పోయే దానికంటే ఆలస్యంగానైనా మంచిదే కదా అనుకున్నాడు దివాకరుడు.

నింగి నుంచి నేలకు దిగి రావాలనుకున్నాడు. దిగి వచ్చి అహల్యతో మాట్లాడాలనుకున్నాడు.

అంతలో ఒక అనుమానం వచ్చింది. నింగి నుంచి నేలకు దిగివచ్చానని చులకనగా చూడదు కదా! అనుకున్నాడు. వెంటనే తన సందేహాన్ని తానే తొలగదోశాడు. తాను దినకరుడు, తేజః కారకుడు. సృష్టి సర్వానికీ చైతన్యం ప్రసాదించే వాడు. అందునా యీ భూలోక వాసులకు తాను కనిపిస్తేగానీ తెలవారదు.

సర్వం తన గమనంతోనే వారికి నడచేది. దినాలు లెక్కించాలన్నా, తిథులు లెక్కపెట్టాలన్నా, తన గమనం- తన పరోక్ష కాంతి ప్రభావంతో వెలిగే చంద్రుడి గమనమే కదా వారికి ఆధారం! తనంటే సర్వే సర్వత్రా భూలోక వాసులకు గౌరవమే ఉంటుంది అని తనను తాను సమర్థించుకున్నాడు. సందేహాన్ని పారద్రోలాడు.

అహల్యను చేరి పలకరించాలనుకున్నాడు.

అహల్య తలారబెట్టుకుంటూ అటూ ఇటూ తిరగసాగింది. యింటి ముందు పెంపుడు నెమలి కేక పెట్టింది.

'ఏమిటి మబ్బులు లేకున్నా కేకలు పెడుతున్నావు?' అంది పలకరింపుగా అహల్య.

అహల్య ఏం ప్రశ్నించిందో నెమలికయితే అవగతం కాలేదు. కానీ పురివిప్పి ఆడుతూ తిరిగి కేక పెట్టింది. ఎక్కడో కోయిల కుహూ కుహూమని కూసింది. చల్లని పిల్లగాలి వీచింది. గాలి వెంట పూల పరిమళం తేలి తేలి వచ్చింది. ఆశ్రమంలో పెంచే పూల మొక్కల మీది నుంచి వీచిన పరిమళమే కాక గంధవహుడు అడవి మీదుగా వీస్తూ వచ్చి ఆ అడవి పూల పరిమళాన్ని కూడా మోసుకుని వచ్చాడు.

మగత కల్పించేంతగా గాఢంగా ఉంది పరిమళం. అహల్య ఆ పరిమళాన్ని ఆస్వాదించింది.

ఇంతలో కోయిల మరోసారి కూసింది. నెమలి పురివిప్పి నాట్యమాడింది. పెంపుడు చిలుక ఏదో పలికింది. అస్పష్టంగా అటు నడిచింది.

పెంపుడు చిలుక అహల్య చేతిపై వాలింది. 'ఏమే!' పలకరించింది అహల్య. చిలుక ముక్కుతో ఆమె చెక్కిలిని తాకింది. అదెంత మృదువుగా తాకినా అది చెక్కిలిపై పొడిచినట్లుగా బాధ పడింది. చిలుకను సున్నితంగా కొట్టింది.

అది ఏదో గొణిగింది. రివ్వున ఎగిరిపోయింది.

అహల్య పకపక నవ్వింది.

ఆమె నవ్వుతూ ఉండగా దివి నుంచి భువికి దిగివచ్చాడు సూర్యుడు.

ఎగిరిపోతున్న చిలుకను - చెట్టుపై నుంచి ఎగిరిపోతున్న కోకిలను ఆడుతూ ఆడుతూ అటుగా ఎగిరి పోతున్న నెమలిని చూసి పడి పడి నవ్వింది అహల్య.

నవ్వుతోన్న అహల్యను చూస్తూ ఆమె చలద్ భంగిమలు గమనిస్తూ తనను తాను మర్చిపోయేంతగా తన్మయుడయ్యాడు సూర్యుడు. ఆమె నవ్వి నవ్వి అలసినట్టు ఆగి అటూ ఇటూ తిరిగింది. అదృశ్యంగా ఇదంతా చూస్తున్న సూర్యుడు ఆమె అమితానందాన్ని చూసి మరీ ముగ్ధుడైనాడు.

మధురాతి మధురంగా వేయి వీణలు మోగినట్లు హృదయ విపంచి పలుకుతున్నట్లుగా గుండెలోని వలపంతా గుమ్మరించేట్టుగా పిలిచాడు సూర్యుడు.

'అహల్యా! అహల్యా!'

రూపం కనిపించకుండా శబ్దం వినిపించేసరికి అహల్య ఉలిక్కిపడింది.

'అహల్యా!' మళ్ళీ పిలిచాడు సూర్యుడు.

అటూ ఇటూ పరికించి చూసింది అహల్య. సమీపంలో తనని పేరుపెట్టి పిలిచే వారెవరా అనుకుంది. ఆమెలో అకస్మాత్తుగా ఊహ మెదిలింది. ఒక వేళ దేవరాజు మహేంద్రుడు తిరిగి వచ్చాడా? అనుకుంది.

'ఎవరు?' అంది మాట వినిపించిన వైపు చూస్తూ.

'మిత్రుడ్ని!' అన్నాడు సూర్యుడు.

'మిత్రుడివా?' ఆశ్చర్యంగా అడిగింది అహల్య.

'అవును! లోకానికంతకూ మిత్రుడ్ని! నీకు మిత్రుడ్ని!'

'మిత్రుడివయితే లోక రీతిగా రాకుండా ఏమిటీ ఈ దాగుడు మూతలు? మామూలుగా వస్తే అర్ఘ్యపాద్యాదులిచ్చి ఆహ్వానించి అతిథిగా అర్చిస్తాం కదా!'

'నేను నా స్వరూపంతో వస్తే నీవు కనులారా చూడలేవు!'

'ఎందుకు?' ఆశ్చర్యంగా అడిగిందామె.

'నా తేజస్సు భరింపరానిదిగా ఉంటుంది'

'ఏం?'

'మామూలు కళ్ళకు నా వెలుగు కష్టం కలిగిస్తుంది'

'ఇంతకూ నువ్వెవరివి?'

'లోక బాంధవుడిని'

'లోక బాంధవుడివా? లోకానికంతకు మిత్రుడ్ని అని చెప్పావు?'

'అవును. మిత్రుడ్ని. లోక బాంధవుడిని'

'వింతగానూ, ఆశ్చర్యంగానూ ఉందే!'

'తెలియనంత వరకూ, తెలుసుకోలేనంత వరకూ అదంతే కదా!'

'తెలిసేలా కనిపించు మిత్రమా!'

నవ్వేడు సూర్యుడు. తెరలు తెరలుగా వినిపించిందా నవ్వు.

'కనిపించు లోక బాంధవా!'

మళ్ళీ నవ్వేడు సూర్యుడు.

'ఇలా వచ్చి కనిపించకుండా వినిపిస్తూ సందేహాలకు తావివ్వ వద్దు. దయచేసి కనిపించు!'

'కనిపించాలనే వచ్చాను. వచ్చాక వచ్చిన చోటులో మచ్చిక లభిస్తుందో లభించదో అని పరీక్షిస్తున్నాను'

'ఇది శ్రీ గౌతముల వారి ఆశ్రమం. ఇక్కడ ఎవరికయినా ఆతిథ్యం ఆత్మీయతా లభిస్తాయి. కరుణా సముద్రులు ఆ మునీంద్రులు. సృష్టికర్త కరుణ వల్ల యీ ఆశ్రమంలో అతిథి అభ్యాగతులను సత్కరించడానికి ఏ కొదవా లేదు! కాల ప్రభావతీతంగా యిక్కడ ఫలిస్తాయి. మీరు నిస్సంకోచంగా అదృశ్య రూపాన్ని వీడి యధా రూపంతో రావచ్చు దివ్య పురుషా! ఆశ్రమంలో గౌతముల వారు లేరు! అయినా తమకేలోటు కలగకుండా నేను అర్చిస్తాను!'

'నేను నీ ఆత్మీయతానురాగ పూరితమయిన ఆతిథ్యం స్వీకరిస్తాను'

'మరి కనిపించండి!'

'కనిపించే ముందు మరో మాట!'

'ఏమిటది?'

'కనిపించి నేనెవరో చెప్పినా నీవు విశ్వసించక పోవచ్చు!'

'అదేం? ఏమిటా విశేషం?'

'అది చూస్తే తెలుస్తుంది'

'అలాగా!'

'అవును. అది చూశాక నేనెవరో చెపితే ఆశ్చర్యపోతావు!'

'దివ్య పురుషుల లీలలన్నీ ఆశ్చర్యకరంగానే ఉంటాయి కదా!'

'అవును! అయినా మానవులు మీకు మా విషయాలు అద్భుతాలుగా, ఆశ్చర్య హేతువులుగా ఉంటాయి!'

'కావచ్చు! నేను సామాన్య స్త్రీని కాదు. చతురాననుడి చతురమతి అంతా ఫలించి సృష్టించబడిన స్త్రీని! బ్రహ్మ సకల లోకాలలోనూ నా సరి లేకుండా సృష్టించిన స్త్రీని. పుట్టీ పుట్టగానే సకల విద్యలూ సంక్రమించిన స్త్రీని. యవ్వనవతిగా ఆవిర్భవించి యవ్వనవతిగానే ఉండేట్టు కన్యగా ఆ బ్రహ్మచేతనే వరం పొందిన స్త్రీని.

అంతేకాదు. ఇవన్నీ నా పుట్టుక గురించిన విశేషాలు. నన్ను చేపట్టిన మహర్షులు శ్రీ గౌతములు మునులలో మునులు. మునీనాం మునిః ఋషీనాం ఋషిః మహర్షీణాం మహర్షిః నూతన న్యాయ సూత్రాలను నిబంధించి ఆచరించే మహర్షి సత్తములు వారు. ఆయనను గురించి మీకు తెలిసే ఉంటుంది'.

'స్త్రీ తనను గురించి గొప్పగా చెప్పుకోవడం విశేషం కాదు! ఆత్మ స్తుతి ఆడవారి జన్మ లక్షణం. అలాగే కన్నవారి గురించి వినేవారికి విశేషంగా చెప్పడమూ విశేషం కాదు! పూబోడులకు పుట్టింటి పొగడ్త ఉగ్గు పాలతో వచ్చినది'

'ఆగాగు!' అతని మాటలకు అడ్డొచ్చింది అహల్య.

'ఏమిటి ఆగమన్నావు?' అడిగాడు సూర్యుడు.

'నీవు స్వయంభువువా? నీకు తల్లి దండ్రీ లేరా? నీకు తల్లీ చెల్లీ లేరా? నీకు భార్యా బిడ్డలు లేరా?'

'ఏం అలా అడుగుతున్నావ్!'

'వారెవరున్నా నీవు యిలా ఆడవారిని ఆడిపోసుకోవు'

పకపక నవ్వేడు సూర్యుడు.

'మగువా! ఎంత మాటన్నావ్! నేను మానినీ మణులను నిందించానా? లేదు! లేదు నన్ను అపార్థం చేసుకోవద్దు. మీ లోకంలోని స్త్రీల సహజ లక్షణాలను వివరించాను. అంత మాత్రాన వారిని కించపరిచినట్టు కాదు. అవమానించినట్టు కాదు. అయినా నిజం నిష్టూరంగా ఉంటుందిలే అహల్యా!'

'అహల్యా! పర కాంతనిలా ఏకాంతంలో పేరుతో పిలవవచ్చునా దివ్య పురుషా!' నవ్వుతూ ప్రశ్నించింది అహల్య.

ఆమె ప్రశ్న పట్టించుకోనట్లుగా వినిపించుకోనట్లుగా అన్నాడు 'చెప్పాగా! ఆడవారికి తమ విషయాలు తమ పుట్టింటి విషయాలు తిన్నగా కనిపిస్తాయని కానీ నీవు నీ భర్త గౌతముల గురించి ప్రకటించిన గౌరవ ప్రపత్తులు ప్రశంసనీయం. ఏ స్త్రీ అయినా తన భర్తపై అనురాగంతోపాటు ఆత్మీయతతోపాటు గౌరవం కలిగి ఉండాలి. నీవు నీ భర్త గురించి గర్వంగా చెప్పిన మాటలు నన్నెంతో అలరించాయి'

అహల్య ఏమీ జవాబు చెప్పలేదు.

'మానినీ మణీ!' మళ్ళీ పిలిచాడు సూర్యుడు.

'దివ్య పురుషా! అదృశ్యంగా ఉండి యిలా మాటలతో ఆడుకోకుండా కనిపించమని చెప్పానుగా!'

'సరే!'

క్షణం గడిచిపోయింది.

సకల లోకాలకూ సకల ప్రాణులకూ వెలుగునిచ్చి చైతన్యం ప్రసాదించే లోక బాంధవుడు- జగన్మిత్రుడు- దివాకరుడూ- దినకరుడు- అహస్కరుడూ- భాస్కరుడూ- సూర్యుడు- తన తేజోమయ రూపాన్ని- సహస్ర కిరణత్వాన్ని ఉపసంహరించుకుని మామూలు దివ్య రూపంతో దేవతలకు సహజమైన కాంతి రూపంతో - హార కిరీట కేయూరాది విభూషణాదులతో ఆమె ముందు ప్రత్యక్షమైనాడు.

ఒక్కసారిగా వెలుగు కళ్ళకు కొట్టినట్లై కళ్ళు మూసుకుంది అహల్య.

'మానినీమణీ! మహా సౌందర్య రాశీ! అహల్యా!' ప్రియమారా పిలిచాడు సూర్యుడు. కళ్ళు బలవంతంగా తెరిచిందామె. ఎదురుగా దివ్య సుందర విగ్రహుడు. తేజోమయ మూర్తి!

'తమరెవరు?'

'అఖిల జగత్తుకూ వెలుగు ప్రసాదించే వాడిని!'

'దినకరా!'

'వేయి కిరణాల వేలుపుని!'

'దినకరా!'

'అఖిల జగత్తుకూ వెలుగు ప్రసాదించే వాడిని! నింగిలో నిలిచే నేను నేలపై నడిచే నిన్ను ఈనాడు చూశాను. అహల్యా దేవీ! అవును నిన్ను అహల్యా! అంటూ నిరుప పదంగా పిలవడం తప్పే! దివ్య తేజో విరాజితమయిన నీ రూపం చూశాక అహల్యాదేవీ! అని పిలవకపోవడం తప్పే! నా అపరాధాన్ని మనసారా మన్నించమని వేడుకుంటున్నాను'

తడబడింది అహల్య. తత్తరపాటు చెందింది. ఇదేమిటీ? సకల చరాచర జీవరాశికీ తన వేడి వెలుగులతో చైతన్యం కలిగించే ప్రత్యక్ష నారాయణుడు తనని క్షమించమని అడగటమేమిటీ? అనుకుంది.

'దేవీ! అహల్యా!'

'చెప్పండి ఏమి సెలవు!'

'నేను నీ ఆతిథ్యం కోరి వచ్చాను అహల్యా!'

'ఆతిథ్యమా! అందుకేం అభ్యంతరం దేవా! యీ గౌతముల వారి ఆశ్రమంలో లభించే వారితో తమకు అతిథి మర్యాదలు చేస్తాను' అందామె.

'కానీ నాకు కావలసింది...' ఆర్ద్రోక్తిలో ఆపాడు.

'కావలసిందేమో సెలవివ్వండి. నా అభ్యాగత స్వయం విష్ణుః అంటారు పెద్దలు. పైగా తమరు ప్రత్యక్ష నారాయణులు. తమని అతిథిగా అర్చించడం ఆ విష్ణు మూర్తిని అర్చించినట్లే కదా! తమరి రాకతో మా ఆశ్రమం పావనమైంది. తమరు అర్ఘ్య పాద్యాదులు స్వీకరించి కొద్దిసేపు యీ ఆశ్రమంలో విశ్రాంతి తీసుకుంటే ఈలోగా తమ రాకను గౌతమీ నదీ తీరాన విహరిస్తోన్న శ్రీ గౌతముల వారికి తెలియజేస్తాను! వారికి తెలియపరుస్తాను. వారు ఆఘమేఘాల మీద వచ్చేస్తారు!'

'వద్దు! వద్దు!' వారించాడు దినకరుడు.

అతి తిరస్కారంగా భావించిన అహల్య తత్తరపడింది.

'ఏమిటి స్వామీ! ఎందుకు మా ఆతిథ్యం వద్దంటున్నారు' కంగారుగా అడిగిందామె.

'ఆతిథ్యం వద్దనలేదు! నీ అతిథిగా వుండాలని వచ్చినవాడిని. నీ విందు భోజనం ఆరగించాలని వచ్చిన వాడిని. ఆతిథ్యం వద్దంటానా?'

'మరేమిటి దేవా!' అర్థం చేసుకోలేక అలా అడిగిన అహల్యను చూసి నవ్వాడు.

'అహల్యాదేవీ! నేను నీ సేవలు కోరి వచ్చాను!'

'నా సేవలా! ప్రత్యేకించి నేను చేయగల సేవలేమి ఉన్నవి ప్రభూ!'

'ఆలోచించు అహల్యా! నిజానికి ఏ ఇంటికి వెళ్ళినా ఆ యింట ఆతిథ్యం యిచ్చేది ఎవరు? స్త్రీలే కదా! భర్త ముని అయినా, రాజయినా, మంత్రి అయినా, అధికారి అయినా మామూలు గృహమే అయినా ఆ ఇంటి ఆతిథ్యం నెరిపేది ఎవరు? అతడు కాదు కదా! ఆహ్వానించేది అర్ఘ్య పాద్యాదులిచ్చి గౌరవించేది యింటి యజమానే కావచ్చు! కానీ ఆహార పదార్థాలు వండి వడ్డించేది ఆడవారే కదా!'

నవ్వింది అహల్య.

'మా గౌతమ మునీంద్రులు న్యాయ శాస్త్రం రచించారు. మీరు చెప్పిన ధర్మ సూక్ష్మం ఆయన ఎక్కడా చెప్పలేదు! తర్కశాస్త్రంలోనూ ఇది విన్నట్లు గుర్తులేదు'.

'నీకు శాస్త్రాలన్నీ బోధించారా గౌతములు!' తను అహల్య అందాన్ని చూసి మోహించి తమకంతో దిగివచ్చిన విషయం గుర్తున్నది సూర్యుడికి. కానీ సూటిగా అడిగి ఆమె మనసును గాయపరిచే దానికంటే మాటల సందర్భంలో మదిలోని మాట వెల్లడిస్తే బాగుంటుందని భావించాడు సూర్యుడు.

'నేనెంత సృష్టికర్త కుమార్తెనయినా - చదువుల తల్లికి ముద్దుబిడ్డనే అయినా - పుట్టుకతోనే సకల విద్యలూ కరతలామలకం అయ్యేలా బ్రహ్మ వరమిచ్చినా - శాస్త్రం శాస్త్రమే! అని గౌతమ మహర్షులు నాతో అన్ని శాస్త్రాలూ చదివించారు'

'సకల శాస్త్రాలూ చదివావా?' కుతూహలంగా అడిగాడు సూర్యుడు.

'ఆహా! వారితో కలిసి అన్ని శాస్త్రాలూ చదివాను!' అంది అహల్య.

'కామశాస్త్రమూ చదువుకున్నావా!'

చప్పున సూర్యుడు అలా అడిగేసరికి ఆమె తెల్లబోయింది. వెంటనే జవాబు యివ్వలేకపోయింది.

'పలకవేం అహల్యా! కామశాస్త్రం కూడా చదివావా?'

'అన్ని శాస్త్రాలూ చదివాను అని చెప్పాను కదా! అన్ని శాస్త్రాలలోనూ కామ శాస్త్రం ఒకటని మీరు భావిస్తే అది కూడా చదివినట్లే కదా!'

'నేను సూటిగా అడిగాను. సమాధానం సూటిగా చెపితే సంతోషిస్తాను!'

'ఏదయినా శాస్త్రం శాస్త్రమే కదా!'

'కామశాస్త్రం, శాస్త్రం కాదని నేను చెప్పడం లేదు. నువ్వు కామశాస్త్రం చదివావా అని అడుగుతున్నాను'

గంభీరంగా అది అహల్య 'చదివాను!'

'చాలా సంతోషం! చదువుకున్న ఆడవారితో సంభాషణ చాలా చతురవంతంగా ఉంటుంది!'

'తమ ధర్మపత్ని ఛాయాదేవి చదువుకోలేదా?' చప్పున ప్రశ్నించింది అహల్య.

సూర్యుడు తడబడ్డాడు. క్షణంసేపు మౌనం వహించాడు. ఆ లిప్త కాలంలోనే లిప్తపాటు ఎరుగని సూర్యుడు మాటలు మరోవైపు నడుస్తున్నాయేమో అనుకున్నాడు.

'మేం దేవతలం కదా! మాకు చదువులతో అవసరం లేదు. ఏదయినా, ఏ శాస్త్రమయినా అలా ఆలోచించగానే వెంటనే అవగతమవుతుంది. వేదాలన్నీ వినీ వినగానే బోధపడతాయి. మీలాగ కాదు. విద్య మాలోని మాట కదా! అదే విద్ అనే పదం! దివ్ అనే పదం ఒకటే కదా! అటూ ఇటూ అయింది' చమత్కారంగా అన్నాడు సూర్యుడు.

అహల్య ఆ మాటలకు జవాబివ్వలేదు. కానీ వింటూ ఉండిపోయి విన్న తర్వాత మౌనం వహించింది.

'ఊ! కామశాస్త్రం చదివావన్న మాట!' మళ్ళీ అడిగాడు సూర్యుడు. ఈ చర్చలో తను అడిగిన ప్రశ్న దారి తప్పిందేమోనని శంకించి మళ్ళీ అడిగాడు.

అహల్య నిట్టూర్చింది 'అవునన్నాను కదా మహానుభావా! యింత తెలిసినవారు యీ విషయాన్నే ఎందుకు పదే పదే ప్రశ్నిస్తున్నారో నాకు తెలియడం లేదు'

'మనస్సులోని మాట సూటిగా అడగలేక...' ఆర్ధోక్తిలో ఆగిపోయాడు సూర్యుడు.

'ఏమది?'

'నా మదిలోని మాట' చమత్కరించాడు సూర్యుడు.

'చెప్పండి'

'చెప్పాక ఒప్పుకోవేమో!'

'అనుమానం ఎందుకు?'

'అనుమానం! అది తర్కంలోని మాట! సందేహం ఇది!'

'సాధారణంగా మానవులకు దేహంతోనే సందేహాలు పుట్టుకొస్తాయి. ఆ సందేహాలతోనే వారు గురు సన్నిధిని చదువుకుంటారు!'

అహల్య మాటలు నవ్వు కలిగించాయి సూర్యుడికి.

'అహల్యా! నింగి నుంచి నెలకు ఎందుకు దిగివచ్చానో తెలుసా?'

'తమరు చెప్పందే నాకెలా తెలుస్తుంది?'

'ఊహించలేవా?'

'ఊహలూ అపోహలు ఎందుకు. సూటిగా అడిగినా చెప్పినా చాలు కదా!'

'నిజమే! నింగి నుంచి నేలకు దిగిన వాడిని. ఈ గౌతమాశ్రమనికే ఎందుకొచ్చానో తెలుసా?'

'వెనుకటి ప్రశ్నకి ఏది జవాబో ఈ ప్రశ్నకీ అదే ప్రత్యుత్తరం!'

'ఆశ్రమానికి వచ్చింది గౌతమ మహర్షితో సంభాషణకే అయితే ఆ ముచ్చట ఏదో గౌతమీ నదీ తీరాన విహరిస్తోన్న ఆయన సన్నిధినే అడిగేవాడిని కదా! పై నుంచి వస్తున్న వాడిని ఆయన ఎక్కడున్నదీ తెలుసుకోలేనా?'

'ఈ ప్రశ్నకు నేనేం సమాధానం చెప్పగలను?'

అహల్య మాటలకు నవ్వాడు సూర్యుడు.

'సమాధానం ఆశించి నేను రాలేదు! నీ సమ్మతి ఆశించి వచ్చాను. ఆలోచించు అహల్యా! నేను నీకోసమే వచ్చాను!' అన్నాడు సూర్యుడు నెమ్మదిగా.

అహల్య సూటిగా చూసింది. ఎదురుగా దివ్యమూర్తిలా నిలబడ్డాడు సూర్యుడు. ఆమెకో సందేహం వచ్చింది. చంద్రుడు చలువల రాయుడు. సూర్యుడు వేడి వేడి మంటల వేలుపు. మబ్బుల చాటున ఉన్నా మసక వెన్నెల ప్రసరిస్తూ ఉన్నా దర్శనీయాంశ మూర్తి చందమామ. పసిపాపలయినా చూసి మురిసిపోయే చల్లని రూపం చంద్రుడిది.

మబ్బుల చాటున ఉన్నా మండిపోయే సూర్యుడిని చూడటం కష్టం. ఉదయభానుడిని, అస్తమయ సూర్యుడిని తప్ప గ్రహణ కాలంలో అయినా సూర్యుడిని తేరిపార చూడలేరు. నీటిలో ప్రతిబింబించే సూర్యుడినయినా బాగా చూడటం కష్టం. మరి ఈ దివ్య తేజోమయ మూర్తి తాను దివాకరుడ్నని - భాస్కరుడ్నని - అహస్కరుడ్ననీ- దినకరుడ్ననీ అంటున్నారు.

మామూలు మనుషుల్లాగ తనతో మాట్లాడుతున్నాడు. తానతన్ని భూలోకవాసుడిని చూసినట్లు లేదా దివ్యలోక నివాసుడిని చూసినట్లుగా వుంది తప్ప మరోరకంగా లేదు. తను కళ్లతో బాగా చూడగలుగుతున్నది. యిది ఎలా సాధ్యం! ఇతనెవరైనా మాయావి పురుషుడు కావచ్చు. గంధర్వుడో- యక్షుడో- రాక్షసుడో...

అలా అనుకోగానే ఆమెలో ఓ మొండి ధైర్యం వచ్చింది 'ఎవరు నువ్వు?'

ఆమె అలా అనగానే హఠాత్తుగా ప్రశ్నించేసరికి సూర్యుడూ నివ్వెరబోయాడు.

'ఇదేమిటీ! అహల్యకి కించిత్ మతి భ్రమణం ఉందా! ఇంతవరకూ తనతో ఆషామాషీగా మాట్లాడింది. ఇప్పుడేమిటి ఇలా ప్రశ్నిస్తోంది!' అనుకున్నాడు.

అనుకుని క్షణంలోని తేరుకున్నాడు. అలా అడగ్గానే తనేం చెపుతాడో అని ఆలోచించి వుండాలి. లేదా ఎవరయినా తమని పరిశీలిస్తూ ఉండాలి. వారు తమరిని గమనించే విషయం ఆమెకి తెలిసి ఉండాలి.

అందుకే తానెవరని అడుగుతూ ఉండాలి. మళ్ళీ అంతలోనే ఆయన తేరుకున్నారు. అడవుల్లో, ఆశ్రమాల్లో భర్త చాటున జీవిస్తూ కల్లాకపటం ఎరుగని ఈ మునిజన వనితకి అంతటి ఆలోచన ఉండదు.

మరేమయి ఉంటుంది?

తనలో తనే వితర్కించుకుని 'ఏమిటి అహల్యా! అలా హఠాత్తుగా అడిగావు? సఖ్యం సాప్తపదీనం అంటారు కదా మీ భూలోక వాసులు. ఏడడుగులు వూరకే నడవరు కదా! నడుస్తూ మాటాడతారు కదా! మనం యింత సమయం మాటల్లో గడిపాం. మనం మిత్రులమే. అయినా నేను లోక మిత్రుడ్ని కదా!' అన్నాడు.

'అదే! నువ్వెవరా అని సందేహిస్తున్నాను!'

'సందేహమా!'

'అవును. నువ్వు దివ్యుడివేనా! సూర్యుడివేనా! లేక అలా చెప్పుకుంటున్న మాయావి రాక్షసుడివా? దినకరుడిగా చెప్పుకుంటున్న గంధర్వుడివా?' గబగబా అడిగేసిందామె.

'ఎందుకొచ్చింది ఆ సందేహం?'

'నువ్వు నిజంగా సూర్యుడివే అయితే నేను నిన్నెలా చూడగలుగుతున్నాను? ఎలా మాట్లాడగలుగుతున్నావు? అదిగో - ఆ వెలిగే మార్తాండుణ్ణి చూడు. సూటిగా చూడలేం కదా! వేయంచుల వేలవేల వెలుగు కిరణాల మూర్తి కదా - మరి నువ్వు యిలా... ఇక్కడ... యీ రూపంతో... యిదంతా ఎలా సాధ్యం?'

పక పక నవ్వాడు సూర్యుడు.

'అహల్యా! నువ్వు చూస్తున్నది సూర్య గోళం! అది నిప్పులు కక్కుతుంది. నింగి నుంచి వెలుగులు విరజిమ్ముతుంది. తేరిపారి చూడటం అసాధ్యం! అసంభవం!'

'మరి నువ్వు ...'

'నేను ఆ మండలాధిపతిని. సూర్య మండలమే నేను. నేనే సూర్య మండలం. అంతే కాదు. నా కిరణావళిని నేనే ఉపసంహరించుకున్నాను. లేకపోతే మీ మానవులే కాదు ఇతరులు కూడా నన్ను దర్శించ లేరు. చూడు నా దివ్య తేజస్సులో సహస్ర సహస్రాంశం మాత్రం చూపుతా! ఆ మాత్రమే నీవు చూడలేవు! నా దివ్య రూపమే కాదు శ్రీమన్నారాయణుడిని కూడా సాధారణ నేత్రాలతో మీరు చూడలేరు. మా కాంతిని మీ కను పాపలు చూసి భరించలేవు!' అన్నాడు.

క్షణం పాటు మెరుపులు మెరిసినట్లైంది. కాంతులు విరజిమ్మినట్లయింది. వెలుగులు ఉప్పొంగినట్లయింది.

చప్పున కనులు మూసుకుంది అహల్య.

'చూశావా అహల్యా!'

'ఏం చూడడం! కనులు మిరుమిట్లు గొలుపుతున్నాయి'

'కళ్ళు తెరువు అహల్యా!'

'చూడలేను! చూసి భరించడం అసాధ్యం!'

'ఇప్పుడున్నది సామాన్య రూపమే! కనులు తెరువు!'

కళ్ళు తెరిచింది అహల్య.

ఎదురుగా ప్రత్యక్ష నారాయణుడు!

సూర్యుడు తన తేజోమయ రూపాన్ని ఉపసంహరించుకుని అంతకు ముందు అహల్యతో మాట్లాడుతూ ఉన్నప్పుడు ఎలా ఉన్నాడో అలా ఉన్నాడు. మిరుమిట్లు గిలిపే రూపంతో కాక, సమ్మోహన పరిచే రూపంతో ఉన్నాడు.

'తెలిసిందా!' నవ్వుతూ అడిగాడు అహర్పతి. అహల్యకింకా ఆశ్చర్యకరంగానే ఉంది.

'అహల్యా!'

'ఏమిటి సూర్యభగవాన్!'

'నేను నీ సేవలు కోరి వచ్చాను'

'ఏం సేవలు చేయాలి భగవాన్!'

'అతిథి మర్యాదలు కాదు...'

'మరేం కావాలి!'

'అహల్యా! నువ్వు లోకోత్తర సౌందర్యవతివి!'

ఉలికిపడిందామె.

'నీ రూపం నిరుపమానం!'

ఆమె గుండెలు ఝల్లుమన్నాయి.

'నిన్ను సృష్టించిన ఆ సృష్టికర్త - ఆ నలుమోముల వేలుపు ఆ బ్రహ్మను అభినందించకుండా ఉండలేను అహల్యా!'

'సూర్య భగవాన్!' విభ్రాంతితో అడిగిందామె 'ఏమిటిది? తమరేం మాట్లాడుతున్నారు? ఆ నింగి నుంచి యీ నేలకు దిగి వచ్చింది. అనన్య సామాన్యమైన అపురూపమైన నా అందాన్ని పొగడడానికా? నన్ను సృష్టించిన ఆ మా తండ్రి ఆ పరమేష్టిని స్థితించడానికా! యిందుకా యింత శ్రమపడ్డారు. తమరేమి! తమ శక్తి ఏమి! తమ ధర్మమేమి? తమరిలా దయచెయడమేమిటి? నాకేం అర్థం కావడం లేదు'

మృదువుగా లేత ఎండ ప్రసరించినట్లు నవ్వాడు సూర్యుడు. లేత వెన్నెల లేత ఎండా రెండూ చల్లగా ఉండి వేడిని పుట్టించేవే వెచ్చదనం కలిపించేవే!

'అహల్యా! ఆ నింగి నుంచి యీ నెలకు దిగివచ్చింది నీ ఈ అనన్యసామాన్యమైన అందాన్ని చూడడానికే! రెండు కనులతో నీ ఈ అపురూపమైన అందాన్ని చూడడానికే! మానవులలో దేవతలలో కూడా కనిపించని యీ మనోహరమైన అందాన్ని చూడడానికే!' అన్నాడు.

ఆమెకు చప్పున ఇంద్రుడు గుర్తుకు వచ్చాడు. ఆయనా యిలాగే తన సౌందర్యాన్ని పొగిడాడు.

తన దివ్య శక్తులతో తన తనువుని తడిమాడు. ఆ స్పర్శే వింతగా ఉంది! ఆ తర్వాతే తన నడుం చిక్కింది.

నెలలు గడిచాక ఇంద్రాంశ సంభవుడు జన్మించాడు.

'ఏమిటీ ఈ దేవతల తీరు!'

దేవతా సార్వభౌముడు ఇంద్రుడు. ప్రత్యక్ష నారాయణుడు సూర్యుడు. ఇద్దరూ ఇద్దరే! వీరే యిలా ఉంటే మిగిలిన వాయు వరుణాది దేవతల సంగతేమిటీ?

"ఇలా దేవతలంతా దిగివచ్చి యిలా తలంపైనున్న హేలావతుల సౌందర్యాలకు దాసోహమంటూ మాటలు మొదలుపెడితే ఒక స్త్రీలకు రక్షణ ఎక్కడ? నయం! రాక్షసుల్లాగా బలాత్కారాలు లేవు. గంధర్వాది మిగతా దేవగణం లాగ మాయలు లేవు. బ్రతికిపోయాం!' అనుకుంది.

అంతలో... ఆలోచనా ముద్రితమైన ఆ ముదిత సొగసు చూసి మరింత మురిసిపోయాడు సూర్యుడు.

'అహల్యా!' పిలిచాడు సూర్యుడు.

ఆలోచనల నుంచి బయట పడిందామె.

'నేను నీ అందాన్ని ఆశించి వచ్చాను'

ఉలికిపడిందామె.

'పట్టరాని నీ సౌందర్యం చూసి నిన్ను చేపట్టాలని వచ్చాను'

'ఇదేమిటి భగవాన్! నన్ను శ్రీ గౌతములవారు అగ్నిసాక్షిగా చేపట్టారు. మీరేమిటి ఇలా అంటున్నారు.

ఒకరు చేపట్టిన స్త్రీని మరొకరు చేపట్టడం ఎలా సాధ్యమౌతుంది? అది అధర్మం! అక్రమం! ఈ పవిత్రాశ్రమంలో అలాంటి మాటలు వినిపించరాదు. తమరు వెళ్ళి రండి!'

'అహల్యా! మేం దివ్యులం! మా శరీరాలు తేజోరూపాలు. ఇవి మృణ్మయం కాదు. మీవి మట్టి శరీరాలు. రసగంధ సమన్వితాలు. ఎప్పటికయినా జీర్ణమయ్యేది కాబట్టే మీది శరీరం. మాది తేజోరూపం!

తేజస్సుకు అంతం లేదు. మీ నీతి నియమం వేరు. మా నీతీ నియమం వేరు' ఇంకేదో చెప్పబోతున్నాడు.

సూర్యభగవానుడు.

'ఆగండి!' ఆయన మాటలకు అడ్డొస్తూ అంది అహల్య.

'ఏమిటి తమరంటున్నది. మీ లోకానికీ మా లోకానికీ ధర్మాల్లో తేడా ఉండవచ్చు. మీ శరీరాలకూ మా శరీరాలకూ తేడా ఉండవచ్చు. మీ మనోధర్మాలకూ మా మనోధర్మాలకూ తేడా ఉండవచ్చు. అంత మాత్రాన మీరు దిగి వచ్చారని

నేనూ స్థాయి దిగజారాలా?'

'అహల్యా!' ఆమె మాటలకు అడ్డు తగులుతూ అన్నాడు సూర్యుడు. 'ఇది వాదనతో ముడి పడిన విషయం కాదు! మనస్సుకు ముచ్చట తీర్చుకోవడమే తెలుసు. అది యుక్తా యుక్తాల సాధ్యాసాధ్యాలు ఆలోచించనీయదు!'

'ప్రభూ! మీరు దివ్వులు. లోకానికంతకూ వెలుగును ప్రసాదించేవారు. తమ రాకతో చీకట్లు తొలగిపోతాయి. అంధకారాన్ని పోగొట్టే తమరు చీకటికి తప్పు చేయాలనడం- చేయడం సమంజసమే అని ప్రభోదించడం వింతగా ఉంది!' అంది అహల్య.

'అహల్యా! ఇది తప్పు కాదు!'

'తప్పు కాదా!' ఆశ్చర్యంగా అడిగింది.

'అవును తప్పు కాదు!'

'ఒప్పు అవుతుందా!'

'అందరూ అంగీకరించేదీ ఒప్పు అనుకుంటే దీనిని అందరూ అంగీకరిస్తారో లేదో నాకు తెలియదు.

'కానీ తప్పు కాదు' అన్నాడు.

'ఎలా ప్రభూ!'

'ధర్మం చాలా విచిత్రమైంది. సూక్ష్మమైంది'

'పరదారాభిగమనం ధర్మం అంటారా!' వ్యంగ్యంగా అడిగింది అహల్య.

'అభిగమనం' నవ్వాడు సూర్యుడు. 'మన ప్రేమలో అభిగమనం లేదు అహల్యా!'

ఆమె ఆశ్చర్యపోయింది. తనలో తను అనుకుంది 'ఏమిటిది? వీళ్ళు దేవతలు. ఆ ఇంద్రుడయితే దేవనాథుడు. వీళ్ళు లోకం సజావుగా సాగటానికి ధర్మం, నీతి, న్యాయం, వార్తన అనే నాలుగు చట్రాలు బిగించారు. వాటిని అనుసరించి లోకం చల్లగా చక్కగా సాగాలి. కానీ వీళ్ళు వాటినే అతిక్రమిస్తామంటూ ఉన్నారు. ఇదేమీ ధర్మం! ఇదేమి నీతి! ఇదేమి న్యాయం! తామై నిర్ణయించిన ధర్మ సూత్రాలు తామే భంగ పరచడమా!'

అహల్య ఆలోచనలు సాగుతున్నాయి.

సూర్యుడు మళ్ళీ పిలిచాడామెని.

'అహల్యా! మావి తేజో శరీరాలు. మీవి మట్టి శరీరాలు. మీకు మాకూ కలయికే లేదు. వుండదు. మేము మీలో ఐక్యమయితే మీరు భరించలేరు!'

వింతగా అన్పించింది.

'నువ్వు దేవతవే! బ్రహ్మ సృష్టించిన దానివే. ఆ బ్రహ్మ కుమార్తెగా ఆ లోకంలో దేవతా స్త్రీగా జన్మించిన దానివే! కాని నువ్వు భూలోకానికి వచ్చావు. భూలోకంలో నివసిస్తున్నావు. ఈ భూలోకంలో జీవిస్తున్నావు. ఇక్కడ జీవించే గౌతములతో సంసార యాత్ర సాగిస్తున్నావు. మీ సంసార జీవనం వేరు. మాతో కలయిక వేరు'

వింతగా వింటున్నది అహల్య.

'అహల్యా! నేను నీ సౌందర్యాభిలాషిగా దిగివచ్చాను'.

'మీకూ నా అందం విభ్రమం కలిగించిందా!'

'పైనుంచి వేయి కనులతో చూసినట్టుగా ఈ సమస్త భూమండలాన్నీ చూస్తూ ఉంటాను. నా చూపుల్లో నీ అంత అందమైన స్త్రీ ఎక్కడా కన్పించలేదు'

ఆమె ఏమీ అనలేదు.

'అసలు మానవ సృష్టి కాదు- సమస్త లోకాల్లోనూ నీ అంతటి అందగత్తె లేదు. అలా కల్పించాడు కదా బ్రహ్మ'.

ఆమె మౌనం వహించింది.

'నా మనస్సు తీరేలా నా కిరణాలతో నిన్ను స్పృశిస్తాను. నా స్పర్శ ఫలితం ఉంటుంది'

'మీ కిరణావళితో స్పృశిస్తారా!' ఆశ్చర్యపోయిందామె.

'అవును'.

'నేనా వేడిమిని సహించుకోగలనా!'

'అవి నిన్ను బాధించవు'.

'దేవా! అంత అంతరాళం నుంచి వచ్చే కిరణాల వేడినే మేం భరించలేమే! మీరు సమీపంలో నిలిచి మీ కిరణావళి నాపై ప్రసరిస్తే నేనెలా భరించగలను!'

నవ్వాడు సూర్యుడు 'ఉదయవేళ-సాయంవేళ- మీకు నా కిరణాలు చల్లగా వుండవా! మీరు వాటిని భరించడం లేదా. మీ గణితం మేరకు నేను మిట్ట మధ్యాహ్నం వేళ మీకు వేడి కిరణాలు ప్రసరిస్తాను. ఈ భూ మండల చలనం వల్ల మీరు నాకు సమీపానికి వస్తూ దూరం వెళుతూ దగ్గరవుతూ నా కిరణాలలోని వేడిమిని హెచ్చు తగ్గులతో భరిస్తున్నారు. అవునా!'

'అవును'

'మరి నేనింత సమీపంలో వున్నాను. నా వెలుగు చూపిస్తే నువ్వు ఆ వెలుగును చూడలేక కళ్ళు మూసుకున్నావే కానీ అది నీకు భరించరానిదేనా?'

'అవును' అందామె ఆశ్చర్యపోతూ.

'అహల్యా! నీతో యింతగా వాదించి వివరించవలసిన అవసరం లేదు. అప్పుడు నన్నడిగినప్పుడే నా కిరణాలతో నన్ను స్పృశించి వుండవచ్చు. దానితో నా కోరిక తీరదు. తిరిగి వెళ్ళి వుండవచ్చు కానీ నీ మనస్సులో నా ఎడల ప్రేమ భావం అంకురించాలి. అందుకే యింతగా చెప్పాను'.

అహల్య ఏమీ అనలేదు.

'ఇది తప్పు కాదు. అధర్మం కాదు. అందుకే నేను నీ మైత్రిని ఆశిస్తున్నాను. మన మధ్య మానసిక బంధం ఏర్పడితే దానితో ఫలితం వుంటుంది'

ఆమె జవాబివ్వలేదు.

'మౌనం అర్ధాంగీకారమా?'

'మౌనం అర్ధ అనంగీకారం కూడా?'

'హమ్మయ్య! నీ నోట వెంట కొంత సుముఖమైన మాట విన్నాను. అదే చాలు'

'వేడి వెలుగుల దొరా! తమకిది తగునా! తమకంతో తమరిట్లాడ తగునా?'

'మళ్ళీ అదే ప్రశ్న! అహల్యా మనస్సు సుముఖమైన వేళలోనే ఇటువంటి సందేహాలు వస్తాయి'.

అహల్య వెంటనే జవాబివ్వలేదు.

'అహల్యా! నీ అందం నీకు తెలియదు. మహా నీతివేత్త అయిన గౌతమ మహర్షుల వారికి తెలియదు. వారి దృష్టి నీ అందంపై లేదు. నీవు వారి సహ ధర్మచారిణివి. తృతీయ పురుషార్థాన్ని ఫలింపచేసే సమ భాగినివి. అంతే! కానీ లోకం పట్టరాని అందం నీది!'

ఆమె చప్పున అటు చూసింది.

'ఈ లోకం దాటి నా లోకం దాకా నీ అందం ప్రశంసలందింది కదా!'

ఆమె వింటున్నది.

'అందుకే- ఆ అందాలకు బందీ అయి నేను వచ్చాను. నా కోరిక తీరాలంటే నువ్వు ఊ అంటే వూహూ అనకుండా వుంటే నేను నిన్ను స్పృశిస్తాను. ఆమె మౌనం వహించింది. సూర్యుడూ మౌనం వహించాడు. కాలాన్ని లెక్కించడానికి ఎవరి గమనం అవసరమో ఆ అధినాధుడూ అహల్యల మధ్య కాలం స్తంభించింది. చల్లని కిరణాలతో- చంద్రుని కంటే చల్లనైన కిరణాలతో సూర్యుడు అహల్య అణువణువు స్పృశించాడు. ఆ స్పర్శ ఆమెకు ఆరోగ్యోద్దీపకంగా అనిపించింది. ఏదో తెలియని మార్పు చోటు చేసుకుంటున్నట్టుగా అనిపించింది'

సూర్యుడు మెల్లమెల్లగా తన వెలుగు రేఖలు ఉపసంహరించుకున్నాడు.

ఆనందంగా అన్నాడు 'సెలవు! ఇక పోయి వత్తునా!'

ఆమె ఊ అనలేదు, ఊహూ అనలేదు.

సూర్యుడు అదృశ్యమైనాడు.

అహల్య ఆకాశంలోని సూర్యబింబం వైపు చూసి- చూడలేక కనులు మూసుకున్నది.

* * * *

గౌతముడు ఇంటికి వచ్చాడు.

ఏదో యజ్ఞంలో మునిగిపోయాడు.

ఆ రాత్రి అహల్య పతి చెంత చేరింది.

పాదాలు ఒత్త సాగింది.

గౌతముడి పాద సంవహన వేళ.

'అహల్యా!' పిలిచాడు మహర్షి.

'స్వామీ!'

'బ్రహ్మ మానసపుత్రీ!'

'అదేమి స్వామీ అలా పిలుస్తున్నారు?'

'నువ్వు బ్రహ్మ మానసపుత్రికవే కదా!'

'అదేమి స్వామీ అలా అంటున్నారు. ఏ స్త్రీ అయినా పెళ్లయిన తర్వాత పుట్టింటి ప్రసక్తి ఎలా వస్తుంది. నేను ఎవరి కుమార్తెనయినా యిప్పుడు తమ ధర్మపత్నిని'

'పుట్టింటి విషయం మరువకూడదు అహల్యా! ఎవరి ఇంట మెట్టినా మీ ఆడవారు తమ పుట్టింటి సౌభాగ్యాన్ని తలుచుకుంటూ వుండాలి!'

'భర్త సేవలో- పిల్లల పెంపకంలో మునిగిపోయిన స్త్రీకి పుట్టింటి విషయాలు ఏం గుర్తొస్తాయి స్వామీ!'

'అందుకే అంటున్నాను. మరువకూడదని'.

'మరచినా మరవకున్నా మానవలోకంలో అయితే పుట్టింటివారు రావడం, పుట్టింటికి వెళ్ళడం వుంటుంది. నేనీ లోకాన్నుంచి ఆ లోకానికి వెళ్లడమన్నా- వారాలోకం నుంచి ఈ లోకానికి రావడమన్నా సామాన్య విషయమా స్వామీ! మామూలు మానవాంగనల సాధారణ జీవితానికి మహర్షుల ధర్మపత్నిగా అసాధారణ జీవితానికి పోలికేమిటి? ఇహపర సాధనమయిన జీవితం కదా స్వామీ ఇది!'

'అవునవును'

అహల్య భర్తతో యింకేమీ అనలేదు.

గౌతములు అహల్యను చెంతకు చేర్చుకున్నారు.

పతి కౌగిట ఒదిగిపోయింది అహల్య.

## 42

ఇంద్రుడి మనస్సు మనస్సులో లేక బృందగానాలు విని ఆనందించలేక నృత్య గాన వినోదాలపై యిసుమంతైనా దృష్టిలేక నందనవనంలో విహరించడానికి వచ్చాడు.

ఒంటరిగా ఉన్న ఇంద్రుడి వద్దకు వచ్చింది ఇంద్ర సఖి.

'ప్రభూ!'

ఏకాంతంలో ఉన్న ఇంద్రుడు - చప్పున అటు చూశాడు.

'ఏకాంతంలో ఏ కాంతను తలచుకుంటున్నారు స్వామీ!'

'ఇంద్ర సఖీ!'

'కులకాంత వలవంతలకు యిది అనువు కాదు కదా!'

'ఏమే ఏమంటున్నావే!'

'చల్లగా గాలి వీస్తున్నది. ఏకాంతంలో ఉన్నారు. ఎదలో మెదిలేది మరెవ్వరో తప్ప శచీదేవమ్మగారు కారు కదా!'

'అవునవును....'

'అందుకే అంటున్నాను. అంతరంగంలో ఆసీనురాలయిన అతివ ఇవ్వరా అని'

ఇంద్రుడు చూశాడు అదోలా!

'కొత్తగాలి వీచి కొత్త సుందరిపై మనసు మళ్ళిందేమో అని అనుమానిస్తున్నాను'

'అదేమే!'

'పాతవారిపై మనస్సు ప్రసరించలేదేమో అని సంశయం'

'ఎవ్వరే పాతవారు?'

'తమరిలా ప్రశ్నిస్తున్నారు కనుకే సంశయంగా ప్రశ్నించాను. అది నిజమే అయింది. ప్రభువులు ఎప్పుడూ నూతనత్వమే కోరుకుంటారు కదా!'

'మనస్సులోని మాట స్పష్టంగా చెప్పక - ఎందుకే ఈ మాటల దాగుడు మూతలు!'

'ప్రభువులు భూలోక విషయం పూర్తిగా మరిచిపోయారేమో అని సంశయించాను. తమ మాటల వల్ల నిజమే అని ఋజువయ్యింది'

భూలోకం ప్రస్తావన రాగానే ఇంద్రుడు ఉలిక్కిపడ్డాడు.

'ఇంద్రాణి పిలుపుతో వచ్చేసిన తమరు తరువాత అహల్యాదేవి సంగతే తలవడం లేదు ప్రభూ!'

ఆయన మౌనం వహించారు.

'అక్కడ జరిగింది తమకు తెలుసుకోవాలనే కుతూహలం కూడా లేదేమి ప్రభూ!'

'చెపుతావా?'

ఆ ప్రశ్న తీరుకు ఆమె బాధపడింది.

'తమరు ఆసక్తిగా వింటే కదా ప్రభూ విన్నవించుకునేది!' అంది నిష్టూరంగా.

'చెప్పవే!'

'అహల్యా దేవికి కుమారుడు కలిగాడు.'

'అది మా దివ్యాంశ వల్లనే సంభవించే వుంటుంది'

'ప్రభువులు ఇంకా గత స్మృతులలోనే ఉన్నారు'

'ఏమంటున్నావే?'

'ఆమె గారికి ఇంద్రాంశతో కుమారుడు జన్మించి మన గణన ప్రకారం కొద్ది కాలమే అయినా - అక్కడ భూలోకంలో మానవ గణన ప్రకారం ఏళ్ళే గడిచాయి'

ఎన్ని హాయనములు గడిచాయో!'

'వారికయితే మూడో నాలుగో గడిచాయి'

'అయితే'

ఇటీవల అహల్యకు మరో కుమారుడు కలిగాడు. అందంగా శంఖంలాగా అమరిన మెడ ఆడవారికి మాత్రమే ఉంటుందని అంటారు. కానీ ఆ శిశువు కంఠం చాలా అందంగా వుందిట. గ్రీవమే పరమ సుందరమయితే శిశువెంత అందంగా వుంటాడో అని'

'నువ్వు వెళ్ళి చూసి వచ్చావా?'

ఇంద్రసఖి మౌనం వహించింది.

'పలుకవేమే!'

'ఉలుకూ పలుకూ లేని తమరితో ఏం చెప్పి ఏం ప్రయోజనం ప్రభూ! ఆమెగారు ముగ్గురు బిడ్డల తల్లి అయ్యారు.'

ఇంద్రుడదోలా చూశాడు.

'తొలుత కూతురు అంజన - తరువాత తమ కటాక్షంతో కుమారుడు. యిపుడు...'

'అతడు గౌతమ పుత్రుడా?'

'పిల్లలు ముగ్గురూ గౌతమ సంతానమే కదా ప్రభూ! వలచో, వరమిచ్చో మీ దేవతలు వారికి సంతానం కలిగేలా దీవించినా అది గణనకు రాదు కదా!'

ఇంద్రుడు మౌనం వహించాడు.

ఇంద్రసఖి కూడా మౌనమే వహించింది.

కాంత్ సమయం గడిచాక ఇంద్రుడే ప్రశ్నించాడు.

'అతడెవరి వర ప్రభావం వల్ల జన్మించాడో...'

'లోక బాంధవుడైన సూర్యభగవానుడి వల్లనట ప్రభూ!'

'ఈ అట ఏమిటే సఖీ!'

'నాకై నేను నిర్ధారించుకోలేదు ప్రభూ!'

'మరెవరందించారే ఈ విశేష విషయం?'

జవాబివ్వలేదు ఇంద్రసఖి.

'నువ్వు వెళ్ళి వచ్చావా?'

ఆమె జవాబివ్వలేదు.

'ఏమే ఉలుకవు పలుకవు. భూలోకం వెళ్ళి వచ్చావా?' గద్దించాడు ఇంద్రుడు.

నెమ్మదిగా తలూపిందామె.

'ఎప్పుడని'

'ఇప్పుడే అక్కడి నుండి వస్తున్నాను ప్రభూ!'

'చెప్పవేమే! ఏమన్నదే ఆ సుందరి?'

ఆమె మౌనం వహించింది.

'ఏమిటే ఆ విశేషాలు?'

ఇంద్రసఖికి అదంతా గుర్తుకి రాసాగింది.

* * * *

విశ్వామిత్రమహర్షి లోక క్షేమానికై సకల జన క్షేమానికై ఒక యాగం తలపెట్టాడు. సాటి మహర్షుల నందరినీ రావించాడు. విశ్వామిత్రుడు ఎవరిపై పంతం పట్టి బ్రహ్మర్షి వరం సంపాదించాడో ఆ వశిష్ట మహర్షి కూడా ఆ యాగానికి వచ్చాడు. ఆర్యావర్తనంలోని ముని సత్తములందరూ విచ్చేశారు.

ఆ వర్తమానం రావణుడికి చేరింది.

విశ్వామిత్రుడు ఎందుకు యాగం తలపెట్టిందీ రావణుడికే తెలియలేదు. తన మంత్రిని పిలిపించాడు రావణుడు.

'విశ్వామిత్రుడు ఏదో యజ్ఞం మొదలుపెట్టినాడట కదా!'

'అవును మహా రాజా!'

'అతని సంకల్పమేమిటో!'

'తెలియదు ప్రభూ!'

'అందులో తెలియకపోవడం ఏముందీ! వళ్ళంతా దనుజ ద్వేషులు. దైవ పక్షపాతులు. మనకు కీడు దేవతలకు మేలు కలిగేందుకే యజ్ఞాలు చేస్తారు. లేదా మానవ రక్షణకు దానవ శిక్షణకు తరలిరమ్మని శ్రీమహావిష్ణువును ప్రసన్నం చేసుకోవడానికి యాగాలు ప్రారంభిస్తారు. ఎట్లయినా మనకు అపకారం తలపెట్టే వీటిని మొదలు పెడతారు'

'చిత్తం ప్రభూ!'

'కాబట్టి ఆ యజ్ఞ యాగాదులు కూడ సక్రమంగా పారిసమాప్తి కాకూడదు. ఆ దశరదుడో- జనకుడో వారికి కావలసిన సంభారాలన్నీ సమకూర్చి ఉంటారు. అవి వృధా కావాలి. యజ్ఞం మొదలుపెట్టిన తర్వాత పూర్ణాహుతి పూర్తయ్యేలోపు యాగం భగ్నం చేయమని మనవారిని పంపించు'

'చిత్తం ప్రభూ!'

'ఎవరిని వినియోగిస్తావ్?'

'తాటకను - ఆమె కుమారులు మారీచ సుబాహులను పంపించు. వారికయితే వారి వల్ల చావు సంభవించదు. వారి చావు మరో మనిషి చేతిలో ఉంది కాబట్టి విశ్వామిత్రుని శాపాలూ, కోపాలూ వారినేం చేయలేవు'

'చిత్తం ప్రభూ!'

మంత్రి వెళ్ళగానే రావణుడు తన ఆలోచనా మందిరానికి వెళ్ళి వీణ వాయించసాగాడు. భర్త వీణా గానం వినడానికి వచ్చింది మండోదరి.

## 43

అహల్యను చూడడానికై వచ్చింది ఇంద్రసఖి.

ఆ సమయానికి అహల్య తన రెండవ కుమారుడిని ఒడిలో వేసుకుని స్తన్యాన్నిస్తోంది. మాతృ దేవత అనే మాటకు అక్షరాలా ఆకృతి వచ్చినట్లుగా ఉన్న అహల్యను చూసీ చూడగానే ఆరాధనాభావం ఉవ్వెత్తున పొంగి పొరలింది. మనస్సు నిండా తృప్తి నిండిన కనులతో చూస్తూ 'కుశలమేనా?' అని అడిగింది.

అహల్య నవ్వింది. అదే సమాధానం అన్నట్లుగా తలూపిందామె.

'కుమారుడా?'

'అంజన తర్వాతి వాడా!'

'ఊహూ! అంజన తర్వాత ఇంద్రాంశతో జన్మించినవాడు పెద్దవాడు. వాడూ అంజనా పూదోటలో ఆడుకుంటున్నారు. వీడు రెండోవాడు' అంది అహల్య.

విభ్రమంగా చూసింది ఇంద్రసఖి. అడిగింది ఆశ్చర్యంతో 'మొదటి కుమారుడు ఇంద్రాంశతో జన్మించాడా!'

కొద్దిగా సిగ్గుతో తల వంచుకుంది అహల్య. ఆమెకు ఇంద్రుడి రాక- అతని సంభాషణ అంతా గుర్తుకు వచ్చాయి.

'వీడెవరి అంశతో జన్మించాడు?'

'భగవాన్ శ్రీ సూర్యదేవుడి కిరణావళితో రూపు దాల్చాడు వీడు!' మెల్లిగా అంది అహల్య.

'వూ!' అంది ఇంద్రసఖి. చిన్న కుమారుడిని ఎత్తుకోవడానికి చేతులు చాచింది ఇంద్రసఖి. అందించింది అహల్య.

ఆ శిశువును ఎత్తుకుని ముద్దాడింది ఇంద్రసఖి.

'భూలోకంలోనే యిలా చిన్నారి శిశువులను ఎత్తుకుని ముద్దాడటం. లాలించడం. చనుబాలు ఇవ్వడం. మొదలైన హృదయానందకరమైన సన్నివేశాలు వుంటాయి. మా దేవ లోకంలో అవన్నీ ఉండవు'.

'మీరు అమృతం తాగేవారు. అమరులు. మీకు జననం మరణం లాంటి బాధలు ఉండవు. మానవులకు పుట్టుక, పెరుగుదల, తరుగుదల, యవ్వనం, వృద్ధాప్యం, మరణం సహజం!'

'మీరు కొన్ని విషయాల్లో మాకంటే అదృష్టవంతులు!'

'ఎలా?'

'అన్నపానాదుల రుచి మీకు తెలిసినట్టుగా మాకు తెలియదు'

'మీకు ఆకలి దప్పికలు ఉండవు కదా?'

'ఆకలి ఉన్నవాడికే ఆ రుచి తెలుస్తుంది. ఆలి ఉన్నవాడికే ఆప్యాయతలు తెలుస్తాయి. మాకు ఆప్యాయతలు తక్కువే!'

'అదేం మీ లోకంలో అందరికీ భార్యలుంటారు కదా!'

'భార్య... అంటే భరింపబడేది. ఐహికంగా ఆముష్మికంగా భర్త మాన మర్యాదలను, గౌరవాలను లోకంలో భరిస్తారు. కనుక అది సార్థకమయిన మాట. మా లోకంలో అది ఔపచారికం'

అహల్య నవ్వింది.

'నవ్వమ్మా నవ్వు! నీకేం!'

'అది కాదు. మానవులు దేవతలకంటే అదృష్టవంతులు అన్నట్లుగా నీవు చెపుతూ ఉంటే నవ్వొచ్చింది'

'చమత్కారానికన్నానులే!'

'చమత్కరించినా నిజమే చెప్పావు కదా!'

'అమ్మా! అమృతం తాగే వారి నోట అనృతం ఎలా వస్తుంది?'

'ఊ! విశేషాలేమిటి?'

'అన్నీ మీ లోకపు విశేషాలే! రావణుడి దుశ్చర్యలు మితిమీరిపోతున్నాయి. అష్ట దిక్పాలకులు ఆయనకి అణిగి మణిగి ఉంటున్నారు. రాక్షస రాజు విజృంభించి ఎప్పుడు ఇంద్రలోకంపై దండెత్తి ఆ సింహాసనాన్ని వదిలివెళ్ళు అంటాడోనని భయం భయంగా ఉంది. మా దేవనాధుడికి అలా వైకుంఠ పురంలో నగరిలో ఆ మూల సౌధంలో హాయిగా పవళించే శ్రీ రామచంద్రమూర్తికి అందరూ వెళ్ళి మొర పెట్టుకుంటే తాను పూర్ణ మానవుడిగా అవతరిస్తాననీ, అదీ ఇక్ష్వాకు వంశంలో- ఇనకుల తిలకుడిగా- దశరధ నందనుడిగా- కౌసల్యా తనయుడిగా అవతరిస్తాననీ, అప్పుడు ఆ రావణ సంహారం జరుగుతుందనీ చెప్పాడట. ఆ శుభ ఘడియ ఎప్పుడెప్పుడా అని అందరం ఎదురు చూస్తున్నాం'

'అవును. మేమూ వింటున్నాం. మహర్షి విశ్వామిత్రుల వారు లోక కళ్యాణం నిమిత్తం ఈ యాగం ప్రారంభిస్తే గౌతములవారూ వెళ్ళారు. అప్పుడు ఆ రావణానుచారులు తాటక- దాని కుమారులు మారీచ సుబాహులు వచ్చి యజ్ఞ వేదికలో రక్తం కురియించి, కల్లూ మొదలయిన దుష్ట ద్రవ్యాలు పోసి యజ్ఞం భంగ పరిచారు'

'వారూ వీరూ అనడం ఎందుకూ! అందరినీ వేధిస్తున్నాడు ఆ అసుర శ్రేష్టుడు.'

'మీ సుర శ్రేష్ఠుల వర ప్రభావమేగా!'

'ఏం చేస్తారహల్యా! ఆ దశకంఠుడి పది గొంతులతో రావణ స్వరంతో నిశ్చల చిత్తంతో రాక్షస భక్తితో ప్రార్ధిస్తే ఆ భోళాశంకరుడు కొండ దిగిరాక వరాలివ్వక ఏం చేయగలడు! మెప్పించిన వాడు అడిగిన వరాలు ఇవ్వాలి కదా!'

'ఏమయినా రావణకృత భుజంగ స్తోత్రం కమ్మని కవిత!'

'సరి! సరి! ఆయన కడుపు చించుకుని రుద్రవీణ పలికిస్తే నువ్వు ఆ కవితలోని సొగసులు మెచ్చుకుంటున్నావా తల్లీ!'

'స్తోత్రం హృదయంగమంగా ఉందంటున్నాను. ఆ పద విన్యాసం ఆ సమాస ఘటన అశువుగా ఆర్తిగా చెప్పిన కవిత్వంతోనే సాధ్యం! కవిత వేదన నుంచే పుడుతుంది. అదే చక్కని కవిత. శాశ్వత కవిత!'

ఇంద్రసఖి ఏం మాట్లాడలేదు.

'ఏం పలుకవేం?'

'నేను నిన్ను చూసి కుశలం కనుక్కుని వెళ్ళాలనే వచ్చానుగానీ కవిత్వ చర్చకు రాలేదు'

నవ్వింది అహల్య.

'మరి వెళ్ళిరానా?'

'వెళ్ళిరానా అనడమే గానీ రావడం మాత్రమెప్పుడో!'

'చెప్పాకదమ్మా! మేం మీలా స్వేచ్ఛా జీవులం కాదు. మీరు ఆశ్రమ వాసులు. అందునా న్యాయ సూత్ర ధర్మకర్త గౌతముల ధర్మపత్నివి! ఇక్కడ మీరు ఎవరికీ తలవంచే పనిలేదు. లోబడి ప్రవర్తించే అవసరమూ లేదు. మాకలా కాదు. నేను శ్రీ మహేంద్రుల వారి దాసిని. వారి దాస దాసీ జనంలో ఒక్కర్తిని. కానీ ఆయన సతీమణికి ఇష్ట సఖిని. వారికి కూర్మి నెచ్చెలిని. కాబట్టి కొండంత మేలు కొలువులో వుండే కష్ట సుఖాలు మీకు తెలియవులే!'

'సరే! నీకు చూడాలనిపించినప్పుడు రా! నేను చూడాలని అనుకున్నా నేను రాలేను. నిన్ను రప్పించుకోలేను' అంది అహల్య.

'స్నేహం చాలా బలమైన పాశం. దాన్నుంచి విడివడటం అంత సులువు కాదు!' అంటూ అదృశ్యమయింది ఇంద్రసఖి.

## 44

అహల్యతో జరిగిన సంభాషణ తూ.చా తప్పకుండా చెప్పింది ఇంద్రసఖి. అదంతా విన్న ఇంద్రుడు అహల్యా సందర్శనానికి తహతాహ లాడసాగాడు.

'ప్రభూ! తమరు ఒకసారి వెళ్ళి వచ్చారు. తమ స్పర్శతో ఆమెకు పుత్ర సంతానం కలిగేలా దీవించారు. ఆ వరం ఫలించింది. ఇక తమరామెతో సఖ్యత సాగించవచ్చు!'

ఇంద్రుడేం అనలేదు.

'తమరెప్పుడు వెళ్ళినా తలపుల్లో తమపై అభిమానం చూపుతూ తలుపులు తెరిచి ఆహ్వానిస్తుంది అహల్య!'

ఊరిస్తున్నట్లుగా ఉన్న ఇంద్రసఖి అన్న మాటలు వింటూ మౌనంగా ఉండిపోయాడు ఇంద్రుడు.

'ఆమె ఆశ్రమ వాసి. ఋషి పత్ని! మాతృమూర్తి. అంతేగానీ అది అచ్చెర మచ్చెకంటి కాదు. తమ క్రీగంటి చూపులు ప్రసరించగానే ప్రభు సేవకు పరిగెత్తుకుని రావడానికి ఆమె తమ సేవా భాగ్యం పొందిన చెలికత్తె కాదు.'

'ఆమె మహా పతివ్రత! బ్రహ్మ మానస పుత్రి. మానవి'

'అయితే!'

'తమరు దోసిలొగ్గాలి'

'ఊ!'

'తమరే సాహసించాలి'

'ఎలా?'

'మహేంద్రులకు శతకోటి ఉపాయాలు'

'ఏమిటే?'

'ఆమె భర్తను తప్ప పురుషుడిని చేరనివ్వదు'

'ఊ!'

'అందుకే ఆమె ప్రేమను మీరు పొందాలి'

'ఆమె మనస్సును జయించడం ఎలాగే?'

'తమరికి చెప్పాలా! తమవంటి పురుషులకు అది వెన్నతో పెట్టిన విద్య. ఋషులకయితే బోధించాలి. ఏమీ ఎరుగని మహనీయులు వారు. తమరు స్త్రీ జన చిత్తచోరులు. నారీ జన నవమన్మధులు. మోహనకారులు. మూడు లోకాల ఏలికలు కనుక సహజంగా దర్పం, ఠీవీ, అధికారం అన్నీ వచ్చి చేరాయి. తమరటు చూసీ చూడగానే సామాన్య స్త్రీలు తమరికి సాహో అని దాసోహం అంటారు!'

'సామాన్య స్త్రీలా?'

'మన్నించండి! సామాన్య అంటే వేశ్య అనే అర్థంలో ప్రయోగించలేదు. మాన్య స్త్రీలనే నా భావన'

'శరీర ధర్మాలు వేరు కాబట్టి మన ధర్మాలకూ మను ధర్మాలకూ ఎంతో తేడా ఉంది'

'అవును. మానవులు మను ధర్మ సిద్ధాంతాలనే అనుసరిస్తారు!'

'అదే నా సంశయం!'

'సంశయించకండి! సరాసరి ఆమె సన్నిధికి వెళ్లండి!'

ఇంద్రుడు జవాబివ్వలేదు.

పరిచితి నుంచి ప్రణయానికి దారి ఏర్పడుతుంది. అది ప్రేమ లక్షణం!'

'అహల్య నన్ను ప్రేమిస్తున్నదా?' ఆత్రంగా అడిగాడు ఇంద్రుడు. అతని తొందరతనం చూసి ఇంద్రసఖి నవ్వొచ్చింది.

'ప్రేమ... మనుషుల్లో సహజ గుణం ప్రభూ! అది వారికి పుట్టుకతోనే వస్తుంది. తల్లి నుంచి రక్త మాంసాలు, తండ్రి నుంచి జీవ ధాతువు స్వీకరించిన గర్భస్త శిశువు ఆ లోకంలో పుట్టీ పుట్టగానే ప్రేమ కోసం రోదిస్తుంది. అది తల్లి స్థన్యంతో లభించి -ఆలన పాలన అందించే అందరి నుంచి దొరుకుతుంది. వివాహమయ్యాక భర్త నుంచి, ఆపై కన్న సంతానం నుంచి ఆమెకు ప్రేమ లభిస్తుంది. స్త్రీ - ముఖ్యంగా మానవ స్త్రీ ప్రేమ స్వరూపం ప్రభూ!'

ఇంద్రుడు ఆమె మాటలకు ఎంతో సంతోషించాడు.

'బాగా చెప్పావే సఖీ! భూలోక యానం నీ బుద్ధిని వికసింపజేసిందే!'

ఆయన మెప్పును నమస్కారం చేసి స్వీకరించినట్లు ప్రకటించింది.

'వెళతాను. అహల్య మనసులో స్థానం సంపాదిస్తాను. ప్రేమ పూర్వకమయిన స్పర్శ ఎంత సుఖదాయి అవుతుందో తెలుసుకుంటాను!'

ఇంద్రసఖి చేతులు జోడించి నిష్క్రమించింది.

ఇంద్రుడొక్కడే ఉండిపోయాడు.

## 45

ముగ్గురు పిల్లలూ పక్క భాగంలో నిద్రిస్తున్నారు. ఆనాడే - మాస రజస్వలా స్నానం అయ్యాక భర్త దగ్గరికి రావటం. అహల్య రాకని గమనించాడు గౌతమమహర్షి.

సూర్యాంశ సంభవుడికి మూడు నెలలు నిండాయి మొన్న వెళ్ళిన వైశాఖ పున్నమికి. భర్త చెంత చేరి పద సంవహనం చేయసాగింది అహల్య. పాదం ఒత్తుతున్న ఆమెకి పాదంలో 'కన్ను' కనిపించింది. ఆమెకి ఆశ్చర్యం వేసింది.

అందరికీ రెండు కనులు ఉంటవి. శిరస్సులెక్కువైతే శిరసు శిరసుకీ రెండేసి కనులుంటాయి. రావణుడికి ఇరవయ్యి! బ్రహ్మకి ఒకప్పుడు పది! ఇప్పుడు ఎనిమిది! అసమ నేత్రుడైన, త్రిలోనుచడైన పరమేశ్వరుడికి ఎల్లవేళలా ఉండేవి రెండే కళ్ళు! కను బొమ్మల మధ్య దాచుకున్న కన్ను తెరిచాడో ఆ కంటి మంటలకు సర్వం భస్మం!

కానీ తన భర్తకు 'కాలిలో కన్ను ఉన్నదేమి స్వామీ!'

'సందేహం అంకురించిందా దేవీ!'

'చిత్తం స్వామీ!'

'చిత్తంలో మొలకెత్తిన చిన్న సందేహానికి ఓ పెద్ద కథ ఉంది దేవీ!'

'అర్ధం కావడం లేదు స్వామీ!'

'ఇలా పాదంలో కన్నున్నవారు ఇంకొకరున్నారు దేవీ!'

'ఎవరు స్వామీ!'

బృగు మహర్షుల వారికి పాదంలో జ్ఞాన నేత్రం ఉంది'

'ఆశ్చర్యం!'

'మహర్షుల జీవితాలు ఆశ్చర్యకరాలే!'

'కానీ తమ పాదంలో కన్ను దాగి ఉన్నట్లు ఎన్నడూ కనుగొనలేదు స్వామీ!'

'నువ్వు గమనించలేదంతే!'

'తమరి పాద నేత్రం విషయం వివరించండి స్వామీ!'

గౌతముడు చెప్పసాగాడు.

'నేను న్యాయ సూత్రాలను రచించాను. నా ధర్మ సూత్రాలు కొందరి చర్చకు హేతువయ్యాయి. భగవాన్ వ్యాసుడు సకల లోక వంద్యుడు. వేదాలు విభజించాడు. వేదాంగాలు రచించాడు. మహా మహిమాన్వితుడు. కానీ ఆయనకెందుకో నా మతం సమ్మతం కాలేదు. నాతో వాదించి నా మతాన్ని ధూషించాడు. అది నాకు భరించరాని వేదన కలిగించింది. నాలో అసూయను కల్పించింది. అహంకారాన్ని పెంచింది. నా మతాన్ని దూషించిన వారిని చూడటం నాకిష్టం లేకపోయింది. ఈ చర్మ చక్షువులతో చూడటం నాకిష్టం లేక పాదంలో ఒక నేత్రాన్ని సృష్టించుకున్నాను. ఆ పాద నేత్రంతో ఆయనను చూశాడు. అదిగో అప్పుడేర్పడింది ఈ కన్ను. ఆ తర్వాత కన్ను అలాగే మిగిలిపోయి మూసుకుపోయింది. నేత్రం చిహ్నంగా మిగిలిపోయింది తప్ప దానిని దృష్టి కోసం వినియోగించే అవసరం రాలేదు!'

భర్త చెప్పింది విని ఆశ్చర్యపోయి - అలాగే చూస్తూ విభ్రాంతికి లోనై, సంభ్రమంతో పతి పాదాలపై వాలిపోయిందామె. పాదాలపై వాలిపోయిన భార్యను అలాగే కౌగిలిలోకి లాక్కున్నాడు గౌతముడు.

* * * *

ఆ రాత్రి గౌతముడు వేకువనే లేచి గౌతమీ స్నానానికి వెళ్ళిన వేళలో - ఆదమరిచి నిద్రిస్తోన్న అహల్యను చూశాడు ఇంద్రుడు. ఇంద్రసఖి రేకెత్తించిన అహల్యా విషయ ప్రేరణతో విషయ వాంఛా లోలుడై వచ్చాడు ఇంద్రుడు. నిద్రాముద్రిత సౌందర్యాన్ని చూశాడు.

ఆమెకు నిద్రా భంగం కలిగించడం ఇష్టం లేకపోయింది. తనలో శతధా కలిగిన ఆనందాన్ని వంద కిరణ స్పర్శలతో ఆమె శరీరాన్ని తేజోరూపంతో స్పృశించాడు ఇంద్రుడు. అహల్యకు మెలుకువ రాలేదు.

మానసికంగా మరోమారు తృప్తి చెందిన ఇంద్రుడు తన లోకాలకు మరలిపోయాడు. తొమ్మిది మాసాలు గడిచాక అహల్యకు కొడుకు పుట్టాడు. అతనికీ శతానందుడని పేరుపెట్టాడు గౌతముడు.

## 46

కొన్నేళ్ళు గడిచాయి.

ఒక రోజు....

గౌతముడు తూర్పు సముద్ర తీరంలో తన సంతానంతో నడుస్తున్నాడు. ఏదో ఆలోచిస్తూ సముద్ర తీరంలో తిరుగుతున్నాడు గౌతముడు. తండ్రి వెంట వచ్చారు కుమార్తె. ఇద్దరు కుమారులు.

ఇంటివద్ద శతానందుడు - చిన్నవాడు తల్లితోనే ఉన్నాడు. ఏవేవో ఆలోచిస్తూ నడుస్తున్న గౌతముడిని పిలిచారు కుమారులు.

'నాన్నగారూ!'

చప్పున ఆగాడు గౌతముడు. ఆలోచనల నుంచి బయటపడ్డాడు.

'ఏమిటి కుమారులారా! ఎందుకు పిలిచారు?'

'మీరు ఆలోచనలో ఉన్నారు. అందుచేత గమనించకుండా తిరుగుతున్నారు. కానీ చాలా పొద్దెక్కింది. అందువల్ల సూర్యకిరణాలకి ఇసుక వేడెక్కింది. మాకు పాదాలు భగ్గుమంటున్నాయి. తమ్ముడు నేను నడవలేకపోతున్నాం' అన్నాడు పెద్ద కుమారుడు.

'అయితే మిమ్మల్నిద్దరినీ ఎత్తుకుంటాను రండి!'

చేతులు చాచి పిలిచాడాయన. ఇద్దరూ పరిగెత్తుకుంటూ వెళ్ళారు. దగ్గరికి వచ్చిన కుమారులిద్దరినీ ఎత్తుకుని భుజాలపై కూర్చోబెట్టుకుని తిరిగి నడవసాగాడు గౌతముడు. అంజన తోడు నడిచింది.

కొద్ది సమయం గడిచింది.

'అమ్మా!' అంటూ ఆర్తిగా పిలిచి యిసుకలో కూలబడిపోయింది అంజన.

గౌతముడు ఆలోచనలో మునిగి అలాగే నడుస్తున్నాడు.

'అమ్మా!' అని మరోసారి ఆర్తిగా పిలిచి ఇసుక వేడిమికి కాలిన పాదాలు ఒత్తుకోసాగింది అంజన.

'నాన్నగారూ!' పిలిచారు ఇద్దరూ ఒకేసారి.

కుడి, ఎడమ చెవుల నుంచి ఒకేసారి నాన్నగారు అనే పిలుపు ఆయనకు చేరింది. ధ్యాన భంగమయింది. ఆలోచన చెదిరింది. ఆగ్రహం వచ్చింది. వచ్చిన ఆగ్రహాన్ని నిగ్రహించుకున్నాడు.

'ఏమిరా కన్నయ్యలూ! జంట కోయిలల్లాగ అలా కేకలు పెట్టారేమిటి?' అన్నాడు ప్రేమగా. ఆయన కూతురిని గమనించలేదు.

'అంజన పిలుస్తున్నది నాన్నగారూ! ఆమె పిలుపును మీరు వినిపించుకోలేదు. అందుకని మేం అలా పిలిచాం!' అన్నాడు పెద్దవాడు.

'అంజన పిలిచిందా?' కూతురి కోసం తలతిప్పి చూశాడు గౌతముడు.

ఆమె తమ పక్క లేదు. వెనుదిరిగి చూశాడు. అక్కడ అంజన కూర్చుని ఉంది. ఆమె ముఖంలో బాధ - దుఃఖం!

'ఏమ్మా?'

అంజన కనుల వెంట నీళ్ళు జలజలా రాలాయి.

'ఏమిటమ్మా?'

'ఎండ వేడిమి ఎక్కువగా ఉంది. ఇసుక మాడిపోతున్నది. కాళ్ళు కాలుతున్నాయి. నడవలేకుండా ఉన్నాను. నన్ను ఎత్తుకోండి నాన్నగారూ' అంది అంజన గబగబా!

నిజమే! కాళ్ళు చుర్రుమంటున్నాయి. పెద్దవాడు కాబట్టి తనకేం తెలియడం లేదు. అయినా నడవలేనంత బాధ లేదు అనుకున్నాడు గౌతముడు.

'ఫరవాలేదమ్మా! ఏం కాదులే! కొంచెం ఓర్చుకోవాలి! లేచి నడువు!'

'ఊహూ! నడవలేను. నన్ను ఎత్తుకో!'

'అంజనా! ఏమిటా మూర్ఖత్వం? ముగ్గురిని ఎలా ఎత్తుకోవడం? లే! నడువు!'

'ఊహూ! చేతకాదు. కాళ్ళు భగ్గుమంటున్నాయి. నన్నెత్తుకో! పెద్ద తమ్ముడినో చిన్న తమ్ముడినో దించేసెయ్!'

'అంజనా! పెద్ద దానివి. నువ్వే నడవలేకపోతే చిన్నవాళ్ళు వాళ్ళెలా నడుస్తారు!'

'ఏమీ లేదు. బాగానే నడుస్తారు'

'చెపితే వినిపించుకోవేం! లేచి నడువు!'

'నీకు వాళ్ళంటేనే ప్రేమ. నా మీద ప్రేమ లేదులే!'

ఆ చిన్నారి మాటలకు నవ్వేడు గౌతముడు.

ఆయన నవ్వితే ఆమెకు మరింత బాధ కలిగింది.

'నీకు కన్నకూతురిపై కన్నా వాళ్ళ మీదే మమత ఎక్కువ?'

నవ్వాడు గౌతముడు మళ్ళీ!

'నీకు నీ కుమార్తెపై కన్నా యితరుల బిడ్డల మీద మమత ఎక్కువా?'

'ఏమిటమ్మా?' అంజన మాటలు అర్థం కానట్లు అడిగాడు.

'నేను నీ కన్న కూతురిని. వాళ్ళు పరాయి బిడ్డలు!'

'నువ్వు కన్న కూతురివా? వాళ్ళు పరాయి బిడ్డలా?' ఆశ్చర్యంగా అడిగాడు.

'అవును. నేను ఒక్కతినే నీ బిడ్డను. వాళ్ళు కారు'

అంజన తెలిసీ తెలియక బాల్య చాపల్యంతో అలా అంటున్నది అనుకున్నాడు గౌతముడు.

'ఎలా?'

'పెద్దవాడు ఇంద్రుడి కొడుకు! చిన్నవాడు సూర్యుడి కొడుకు!'

'ఏమిటీ?' ఆశ్చర్యంతో అడిగాడు గౌతముడు.

'అవును. వాడు ఇంద్రుడి కొడుకు! వీడు సూర్యుడి కొడుకు! నీ సంతానం కాదుగ నన్ను దూరం చేసుకుని వాళ్ళను దగ్గరకు తీసుకుంటున్నావు' అంది ఏడుస్తూ అంజన.

'ఆపు నీ ఏడుపు!' కసురుకున్నాడు. భుజాలపై ఉన్న కొడుకులను ఇద్దరినీ కిందకు దించాడు. ముగ్గురినీ పరిశీలనగా చూశాడు. అంజన నిర్నిమేషంగా చూస్తూ ఉంది. పిల్లలిద్దరూ బిక్క మొఖాలతో నిలబడ్డారు.

'వీళ్ళు తన సంతానం కాదా! ఇతరుల సంతానమా! ఎలా తేల్చుకునేది?'

చప్పున ఆయనలో ఆగ్రహం వెల్లువలైంది. ఇద్దరినీ చెరో చేత్తో పట్టుకుని పక్కనే ఘోష పెడుతున్న సముద్ర జలాల్లోకి విసిరేశాడు. దిక్కు తెలియని పిల్లలు యిద్దరూ నీళ్ళలో పడ్డారు. అంజన ఆశ్చర్యంతో చూస్తోంది. దిగ్భ్రాంతి చెందింది.

'వీళ్ళిద్దరూ నా సంతానమే అయితే యిలాగే మానవ రూపంతో వస్తారు. కాకపోతే వానర రూపులు అవుతారు' అన్నాడు. శపిస్తున్నట్లుగా శాసిస్తున్నట్లుగా కఠినంగా అన్నాడు.

అంజన వింత చూస్తున్నట్లు నిలబడిపోయింది. కొన్ని క్షణాలు గడిచాయి.

నీళ్లలోకి విసిరి వేయబడ్డ చిన్నారులిద్దరూ నీటిలోకి మునిగారు ఆ వేగానికి. మునిగిన కొద్ది క్షణాలకు నీళ్లపైకి తేలి నీళ్లలోంచి నడుస్తూ ఒడ్డుకు రాసాగారు.

వాళ్ళను చూసి అంజన ఆశ్చర్యపోయింది. గౌతముడు నిర్ఘాంతపోయాడు. కుమారులిద్దరు కూడా వానర రూపులయిపోయారు. కోతి ముఖాలు.. తోకలు.. శరీరం నిండా రోమాలు.

గౌతముడికి పట్టరాని వేదన కలిగింది. తన వారనుకున్నవారు వానరులయ్యారు. పరాయి వారయ్యారు! హతవిధీ! అనుకున్నాడు.

విధిని తలుచుకోగానే ఆయన మనస్సులో ప్రశాంతత వచ్చేసింది.

'అంతా విధి లిఖితం! విధి విలాసం! బ్రహ్మ ఎలా సంకల్పించాడో అలాగే సాగుతుంది. తను మాత్రం నిమిత్తమాత్రుడు'

అలా అనుకోగానే ఆయన మదిలో తన మామగారైన బ్రహ్మ మెదిలాడు. ఇదంతా ఆయన వింత చేష్ట అనుకుని ప్రసన్నం కమ్మని వేడుకున్నాడు.

సరస్వతి వీణా వాదనలో, వేద పఠనంలో సృష్టి కల్పనలో నిమగ్నుడైన బ్రహ్మకు గౌతముడి పిలుపు వినిపించింది.

'హే! చతురాననా! ఏమిది! కోరి కన్యాదానం చేశావు. కోరిక లీరిక లెత్తేలా దేవతలు దేవతా సార్వభౌముడు కోరివచ్చినా నన్నే ఎన్నుకుని కన్నెను ధారపోశావు. ఇప్పుడీ విచిత్ర సంఘటన ఏమిటి స్వామీ!'

బ్రహ్మ చప్పున కదిలివచ్చాడు.

దృశ్యా దృశ్యంగా భాసిస్తూ చెప్పాడు 'గౌతమమహర్షీ! ఇదొక విచిత్ర సన్నివేశం! నీ కుమారులిద్దరూ కారణ జనములు. వారి వలన జరగవలసిన కార్యాలెన్నో ఉన్నాయి! శ్రీమన్నారాయణుడు భూమిపై నడయాడబోతున్నాడు. అప్పుడు నీ సంతానం ఆయనకు సహాయకారులవుతారు!' చెప్పాడు.

గౌతముడు వింటున్నాడు.

'గౌతమా! అహల్య దోషి కాదు. ఆమె తప్పు చేయలేదు! ఒక వేళ నీ దృక్పథంలో ఆమె దోషి అనిపిస్తే ఆమెను మన్నించు. నీ శాపానికి గురి చేయకు. మీ ఆంధ్ర దేశంలో ఒక సామెత ఉన్నదే కదా! కుమ్మరికి ఒక ఏడు - గుండ్రాయికి ఒక వేటు అని కదా! ఏడాదిపాటు కులాలుడు శ్రమపడి నిర్మించిన కుండలన్నీ ఒక రాతి దెబ్బతో సర్వనాశనం చెయొచ్చు! కానీ అది విజ్ఞత. వివేకం కాదు. విధ్వంసం మంచిది కాదు.

గౌతమా! సృష్టిలో ఎక్కడా లేని అందాలు ఆమె స్వంతం చేసి అహల్యను సృష్టించాను. దేవతలకిచ్చి ఆ లోకంలో వుంచే దానికన్నా నీకిచ్చి భూలోకవాసిని చేయడమే మేలని తలచాను. అలాంటి అహల్యను నువ్వు కోపంతోనో, శాపంతోనో శిక్షించడం నాకు సమ్మతమవుతుందా! ఆలోచించు! సహనం, శాంతి, సముద్రం కన్నా మిన్న అయినవి. సముద్రం విశాలమూ, అగాధమూ అయితే అంతకన్నా ఇవి విశాలం అగాధము ఆనందదాయకం'

గౌతముడు అహల్య గురించి బ్రహ్మ చెప్పిన మాటలు విన్నాడు.

ఆయన మనసులో శాంతం సముద్రంలా పొంగింది.

'పరమేష్టీ! కోపం మానవుడికి శత్రువు. మానవుడి శాంతమే అతడికి రక్షా. కోపంతో నా కుమారులను వానరులుగా శపించాను. మరింత ఆగ్రహంతో అహల్యనేమని శపించి ఉండేవాడినో నాకు తెలియడం లేదు. సరయిన సమయంలో శాంతి సందేశం వినిపించి నన్ను కాపాడారు!'

బ్రహ్మ ఆనందంతో అన్నాడు.

'గౌతమా! అన్నీ కార్య కారణ సంబంధాలేనయ్యా! ఋక్షవిరజుడనే వానర శ్రేష్టుడు సంతానం లేక తపిస్తున్నాడు. అతడికి నీ కుమారులను దత్తం చేయవయ్యా మహర్షీ! అతడు దండకారణ్యంల్ కిష్కింధ రాజ్యం నిర్మించ తలపెట్టాడు. అతడి వారసులుగా ఈ బాలురు కిష్కింధ ఏలుకుంటారు. చెప్పాను కదా! వీరు సైన్యం, వీరి సంతానం శ్రీమహావిష్ణువు ఈ లోకంలో అవతరించిన సమయంలో మిక్కిలి సహాయ పడతారు'

గౌతముడు ఆ మాటలకు సంతోషించాడు.

బ్రహ్మకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు 'పరమేష్టీ! ఈ సకల చరాచర సృష్టి మీ మూర్తిత్రయ పాలనకు లోబడి నడుస్తుంది. మీ ఆజ్ఞ - అనుజ్ఞ లేనిదే ఏమీ జరుగదు. తెలిసో తెలియకో మాన్యులు, సామాన్యులు కూడా అజ్ఞానంలో పడతారు!'

బ్రహ్మ సంతోషంగా అన్నాడు 'అదిగో ఋక్ష విరజుడు వారసులను అన్వేషిస్తూ వస్తున్నాడు. ఈ వానరులను వారసులుగా అతనికి అప్పగించు!'

దృశ్యా దృశ్యంగా కనిపిస్తోన్న బ్రహ్మకు గౌతముడు అంజలి ఘటించాడు.

బ్రహ్మ అదృశ్యమయ్యాడు.

వానర రూపంతో వున్న ఇద్దరు కుమారులనూ, అంజననూ చూసి నిట్టూర్చాడు గౌతముడు. అంతలో కొంత దూరంలో విష్ణు సంకీర్తనం చేస్తూ వస్తున్న వానర శ్రేష్టుడు కనిపించాడు. గౌతముడు అతని రాక కోసం నిరీక్షిస్తూ నిలబడ్డాడు.

ఋక్ష విరజుడు సమీపించాడు.

'మహానుబావా! తమరెవరో తెలుసుకోగోరుతున్నాను. నన్నందరూ ఋక్ష విరజుడని పిలుస్తారు. నేను వానర మూర్తిని. కిష్కింధలో వానర సామ్రాజ్యం నిర్మించాలని తలపోస్తున్నాను. పుత్రహీనుడినైన నేను పుత్రుల కోసం పరితపిస్తూ పరిభ్రమిస్తున్నాను' అన్నాడు.

'గౌతముడని నన్నంతా సంభావిస్తారు'

గౌతముడి మాటలు పూర్తయి కాకముందే అత్యంత సంభ్రమంతో అన్నాడు ఋక్షవిరజుడు 'మహానుభావా! మహనీయ తేజా! న్యాయసూత్ర నిర్మాతా! చతురానన జామతా! నమో నమః!'

గౌతముడు ఆశీర్వదించాడు 'సుపుత్రా ప్రాప్తిరస్తు! ఐశ్వర్యమస్తు! ఇష్టకామ్యార్ధ సిద్ధిరస్తు! పుత్ర పౌత్రాభివృద్ధి రస్తు! వంశాభివృద్ధిరస్తు! శాంతి రస్తు! పుష్టి రస్తు! తుష్టిరస్తు!'

ఋక్ష విరజుడు ఆనందంతో శిరస్సు వంచి నమస్కరించాడు.

అప్పుడు చూశాడు గౌతముడి చెంతనున్న వానర మూర్తులను.

'వీరెవ్వరు స్వామీ!'

'నీ ఆలనలో పాలనలో అభివృద్ధికి రానున్నవారు!'

'ధన్యోస్మి మహర్షీ! ధన్యోష్మి!'

'ఋక్ష విరజా! వీరిని నీకు దత్తం చేస్తున్నాను. ఇది పరమేష్టి సంకల్పం! చతురాననుడి చాతుర్యం!'

'నా బ్రతుకు పండింది స్వామీ! నా కోరిక నెరవేరింది! పుత్రాన్వేషణలో ఉన్న నాకు ఇరువురు కుమారులను అనుగ్రహించి ధన్యుడ్ని చేశారు!'

గౌతముడు యిద్దరు కుమారులను దగ్గరకు తీసుకుని, ఋక్ష విరజుడికి అప్పగిస్తూ అన్నాడు 'నాయనలారా! నేటి నుంచి యిక మీరు యీ వానరేశ్వరుని సంతానం! ఆయన సంరక్షణలో పెరిగి పెద్దవారై అన్యోన్యతకు ఆదర్శంగా అన్నదమ్ముల అనురాగాలకు చిహ్నంగా జీవించండి'

ఋక్ష విరజుడు వారిద్దరినీ ఆనందంతో స్వీకరిస్తూ 'గౌతమమహర్షీ! జన్మతో మీరు ఏకోదరులు పెరిగాక జ్ఞాతులు జ్ఞాతిశ్చేదనలేనకిం అని కదా సూక్తి. అన్నదమ్ములు దయ విభాగాలకై పోరాడుకోవడం ఈ త్రేతాయుగంలోనే ప్రారంభమవుతుంది. ద్వాపరంలో విస్తృతమవుతుంది. కలియుగంలో విజృంభిస్తుంది. అది సహజం! అనుజన్ములు! అగ్రజులతో తగాదా పడటం తప్పదు!'

గౌతముడు తలూపేడు.

'మహర్షీ వీరి పేర్లు...'

'అవి యిక నువ్వే నిర్ణయించు!'

ఋక్ష విరజుడు వారిని పరిశీలనగా చూశాడు 'పెద్దవాడు వాలి! అందమైన కంఠంతో ఉన్న ఈ చిన్నవాడు సుగ్రీవుడు!' అన్నాడు.

గౌతముడు ఆమోద సూచకంగా తలూపాడు.

'మరిక సెలవా స్వామీ! వెళ్ళి నా సామ్రాజ్యాన్ని నిర్మించుకోవాలి! పాలించడానికి అవసరమున్నా కాకున్నా పిత్రార్జితంగా వంశపారంపర్యంగా పాలించుకోవడానికి నా కుమారులకు రాజ్యం కావాలి కదా! ఈ వానర కుమారులు సామాన్యులు కాదు కదా! చెట్లపైనా, గుట్టలపైనా నివసిస్తూ కేవలం కందమూలాలు తింటూ కాయగమనంతో కాలం గడపలేరు కదా! నరమూర్ధన్యులకు తోడ్పడతగిన స్థాయిలో యీ వానర మూర్ధన్యులు ధన్యులు కావాలి మహర్షీ!'

'తథాస్తు!' దీవించాడు గౌతముడు.

ఋక్ష విరజుడు వాలి సుగ్రీవులను చెరో భుజంపై ఎక్కించుకుని వాయు వీధుల్లోకి ఎగిరిపోతుండగా గౌతముడు చూస్తూ నిట్టూర్చాడు. అంజనను చేయి పట్టుకుని నడిపిస్తూ ఆశ్రమం వైపు కదిలాడు.

జరిగినదంతా చూస్తూ దిగ్భ్రాంతికి లోనయిన అంజన తండ్రి వెంట నడిచింది.

* * * *

నారదుడు దేవలోకం వెళ్ళాడు.

'నారాయణ! నారాయణ!'

ఆ స్మరణ విన్న దేవేంద్రుడు - అటు ఎటో చూస్తున్న వాడు ఇటు తిరిగి 'దేవర్షులకు ప్రణామములు!' అంటూ నమస్కరించాడు.

'విజయీభవ!'

నారదుడి దీవెన విన్న దేవేంద్రుడు ఆశ్చర్యంగా అడిగాడు 'ఏమిటిది నారదా విజయీభవ అని దీవిస్తున్నావు?'

'దేవేంద్రా! మీకూ, దైత్యులకూ జ్ఞాతి వైరం కదా! మిమ్ములను ధిక్కరించి అధికరించి మీ స్వర్గాన్ని కొల్లగొట్టి, నీ సింహాసనాన్ని ఆక్రమించుకుని మూడు లోకాలనూ ఏలాలని కదా హిరణ్యాక్ష, హిరణ్యకశ్యప, బలి మొదలయిన రాక్షస రాజుల జీవితాశయం! వారి కోవలోనివాడే కదా రావణుడు! అతన్ని జయించే నరోత్తముడికి అనుకూలత సిద్ధిస్తున్నది. కాబట్టి ఎవరు రాక్షసులను నిర్జించినా అది నీ విజయంగా భావిస్తాను. కనుక విజయీభవ! అని దీవించాను'

'వివరించండి మహర్షీ!'

'గౌతమ పుత్రులు నర రూపం వదిలి వానర రూపం దాల్చారు!'

ఉలిక్కిపడ్డాడు ఇంద్రుడు 'ఏమంటున్నారు మహర్షీ!'

'అవును దేవేంద్రా! తండ్రి శాపంతో వారికి వానర రూపం వచ్చింది'

ఇంద్రుడు ఆశ్చర్యపోయాడు.

'గౌతమ మహర్షి తన సంతానాన్ని శపించారా?'

నారదుడు వివరంగా చెప్పాడు.

పూర్తిగా వివరించాక అన్నాడు 'దేవేంద్రా! రావణుడికి నరుల వల్లా వానరుల వల్లా తప్ప మిగతా వారి వలన మరణం లేదు. అందుకే శ్రీమన్నారాయణుడు నరుడిగా అవతరించనున్నాడు. ఆయనకు సహాయం అందించడానికి దేవతా గణం వానరులుగా పుట్టువొందుతున్నారు'

దేవేంద్రుడు ఆ విషయం విని సంతోషించాడు.

నారదుడు 'నారాయణ! నారాయణ!' అంటూ కదలబోయాడు.

'దేవర్షీ!'

'ఏమి మహేంద్రా!'

'ఇరువురు కుమారులు యిప్పుడు వాలి - సుగ్రీవులుగా మారి వానర రాజ్యానికి వెళ్ళారని తెలిసిన అహల్య...'

'చెపుతాను' అంటూ మొదలుపెట్టాడు 'అలా కొడుకులను యిద్దరినీ వానర రూపం ధరించిన వారిని ఋక్ష విరజుడికి అప్పగించి కుమార్తె అంజనతో ఆశ్రమానికి కదిలిన గౌతముడు ఆశ్రమం చేరాడు. చేరగానే...

## 47

అతిథి అభ్యాగతులకు కావలసిన ఏర్పాట్లన్నీ పూర్తిచేసి కుటీరం నుంచి బయటికి వచ్చింది అహల్య. గౌతముడి మధ్యాహ్నికాలకు కావలసిన ఏర్పాట్లు చేయడానికి బయటికి వచ్చిందామె. అప్పుడే గౌతముడు, అంజన వస్తున్నారు.

గౌతముడికి చెప్పలేని - పట్టరాని కోపం వచ్చింది. ఆమెను చూడగానే - తన నుంచి రహస్యం దాచినందుకు ఆమెని శపించాలన్నంత ఆగ్రహం వచ్చింది. అంతలో బ్రహ్మ చేసిన ప్రబోధం - ఆయన చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ఆగ్రహాన్ని అణుచుకున్నాడు గౌతముడు.

అంజన తల్లిని చూడగానే జంకింది. జరిగిన సంగతులన్నీ తెలిస్తే అమ్మ ఏమంటుందోనని విపరీతంగా భయపడిందామె. దాంతో ఆమెకు తండ్రి చాటుకు వెళ్ళింది.

కుమారులిద్దరూ కనిపించక భర్తను ప్రశ్నార్థకంగా చూసింది అహల్య. గౌతముడు ఆమె కనుల్లో కనిపించిన భావాల్ని స్పష్టంగా చదవగలిగినా జవాబివ్వలేదు.

'అంజనా!'

తండ్రి చాటు నుంచి ఇవతలికి వచ్చి తలవంచుకుని నిలబడింది అంజన.

'అంజనా! తమ్ములేరీ!'

'అంజన జవాబివ్వలేదు'

'ఏమే పలుకవు?'

అయినా అంజన సమాధానం చెప్పలేకపోయింది.

భర్త వైపు చూస్తూ అడిగింది 'పిల్లలేరి స్వామీ!'

నిశ్చలంగా నిర్వికారంగా జవాబిచ్చాడు గౌతముడు 'సముద్రం పాలయ్యారు'

ఆ జవాబు విని ఆమె నిర్ఘాంతపోయింది.

'స్వామీ! ఏమంటున్నారు మీరు?'

'అవును అహల్యా! చిన్నారులిద్దరినీ సముద్రంలోకి విసిరేశాను'

'స్వామీ తమరు మన చిన్నారుల్ని సముద్రంలోకి విసిరేశారా? వారంత చేయరాని తప్పు ఏం చేశారు స్వామీ? అయినా ముక్కు పచ్చలారని బాలురు... లోకం తెలియని పసిబాలురు. మన పిల్లలు వాళ్ళు. తెలిసో తెలియకో తప్పు చేస్తే క్షమించాలి కానీ నిర్దాక్షిణ్యంగా మృత్యువాత పడవేస్తారా? అంత కఠినత్వమా తమరిలో' దుఃఖంలో అడిగింది అహల్య.

'అహల్యా! వాళ్ళు పిల్లలే! లోకం తెలియనివారే! కానీ వాళ్ళు నీ కడుపున పుట్టిన నేరానికి- చేయని తప్పుకు శిక్ష అనుభవించారు'

'స్వా... మీ...!'

'అవును మరొకరి వరంతో పుట్టినందుకు వారు దండింపబడ్డారు!'

'ఏమిటి స్వామీ తమరంటున్నది?'

'ఇంద్రాంశతో నీ పెద్ద కుమారుడు, సూర్యాంశతో నీ రెండవ కుమారుడు జన్మించారు కదా! పరాయి బిడ్డల్ని భరించి పోషించడం ఇష్టం లేక వారిని సముద్రంపాలు చేశాను'

అహల్య కనుల వెంట నీరు జలజలా రాలింది.

ఆమె నోటంట మాటరాక మూగదానిలా ఉండిపోయింది.

'ఏ స్త్రీ కూడా భర్త నుంచి రహస్యం దాచదు. భార్యా భర్తల మధ్య ఒకరికి తెలిసిన రహస్యం మరొకరు దాచకూడదు. అది దాంపత్య ధర్మ విరుద్ధం. నువ్వు నా నుంచి రహస్యం దాచావు. ఆ ఫలితం నీ సంతానాన్ని బలి తీసుకుంది'

అహల్య మూగగా రోదిస్తూ ఉన్నది.

'నాకు అంజన ద్వారా విషయాలు తెలిశాయి'

చప్పున అటు చూసింది అహల్య.

గౌతముడు అంతా వివరించాడు.

అది విన్న అహల్య క్రోధమూర్తి అయింది 'ఎంత ఘోరం జరిగిందే నీవల్ల, పాపిష్టిదానా! అసూయ నీ మనసును ఆక్రమించి ఎంత దుష్ఫలితాన్నిచ్చిందో చూశావా! నీవల్ల నీ తమ్ములు వానరులయ్యారు కనుక నీకు వానర సంబంధమే గతి కావాలి. నీ భర్త వానరుడవుతాడు. నీకు జన్మించే సంతానమూ వానరుడే అవుతాడు. నీ కుమారుడు వానరునిగా మారిన నా కుమారునికి బంటుగా జీవిస్తాడు. నరులు వానరులుగా మారినా నా కుమారులు రాజ్యాధికారులవుతారు. కానీ నీ కుమారుడు బంటుగానే బ్రతుకంతా వెళ్ళదీస్తాడు!'

అహల్య శాపం విని తరతరలాడిపోయింది అంజన.

అభం శుభం తెలియని ఆమె వలవల ఏడ్చింది. గౌతముడు కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు.

గౌతమ మహర్షిని నిశితంగా చూస్తూ అంది అహల్య 'స్వామీ వారు దేవతలు! ఇంద్రుడు దేవనాథుడు ఏదో మాయ చేశాడు. నన్నే మాయ కమ్మినట్లయింది. సూర్యుడు ప్రత్యక్ష నారాయణుడు. ఆయన దర్శనంతో నా కనులు మూతలు పడ్డాయి. ఏదో వెలుగు నన్ను నన్నావహించినట్లయింది. అది దేవ రహస్యం అంటూ వారు నన్ను మూగదాన్ని చేశారు. పతి చెంత దాచదగిన పరమదోషం నేను మనసా వాచా కర్మణా ఎరుగను. అయినా న్యాయ సూత్రాలు తెలిసిన ధర్మమూర్తులు తమరు! న్యాయ సూత్రాల్ని నిర్మించిన మహానుభావులు తమరే ఇలా నేరం చేసింది ఒకరని భావించి - మరొకరిని శిక్షించడం న్యాయమా స్వామీ!' దుఃఖంతో జీరపోయిన గొంతుకతో అడిగిందామె.

అదంతా విధివిలాసం అలా జరగవలసి ఉంది. అంతే! జరిగిన దానికి వగచి లాభం లేదు. గతం నశోచామి...'

గౌతముడు అన్న మాటలు ఆమెకు మరింత బాధ పెట్టాయి.

'మీరు పురుషులు! అందునా మహర్షులు! మీ గుండె రాతి గుండె! మీరు సుఖ దుఃఖ ద్వంద్వాలకు అతీతులు. కానీ నేను స్త్రీని! మాతృమూర్తిని. పుత్ర శోకం భరించడంలో కష్టం మీకు తెలియదు'

'అహల్యా! ఎంత వగచినా వారు తిరిగి రారు. అసాధ్యమైన దానికోసం వగవడం అజ్ఞానుల లక్షణం'

అహల్య భర్తతో వాదించలేక మౌనంగా దుఃఖించసాగింది. అంజన తల్లి చెంతకు చేరి మెలిమెల్లిగా దగ్గరగా వచ్చిన కూతురుని కౌగిలిలోకి తీసుకుని అంది అహల్య 'ఆడవారి జీవితాలు శోకతప్తాలు. మన బ్రతుకులు శాపాల పాలయ్యాయి' తల్లి గుండెలలో తల దాల్చుకుంది అంజన. గౌతములు మధ్యాహ్నికాల కోసం కదిలారు.

## 48

నారదుడు చెప్పినదంతా విన్నాడు ఇంద్రుడు.

కిష్కింధను ప్రస్తుతం పాలిస్తున్నవాడు, నరుని రూపం దరించనున్న నారాయణునికి సైదోడుగా నిలిచి సాయపడువాడు. త్వరలో సింహాసనాన్ని అధిష్టించనున్న వాలి కూడా నారాయణునికి వైరి వీరవర్గంలోని వాడే! అందుకే జంతువుని అయినా సంశయించక నరమూర్తిగా అవతరించే నారాయణమూర్తి ఆ వానర మూర్తిని సంహరిస్తాడు. అతను అనుజుడైన సుగ్రీవునికి పట్టం కడతాడు. ఆపై అతను, అతని మంత్రులు, సైన్యం ఆ పరంధామునికి తోడ్పడతారు' వింటున్నాడు ఇంద్రుడు.

'రావణ సంహారం జరుగుతుంది!'

తృప్తిగా నిట్టూర్చాడు ఇంద్రుడు.

'ఉచ్ఛ్వాస నిశ్వాసాలు లేని నీవే నిట్టూరిస్తే, అవే ఊపిరిగా బ్రతికే భూలోక జనం ఎంత సంతసిస్తారో ఆలోచించు!'

ఇంద్రుడు తలూపేడు.

'శాంతంగా శాంతితో ఊపిరి పీల్చుకుంటారు కదూ!'

అవునన్నట్లు తలూపేడు ఇంద్రుడు.

'కథ చాలా వేగంగా సాగిపోతున్నది మహేంద్రా!'

'వివరించండి దేవర్షీ!'

'గౌతముల వారికి మరొక కుమారుడు కలిగాడు. అతడి పేరు శతానందుడు. విద్యలో వినయంలో వివేకంలో అతడు గౌతముల పేరు నిలబెట్టనున్నాడు'

'ఊ!'

'అతడు జనకరాజర్షి కొలువులో చేరనున్నాడు'

'చక్కని చోటులో చేరనున్నాడు! వేదాంతులకు వేదాంగ వేత్తలకు అది తగిన స్థానం కదా స్వామీ!'

'గౌతముడి మనసులో ఏమున్నదో తెలియదు కానీ తదుపరి తన స్థానాన్ని ఆక్రమించి గురుకులాన్ని మరింత పెంచి దానికి గౌరవాన్ని ఇనుమడింపజేయగలడని తలపోస్తున్నాడు!'

'ఊ!'

'తండ్రిగా ఆయన అలా ఆలోచించడం సమంజసమే! కానీ అది తానొకటి తలిస్తే దైవం మరొకటి తలుస్తారని ఆంధ్రదేశంలో వాడుకగా అనుకుంటారు. దేవేంద్రా! ఆ తండ్రి అలా తలచినా మా తండ్రి తలంపు ఇంకోలా ఉన్నది'

'ఎలా దేవర్షీ!'

'జనకుడి కొలువులో చేరగలడని'

'నువ్వు లలాట లిఖిత లిపిని ఎప్పుడు నేర్చావు దేవర్షీ!'

'కంటికే కనిపించని లిపిని కలుపుకుని చదవటం అసాధ్యం కదా దేవేంద్రా! ఇది మా తండ్రిగారే సెలవిచ్చారు!'

'అది దేవ రహస్యం కదా దేవర్షీ!'

'దేవ రహస్యాన్ని దేవర్షి దేవేంద్రుడికి విప్పి చెప్పడం తప్పు కాదులే దేవేంద్రా! దేవ రహస్యాలు మానవులకు తెలియరాదు! కానీ దేవతలకు తెలియడం తప్పుకాదులే!'

దేవేంద్రుడు నవ్వాడు.

'ఇంకా భూలోక విశేషాలేమిటి దేవేంద్రా!'

'గౌతమాశ్రమ కథ ఇంకా పూర్తికాలేదు స్వామీ!'

'సశేష విశేషాలేమిటి దేవర్షీ?'

'ఆగ్రహంతో అహల్య శపించినట్టుగానే అంతా జరిగిపోయింది. అంజన భర్త కేసరి వానరశ్రేష్టుడే అయినాడు. వారికి శివాంశతో కుమారుడు జన్మించాడు. తల్లి శాపం తనని వెంటాడటం వల్ల అంజన కుమారుడు వానరుడు గానే పుట్టువొందాడు. అతడికి ఆంజనేయుడు అని పేరు పెట్టారు. అంజన ఆశ్రమ వాసినిగా గుట్టుమట్టుగా కుమారుడిని పెంచుతున్నది'

'ఊ!'

'ఇప్పుడు గౌతముల కొడుకు శతానందుని పండితుని చేయడంలోనే ఎక్కువ కాలం గడుపుతున్నారు. ఆయనకు వాలి సుగ్రీవుల వర్తమానం అప్పుడప్పుడూ తెలుస్తూనే ఉంది'

'ఊ!'

'ఇంకేం మిగిలింది దేవనాథా! రావణ సంహారం ఎప్పుడెప్పుడా అని మనం ఎదురు చూడటమే!'

'ఊ!'

'దశరధుడు తపిస్తున్నాడు పాపం! అన్నట్లు! ఈ పాపం అనే పద ప్రయోగం కూడా ఆంధ్ర దేశీయులదే! ఏదో పాపం వల్లో శాపం వల్లో కష్టాలు వస్తాయని వారు నమ్ముతార్లే! అందుకే అలా అంటారు!'

'ఊ!'

'మరి వెళ్ళిరానా దేవేంద్రా!'

'ఊ!'

'దేవేంద్రులు అన్యమనస్కంగా ఉన్నట్టున్నారు!'

'ఊ!' దీర్ఘీకరించాడు ఇంద్రుడు.

'ఏదో ఆలోచనలో ఉన్నట్టున్నారు'

'అవును! శ్రీమన్నారాయణ మూర్తి ఎప్పుడు భూలోకంలో అవతరిస్తాడో అని ఎదురుచూస్తున్నాను నారదా!'

'మనం త్వరపడితే అవుతుందా! అవతరించవలసిన వేళ రావాలి! ఆయన పుట్టుక జరగాలి. అంతే!'

అవునన్నట్టు మహేంద్రుడు తలూపాడు.

నారాయణ! నారాయణ! అని స్మరిస్తూ నారదుడు కదిలిపోయాడు.

గౌతమాశ్రమం కళకళలాడుతున్నది. ఎటు చూసినా వసంత వైభవం. పూచిన మొక్కలతో- సాగిన తీగలతో- పూలతో పిందెలతో- కాయలతో- ఫలాలతో- విరిగిపోతాయేమో అన్నట్లు వంగిన చెట్లతో ప్రకృతి అంతా పరవశం కలిగించే విధంగా ఉంది.

గౌతమ మహర్షి శిష్య శిక్షణలో క్షణం తీరిక లేనట్లుగా గడుపుతున్నారు. ఏ క్షణమయినా అవకాశం లభిస్తే బహుధారణా సంపన్నులయిన వారిచేత వేద వేదాంగాలను ధారణ చేయిస్తున్నారు. దేనికీ లోటు లేని విధంగా సాగిపోతున్నది. అహల్యకి పతి సేవలో, ఆశ్రమ నిర్వహణలో కాలం తెలియడం లేదు.

ఓ రోజు రాత్రి!

బాగా పొద్దుపోయేదాకా ఆశ్రమ విషయ చర్చలతో శ్రమపడి ఆదమరిచి నిద్రిస్తున్నారు గౌతమ మహర్షి.

పతి సేవలో అలసిన అహల్య కూడా మైమరచి నిద్రిస్తున్నది.

## 49

ఇంద్రుడి మనస్సు నిండా ఆలోచనలు. నారదునితో మాట్లాడిన తర్వాత మనస్సు మరింత వికలమైంది. అతనికి అహల్య గుర్తొచ్చింది. ఆమె అందం, ఆమె మాట తీరు, మన్నన గుర్తొచ్చాయి. ఆమె సౌశీల్యం గుర్తొచ్చింది. ఆమె నియమ జీవితం గుర్తుకు వచ్చింది. తన వైభవం నెమరు వేసుకున్నాడు. తన భోగం గుర్తుకు తెచ్చుకున్నాడు.

తనూ శచీదేవి సలిపిన శృంగార విహారాలను తలపోసుకున్నాడు. ఆత్మీయంగా ప్రేమగా తనతో శచీదేవి ఎలా కలిసి మెలిసి విహరిస్తుందో గుర్తు చేసుకున్నాడు. అహల్యతో అలా సుఖించాలి అనుకున్నాడు. తను వెళ్ళాడు. ఆమెను చూశాడు. తన తేజస్సుతో ఆమెని స్పృశించాడు. తన మహత్యంతో ఆమెకు సంతానమూ కలిగింది. కానీ తన కోరిక తీరిందా?

ఊహూ! ఎలా తీరుతుంది? చూపులతో జరిగిన శృంగారం అది! అది తృప్తిని యిస్తుందా? ఎంత వెర్రి?

తను తనువుతో తనువును చేర్చితేనే కదా తనకు తనివితీరా ఆనందం కలిగేది. తనది తేజశ్శరీరం. ఆమెది మానవ శరీరం! బ్రహ్మ విశేషంగా సృష్టించినా అది ఆమె మానవాంగనే!

తన తేజోమయ శరీరానికి ఆమె మానవ శరీరానికి అనుబంధం కుదరదు. ఆమెను దివ్యరాలిని చేయాలి! లేదా మహేంద్రుని ఆలోచన చట్టుకున ఆగింది. పెదాలపై చిరునవ్వు కదలాడింది.

'ఇంద్రసఖీ!'

మనస్సులో తన అంతరంగాన్ని పరిపూర్ణంగా గ్రహించిన చెలిని తలపోశాడు.

'ప్రభూ!

నారదుడు వెళ్ళిపోగానే - వనంలో ప్రవేశించిన ఇంద్రసఖి అతని మనస్సును గుర్తెరిగి వచ్చింది. వేచి వేచి ముందు వచ్చి పిలిచింది.

తను మదిలో అనుకోగానే వచ్చిన ఇంద్రసఖిని చూసి మహేంద్రుడు ఎంతో సంతోషించాడు. ఆమె రావడం శుభ శకునంగా భావించాడు.

'ప్రభూ!'

'ఏమంటున్నదే మీ అహల్య!'

నవ్వింది ఇంద్రసఖి 'అదేమిటి ప్రభూ! అలా సెలవిచ్చారు. ఆమె గౌతముల ధర్మపత్ని! తమ వలపుల పంట! అంతేకానీ ఆమె నా అహల్య ఎలా అవుతుంది ప్రభూ!'

'నీవు ఆమెకి నచ్చిన చెలివి కదే!'

'అవును ప్రభూ! అందులో గొప్పేమున్నది. మీకోసం ఈ లోకం నుండి తన లోకానికి వచ్చానని ఆమెతో చెలిమి చేయాలని వచ్చానని చెపితే దేవతా స్త్రీని కనుక దేవేంద్రుల వారికీ శచీదేవమ్మగారికీ యిష్ట సఖిని కనుక గౌరవించింది. ఆదరించింది'

'ఆ ఆదరణ చాలదటే!'

'తమరినీ ఆదరించింది కదా ప్రభూ!'

ఇంద్రుడేమీ అనలేదు.

'తమరి వలన ఆమెకు పుత్ర భాగ్యమూ కలిగింది కదా ప్రభూ!'

దానికీ ఇంద్రుడు జవాబివ్వలేదు.

'ప్రభూ!' మళ్ళీ పిలిచింది. ఇంద్రుడి మనస్సు తెలుసుకున్నట్లుగా అంది మెల్లిగా 'తమరు సెలవివ్వనే లేదు! ఎందుకు పిలిచారో తెలియదు. నన్ను అహల్యాదేవి చెంతకు వెళ్ళి రమ్మందురా స్వామీ!'

'వద్దు! ఇంద్రసఖీ!' మెల్లిగా అన్నాడు. ఇంద్రుడు! 'మేమే వెళుతున్నాం!'

'సంతోషం ప్రభూ!' సంభ్రమంగా అందామె 'తమరి మనస్సు యిప్పటికయినా అటు ప్రసరిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఆలస్యం అమృతం విషం అని ఆంధ్రదేశంలో అనగా విన్నాను. అమృతం తాగుతున్న మనకు దాని విలువ తెలియదు. కానీ విషం విలువ రాక్షసులకు బాగా తెలుసు!'

'ఊహూ!'

'అవును ప్రభూ! రాక్షసులు కామరూపులు కదా! వారు ఏదయినా సాధించదలుచున్నప్పుడు రాక్షస రూపులుగా కాక ఇచ్ఛవచ్చిన రూపం ధరించి యిష్టపూర్తిగా సుఖిస్తారట ప్రభూ!'

చప్పున అటు చూశాడు ఇంద్రుడు. సూటిగా ఇంద్రసఖి ముఖం పరిశీలనగా చూశాడు.

'ప్రభూ! రాక్షసులు ఏ రూపమైనా ధరించగలరు కదా! వారే ఏమిటి యక్షులు, గంధర్వులు కూడా తలచిన రూపం దరించగలరు. కానీ మరో రూపం దాల్చి మనోవాంఛ పూర్తిచేసుకోవడం ఒక రాక్షసులకే ప్రవృత్తి అయిపోయింది'

ఇంద్రుడు తలూపేడు. ఏమీ సమాధానం ఇవ్వలేదు.

'ప్రభువులు అహల్యాదేవి పేరు ప్రస్తావించారు...' అర్థోక్తిలో ఆగిందామె.

అవునన్నట్లు తపూలేడు ఇంద్రుడు.

'తమరు భూలోకం వెళుతున్నారా?'

'అవును.. అహల్యాదేవిని చూడటానికి వెళుతున్నాను'

శుభం అన్నట్లుగా నవ్వింది.

'ఇక్కడ శచీదేవి గారి సేవలో జాగ్రత్త!' హెచ్చరించింది కదిలాడు ఇంద్రుడు.

గౌతమాశ్రమంలో....

ప్రధాన పర్ణ కుటీరంలో అహల్య - గౌతమ మహర్షి విడివడి శయ్యలపై మైమరచి నిద్రిస్తున్నారు.

కలలు రాని కలతలు లేని కమ్మని నిద్రసుఖం అనుభవిస్తున్నారు యిద్దరూ. వాతాయనాల నుంచి సానుకూలంగా వీస్తున్నది గాలి. ఇంద్రుడు ఆ కుటీరంలో ప్రత్యక్షమైనాడు. అతని రాక చిరుగాలిలా ఉంది.

ఎవరికీ నిద్రాభంగం కలిగించలేదు.

నిద్రా ముద్రితమైన అహల్య సౌందర్యం కనులారా చూశాడు ఇంద్రుడు. అతనికి ఎంత చూసినా తనివి లభించడం లేదు. క్షణ క్షణానికీ తమకం పెరిగిపోతుంది.

ఆ పర్ణ కుటీరం నుండి గౌతముడిని బయటికి వెడలనంపి - తాను అహల్య చెంతచేరి అమందా నందాలను పొందాలని ఉవ్విళ్ళూరసాగాడు.

ఎలా గౌతముడిని బయటికి పంపడం?

ఈ భూలోకంలో క్షణ క్షణం కాలం వేగంగా సాగిపోతూ ఉంటుంది. అది ఎవరికోసమూ ఆగదు. తను దేవనాధుడైనా - త్రిలోకాధి నేత అయినా - కాలానికి అధినాధుడు కాడు. దాన్ని ఆపలేడు.

కాలం గడిచి యీ చీకటి తెరలు విడిపోయి, రాత్రి గడిచి - తెల్లవారి వెలుగులు వస్తాయి. గౌతముడు మేలుకొంటాడు. ఆయన తన కార్యక్రమాలను నిర్వర్తించుకుని ఆశ్రమంలో మరో చోటుకో- మరో ఆశ్రమానికో- తరలి వెళితే తప్ప తనకూ, అహల్యకూ ఏకాంతం దొరకదు!

అంతవరకూ తను దృశ్యంగానో అదృశ్యంగానో యిక్కడ వేగిపోతూ వేచి ఉండవలసిందేనా?

ఊహూ! గౌతమమహర్షిని కుటీరం నుంచి వెలికి పంపాలి. ఎలా? ఆలోచిస్తూ బయటికి కుటీరం బయటికి వచ్చాడు ఇంద్రుడు. నాలుగు దిశలా తిరగసాగాడు. ఆలోచనలతో ఒకసారి తలెత్తి గగనమండలం వైపు చూశాడు.

చంద్రుడు ఏదో అత్యవసర కార్యంపై గబగబా వెళుతున్నట్లుగా కదిలిపోతున్నాడు. చిరు మబ్బులు కదులుతున్నాయి. నక్షత్రాలు మిలమిలా తళతళా మెరుస్తున్నాయి.

పై నుండి పై లోకాలనూ, కింది లోకాలనూ పాలించే ఇంద్రుడు పైనుంచి తన చూపును కిందికి మరల్చాడు. అక్కడ - ఆయనకో అద్భుతమైన దృశ్యం కనిపించింది. దానితో మనసు సేదతీరింది. కీకారణ్యంలో దారిదొరక్క అంధకారంలో

మరీ అగమ్యగోచర స్థితిలో ఉన్నవాడికి వెలుగు రేఖలు - దారీ ఒకేసారి దర్శనమిచ్చినట్లయింది.

ఎంతో ఆనందించాడు. తనకు కనిపించి మార్గోపదేశం చేసిన ఆ జీవిని మెచ్చుకున్నాడు. అక్కడ కనిపించింది మానవలోకాన్ని తన తొలి కూతతో జాగృతం చేసే కోడి. అక్కడ ఒక కోడి తన పిల్లలతో సహా ఆదమరిచి నిద్రిస్తున్నది.

కోడి కూతత్ జనం నిదుర మేల్కొంటారు. ప్రభాత సమయం కాక పూర్వమే తమ కార్యక్రమాలు నిర్వర్తించుకుంటారు. మహర్షులు - ఆచార పరాయణులు తమ జపతపాలు సూర్యోదయం కాకముందే పూర్తి చేసుకుంటారు.

ఆదమరిచి నిద్రించే ఆ ఆచారపరాయణులకు సమయం మించిపోకుండా తమ అనుదిన కార్యక్రమాలకు కాలాతీతం లేకుండా మేలుకొలుపుగా కోడి కూస్తుంది.

'ఓసి కోడి! నీవు పందెంలో ఓడి చచ్చినా, గెలిచి చచ్చినా వీర స్వర్గం ప్రసాదించవచ్చు కదే!' అనుకున్నాడు దేవనాధుడు.

దారి తోచని తనకు దారి చూపుతున్నట్టుగా కనిపించిన ఆ కోడికి మరుజన్మలో మహర్దశ లభించేలా దీవించాడు. వెంటనే దానికి కూత వేయవలసిందిగా ఆజ్ఞాపించాడు.

కానీ - తను నిద్రిస్తూ తను - వేళకు మేలుకుంటూ అందరినీ సరైన వేళకు మేలుకొలిపే కోడి తన జీవ లక్షణానికి భిన్నంగా ఎలా ప్రవర్తిస్తుంది? అది క్రమం తప్పదు కదా!

తన కోరిక మేరకు కూయని కోడిపై విసుగు పుట్టింది ఇంద్రుడికి.

అది నియమ జీవి! నియమానుసారంగా తన కర్తవ్యం చక్కగా నిర్వర్తిస్తుంది. అంతేగానీ తను కూయమని కోరుతున్నాడని - తన కోరికకు దోహదంగా కూసి తనకు తోడ్పడాలని అది కూయదు కదా!

చప్పున ఇంద్రుడికి ఓ ఊహ వచ్చింది. అది కూసే కూత తనే....

అంతే! మరేం ఆలోచించలేదు. ఇంక సమయాన్ని చేజార్చుకోదలచలేదు.

కొక్కొరొకో! అంటూ కూశాడు. ఒకటి రెండు మూడు నాలుగు అయిదుసార్లు కూశాడు.

అకాలంగా వినిపించిన కూత విని నిద్రిస్తోన్న కోడి మేలుకుంది. గొంతు సవరించుకుని తన గొంతూ కలపబోయింది. కానీ దాని గొంతు పెగల్లేదు. తిరిగి అది నిద్రలోకి జారుకుంది.

ఇంద్రుడు ఆశించిన ఫలితం దక్కింది. లోపల ఆదమరిచి నిద్రపోతున్న గౌతముడు కోడి కూత వినగానే మేలుకున్నాడు. ప్రాత కాల భగవన్నామస్మరణ చేశాడు. కర దర్శనం చేసుకున్నాడు. స్తోత్రం చేశాడు.

తర్వాత 'హే భూదేవీ! క్షమస్వ!' అంటూ భూమాతను - ఇక నిద్ర లేచింది మొదలు మళ్ళీ శయనించేదాకా విష్ణుపత్ని అయిన భూదేవిని తన పాద స్పర్శతో పీడిస్తున్నందుకు క్షమించమంటూ ప్రార్థించాడు.

అప్పుడు తలతిప్పి చూశాడు. పూర్తిగా కళ్ళు తెరిచి చూశాడు. అహల్య గాఢ నిద్రలో ఉంది.

నిద్రాముద్రితమయిన ఆమె దివ్య సౌందర్యాన్ని చూశాడు. ఆమె తన ఎడమ చేతిని తలగడ దిండుగా చేసుకుని పడుకుని ఉంది. మూసిన కనురెప్పలు ముకుళిత పద్మాల్లా ఉన్నాయి. వేకువ వేళలో మెలమెల్లగా వీచే పిల్లగాలులకు ముంగురులు కదలాడుతూ చందమామతో దోబూచులాడే నీలి మేఘమాలికలా ఆమె ముఖ చంద్రుడితో దోబూచులాడుతున్నాయి.

నిదురలో కొద్దిగా పైట చెదిరింది. మాతృత్వ చిహ్నాలు కొద్ది కొద్దిగా దర్శనమిస్తున్నాయి. గౌతముడు ఇల్లాలిని కనులారా చూసుకున్నాడు.

'ఈ అపూర్వ సౌదర్యం మళ్ళీ ఎప్పుడు చూస్తానో!' అనుకున్నాడు. ప్రతి నిత్యం గౌతముల వెంటనే అహల్య కూడా మేల్కొంటుంది. ఆయన గౌతమీ స్నానానికి వెళితే - అవి పర్వదినాలయితే తనూ శిష్యులతోపాటు తోడుగా వెళుతుంది. శేషదినాల్లో తను తన కుటీరం శుభ్రం చేసుకుని దంతధావనాది కృత్యాలు పూర్తి చేసుకుని స్నానాదులు కావించుకుని పంచాయతన పూజకు కావలసిన పూజాది ద్రవ్యాలు సిద్ధం చేస్తుంది.

ఆపై వంట పని యింటి పని చూస్తుంది. ఎప్పుడో గౌతములు యిలా ముందుగా నిదురలేస్తేనే ఆమె నిదురపోయేవేళ నీడలు తీరే ఆమె అందచందాలు చూడగలుగుతాడు.

గౌతములు అహల్యకు నిద్రాభంగం కాకుండా కుటీరం వెలుపలికి వచ్చాడు. మెల్లిగా తలుపులు చేరవేశాడు. ప్రశాంతంగా నిద్రిస్తోన్న యేటిలా ఉన్న తమ ఆశ్రమాన్ని చూశారు. గౌతమీ నది వైపు నడవసాగారు.

అదృశ్య రూపంలో - కుటీరం వాతాయణం నుంచి సర్వం గమనిస్తున్నాడు ఇంద్రుడు.

గౌతముడితోపాటు అహల్యా నిదుర లేస్తుందేమోననీ, లేచి పతి పాదాలకు నమస్కరించి ఆపై పతి అడుగుజాడల్లో అడుగులో అడుగు వేస్తూ అతనితో పాటే గౌతమీ స్నానానికి వెలుతుందేమోననీ శంకిస్తూ సదిగ్ధావస్థలో ఉన్న ఇంద్రుడు బరువుగా నిట్టూర్చాడు.

'కాలం మనకు అనుకూలంగా ఉంది. అందుకే కాలం కాని కాలంలో కోడి కూత విన్న గౌతముడు అదేమిటని ఆలోచించకుండా స్నానానికి బయలుదేరాడు. అదో శుభసూచకం!' అనుకున్నాడు.

ఆపై - కుటీరం తలుపులు మెల్లిగా తెరుచుకుని లోపలికి అడుగుపెట్టాడు. తిరిగి తలుపులు చేరవేశాడు.

హేరండ తైలం దీపం వెలుగుల్లో - మంద మందమలయానిలాలకు కదులుతున్న మందకాంతులు ప్రసరించే ఆ దీపం వెలుగులో చెక్కిన రాతిబొమ్మలా చక్కగా నిద్రిస్తోన్న అహల్యను చూశాడు.

ఆమె నిద్రాముద్రిత సౌందర్యం నెమ్మదిగా పారే గంగా ప్రవాహంలా ఉంది! ఆమె తనూ సౌందర్య లహరిలో తనివితీరా ఎప్పుడెప్పుడు ఓలలాడదామా అని అనిపించింది.

తొలగిన పైట చాటు నుంచి అరచాటుగా కన్పించే ఆమె యవ్వన సౌందర్యం మృగరాజును మత్తెక్కించే వన సౌందర్యంలా ఉంది. ఇంద్రుడికి కళ్ళు చెదిరాయి.

'నిజం అహల్యా! నీ రూపం కనులారా చూడాలంటే ఈ రెండు కనులూ చాలవు. ఒళ్లంతా కళ్ళు చేసుకుని చూసినా తనివి తీరదు' అనుకున్నాడు.

ఆలోచనలతో అందాల వీక్షణంలో అరక్షణం గడిచినా రెప్పపాటు లేని తనకు రెప్పపాటు కాలం వృధా అయినా తిరిగి రాదని - తిరిగి యింతటి మహదవకాశం ఎప్పుడో - అసలు లభిస్తుందో లేదో అనుకున్నాడు.

వెంటనే తను యిలా ఆమెను చేరరాదనుకున్నాడు. ఆమె కాదని వాదుకు రాకుండా కమ్మని యోచన చేశాడు.

'మహేంద్రజాలం ప్రభావ దేహిమే గౌతమ రూపం' మూడు సార్లు మంత్రం పఠనం చేశాడు.

మహేంద్రుడు గౌతమమహర్షిగా మారిపోయాడు.

జడలు, రుద్రాక్షలు, విభూతి రేఖలు అన్నీ ప్రత్యక్షమయ్యాయి అతని శరీరం మీద. హారాలు, కిరీటం, కేయూరాలు మొదలయిన ఆభరణాలన్నీ మాయమయ్యాయి. పట్టు పీతాంబరం కట్టిన మేని మీద మామూలు నీరు కావి దుస్తులు

వచ్చి చేరాయి.

ఎంత మార్పు!

మహేంద్రుడంతటి వాడికయినా - మూడు లోకాలనూ ఏలే వాడయినా - మహోజ్వల విభవం అనుభవించే వాడికయినా పరకాంతను కోరితే, పరకాంతాగమనం కాంక్షిస్తే పతనం తప్పదు కదా! ఆత్మన్నౌత్వం విడనాడితే అధఃపతనమే కదా!

గౌతముడిగా మారగానే లోపల ప్రత్యక్షమైన ఇంద్రుడికి బయటికి వెళ్ళి అహల్యను ఆటపట్టించాలనే చిలిపి ఊహ కలిగింది. అంతే! చప్పున కుటీరం బయటికి వెళ్ళాడు.

బయట క్షణంపాటు నిలుచున్నాడు. చుట్టూ ఉన్న ప్రకృతి ఆదమరిచి నిద్రిస్తున్నట్లు ప్రశాంతంగా ఉంది. మందమందంగా వీచే మలయానిలం నిద్రించే పూల సౌరభం భారంగా మోస్తూ మెల్లమెల్లగా వీస్తోంది. ఇంద్రుడు తలుపు తట్టాడు. ఒకసారి - రెండు సార్లు - మూడు సార్లు.

లోపల నిద్రిస్తోన్న అహల్యకు నిద్రాభంగమైంది. చప్పున కనులు తెరిచింది.

ఎదురుగా పర్ణకుటీర కుడ్యానికి తగిలించి ఉన్న చిత్రపటం కనిపించింది.

శేష తల్ప శాయి అయిన శ్రీమహావిష్ణువు దర్శనమయింది. అటు చూసింది భర్త శయ్య వైపు.

గౌతముల శయ్య ఖాళీగా ఉంది. ఎటు వెళ్ళారు? అనుకుంది.

అంతలో ఇంద్రుడూ గౌతముడి కంఠాన్ని అనుకరిస్తూ 'అహల్యా! అహల్యా!' అని పిలిచాడు.

అహల్య భర్త పిలుపు వినగానే చప్పున శయ్యపై నుండి లేచి వెళ్ళి తలుపు గడియ తీసింది.

అర నిద్రలో లేచి వచ్చింది అహల్య! నిద్రాలసటతో ఆమె కనులు మత్తుగా ఉన్నాయి. చెదిరిన తల కట్టు మరింత శోభగా ఉంది. అలకలు నెన్నుదుటిపై కదలాడుతూ కమనీయంగా ఉన్నాయి.

నార చీరలో ఉన్నా ఆమె తనూ వైభవం నాకపురీ సామ్రాజ్ఞీ వైభవాన్ని తలదన్నేదిగా ఉంది.

శచి త్రిదశ! కానీ అహల్య నిత్య యవ్వని! కన్య! అనుకున్నాడు దేవేంద్రుడు.

తలుపు తట్టి, పేరు పెట్టి పిలిచి నిలిచినా 'భర్త' తలుపు తెరిచినా లోపలికి రాకుండా అక్కడే నిలుచుని హేరండ తైల దీపకాంతిలో స్పష్టా స్పష్టంగా కనిపించే తననే నిశితంగా ఆపాదమస్తకం చూస్తూ ఉండటం అహల్యకు బాధగా అనిపించింది.

'రండి!'

లోపలికి రమ్మని పిలిచింది. వింతగా ఉన్న భర్త ప్రవర్తనకు ఆశ్చర్యపడుతూ.

'ఆహ్వానానికి ధన్యుడ్ని! లోపలికే కాదు. మది లోపలికి రమ్మని ఆహ్వానించవా అహల్యా!' పెదవులు దాటి బయటికి రాబోయిన జవాబుని మనస్సులోనే అణిచివేసుకున్నాడు. గౌతమ రూపి అయిన ఇంద్రుడు లోపలికి వచ్చీ రాగానే తలుపు వేశాడు. అహల్య యిటు తిరిగింది.

ఆమె ఘన జఘన సౌందర్యం చూడగానే ఆమె సంపద ముందు తన ఇంద్ర వైభవం అంతా వ్యర్థం అనుకున్నాడు ఇంద్రుడు. ఆమె వెన్ను చూడగానే అతనికి మతి పోయింది.

చప్పున భుజంపై చేయి వేశాడు. అహల్య తలతిప్పి చూసింది. ఆమెకు భర్త స్పర్శ వింతగా వినూత్నంగా వేడిగా అనిపించింది.

'అహల్యా!'

ఇంద్రుడి గొంతు తడారిపోయినట్టనిపించింది.

'ఊ!'

'హఠాత్తుగా మెలుకువయింది. స్నానాది నిత్య కృత్యాలకు వేళయిందేమోనని భ్రమించి లేచి వెళ్ళాను. తీరా వెళితే మూడో జామే ప్రవేశించీ ప్రవేశించనట్లుంది. నిదురించే గౌతమిని స్పృశించడం ఇష్టం లేక తిరిగి వచ్చాను'

'ఊ!'

ఇద్దరూ కదలకుండా నిలబడే ఉన్నారు.

'నడి రేయి దాటింది నాల్గవజాము వచ్చేదాకా మళ్ళీ నిదురిద్దాం!'

'ఊ!'

కొత్తగా ఉన్న భర్త ప్రవర్తన ఆమెకి ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇంద్రుడు శయ్యపై కూర్చోడానికికదిలాడు. అహల్య కూడా తన శయ్య వైపు కదిలింది. ఇంద్రుడు గౌతముడు శయ్యని సమీపించాడు. అహల్య తన శయ్యను చేరి 'భర్త' వైపు చూసింది. శయ్యను సమీపించిన శయనించకుండా ఉన్న 'భర్త'ను చూసి 'శయనించండి స్వామీ!' అంది అహల్య.

తమకంతో వేగుతూ తహతాహలాడిపోతూ ఉన్న ఇంద్రుడు 'తన' శయ్యపై పడుకోకుండా శయనించండి స్వామీ! అన్న ఆమె మాట శయనించరండి స్వామీ!' అని వినిపించినట్లయి ఆమె శయ్యను సమీపించాడు.

అహల్య నివ్వెరపోయింది. ఇన్ని సంవత్సరాల కాపురంలో ఏనాడూ తనని చేరరాని భర్త ఈనాడు తనకై తను తన శయ్యకు చేరడం ఆమెకు కొత్తగా వుంది.

'శయనించండి స్వామీ! అని పిలిచావుగా అహల్య!'

'భర్త మాటలకు ఆశ్చర్యపోయిందామె. తను శయనించండి అన్న మాటలు ఆయనకు 'శయనించ రండి' అని వినిపించింది అనుకున్నది.

ఆమెను సమీపించాడు. ఇంద్రుడు ఆమె శయ్యపై పై ఆమె సరసన కూర్చున్నాడు. విరహం వేడి విజృంభించింది. చప్పున ఆమె భుజంపై చేయి వేశాడు. అతడి కళ్ళు కాంక్షలతో వేయిరేకులతో విప్పారిన సహస్రదళ పద్మంలా అయ్యాయి.

ఏళ్లకొద్దీ వేచి ఉన్న అవకాశం తనకై తాను వచ్చి వరించినట్లుగా అనిపించింది ఇంద్రుడికి. మరో చేయి మరో భుజంపై వేశాడు మరింత తమకంతో.

'ఏమిది స్వామీ!'

'అహల్యా! అంతే పిలిచాడు.

'ఎన్నడూ లేనిది యీ వేళ ఏమిటి స్వామీ!'

'ఎన్నడూ నిన్నీవేళలో చూడలేదు కదా!'

'చూచితే!'

'చూపులకు రంభలా ఉన్నావు!'

'అదేమిటి స్వామీ! ఆ పోలిక. అచ్చెరలతో నాకు పోలిక. అందగత్తెలే అయినా వారంతా నాట్య కళాకారిణులు. నర్తకీమణులు. మించి పలికితే దేవవేశ్యలు కదా!'

'నేను రంభతో పోల్చింది అందుకు కాదు దేవీ! రంభ ఊరువుల సోయగం సకల లోకాలలోనూ సుప్రసిద్ధం'

'అయినా...'

'నీ ఊరువుల సోయగం ఆ రంభ ఊరువుల సోయగాన్ని తలదన్నేట్టుగా ఉంది!'

'బావుంది స్వామీ! సకల చరాచర సృష్టిలో నన్ను జగదేక సుందరిగా సృష్టించాడు ఆ సృష్టికర్త'

ఇంద్రుడు సమాధానం చెప్పలేకపోయాడు. క్షణంపాటు నిశ్శబ్దం.

'ఆగ్రహం వచ్చిందా స్వామీ!'

'ఆగ్రహమా! అది ఆమడ దూరంలో ఉంది. మనస్సు నిండా ఆనందం నిండిన ఈ వేళలో ఆగ్రహం మన చెంతకు రాదు కదా!'

'ఎందుకు స్వామీ! అంత ఆనందం!' ఆశ్చర్యంగా అడిగింది.

తన తపనలతో తన తొందరపాటుతో తనకు లభించిన అపూర్వావకాశంతో తబ్బిబ్బవుతూ తన గుట్టును తనే రట్టు చేసుకుంటానా అనుకున్నాడు ఇంద్రుడు.

మదిలో మెదిలే కలవరపాటును తోసి రాజంటూ నవ్వుతో అన్నాడు 'అహల్యా! ప్రతి నిత్యం నాల్గవ జామునే నిదుర లేచీ లేవగానే ఆశ్రమం వీడి నదికి వెళ్ళి మునకలాడి నిత్య జపతపాలతో మునిగిపోయే నాకు ప్రకృతి రమణీయతను చూచే అవకాశం, గమనించే సమయం ఉండేది కాదు. అప్పుడు నా దృష్టే వేరు కదా!'

'కానీ ఈనాడు అర్ధరాత్రి దాటీ దాటకముందే నిద్ర లేచాను. స్నానాది కృత్యాలకు నదీముఖంగా నడిచాను. వేళ కాదని గుర్తించి తిరిగి వస్తూ పరిసర ప్రకృతిని పరిశీలనగా చూశాను. ఎంత అందం! ఎంత ప్రశాంతత! ఇన్ని సంవత్సరాలుగా చూడలేకపోయినందుకు ఎంతో విచారించాను. తిరిగి మన ఆశ్రమానికి- మన పర్ణకుటీరానికి వచ్చాను. ఇది వెన్నెలలో ముద్ద కట్టిన అందంలా అనిపించింది. ఆపై నిన్ను చూశాను. దేవీ! నువ్వెలా ఉన్నావ్?'

ఇంద్రుడికి అహల్యను చూడగానే ఉద్విగ్నత అధికమైంది. మాటల్లోకి వచ్చేసింది మనస్సు లోని వేగం! మదిలోని ఆవేశం! మాటల రూపం దాల్చింది.

'దశాబ్దం గడిచిందో, ఇంకా ఎక్కువే అయిందో గానీ అహల్యా! నిన్నేనాడు ఇలా చూడలేదు!'

ఎన్నడూ వినని ప్రశంశ 'పతి' నోట వినగానే సిగ్గులమొగ్గ అయింది.

పెళ్ళయ్యాక యిన్ని వసంతాలు గడిచినా, ఏనాడూ తన సోయగాల ప్రశంస చేయని తన 'పతి' ఈనాడిలా ప్రశంసిస్తూంటే ఆమెకు వింతగానూ వినోదంగానూ ఉంది.

'అవకాశం రాలేదు అహల్యా! ఎన్నడూ ఈ వేళలో మేల్కోలేదు కదా! నిదురించే నీ అందం అణువణువునా తొణికిసలాడటం ఈనాడే చూశాను. సాగర విస్తీర్ణమాన సౌందర్యం ఒక తనువులో పొదిగితే ఎలా ఉంటుందో నేను కళ్ళారా చూశాను దేవీ!'

అహల్య ఆ పొగడ్తకు మరీ మురిసిపోయింది.

'అంతేనా దేవీ! చెడిన నిద్రలో లేచి చెదిరిన అలంకరణతో వచ్చి కనిపించావు. కమనీయమూ, రమణీయమూ, గణనీయమూ అయిన నీ అందం అపూర్వం! అద్భుతం! అమోఘం! యిన్ని వసంతాలు వ్యర్ధంగా గడిచిపోయాయా? నీ అందం చూడకుండా వ్యర్ధమయ్యాయా? ఎంత దిగులుగా ఉందో తెలుసా?'

'పతి' మాటలు అహల్యకు పరవశం కలిగిస్తున్నా పతి ధోరణి వింతగానూ విపరీతంగానూ ఉన్నందుకు ఆశ్చర్యపోయింది అహల్య!

'స్వామీ! తమకు సర్వస్వం సమర్పించుకుని తమ సేవలో తరించాను నేను. ఈనాటికి తమరు నా సౌందర్య ప్రశంస చేయడం సృష్టికర్త నన్ను సృష్టించిన ఫలం పరిపూర్ణమైందని భావిస్తున్నాను. ధన్యురాలిని స్వామీ!'

గౌతముని రూపంలో ఉన్న ఇంద్రుడికి ఆ మాటలు తనని ఉద్దేశించి అన్నట్లుగా అనిపించింది.

ఔను! ఆమె సృష్టికి తనే కదా కారణం! తన కోసం జన్మించిన తరుణీమణి మరొకరి సొత్తయినా తిరిగి యీనాడు కదా తనకు కరస్పర్శ లభించింది. తన కోరిక పూర్తిగా ఫలించేది ఈరోజే కదా!'

ఆలోచనలను ఆవలికి నెడుతూ అన్నాడు 'నిన్నిలా - నిన్నీవేళలో నిండుగా చూడటం. సౌందర్యం రాశి పోసినట్లుగా ఉన్న నిన్ను చూడటం - మా మనస్సులో మదనుడు అఖండ తాండవం -అంతా విచిత్రంగా వుంది'

అహల్య సిగ్గుతో తల వంచుకుంది.

'ప్రతి దినం నూతన యవ్వనారంభం సంరంభం సమాహారంలా వున్నావు అహల్యా!'

'స్వామీ!'

'మేనకనకమయభూషలు లేకున్నా మేనే కనకమయం అనిపిస్తోంది!'

'ప్రభూ!'

'ఎంత అందం!'

'స్వామీ!'

'ఏమి సోయగం!'

'స్వామీ!'

'ఏమి లావణ్యం!'

'స్వామీ!'

'ఏమి తారుణ్యం!'

'స్వామీ!'

'ఇన్ని సంవత్సరాలు గడిచినా నీ అందం చూడని - నీ సోయగం వర్ణించని - నీ లావణ్య తారుణ్యాలను ప్రశంసించని నా తప్పును మనసారా మన్నించు దేవీ!'

తరతరలాడింది అహల్య.

'స్వామీ! తమరు మహర్షి సత్తములు. బ్రహ్మ ప్రశంసాపాత్రులు. న్యాయ సూత్ర నిర్మాతలు. అన్నిటికీ మించి నా పతి దేవులు! నేను తమ చరణ దాసిని. నా తనువూ మనసూ సర్వం అన్నీ తమకు అంకితం. తమ సేవలో తరించి, విరించి ఆనందించి అభినందించేలా జీవించడమే నా జీవిత ధ్యేయం! అదే నా గమ్యం! తమరు నన్నలా ప్రశంసిస్తూ ఉంటే ఎంతో ఆనందంగా ఉంది. కొండెక్కినంత సంబరంగా ఉంది.

కోర్కెల పంట పండినంత నిండుగా గుండెల నిండా పరవశం పరవళ్ళు తొక్కుతోంది. కానీ నన్ను మన్నించమని వేడడం భావ్యం కాదు!'

'శయ్యాగతులయిన - ఏక శయ్యాగతులయిన భార్యాభర్తల మధ్య హెచ్చు తగ్గులు లేవు!

తులాభారంలో సమంగా తూగే వీరుల్లాంటి వారు భార్యాభర్తలు. వారి మధ్య మదనుడు లాస్యం చేస్తూ ఉంటాడు. న్యూనోన్నతాలు లేని సమస్కంధులు వాళ్ళు!'

'భర్త' చమత్కారానికి ఆమె పరవశించింది.

'ధన్యురాలిని స్వామీ!'

'నేను ధన్యతముడ్ని దేవీ!'

అహల్యను కౌగిలిలోకి తీసుకున్నాడు ఇంద్రుడు. తమకంతో తరతరలాడిపోయాడు. ఆ స్పర్శకి అహల్య మేను పులకరించింది.కానీ సంశయిస్తూ అంది అహల్య.

'స్వామీ! ఇది ఋతుకాలం కాదు కదా!' అంది అహల్య.

ఇంద్రుడికి ఆ మాటలు ఛెళ్ళున కొరడాతో కొట్టినట్లనిపించింది.

'ఋతుధర్మం జంతుధర్మం దేవీ! మానవుడు జంతు లక్షణాలను కలవాడే కదా! ఒక్కొక్కసారి ఆగ్రహం వచ్చి పశువులా ప్రవర్తిస్తాడు. ఒక్కోసారి ఆవేశంతో జంతువులా చరిస్తాడు. మరోసారి ఆనందం పెల్లుబికి జంతుధర్మం ఆచరిస్తాడు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్య సమన్వితమై - ఆయా భావ ప్రభావ సమంవితుడై జంతువులా చిందులు వేస్తాడు. అయినా యిది ప్రకృతి ధర్మం దేవీ!'

'స్వామీ!'

'బయట ప్రకృతి - ఆశ్రమంలోపల ప్రకృతి ప్రకృతికి ఆకృతిలా ఉన్న నువ్వు నన్ను కదిలించావు దేవీ!'

'స్వామీ!'

'కలవరం సృష్టించారు దేవీ!'

'స్వామీ!'

'నా నరనరాన పొంగి ప్రవహించే రక్తంలో ఇప్పుడు కోరిక హిమగిరి శృంగ పతితమయిన గంగా ఝరీ వేగ సదృశంగా ఉంది దేవి!'

'తరుణం కాని తరుణంలో తరుణీ ప్రశంస - తరుణీ ప్రసంగం - తరుణీ సమాగమం...' అర్థోక్తిలోనే ఆగింది అహల్య.

'తరుణం వచ్చింది దేవీ!'

'స్వామీ!'

'ఈనాడే నిన్ను తొలిసారి పూర్తిగా చూస్తున్నట్టుంది దేవీ!'

'మౌనులు వాచాలురవుతున్నారు స్వామీ!'

'అంతా కాంతా కరస్పర్శ ప్రభావం! పరుసవేది సోకితే లోహం స్వర్ణమయం అయినట్టు- నీ కరస్పర్శతో నేడు నాలో వింత వింత భావనలు- వినూత్న కాంక్షలు...వెల్లువలై ప్రవహిస్తున్నాయి దేవీ!'

'స్వామీ!' ఆమె భర్త పాదాలు స్పృశించింది 'ధన్యురాలను స్వామీ!' అంది ఆనందంగా.

'నేనూ ధన్యుడ్నే!' అన్నాడు ఇంద్రుడు.

అహల్య సిగ్గుతో వాలిపోయింది.

ఇంద్రుడు ఆమెను కౌగిట్లో బంధించాడు. అతనికి సుధర్మ సింహాసనాన్ని ఆక్రమించుకున్నట్టుగా ఉంది. రాక్షసుల చేతికి దక్కిన స్వర్గం తిరిగి తన చేతుల్లోకి చిక్కినట్టుగా ఉంది.

'ఏమి పలుకను స్వామీ!'

'నీ మదిలో ఏదీ మెదలడం లేదేమిటి?'

'సహస్రవిషయాన్వితంగా ఉంది మనస్సు స్వామీ!'

'ఒకటి చెప్పరాదా?'

'మౌనముద్రాంకితులు ఈనాడు మహావిషయవిన్యాసకులయినారేమిటా అని...'

'సంశయిస్తున్నావా'

'సంశయమా స్వామీ...'

'సందేహమా?'

'సందేహమెందుకు స్వామీ!'

'ఆశ్చర్యమా?'

'ఆశ్చర్య ఆనంద విభ్రమాలకు లోనవుతున్నాను.'

'కాలమెప్పుడూ ఒకే తీరుగా నడవదుగా దేవీ!'

'ఈనాటికి నా స్వామి...'

'అవును! ఈ నాటికి నీ స్వామికి కాలం కలిసివచ్చింది. సమయం సందర్భం అనుకూలించాయి!'

'సర్వం కొత్తగా ఉంది!'

'అవును ఇది వినూత్నానుభవం!'

'ఒకప్పుడు ధర్మాచరణాన్వితమైనది ఈనాడు కాంక్షా సమన్వితంగా ఉంది స్వామీ!'

'అది ధర్మార్థ కామ సంబంధమైన పురుషార్థాల్లో మూడో పురుషార్థం. కానీ ఇది కాంక్షా సమన్వితం!'

'ధర్మకామమే కదా స్వామీ!'

ఇంద్రుడు జవాబివ్వలేదు. అహల్య రెట్టించలేదు. వినోదం విశృంఖలమవుతున్నది.

'స్వామీ!'

'అహల్యా సముద్రజలాలు అన్నీ పుడిసిట పట్టినా తీరని దాహం. కొండలన్నీ పిండి చేసుకుతిన్నా తీరని ఆకలి నాలో చొరబడ్డాయా అన్నట్టుంది. అందం అవలోకించనా... ఆనందించనా... యీ మీమాంస మీమాంసాశాస్త్ర విషయానికి అతీతంగా ఉంది.'

అహల్య అతని గుండెల్లో తలదాచుకుంది. మదనుడొక్కసారిగా పది పదివేల బాణాలు ప్రయోగించినట్లయింది. శతమఘుడు సహస్రయజ్ఞకర్తగా భాసిల్లాడు.

అహల్య ఎన్నడూ ఎరుగని అనుభవాలకు ఆనందాశ్చర్యాలకు లోనవుతూ అతనిలో ఐక్యమవుతున్నది.

## 50

ఆశ్రమం వెలువడిన గౌతమ మహర్షి ప్రశాంతంగా ఉన్న ప్రకృతిని పరిశీలిస్తూ నదీ తీరం వైపు నడవసాగాడు.

నిద్రిస్తున్నట్టుగా ఉన్న చెట్లనూ... పరిమళాలను వెదజల్లి వెదజల్లి అలసిసొలసి విశ్రాంతి తీసుకుంటున్నట్టుగా ఉన్న తీగలనూ ముకుళించుకుంటున్న పూవులనూ వికసితోన్ముఖమైన పుష్పాలనూ చూస్తూ నడుస్తున్నాడు.

వీచి వీచి అలసిపోయిందా అన్నట్టుగా గాలి ఆగి ఆగి వీస్తున్నది. పగటి వేడిమికి వేడెక్కి సూర్యాస్తమయం కాగానే చల్లబడుతోన్న భూమి క్రమక్రమంగా చల్లదనాన్ని పెంచుకుంటున్నది.

పున్నమినాటి చంద్రుడు నింగి నడిమింట వేలవేల కిరణాలతో వెలుగులు చిమ్ముతున్న విషయం గౌతముడు గమనించలేదు. స్పష్టాస్పష్టంగా ఏవో మంత్రాలు గొంతుకలో పలిస్తూ నడుస్తున్న గౌతముడు గౌతమీ తీరం చేరాడు.

అప్పుడు గోదావరి ఎట్లున్నది!

కలతలు లేని కాపురంలో సుఖశయ్యాగత అయిన కుటుంబిని నిద్రిస్తున్నట్టుగా ఉంది.

అప్పుడు గౌతమి ఎలా ఉన్నది! భర్త పరిపూర్ణానురాగాల అనుభవించి ఆనందించి ఆదమరచి నిదురించే అర్ధాంగిలా ఉంది.

అప్పుడు గోదావరి ఎలా ఉంది?

పగటి వెలుగులను మించే వెలుగులు పంచే చలువ వెన్నెల రేడు అమృత కిరణాలు గోదావరిపై ప్రవహిస్తూ వెండి వెలుగులు పులుముతున్నట్టుగా ఉంది.

నదిని సమీపించి చూసిన గౌతముడు క్షణంపాటు రెప్పపాటు మరిచి గౌతమిని చూస్తూ ఉండిపోయి ఆపై నిర్ఘాంతపోయాడు.

పరమ నిష్ఠాగరిష్టుడయిన గౌతముడు నిదురించే గౌతమిలో దిగి స్నానాదులాచరిస్తాడా?

ఊహూ...

'ఏమిది! స్నానద్యనుష్టానాలకు యింకా వేళకాలేదా! గడ్డకట్టినట్టు కదలికే లేనట్టు యింత ప్రశాంతంగా ఉందేం గౌతమి! తాను సమయాతిక్రమణ చేశాడా! లేక కాలధర్మాన్ని మరచిందా గౌతమి! ఊహూ గౌతముడు- గౌతమి ధర్మాతిక్రమణ చేయరు'

నదిలో దిగబోయిన గౌతముడు ఆగి ఆలోచించసాగాడు.

'ఎలా జరిగిందిది? ఎలా జరిగిందిది? కాలం తనని మోసగించిందా! లేక కాలసూచిక అయిన కుక్కుటం తనని మోసగించిందా?'

ఆలోచనలు ఆపి గౌతముడు తలపైకెత్తి చూశాడు.

ఆకాశం నిర్మలంగా ఉంది.చుక్కలు రేకులు వచ్చిన వెలుగు మొక్కల ముక్కల్లా ఉన్నాయి. చద్నున్రిడు అమృతము గూడుకట్టిన దొరలా ఉన్నాడు.

నక్షత్ర గమనం చూశాడు. చంద్ర గమనం చూశాడు. అర్ధరాత్రి! పిశాచాలకు నిశాచరులకు జారులకు చోరులకు అనువైన సమయం! వామాచారులకు అనుకూలమైన వేళ! కానీ నిష్ఠాగరిష్టులకు నియమ శీలురకు విశ్రాంతి వేళ!

ఇదేమి! తన మనస్సులో జారులు- చోరులు- నిశాచారులు, పిశాచాలు, వామాచారులు మెదులుతున్నారు.

ఏం జరిగింది?

తన భోజన విషయంలో వ్యత్యాసం జరిగి జీర్ణకోశంలో సందడి సందడి మొదలై అజీర్ణ లక్షణంగా అపరాత్రివేళ నిద్రాభంగమైందా? మెలకువ వచ్చిన వేళే సరైన వేళ అనుకుని తాను లేడికి లేచిందే పరుగని గౌతమీ స్నానానికి సంధ్యానుష్ఠానాలకు జపతపాలకు వచ్చాడా? లేదే! తాను హితభుక్- మితభుక్- కాలభుక్- తన విషయంలో ఎన్నడూ అలా జరగదు. జరగలేదు. జరగబోదు. మరేం జరిగింది? తాను ప్రకృతి పరిశీలన చేస్తూ పరవశించాడే కానీ ప్రకృతిని చూసి వేళను గుర్తించలేకపోయాడు. ఎందుకిలా జరిగింది? నిద్రాముద్రితమైన మనస్సు జడమైపోయిందా!

మరోసారి గగనమండలాన్ని పరిశీలించాడు. ఇంకా చాలా వేళ మిగిలి ఉంది. ఇక ఇక్కడ చేసే పనేమీ లేదు. తిరిగి ఆశ్రమానికి వెళ్ళి- విశ్రాంతి తీసుకుని తిరిగి వేళ కాగానే తిరిగి రావాలి. అంతే! గౌతముడు ఆశ్రమోన్ముఖుడైనాడు.

## 51

వజ్రాయుధ ధారి వైఖరి వింతగా ఉన్నది. ఎన్నడూ విపరీతధోరణి చూడని అనుభూతించని అహల్యకు అంతా వింతగా ఉంది.

'అహల్యా!' ఆమె ఒడిలో శయనించిన ఇంద్రుడు పిలిచాడు.

'స్వామీ!'

'తృతీయ పరుషార్థమింత సంతసహేతువని ఎరుక రాలేదేమిన్నాళ్ళు.'

గౌతముడి రూపంలో ఉన్న ఇంద్రుడు అడిగిన ప్రశ్నకు అహల్య సిగ్గుపడింది. ఏ జవాబూ చెప్పలేకపోయింది. అయినా ఏ ఇల్లాలయినా ఏ భర్తకయినా ఏం సమాధానం చెబుతుంది- ఆనందించడం తప్ప. అలరించడం తప్ప. అన్యమెరుగని అతివ ఏం చెబుతుంది.

'పలకవేమి!'

'ఏమి పలుకను నా దైవమా! నా జీవితంలో ఇదే మధుర మధురానుభూతుల తొలకరిలాగున్నది. తిరిగి ఇలాంటి రేయి యీ జన్మకు మరి లభించునా అనే సందేహం తొందరిస్తున్నది. మదిలో ఎంత ఆనందమో అంత దిగులు'

'చింత ఏలనే చిగురుబోడీ! నీవన్నట్టు ఇది తొలకరి! ఈ తొలకరికి మొలకెత్తిన మన కోరికలు తీగలు సాగి పూలు పూచి కాచి ఫలించు కమ్మని కాలం ముందున్నదే!'

'కలికి చిలుకల కొలికి రసాలూగు రాసాలాగ్రాన చివురులు మేసి కలకూజితాలు కమ్మకమ్మగ వీనుల విందుగా వినిపిస్తూ వుంటే కఠిన శిల అయినా కరుగుతుంది. జడునిలో అయినా చైతన్యం చివురిస్తుంది. ముని అయినా మహావాచాలుడవుతాడు.'

చమత్కారంగా అన్న మాటలకు అహల్య సిగ్గుపడి మోము అటు మరలించింది.

'ముగ్గురు కుమారుల కన్న తల్లివి ముగ్ధలాగా ముచ్చట పడుతున్నావు దేవీ!'

జవాబుగా మరింత ముగ్ధ అయ్యింది వదన.

'అహల్యా! నీ వలపు వాగులో మునక లాడిన నాకు నాకపురీ మందాకినీ సలిల సందోహాల్లో మునక లాడినట్టుగా ఉంది.'

అహల్య కిమ్మన లేదు.

'దేవీ!'

'స్వామీ'

'జారిపోయిన దినాలన్నీ వ్యర్థాలే! మిగిలిన దినాలన్నీ యిక పండుగ దినాలే! మన పాలిక ప్రతి రాత్రీ వసంత రాత్రి కావాలి దేవీ! నీ అనురాగామృతంలో ఓలలాడుతూ అమితానందం పొందాలి. ఈ సుఖసీమల నుంచి నన్ను దూరం చేయకు!'

హఠాత్తుగా అతనలా అనగానే అహల్య దిగ్భ్రాంతికి లోనయ్యింది 'ఏమిటి స్వామీ! ఈ వింత కోరికేమిటి స్వామీ! తమరి చేతలు తమరి మాటలు కొత్తగా ఉన్నవేం! విచిత్రంగా ఉన్నవేం?'

ఇంద్రుడు తనని తాను సంబాళించుకున్నాడు.

తన్మయత్వంతో తానెవరో తానేమిటో తనున్న యిప్పటి రూపమేమిటో తన సహజ రూపమేమిటో మరిచి జాలిగా బేలగా మాటాడటం ఎంత పొరపాటో... అనర్థహేతువవుతుందో గుర్తుచేసుకున్నాడు. చప్పున మాట మార్చాడు.

ఎన్నడూ లేని విధంగా ఎన్నెన్నో మాటలు చెపుతూ మనస్సును, శరీరాన్ని రంజింప జేస్తున్న భర్త హఠాత్తుగా మౌనం దాల్చేసరికి అహల్యకి నవ్వొచ్చింది.

కొందరు మునులు విపరీత ప్రకృతిగా ఉంటారట.

తపస్సుకి వెడితే ఇక అంతే! ఒకటే తపస్సు భార్య బిడ్డల సంగతే గుర్తుకి రాదుట!

విశ్వామిత్ర మహర్షి మరీను. వేలకి వేల యేళ్ళు తపస్సు చేశాడట! అదే మేనక తనను చేరరాగానే తపం గిపం మరిచే పోయాడు. తన తపన తన తపస్సు అన్నీ మేనకే అనుకున్నాడు. అందులోనూ మహనీయుడే అనిపించుకున్నాడు.

పట్టుబడితే అంతే మరి! త్రిశంకుడిని స్వర్గానికి పంపాడు. ఇంద్రాదులు తోసివేస్తే గగనమధ్యంలో నిలిపి. కొన్ని వేల సంవత్సరాలు తపించి దర్శించిన గాయత్రీమాత కరుణతో తన తపశ్శక్తినంతా ధారపోసి సృష్టికి ప్రతిసృష్టి చేసి మరో స్వర్గాన్ని త్రిశంకుడికి ప్రత్యేక స్వర్గం బహూకరించాడు. మహర్షులు ఎంతకయినా తగినవారే!

'అహల్యా' గౌతమ రూపంలో ఉన్న ఇంద్రుడు పిలిచాడు.

ఆలోచనల్లోంచి బయటపడింది అహల్య 'ఏమి సెలవు స్వామీ!'

'ఏమిటి ఆలోచిస్తున్నావు?'

'ఏమీ లేదు స్వామీ!'

'ఎందుకు లేదు! నేను నిన్ను పరిశీలనగా చూస్తూనే ఉన్నాను. ఏదో ఆలోచిస్తున్నావు. ఊ మన మధ్య యింక దాపరికం ఏమిటి అహల్యా! నీ మనస్సులోని మాటేమిటి చెప్పు!'

'ఏమీ లేదు స్వామీ! తమరికి చెప్పుకోనిది, చెప్పుకోరానిది ఏముంటుంది స్వామీ!'

'మరి ఇంకా సందేహిస్తావేం?'

'సందేహం కాదు స్వామీ'

'సంశయమా?' నవ్వుతో అడిగాడు ఇంద్రుడు.

'అలాంటిదే!'

'ఏమిటి?'

'తమ వింత పోకడ గురించే మహర్షీ!' ఆలోచించే మహర్షీ అని సంబోధించింది అహల్య.

ఉలిక్కిపడ్డాడు గౌతమ రూపి అయిన ఇంద్రుడు. కానీ తనలోని ఉలికిపాటును కప్పిపుచ్చుకుంటూ అడిగాడు. 'ఊ ఏమిటది?'

తలవంచుకుని భర్త పాదాలు స్పృశిస్తూ మెలమెల్లగా అంది అహల్య 'స్వామీ! తమరు మహర్షులు మహనీయులు, తపోధనులు! తమరెరుగనిది ఏమీ లేదు. కానీ తమ చరణ సేవలో నేనూ కొంత విజ్ఞానం సంపాదించుకోగలిగాను. నాకు తమ ఈనాటి ప్రవర్తన వింతగా ఉంది. వినోదాత్మకంగా ఉంది. ఆనంద దాయకంగా ఉంది. ఆలోచన ప్రేరేపించేదిగా ఉంది. తమరెన్నడూ యింత తమకంతో ప్రవర్తించలేదు. తన్మయం భజించనూ లేదు. అపూర్వమూ, అద్భుతము, ఆనందదాయకమూ అయిన తమ యీ శృంగారం నన్ను పరవశను చేసింది. ఆపై తమరున్నట్లుండి మౌనం వహిస్తే ఆలోచన కలిగింది. తమ పూర్వదీక్షలో తమ తపస్సు, తమ ధ్యానం, తమ రచన వాటిపై తమ మక్కువ ఈనాటి తమరి మత్తనూ శృంగార లహరీ విహారం అంతా విపరీతంగా ఉంది!'

గౌతమ రూపంలో ఉన్న ఇంద్రుడు తత్తరపడ్డాడు.

ఆడవారు జడులు మంద బుద్ధులు ఆలోచనా శూన్యులు అని భూలోకంలోని పురుషపుంగవులు స్త్రీలను కొంటెతనంతో కించపరుస్తూ ఉంటారని నారదుడు చెప్పాడు. అది అబద్ధం. వారిలో బుద్ధి వికసనం ఉంది ఆలోచన ఉంది. చైతన్యం ఉన్నది' అనుకున్నాడు.

'ఆడవారిని కించజ్ఞులుగా ఆలోచనా శూన్యులుగా తలపోసే మగవాడే కించిజ్ఞుడు. వాడే ఆలోచనా హీనుడు. వాడే మందబుద్ధి అని అనుకున్నాడు ఇంద్రుడు. అయినా వారి అవివేకం కానీ బుద్ధి తీక్షణకు, ఆలోచనకూ ఆడ మగ బేధమేమున్నది మగవారికి ఆలోచించవలసిన సమయాలూ సందర్భాలూ ఎక్కువ! ఆడవారికి ఆ అవసరం, అవకాశం తక్కువ.

అంతేకానీ గార్గీ మైత్రేయిల్లాగా అందరాడవారూ విద్వత్ వతంసులే! శచిలాగా చక్కని ఆలోచన కలవారే! అనుకున్నాడు.

తన ప్రశ్నకు బదులివ్వకుండా ఏదో ఆలోచనలో మునిగిన 'ఇంద్రుడి'ని చూసి మళ్ళీ అడిగింది అహల్య. 'కోపం వచ్చిందా స్వామీ!'

'కోపమెందుకు కోమలాంగీ!' నవ్వుతో అన్నాడు ఇంద్రుడు 'ఈ సమయంలో ఆగ్రహం ఆమడ దూరం ఉంటుంది. ఆనందించి రసించవలసిన వేళ కదా ఇది!'

'ఆగ్రహమే కాదు. ఆలోచన కూడా అల్లంత ఉంటేనే ఆనందించే అవకాశం, అలరించే చతురత, రసించే రసికత, పరవశించే మాధుర్యం మన చెంతకు వస్తాయి స్వామీ!'

ఇంద్రుడు ఆ మాటలకు ఉబ్బి తబ్బిబ్బయ్యాడు.

ఒక్క పెట్టున బిగి కౌగిలిలోకి తార్చి ముద్దులు పేర్చి శృంగారం తీర్చి లాలసత చేర్చి ఆనందం సమకూర్చి అలరింప చేశాడు.

అహల్య ఆ బిగికౌగిలికి ఉక్కిరి బిక్కిరైంది! ఆ ముద్దులతో ఊపిరి తిప్పుకోలేక పోయింది! ఆ ఉధృత శృంగార విహారాలకు ఓర్చుకోలేకపోయింది. ఆ లాలసతకి పరవశించింది. ఆ ఆనందానికి తన్మయం చెందింది. అతని తనువులో తనువు మమైకం చెందింది. మైకం కమ్మినట్లు సొమ్మసిల్లి మళ్ళీ అతని సాంత్వనంతో సేద తీరింది.

అప్పుడు- ఆ ఇద్దరి శృంగారం అంగారమై వారిద్దర్నీ దహిస్తున్నప్పుడు- ఇద్దరూ రస శృంగార శిఖరారోహణ చేసి ఆనందిస్తున్నప్పుడు- తనువు తనువుతో రాపాడుతున్నప్పుడు- తలపోతలు జలపాతలుగా తనివి అందిస్తున్నప్పుడు-

తన కోరికలు సమస్తం ఫలించాయని ఇంద్రుడు తలపోస్తున్నప్పుడు- ఆనందమింత అద్భుతంగా ఉంటుందా అని అహల్య తలపోస్తున్నప్పుడు...

మళ్ళీ మళ్ళీ ఇలాగే రావాలని వచ్చి ఆనందించాలని ఈ రహస్యం శాశ్వతంగా తనలోనే నిక్షిప్తం చేసుకుని మారు రూపుతో మరు తీపులు ఫలింపజేసుకోవాలని ఇంద్రుడు తలపోస్తున్నప్పుడు...

హఠాత్తుగా-

తపోభంగమైనట్టు...

ప్రశాంత వాతావరణంలో పెనుశబ్దం పెరిల్లుమన్నట్టు-

ఉద్యానవనంపై పిడుగు పడినట్టు-

హాయిగాన్ నిదురించే వారిపై తుఫానుకు కూలే వృక్షం పడినట్టు-

చక్కని సంగీతంలో అపశ్రుతి పలికినట్టు...

వేద ప్రవచనంలో అపశబ్దం పడ్డట్టు-

కవితాధారలో గణభంగం జరిగినట్టు-

ఓ కఠోర స్వరం ఆ ప్రశాంత కుటీరంలో మార్మోగింది.

అది...

గౌతమ మహర్షి కంఠం!

అది...

అహల్యానాధుని కంఠం!

అది...

బ్రహ్మ అల్లుడి కంఠ స్వరం!

ధర్మసూత్రాలు న్యాయసూత్రాలు పలికిన స్వరం

ఆ స్వరం- ఆ భీకర కంఠం ప్రళయకాల పర్జన్య గర్జనలాగా- వినపడగానే తృళ్ళిపడింది అహల్య.

బెదిరిపోయాడు గౌతమ రూపంలోని ఇంద్రుడు.

నదీస్నానానికి వెళ్ళే వేళకాదని తెలిసి వేళ కాలేదని తెలుసుకుని తనకు ఎలా నిద్రాభంగమైందో తెలియాక ఎందుకు మెళుకువ వచ్చిందో తెలుసుకోలేక తిరిగి తన పర్ణకుటీరానికి వచ్చిన గౌతమ మహర్షి తలుపు తీసుకుని లోపలికి రాగానే హేరండతైల దీపాల వెలుగుల్లో...

అక్కడ-

ఆ అహల్య శయ్యపైన-

ఒకరిలో ఒకరు ఒదిగిపోతూ-

ఒకరి నొకరికి సమర్ధించుకుంటూ-

పరవశంతో- ప్రకృతిని మరిచి- ప్రాకృతుల్లాగా- పరిసరాలని మరిచి అమితానందకాసారంలో కేళీ విహారం సలుపుతూ...

కాలం చాలదన్నట్టు, మళ్ళీ ఈ అవకాశం రాదేమో అన్నట్టు-

జన్మకొక్కసారే- జన్మజన్మల తపస్సు ఫలించి వరించినట్టు అంగార శృంగార అంగారరాసిలో భస్మీకృతమవుతున్న కోరికలతో తమ్ముతాము మరిచిన అహల్య- గౌతమ రూపంలో ఇంద్రుడు-

వారినలా చూడగానే గౌతముడికి అసహ్యం వేసింది.

మోము అటు తిప్పుకున్నాడు.

మరో వ్యక్తి తమ సమీపంలో వచ్చి నిలుచున్న స్పృహ కూడా లేకుండా అరమోడ్పు కన్నులతో ఆనందిస్తున్న వారిపై ఆగ్రహం వచ్చింది.

ఆగ్రహం మనస్సునుంచి కదిలి పెదవులు దాటి కేకగా వెలువడింది.

ఆ కేక- పొలికేకలాగా- మూడక్షరాలతో ముక్తాయించింది.

'అ...హ...ల్యా...'

అహల్య పేరు మూడక్షరాలూ విడివడిగా విడిపోయాయి. అవి కలిస్తే అహల్య! బ్రహ్మ మానసపుత్రి! మహేంద్రుని మహత్వ కాంక్షా రూపం! గౌతముడి ఇల్లాలు! శతానందాది బాలుర మాతృమూర్తి...!

విడివడితే-

అర్థరహితం! వ్యర్థం!

అలా గౌతముడి కఠిన వాక్కులో అహల్య వ్యర్థరూప అయ్యింది.

ఆ మాటలు చెవి సోకగానే-

ఆమె మనస్సు జాగ్రుతమైంది.

కొరడా దెబ్బ తిన్న జవనాశ్వం చందాన జాగృతమైంది.

ఆ మాటలు చెవిన పడగానే-

ఇంద్రుడు ఉలిక్కిపడ్డాడు. భయపడ్డాడు. తుళ్ళి పడ్డాడు. బెదిరాడు. భయంకంపితుడైనాడు. కౌగిలి వదిలాడు. ఖంగుతిన్నట్టు చప్పున లేచాడు. తప్పు చేసినట్టు తలొంచుకున్నాడు. ముప్పు తప్పదన్నట్లు మోము వాల్చుకున్నాడు. చెదిరిన మనస్సుతో, బెదిరిన గుండెతో వణికే శరీరంతో నిర్వీర్యుడై నిస్తేజుడై నిస్పృహకు లోనై నిశ్చలంగా నిలబడ్డాడు.

అసంకల్పితంగా అహల్యా లేచి నుంచున్నది.

ఆమెకు చెదిరిన చీర సరిచేసుకోవాలని కానీ, చెదిరిన తల కట్టు చక్కదిద్దుకోవాలని కానీ, చెదిరిన పైట చెంగు చక్కగా సవరించుకోవాలని కానీ అనిపించలేదు.

తన సమీపంలో తనువంతా సిగ్గుల మొగ్గల రూపంలో ఉన్న ఒక గౌతముడు. తనకు అల్లంత దూరంలో తనువంతా అగ్నిహోత్ర దీధిపతులు వెలుగొందుతున్నట్టు ఒక గౌతముడు.

ఎవరు ఎవరో ఆమెకు తెలియడం లేదు.

ఏమి జరిగిందో మరేం జరిగిందో తెలియడం లేదు.

క్రమ క్రమంగా తనలోని చైతన్యం దూరమవుతున్నట్టు-

తన మనస్సులో కదలిక ఆగిపోతున్నట్టు-

తన కనులు చూపులు కోల్పోయినట్టు-

జ్ఞానేంద్రియానికి శక్తి తగ్గిపోతున్నట్టు-

ఒక శిలలా- ఒక మొద్దులా- ఒక బండరాయిలా నించుండి పోయింది.

దోషి తప్పు చేస్తూ నేరం మధ్యలో దొరికి న్యాయమూర్తుల శిక్షా వాక్కుల కోసం ఎదురుచూస్తూ ఇంకేం చేయగలిగింది లేనట్టు నిలబడిపోయినట్టు నిలబడిపోయింది.

'ఎవడవురా మాయావీ!'

గర్జించినట్టుగా గద్దించాడు గౌతముడు.

గౌతమ రూపంలో ఉన్న ఇంద్రుడు తనలో తాను కుంచించుకుని భూమిలోకి దిగిపోతూ పోతూ అధఃపాతాళానికి దిగిపోతున్నట్టుగా వంచిన తల ఎత్తలేదు.

సమాధానం రాకపోయేసరికి మరింత కృద్ధుడైనాడు గౌతముడు.

'యక్షుడివా! కింసరుడివా! కింపురుషుడివా?'

దానికీ జవాబివ్వలేదు ఇంద్రుడు. మహర్షులకు కోపం రానే రాదనీ- వస్తే ఆ కోపం శాపంగా మారి తీరుతుందని అతడికి తెలుసు. రోటిలో తలదూర్చి రోకటి పోటుకు వెరిస్తే ఎలా అని ఆంధ్ర దేశంలో నానుడి అతడికి తెలుసు. అందుకే కిం అనకుండా అన్నిటికీ మౌనమే తన మూగభాషగా నిలబడ్డాడు.

'రాక్షసుడివా! వారికయితేనే ఈ మాయలు, మంత్రాలు మాయోపాయాలు పరదార గమనాభిలాషలూనూ! చెప్పరా ఎవడవురా నువ్వు?'

బెల్లం కొట్టిన రాయిలా నిలబడిపోయాడు ఇంద్రుడు.

చెప్పరా చెప్పరా అని గౌతముడు గద్దిస్తున్నాడు! ఏం చెప్పగలడు ఇంద్రుడు?

'మాటలు రాని మూగవాడివా? మాటలు నేర్చిన మాయావివా?'

జవాబివ్వలేదు ఇంద్రుడు.

'అహల్యా! ఎవడు వీడు?'

ఏం చెబుతుంది అహల్య! ఆమెకేం తెలుసు!

'స్వామీ! నిజం తమ పాదాలాన- నిజమే చెబుతున్నాను. హఠాత్తుగా తమరిలా జ్వలించే ఆహితాగ్నిలా ప్రత్యక్షమయ్యేదాకా- తమరే అని భ్రమించాను. భ్రమించానని ఇప్పుడు అనుకుంటున్నాను. తమరే అనుకున్నాను. స్వామీ! అతడెవరో నేనెరుగను'

ఇంద్రుడు ఆ సమాధానానికి అబ్బురపడ్డాడు.

గౌతముడు అవాక్కయ్యాడు.

అహల్య తప్పుచేస్తూ దొరికిపోయింది. అది పతివ్రతలకు అనువైనది కాదు. ఆర్యావర్తంలోని ఏ స్త్రీకి ఇది గౌరవం కాదు. తప్పు చేస్తూ 'అతడూ' పట్టుబడ్డాడు.

కానీ నేరం ఎవరిది? ఎవరు ఎవరిని అడుసులోకి దించింది? ప్రథమ దోషి ఎవరు?

'మాయారూపీ! నీ స్వస్వరూపాను సంధానం చెయ్యరా! మోసగించావు. మోహపెట్టావు. దోషివయ్యావ్, దోషం చేశావ్! దొరికిపోయావ్ ఇంకెందుకురా యీ ఇంద్రియ చాపల్య రూపం! ఊ నీ అసలు రూపుతో చేసిన తప్పుకు దండన అనుభవించు!'

గౌతముడి మాటలు ఊషర క్షేత్రంలోని వర్షపు చినుకులే అయ్యాయి. వంచిన తల ఎత్తడం లేదు ఇంద్రుడు. పొందనున్న శాపాన్ని స్వీకరించడానికి సిద్ధంగా నిలబడ్డాడు.

తన రూపు ధరించి- తప్పు చేసి- జడుడిలా నిలబడ్డ అతనిపై తనకమండలం లోని నీరు చల్లాడు గౌతముడు.

'ఎంత మాయ చేసినా ఇంద్రజాలిక విద్యలెన్ని నేర్చినా- ఈ మంత్రజలం ముందు అవి విచ్చిపోక తప్పదు. మూర్ఖుడా! నీ స్వస్వరూపం తెలుసుకుని ఉంటే తేలికగా శిక్షించి వదిలేవాడిని- కానీ... ఇప్పుడు...'

గౌతముడు మాటల మధ్యలోనే ఆగాడు.

తన మంత్రజలంతో క్రమక్రమంగా తన రూపు కోల్పోయి అతని రూపం సంతరించుకుంటున్న ఆ దేవనాధుడిని- ఆ త్రిలోకాధీశ్వరుడిని, ఆ శచీనాధుడిని- ఆ ఇంద్రుడిని చూసి 'ఛీ...ఛీ...' అన్నాడు గౌతముడు.

తన రూపు తనకు వచ్చేశాక కూడా ఇంద్రుడు దించిన తల ఎత్తలేదు.

అప్పుడు తన భర్త రూపంలో వచ్చింది మహేంద్రుడిగా గుర్తించిన అహల్య తెల్లబోయింది!

ఎంతకెంతకు దిగజారి ఇంతకింతగా దిగివచ్చి అంత కఠినంగా అవమానం అనుభవిస్తున్న అతన్ని చూసి ఆమె అసహ్యించుకుంది.

ఇంద్రియాధిపతి అయిన ఇంద్రుడు- ఇంద్రియ లోలత్వంతో ఎంత హీనుడయ్యాడు అనుకుంది జుగుప్సతో.

తా చెడి తననూ చెడగొట్టిన అతని కుచ్చిత చర్యకు ఎంతగానో ఏవగించుకుండి.

'మహేంద్రా!' పిలిచాడు గౌతముడు.

అతడిలో ఇప్పుడు ఆగ్రహం లేదు. అసూయ లేదు.

న్యాయాన్యాయసూత్ర విరించి అయిన గౌతమ మహర్షిలా ఉన్నాడు.

న్యాయాన్యాయాలు విచారించి ధర్మాసనంపై ఆసీనుడై తీర్పు చెప్పే జగదేక న్యాయమూర్తిలా ఉన్నారు.

'త్రిలోకాధిపతివి నువ్వు. ధర్మాధర్మ విచారణాధికారివి నువ్వు. నువ్వే అధర్మానికి ఒడిగట్టావు. అందరినీ పాలించే నువ్వు అధర్మాన్ని పాటించావు. అందుకే దోషిలా నుంచున్నావు. నువ్వెవరికయినా శిక్షార్హుడివే!'

ఇంద్రుడు శిలలా నిలబడిపోయాడు. అతని కర్ణేంద్రియాలు మాత్రం పనిచేస్తున్నాయి.

'నీవు స్త్రీ లోలుడివి! విషయ చింతానుశీలుడివి! యుక్తా యుక్తాలు మరిచావు. ఋషి పత్నిని నీ మాయతో భంగపరిచావు! అందుకే నీవు శిక్షార్హుడివి!'

ఇంద్రుడు జడుడిలా నిలబడ్డాడు. అతని చర్మచక్షువులు మాత్రం చైతన్యవంతంగా ఉన్నాయి.

'నీవు రెండు కనులతో అహల్య సౌందర్యాన్ని చూశావు. ఇక నీ ఒళ్ళంతా కళ్ళే అవుతాయి. సహస్ర నేత్రుడివవుతావు. ఏ సృష్టికార్యంలో నువ్వు ఇంత అధఃస్థితికి చేరావో ఆ సృష్టి చిహ్నాలు నీ శరీరం నిండా నిండి- శచీదేవికి నువ్వంటే జుగుప్స కలిగిస్తాయి. పరులకు అవి నేత్రాలు! ఆమెకు మాత్రం అవి భోగ చిహ్నాలు- వెళ్ళు- నీ కపటచేష్టలకు కలకాలం వగస్తూ వుండు!'

ఇంద్రుడు నిశ్చేష్టుడైనాడు.

'అ...హ...ల్యా...'

ఆమె కైమోడ్పుతో శిరసు వంచింది. అలా అలా కుంచించుకుపోతూ వినమ్రురాలి కూలబడిపోయింది.

"ఈ శరీరంతో నువ్వు పాపం చేశావు. దానికి ఫలితం అనుభవించు! విద్యా వివేకాలతో మనస్సు చైతన్య వంతమవుతుంది. కానీ నీ మనసు జడమై పోయింది. ఆలోచించే శక్తిని కోల్పోయింది! నేఎ కనులకు యదార్థాన్ని చూసే శక్తి పోయింది. నీ కర్ణేంద్రియాలకు శబ్దాన్ని తెలుసుకునే శక్తి నశించింది. నీ జిహ్వకు స్వపరభేదం గుర్తించే శక్తి పోయింది. అందుకే అవి అన్నీ చైతన్య రహితమై దోష కార్యానికి దోహదం చేశాయి".

అహల్య పంచేంద్రియాలు ఏకీకృతమైనట్టు గౌతముడి శాపం కోసం ఎదురుచూశాయి.

'నువ్వు శిలలా చైతన్య రహితంగా పడివుండు'

గౌతముడి శాపం వెలువడగానే-

అహల్యలో జీవశక్తి క్రమ క్రమంగా నిస్తేజం కాసాగింది.

'స్వామీ! ఇప్పుడు తమకు నా దోష నిర్దోష విషయ వివరణ చేసి మన్నన అడిగే శక్తి లేదు. పరుషమైన తమ శాప వాక్కులు నా శరీరాన్ని శిలాకృతిగా మలుస్తున్నవి. ప్రభూ! జ్ఞానమూర్తీ! నా శాపావసానం ఏమిటో సెలవివ్వండి! కఠినమూర్తిగా క్షణం శపించినా శాశ్వత కరుణామూర్తులు తమరు. ఆగ్రహం తమకు క్షణకాలమే! శాంత గంభీరమూర్తీ! తమరు నోరారా నా శాప విమోచనం ఏమిటో సెలవిస్తే శిలగా పడివున్నా అంతశ్చైతన్యంతో ఆనాటి శుభగడియల కోసం ఎదురుచూస్తూ వుంటాను'

ఆమె దీనవాక్కులు గౌతముడిని కదల్చలేక పోయాయి.

ధర్మమూర్తిలా న్యాయమూర్తిలా అన్నాడు 'ఏ శిక్షకయినా అవధి ఉన్నది. ఏ శాపానికయినా విమోచనం ఉన్నది. శిలామూర్తీ! శ్రీమన్నారాయణమూర్తి త్వరలో కౌసల్య గర్భవాసాన ఇక్ష్వాకు కులతిలకుడిగా దాశరథిగా అవతరించనున్నాడు. సర్వపాపహారి అయిన ఆ మూర్తి పాదధూళి సోకగానే- ఆ ప్రభువు నెమ్మేనిపై వీచి పవిత్రమయ్యే గాలులు నీ శిలారూపంపై వీచగానే- ఆ దయామూర్తి కరుణార్ద్ర దృష్టులు నీ శిలాకృతిపై ప్రసరించగానే నీ శాపం పాపం రూపరిపోతాయి. తిరిగి స్వచ్ఛంగా పవిత్రంగా అలనాడు విరించి నిర్మించినట్లు నీవు నీవుగా నిజరూపం ధరిస్తావు. అస్తు!'

'ధన్యోస్మి!'

మోడ్చిన చేతులు భర్త కభిముఖంగా ఉండగా నిమీలిత నేత్రమై దృష్టి పతి పాదాలపై నిలిచి- చిత్తం ఆ అంఘ్రిద్వయానికే అంకితం చేసి క్రమ క్రమంగా శిలా రూపిణి అయ్యింది అహల్య.

ఇంద్రుడు ఇదంతా చూస్తూ తనను చూసుకున్నాడు. ఒళ్ళంతా కన్నులు. అవును ఒళ్ళంతా కనులు చేసుకుని చూసినా తనివి తీరదు అని తమకంతో తలచినందుకు అట్లే అయ్యింది. ఆ కనులు... ఛీ... ఛీ... ఇంద్రుడు అసహ్యంతో తనను తాను నిందించుకుంటూ అదృశ్యుడైనాడు. గౌతముడు తపస్సుకు కదిలాడు.

## 52

అయోధ్యలో పుత్ర కామేష్టి యాగం మొదలయ్యింది. మహర్షులంతా వచ్చి చేరారు.

శాంత భర్త - మృకండ పుత్రుడు- ఋష్యశృంగుడు అన్నీ తానే అయ్యి యాగాన్ని నడిపిస్తున్నాడు. యాగం పూర్తయ్యింది.

యజ్ఞ పురుషుడు జ్వలిస్తున్న హోమాగ్ని నుండి ఆ హోమాగ్ని కీలల మధ్య తప్తకాంచన రూపంతో వెలువడ్డాడు.

ఆయన దశరథుడిని ప్రసన్నంగా చూస్తూ సెలవిచ్చాడు 'అయోధ్యా నగర పురవరాధీశ్వరా! దశరథ మహారాజా! నీ యాగం పూర్తయ్యింది. నువ్వు సమర్పించిన హవిస్సులతో సకల దేవతలు పరితృప్తులయ్యారు. ఈ అగ్నికీలలు ధగధగ లాడినట్లు నీ వంశ కీర్తులు తేజోవంతమవుతాయి. ఈ అగ్ని జ్వాలల్లో హోమ ద్రవ్యాలు భస్మ భూతమయినట్లుగా నీ కుమారుల చేతుల్లో దుష్ట రాక్షసులు నశిస్తారు'

'ధన్యుడ్ని స్వామీ!' అన్నాడు దశరథుడు ఆనందంతో తబ్బిబ్బవుతూ.

'నీ ముగ్గురు రాణులకూ ఈ పాయసాన్ని పంచు. ఆ ముగ్గురికీ నలుగురు కుమారులు జన్మిస్తారు. కొడుకులు లేరనే దిగులు తీరేలా నీకు అమితానందాన్ని కలిగిస్తారు!'

'మా వంశమే తరించింది ప్రభూ!' అన్నాడు దశరథుడు.

'దశరథ మహారాజా! శ్రీమన్నారాయణుడు నీ కుమారుడుగా జన్మించడం వల్ల నీవు నీ భార్యలు- నీ వంశం- నీ దేశం- నీ ప్రజలూ తరిస్తారు. అంతేకాదు ఆయన పవిత్ర పాదస్పర్శతో భూమి పులకిస్తుంది. చెట్లు తరిస్తాయి. శిలలు చైతన్యవంతమవుతాయి. ఆ పుణ్య పురుషుని జననంతో ఈ భూమి పుణ్యభూమి అవుతుంది. నరవానర సమూహం జన్మ సార్ధకమవుతుంది!' యాగఫలం అందించాడు యజ్ఞ పురుషుడు.

దశరథుడి ఆనందానికి అవధుల్లేవు.

యాగం చేయించిన ఋషుల ఆనందానికి హద్దుల్లేవు. వింటున్న మంత్రి సామంత దండనాథభట సమూహాల సంతోషానికి ఎల్లలు లేవు. సామాన్య జనుల సంబరాలకు అంతులేదు.

ఆనాడు అయోధ్యలో మొదలయిన సంబరాలు అంబరాన్ని అంటాయి.

పాయసంలో సగభాగం కౌసల్యకిచ్చాడు. దశరథుడు సుమిత్రకు సగంలో సగం ఇచ్చాడు. కేకేయికి సగం ఇచ్చాడు. ఆ మిగిలిన సగం సుమిత్రకిచ్చాడు. అంతఃపురంలో రాణులు, దాసదాసీజనమే కాదు అణువణువు ఆనందించింది.

* * * *

రావణుడు అశాంతిగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ప్రహస్తుడు మౌనంగా నుంచున్నాడు.

'ఎన్ని యాగాలు భగ్నం చేయలేదు. ఈ యాగాన్ని భగ్నం చేయలేకపోయారా మారీచ సుబాహులు!'

ప్రహస్తుడు నెమ్మదిగా అన్నాడు 'ప్రభూ! జడధారులు సంకల్పించి యజ్ఞయాగాదులు చేస్తే అవి దానవవైరి నాశన హేతువులని తలంచి వాటిని నాశనం చేస్తాం. కానీ దశరథ మహారాజులుంగారు కొడుకు కోసం యాగం చేస్తే అది మనకు విరోధం అవుతుందని అనుకోలేదు'

రావణుడు జవాబుగా కోపంగా చూశాడు.

'మన్నించండి ప్రభూ!'

రావణుడేమీ అనలేదు.

ప్రహస్తుడు నెమ్మది నెమ్మదిగా నిష్క్రమించాడు.

* * * *

'జనక రాజర్షీ!'

'సెలవివ్వండి దేవర్షీ!' నారదుడికి వినయంగా నమస్కరించి అన్నాడు జనకుడు.

'వచ్చే వైశాఖ మాసంలో నువ్వు యాగం చెయ్యాలి'

'చిత్తం'

'విశ్వామిత్ర మహర్షి చెప్పి వెళ్ళారు గుర్తున్నది కదా!'

'అవును స్వామీ!'

'ఆనాటికి ఆ యజ్ఞం నిర్వహించాలంటే ఇప్పటి నుంచి చేయవలసిన కొన్ని విధులున్నాయి!'

'సెలవివ్వండి!'

'సంవత్సర దీక్ష పూని అశ్వమేధం చేసినట్టే దీనికీ వత్సర దీక్ష అవసరం!'

'అలాగే!'

నారదుడు జనక మహర్షికి యజ్ఞ విషయాలన్నీ వివరంగా చెప్పి కదిలాడు. మిథిలా నగరంలో ఉత్సవాలు మొదలయ్యాయి.

* * * *

చైత్ర శుద్ధ నవమి! బుధవారం! పునర్వసు నక్షత్రం! అయిదు గ్రహాలూ ఉచ్ఛస్థితిలో ఉన్నాయి గురుచంద్ర యుతి! కటకలగ్నం!

కౌసల్యాదేవికి కుమారుడు జన్మించాడనే శుభవార్త పురిటిగది దాటి అంతఃపురం వెలువడి నగరమంతా ప్రతిధ్వనించి అజనాభదేశమంతటా మార్మోగింది.

లంకలో రావణుడికీ తెలిసింది.

తెల్లవారింది. దశమి! గురువారం! మీన లగ్నం! పుష్యమీ నక్షత్రం.

కైకకు కుమారుడు పుట్టాడు!

ఆ వార్త దేశమంతటా ఆనందోత్సాహాలను సృష్టించింది. పురుష సంతానమే లేదని తపించిన దశరధుడు నిన్న ఒక కుమారుడు నేను మరో కుమారు కలగడంతో ఆనందంతో మురిసిపోతున్నాడు.

వృద్ధాప్యంలో నయినా కుమారులు కలిగినందుకు ఆనందంగా ఉంది దశరధుడికి!

ఆనందంతో తెల్లవారింది. ఏకాదశి! శుక్రవారం! ఆశ్లేషా నక్షత్రం! సుమిత్రా దేవికి పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఆమె బాధలో మూల్గుతూ ఉంటే అది సంతానలక్ష్మి చిరుమువ్వల సవ్వడిలా వినిపిస్తోంది.

కర్కాటక లగ్నం! మొన్న కౌసల్య గర్భస్థ శిశువు తలసూపిన శుభలగ్నం. సుమిత్రకు కొడుకు పుట్టాడు అనే వార్త అంతఃపురమంతా నిండింది.

దశరధుడు ఆనందంతో ముత్యాల సరాలు నవరత్నాల హారాలు దాసదాసీలకు బహుమతిగా ఇస్తున్నాడు. అంతలో ఆఘమేఘాల మీద మరో దాసి వచ్చింది.

'ప్రభూ! ప్రభూ! సుమిత్రమ్మ గారికి కొడుకు పుట్టాడు'

దాసీ దానికి సంబరంతో మతిపోయి చెప్పిన శుభవార్తే మళ్ళీ చెపుతూ ఉందనుకున్నాడు మహారాజు.

కంఠ సీమలోని మణిహారం తీసి అందించి 'మంధరా! మాకీ వార్త ముందే తెలుసే! అయినా మా ఆనందం పొంగి పొర్లుతున్నది! అందుకే బహుమతి!' అన్నాడు.

'ప్రభువులు! రెట్టింపు బహుమతి అందజేస్తారనే వచ్చాను! తమ సుమిత్రమ్మ గారికి జంట కోయిలలు కూసినట్టు పుత్రద్వయం - కవలలు జన్మించారు'

దశరధుడు ఆనందాల వెల్లువే అయ్యాడు.

'ఏమేమి? సుమిత్రా దేవికి ఇద్దరు కుమారులు జన్మించారా!'

'చిత్తం ప్రభూ!'

'ఎంత మంచి వార్త చెప్పావే! శ్రీ మహావిష్ణువు చతుర్భుజాలతో దీవించినట్లయ్యింది కదే! నాలుగు దిక్కులకూ ఇక్ష్వాకుల కీర్తి పతాకం ఎగరవేసే నలుగురు కుమారులు కలిగారా! పరమాత్ముడెంత దయామయుడు!'

వార్త చైత్రమాస వసంత వాయువులా దేశమంతటా వ్యాపించింది. అనేక దానాలు చేశాడు దశరధుడు ఆనందంతో.

పదకొండు రోజులు గడిచాయి.

పండెండవ రోజున వశిష్టుడు స్వయంగా పూనుకుని జాతకర్మాది క్రియలు పూర్తి చేయించాడు.

కౌసల్యా సుప్రజుడికి రాముడని పేరుపెట్టారు. కైకా గర్భ సంభూతుడికి భరతుడని నామకరణం చేశారు. సుమిత్రా నందనుడు లక్ష్మణుడు-శతఘ్నుడు అని పేరుపెట్టారు ఆఖరువాడికి.

నామకరణం వేడుకలు దశదిశలా మారుమ్రోగాయి.

* * * *

అయోధ్యలో సంబరాలు అంబరాన్నంటే వేళలో మిథిలలో-

యాగానికి కావలసినవన్నీ ఏర్పాటు చేసుకుని యాగాభూమిలో జనకుడు స్వయంగా నాగలి పట్టి భూమి దున్నుతున్నాడు.

ఒక చోట నాగలి సాగక ఆగింది. ఎడ్లు నిలిచాయి. జనకుడు కారణం తెలియక నిలిచాడు. ఏదో గట్టి పదార్థం నాగలిని నిలేసింది. చక చక భూమిని తవ్వారు. ఒక సువర్ణ పేటిక.

జనకుడే స్వయంగా పేటికను తీసి తెరిచాడు.

అందులో ఒక బాలిక!

సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని ఇల్లాలు లక్ష్మీదేవిలా కనిపించింది. 'సీత!' అని పిలుచుకున్నాడు జనకుడు.

* * * *

కైక రామలక్ష్మణులకు ధనుర్విద్యా గురువైంది. రాముడు కౌసల్య ముద్దు బిడ్డడు. లక్ష్మణుడు సుమిత్రా నందనుడు. కానీ వాళ్ళిద్దరూ కైకేయి కన్నులకన్న సంతానం లాగ మెలుగుతున్నారు.

రాముడు దిన దిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ అటు విద్యాభ్యాసం వసిష్టుల శ్రీచరణాల వద్ద, ఇటు విలు విద్యాభ్యాసం కైక వద్ద సాగిస్తూ ఉంటే దనుజులకు రోజులు దగ్గరపడుతున్నట్టుగా బెంబేలు పడుతున్నారు.

## 53

జనకుడు ఇంట మరో ముగ్గురు బాలికలు వెలిశారు. నలుగురూ- సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి. జగదేక మాత నాలుగు భుజాల్లా ఉన్నారు.

ఒక రోజు ఆడపిల్లలందరూ బంతి ఆట ఆడుతున్నారు.

విసురుతూ అందుకుంటూ మళ్ళీ విసురుతూ పాలోమని చెలికత్తెలతో చెల్లెళ్ళతో కలిసి ఆడుతున్నది సీత. ఆమె అందుకోబోయిన బంతి చేజారి దొర్లుకుంటూ మందిరాలు దాటి వెళ్ళింది. అది వెళ్ళి వెళ్ళి ఓ మూలగదిలో దూరింది. అది ఓ రకం పూజామందిరం.

అక్కడ శివధనుస్సు. అది తరతరాలుగా విదేహులింట పూజా పురస్కారాలు అందుకుంటున్న ధనుస్సు.

సీత ఆ మందిరం ప్రవేశించింది. బంతి ఆ మందిరంలో దొర్లుతూ వెళ్ళటం చూసిందామె. కానీ బంతి ఇప్పుడు కనిపించలేదు. ఎక్కడుందా? అనుకుంటూ చూసింది. ఎక్కడా కనిపించలేదు. ధనుస్సు చాటున ఉందేమో అని ఆ ధనుస్సును పేటికతో సహా పక్కకు జరిపింది. అక్కడే ఉన్నది బంతి!

బంతిని తీసుకుని తిరిగి పేటికను యథాస్థానాన ఉంచింది సీత. ఆపై తిరిగి ఆటలాడేందుకు ఇటు తిరిగింది, ఆమెను వెన్నంటే వచ్చిన చెల్లెళ్ళు, చెలులు, దాసీలు ఈ దృశ్యం చూసి అబ్బురపడ్డారు.

ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసంలో ఆయుధ పూజ రోజున శుద్ధ నవమి నాడు తప్ప ఆ ఆయుధాన్ని ఎవరూ స్పృశించరు. స్పృశించలేరు. ఆనాడైనా మహాబలిష్ఠులయిన వీర సైనికులు ఎందరో కలిసికట్టుగా మహా ప్రయత్నంగా మోసుకురావలసిందే తప్ప-

ఇలా ఓ చిన్నారి అవలీలగా- అలవోకగా అటు దాన్ని ఇటు జరిపి, ఇటు దాన్ని అటు జరిపి తీసి పెట్టేంత తేలిక కాదు అది.

అందుకే వారందరూ అద్భుతానికి లోనయ్యారు. క్షణాలపై విషయం విదేహాధీశుడికి తెలియజేయబడింది. ఆయన అబ్బురపడ్డాడు.

'యాగ భూమిలో నవరత్న మణిఖచిత స్వర్ణ పేటికలో లభించిననాడే అమ్మ అంబస్వరూపం అనుకున్నాను. భూమిలో లభించిన భూలక్ష్మిగా భావించాను. ఈనాడు ఈ సంఘటన మా తల్లి మాలక్ష్మి అవతారమని ఋజువు

చేసింది. ఇదే ఇక కన్యాశుల్కం! ఎవరయితే యీ ధనువు ఎక్కిడగల మిక్కిలి జోదో- ఆ ధనుర్ధారికి- ఆ కోదండుడికి- నా తల్లిని ఇచ్చి కళ్యాణం జరిపిస్తాను'

మనస్సులో నిర్ణయం చేసుకున్నాడు జనకుడు.

* * * *

'విశ్వామిత్రుడు యాగం మళ్ళీ ప్రారంభించినాడని వేగులు వార్త తెచ్చినారు ప్రభూ! సర్వదనుజ సంహారిగా, సర్వదేవతా శ్రేయః కామిగా, సర్వ మానవ శుభోదర్కంగా విశ్వామిత్రుడు యాగ సంకల్పం చేశారట ప్రభూ! ఆ యాగానికి మునులందరూ విచ్చేసినారట!'

ప్రహస్తుడు చెప్పిన మాటలు వినగానే ప్రశాంత కాసారంలో మట్టి బెడ్డ పడ్డట్టయ్యింది.

రావణుడు తలూపాడు.

'ప్రహస్తా!' క్షణం ఆగి పిలిచాడు 'ఆ యాగం పరిసమాప్తి కాకూడదు. ఎన్ని విధాల భంగపరచాలో అన్ని విధాల దానిని భగ్నం చెయ్యండి! మారీచ సుబాహులతో పాటు తాటకనూ తీసుకు వెళ్ళమని నా ఆదేశంగా చెప్పు. వారికి తోడుగా మరికొందరిని పంపు!'

'చిత్తం ప్రభూ!'

ప్రహస్తుడు వెళ్ళిపోయాక రావణుడు ఆలోచనలో పడ్డాడు. అతనికి అన్ని విషయాలు కలగాపులగంగా కనిపించసాగాయి.

* * * *

విశ్వామిత్ర మహర్షి ఆశ్రమం!

అజనాభ దేశంలో ప్రముఖ మహర్షులు, మునులు శిష్య ప్రశిష్య సమేతంగా విచ్చేశారు. ఆయన తలపెట్టిన యాగానికి ఋత్విక్కులుగా అధ్వర్యులుగా హోతలుగా సుబ్రహ్మణ్యులుగా ఎందరెందరో సకల వేద శాస్త్ర పండితులు వచ్చారు.

యాగం ప్రారంభమైంది.

ఆయన ఎప్పుడు యాగం ప్రారంభించినా తండోపతండాలుగా వచ్చి యాగాన్ని భగ్నం చెయ్యడానికి శతవిధాలా ప్రయత్నించే రాక్షసుల పొలకువ ఏమాత్రం లేకపోవడంతో విశ్వామిత్రుడు, తదితర మహర్షులు ఎంతో సంతోషిస్తున్నారు.

'నారాయణుడు నరుడుగా అవతరించాడు. ఇక సకల రాక్షస బాధలకూ స్వస్తి! దానికిది నాంది' అన్నారు ఓ మహర్షి.

ఆయన మాటలకు మిగతా అందరూ ఎంతో సంతోషించారు.

'ఎప్పుడు బ్రహ్మర్షి యాగం తలపెట్టినా శేషవర్జంలాగా వచ్చి భగ్నపరిచే మారీచ సుబాహులు ఈ పర్యాయం ఇటు తొంగి చూడలేదు. బహుశా అయోధ్యలో దశరథులు అవతరించినారన్న వార్త చెవుల పడిందేమో!' అన్నాడు ఇంకో మహర్షి.

'వశిష్టుల శిష్యరికంలో, కైకేయి ధనుర్విద్యా శిక్షణలో రామచంద్రుడు సారించే ధనుష్టంకారం రావణాది మహారాక్షసుల చెవుల రింగుమని మోగుతూ భయభ్రాంతులను చేస్తున్నదేమో!' అన్నాడు మరో మహర్షి.

ఆ మహర్షుల మాటలు అందరిలో ఆనందాన్ని కలిగించాయి.

అంతలో-

గగనం ఘటిల్లుమని మ్రోగినట్లు-

దశదిశలు దద్దరిల్లినట్టు- పెడబొబ్బలు వినిపించాయి. ఆపై యాగభూమిపై భాగాన వియన్మధ్యమున మేఘాలు కమ్మాయి.

మహర్షుల గుండెలు గుభేల్ మన్నాయి. అందరి ముఖాన విచార రేఖలు కమ్ముకున్నాయి. అవి రాక్షస మాయలు ఇంతవరకు లేవు లేవని భ్రమించిన రాక్షసుల పొలకువకు నిదర్శనాలు.

విశ్వామిత్రుడు ఆందోళన చెందాడు. మహర్షులంతా భయభ్రాంతులయ్యారు. కారు మేఘాల నుండి రక్తధారలు కురిశాయి. మాంస ఖండాలు జారి పడ్డాయి. కుండలతో కల్లు కురిసింది. సర్వం హోమ గుండాల్లో వర్షించినట్టుగా పడ్డాయి. యజ్ఞం భంగమైంది. మారీచ సుబాహులు తాటక కేరింతలు కొడుతూ వెళ్ళారు.

ఆనాడు లంకలో మహోత్సవం.

విశ్వామిత్రుడు ఆలోచనల్లో మునిగిపోయాడు.

ఆలోచించగా- ఆలోచించగా- కోటి నదులు ధనుష్కోటి చేరినట్టు ఆయన ఆలోచనలన్నీ అయోధ్య వైపు కేంద్రీకృతమయ్యాయి. సర్వం శ్రీరామచంద్ర మయమయ్యాయి.

విశ్వామిత్రుడు కదిలాడు.

## 54

అయోధ్యలో...

దశరధ మహారాజు కులగురువు వశిష్టుల వారితో సంప్రదింపులు చేస్తున్నాడు.

నలుగురు కుమారులకూ పదహారో సంవత్సరం రాబోతున్నది వారికి వివాహవయస్సు వచ్చింది. రూపలావణ్య సౌందర్యాలతో సమానంగా- ఆర్షేయ పౌరుషేయాలకు తగ్గట్టుగా ఎక్కడో నలుగురు కన్యలు జన్మించే ఉంటారు. అన్ని రాజ్యాలకూ వర్తమానం పంపితే అనురూపలయిన వధువులు లభ్యమవుతారు. ఆపై సంబంధం నిశ్చయించి బాంధవ్యం కలుపుకోవడమే.

ఆ విషయాలు చర్చించుకుంటూ ఉండగా-

ఆఘమేఘాల మీద పరిగెత్తుకుంటూ వచ్చాడు ప్రతీహారి.

'ప్రభూ! ప్రభూ!' అన్నాడు తొందరపాటుతో.

దశరధుడికి ఏకాంత భంగం చేసిన వాడిమీద కోపం వచ్చింది.

'ప్రభువులు మన్నించాలి! కోపధారి మునీంద్రులు విశ్వామిత్రుల వారు చండమారుతంలా వచ్చేస్తున్నారు! వారు ప్రధాన ద్వారానికి అల్లంత దూరంలో అగుపించగానే పరిగెత్తుకుని వచ్చాను. అనుమతి లేకుండా వర్తమానం లేకుండా తమ ఏకాంతాన్ని భగ్నం చేసినందుకు తలతీసినా ఫర్వాలేదు. మునులు రాక తమకు తెలియజేయాలన్న తొందరలో సంప్రదాయభంగం చేశాను' అన్నాడు గబగబా.

తను చెప్పవలసినది చెప్పాను ఇక ఏం జరిగినా మేలే. ప్రభు సేవలో మరణించినా ముక్తిహేతువే అనుకున్నాడు భటుడు.

తల తెగి ముక్తి లభిస్తుందనుకున్న వాడికి ముక్తాహారం లభించడంతో ప్రభువుల దయను కీర్తిస్తూ వెళ్ళాడు భటుడు.

'వసిష్ఠ మహర్షీ! విశ్వామిత్రుల వారి రాక వినగానే నాకు పంచప్రాణాలు పైపైన ఎగిరిపోయాయి. తమరు స్వయంగా వెళ్ళి వారికి అర్ఘ్యపాద్యాదులిచ్చి తోడ్కొని వచ్చి సుఖాసీనులను చేసి కుశల ప్రశ్నాదికం కనుక్కోండి. ఆపై నేను దర్శనానికి వస్తాను!' అన్నాడు దశరథుడు.

వశిష్ఠుడు వెంటనే కదిలాడు.

ప్రధాన ద్వారం వద్ద- బ్రహ్మర్షులిద్దరూ పరస్పర ప్రవర సహితంగా ప్రణామాలు చేసుకున్నారు.

ఒకరినొకరు గౌరవ పురస్సరంగా పలుకరించుకున్నారు. ఆపై విశ్వామిత్రుడికి అర్ఘ్యపాద్యాదులు సమర్పించారు. బ్రహ్మర్షి వసిష్ఠుల స్వాగతం. బ్రహ్మర్షి విశ్వామిత్రులకు అమితానందాన్ని కలిగించింది.

సుఖాసీనుడయ్యాక దశరథుడు నెమ్మదిగా రావేశించి గాథేయుడికి అంజలి ఘటించాడు. ఆశీర్వచనాలు అయ్యాయి.

విశ్వామిత్రుడు దశరథునితో పలుకరింపుగా నవ్వి అన్నాడు 'కోపదారి అని నాకు బిరుదు మహారాజా! ముక్కున ఉండే కోపం ఎటు పోయిందో ఏమైందో తెలియడం లేదు'

'అది మా వంటి వారి అదృష్టం' అన్నాడు దశరథుడు.

విశ్వామిత్రుడు నవ్వాడు.

'తమరి రాకకు హేతువేమీ! తమరేం కోరి వచ్చారో సెలవిస్తే పూని పనిగట్టుకుని పూర్తి చేస్తాను! సెలవివ్వండి మహర్షీ!'

'నేను యాగం సంకల్పించాను దశరథా! కానీ రాక్షసుల మాయోపాయం, దుందుడుకు తనం దానిని పదేపదే భగ్నపరుస్తున్నది!'

'నేను నా సైన్యంతో నా ఎనిమిదిమంది మంత్రులతో వచ్చి యాగరక్షణ చేయనా స్వామీ!'

'అంతశ్రమ వద్దయ్యా మహారాజా!'

'పోనీ సైన్యం పంపనా!'

'వారు చాలరు ఇక్ష్వాకు కులదీపకా!'

'మరేం చేయ శక్తుడనో సెలవివ్వండి! మంత్రి సామంత దండనాధ సేనానులతో కాదంటున్నారు. నన్ను వద్దంటున్నారు. ఇక నేను చేయగలిగింది' అర్ధోక్తిలో ఆగాడు దశరధుడు.

'వారిని నిర్జించడానికే వసుధలో జన్మించిన నరశ్రేష్టుడు నీ కుమారుడు శ్రీరామచంద్రుడు ధనువు పట్టి నిలిచిన గానీ నా యజ్ఞం నిర్విఘ్నంగా పరిసమాప్తి కాదయ్యా ప్రభూ!'

విశ్వామిత్రుడి మాటలు పిడుగులా ధ్వనించాయి. 'ఏమి! ఏమేమి! నా కుమారుడు రామచంద్రుడా! స్వామీ ముక్కు పచ్చలారని బాలకుడు! చిదిమిన పాలుగారే చెక్కుటద్దాలవాడు- లేత ఎండకీ అలసిపోయేవాడు- అస్త్ర విద్యలో బీజాక్షర సంపుటికూడా పూర్తిచేయనివాడు- నా కులదీపుడు- నా స్నానం- నా పాపం, నా జపం- నా ధ్యానం- నా సర్వం- ఆ వసవల్చుబాలకుడు ఎక్కడ? దుష్టరాక్షస సంహారం ఎక్కడ! దయచేసి నన్ను తోడ్కొని పొండి! ఆ దనుజుల్ని దునుమాడతాను. తమ యాగాన్ని పూర్తి చేయిస్తాను!' అన్నాడు దీనాతి దీనంగా.

కొడుకును మునివెంట పంపాలన్న మాట చెవిని పడగానే దశరధుడికి సర్వం అయోమయంగా భాసించసాగింది. అయినా తనను తాను సంబాళించుకుని మహర్షికి అలా విన్నపం చేశాడు.

దశరధుడి మాటలు విన్న విశ్వామిత్రుడు నవ్వాడు 'రాజా! ఆ దనుజ సంహారం- ఆ దుష్ట మారీచ సుబాహు శిక్షణ- ఒక్క రామచంద్రుడి వల్లే అవుతుంది. నేను కోరింది నెరవేరుస్తానన్న నీ తొలి మాటలు గుర్తు తెచ్చుకుని రాముని నాతో పంపు. మేం నేర్చిన సకల విద్యలూ నేర్పిస్తాను. నీ కుమారుడిని మించినవాడు ధనుర్ధారి ఈ సకల చరాచర జగత్తులో లేకుండా తీర్చి పంపుతాను. ఎన్నో ప్రాశస్తమైన దివ్యాస్త్రాలు నా వద్ద మూలుగుతున్నాయి. ఉపదేశించి పంపుతాను!'

'స్వామీ! సృష్టికి ప్రతిసృష్టి చేసిన మీతో కానిది నా చిన్నారి శిశువుతో అవుతుందా! ముని ప్రభూ! దయచూడు! దాశరధిని వీడి ఈ దశరధుడు జీవించలేడు. రాముడిని పంపడం అన్న ఒక్కమాట తప్ప మరేదయినా చెప్పండి! శిరసావహించి పూర్తి చేస్తాను!'

దశరధుడు అలా అనగానే-

క్రోధమూర్తి అయిన విశ్వామిత్రుడు బంగరు గద్దియ నుండి లేచాడు. రెండడుగులు దిగి- ముందుకు నడవబోతూ అన్నాడు 'సరే! ఇన్నేళ్ళూ ఇక్ష్వాకులు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారనే జగత్ ప్రసిద్ధి కెక్కింది! నేటితో వారూ మాట తెప్పేవారితో కలిసిపోతున్నారు. ఏం చేయగలం. విధి వైపరీత్యం! దశరధ మహారాజా! తమ స్వాగతసత్కారాలకు ధన్యవాదాలు. మేమే వెళ్ళి విసర్జించిన ఆయుధాలు ధరించి- మరచిన క్షాత్రాన్ని- విడిచిన క్రోధాన్ని పునరుద్ధరించి-'

దశరధుడు ఆ మాటలు తీవ్రతకు తరతరలాడుతుండగా-

విశ్వామిత్రుడు వాక్యం పూర్తి చేయకముందే-

వశిష్టుడు దశరధుడికి మాత్రమే వినబడేలా చెప్పాడు 'మహారాజా! రాముడిని విశ్వామిత్ర మహర్షి వెంట పంపండి! ఆయన తమ చిన్న శిశువును ముంగిటి ముత్యనును- ముద్దుగారే శ్రీ కౌసల్యా తనయుడుని కంటికి రెప్పలా కాపాడాడు. ఇక ధనుర్విద్యామూర్తి శిష్యరికంతో దాశరధి విలువిద్య సంపూర్ణంగా అభ్యసిస్తాడు. భయం వద్దు. జంకువద్దు, సంశయం వద్దు. నీ రక్షణలో కన్నా విశ్వామిత్రుల రక్షణలో సర్వశుభకరంగా యాగరక్షణావిధి ముగించి కళ్యాణమూర్తిగా తిరిగి రాగలడు. ఈ దనుజసంహార కాండతో రఘురాముని శౌర్య ప్రతాపాలు సకలలోక విదితాలు అవుతాయి!'

వశిష్టుడి చాలని మాటలు- చందన చర్చలా- శైత్యోపచారంలా పుత్రవాత్సల్యతాపంతో తపించే దశరధుడికి శాంతిని కలిగించాయి. ధైర్యాన్ని పెంచాయి. విచక్షణా జ్ఞానాన్ని కలిగించాయి.

'స్వామీ! విశ్వామిత్ర మహర్షీ! నా పుత్రవాత్సల్య దోష పూరితమైన మాటలు మన్నించండి! రాముడిని ఇప్పుడే పంపిస్తాను. పిలిపిస్తాను. తోడుకొని వెళ్ళండి!' అన్నాడు వినయంగా.

విశ్వామిత్రుడు ముందంజ వేసిన వాడు తిరిగి ఆసనంపై కూర్చున్నాడు.

దశరధుడి చూపులే ఆజ్ఞగా దౌవారికుడు వెళ్ళి రాముని వెంట పెట్టుకుని వచ్చాడు. రాముడి వెంట లక్ష్మణుడు వచ్చాడు.

'రామచంద్రా! నాయనా! మహర్షులు విశ్వామిత్రులు!' అనగానే సోదరులిద్దరూ ప్రణమిల్లారు.

'వారితో వెళ్ళి వారి ఆనతి మేరకు యాగరక్షణ చేసిరా తండ్రీ! మునిజనసేవ మన ఇక్ష్వాకుల మొదటి కర్తవ్యం!'

తండ్రి మాటలు వినగానే శిరసు వంచి ఆజ్ఞగా స్వీకరించాడు.

రాముడి వెంట లక్ష్మణుడు పయనమయ్యాడు. వెలుగు లాంటి రాముడిని వెన్నంటి నీడలా లక్ష్మణుని వెళ్ళిరమ్మని వశిష్టుడు ఆదేశించాడు.

విశ్వామిత్రుని వెంట ఇక్ష్వాకుల కీర్తి ప్రతిష్టల్లాగా కదిలారు శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణుడు. వెళుతున్న వారినే కనులనిండా నింపుకుంటూ చూస్తూ- ఆశీర్వదిస్తూ- ఆనందిస్తూ- ఆలోచిస్తూ- నిలబడ్డాడు దశరధుడు.

'కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికం'

విశ్వామిత్ర మహర్షి లోకాలనన్నింటినీ తన బొజ్జలో దాచుకుని నిద్రిస్తున్న లోకేశ్వరుడ్ని- నరుడిగా అవతరించిన నారాయణమూర్తిని జాగృతం చేస్తూ సుప్రభాతం పాడాడు.

చప్పున మేలుకాంచి గురువందనం చేశాడు రాముడు. అన్నగారి అడుగుజాడల్లో నడయాడే సోదరుడు లక్ష్మణుడూ గురువందనం చేశాడు.

ఆపై- స్నానాదికాలు నెరవేర్చుకున్నాక- 'మహాపురుషా! మానవరూప ధారీ! ఈ భూమిపై అవతరించాక ఈ లోకానికి సంబంధించిన లక్షణాలు అన్నీ సంక్రమిస్తాయి. వాటిలో ఆకలి దప్పికలు, అలసట ప్రముఖమైనవి. ఇక్ష్వాకు కులతిలకా మీకు ఆకలిదప్పులు, అలసట లేకుండా బల- అతిబల మంత్రోపదేశం చేస్తాను' అన్నాడు విశ్వామిత్రుడు.

'ధన్యోస్మి!' అన్నట్టు అంజలి ఘటించాడు రాముడు.

ఆపై మహర్షి మంత్రోపదేశం చేశాడు.

ఆశ్రమం నిర్మించిన అడవి ప్రాంతం చేరగానే రాక్షస మాయలు ప్రారంభమయ్యాయి.

రాముడు నారి సారించి ధనుష్టంకారం చేసి బాణ ప్రయోగంతో ఆ మాయను ఛేదించాడు.

అయినా తాటక విజృంభించి మాయను మరింత ఎక్కువ చేసి వారికి అడుగడుగునా అడ్డు తగులుతూ పయనానికి ఆటంకం కలిగించ సాగింది.

అప్పుడు- విశ్వామిత్రుడు 'రామచంద్రా! రఘుకుల తిలకా! తాటక మాయలకు అంతం ఉండదు! దానిని అంతమొందిస్తేనే ఆ మాయలకు ముగింపు'

'గురువరా! తాటక...'

'స్త్రీ అని సందేహించకు! అసుర సంహరణానికి నాంది కావించు! ఇది నా అనుమతి! నా ఉపదేశం!'

'గురువాక్యం త్రికరణశుద్ధిగా ఆచరిస్తాను' మహర్షికి కైమోడ్పులు చేసి బాణం సంధించి మంత్రించి ప్రయోగించాడు.

తాటక మొదట వేరు తెగిన మహా వటవృక్షంలాగా నేలకూలింది.

* * * *

విశ్వామిత్రుడు యాగ స్థలానికి చేరుకున్నాడు.

రామలక్ష్మణులు రక్షణగా ఉండగా విశ్వామిత్రుడు దీక్ష వహించాడు. ఆరు రోజులు అన్నదమ్ములు కన్ను చెదరకుండా యజ్ఞవేదిని రక్షించారు. విశ్వామిత్రుడు యజ్ఞం విజయవంతంగా నిర్వర్తించాడు.

ఆ సమయంలో-

మింటిలో జంట రాక్షసులు తమ దుశ్చర్య మొదలుపెట్టారు కానీ రాముడి బాణ పరంపర వారి దుశ్చర్యను అడ్డుకుంది.

ఆ మీదట రాముడు వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించి మారీచుని గురిచూచి కొట్టాడు. వాడు ఆ బాణం తాకిడికి గాలిలో కొట్టుకుపోయే ఎండు రావి ఆకులా కొట్టుకుపోయాడు. ఆగ్నేయాస్త్రానికి గురై సుబాహుడు మరణించాడు వారివెంట వచ్చిన రాక్షసులు చెల్లాచేదురయ్యారు.

యాగం నిర్విఘ్నంగా పూర్తయ్యింది.

* * * *

మారీచుడు కుప్పకూలినట్లు పడ్డాడు. కొద్దిసేపటికి తేరుకుని అన్నాడు 'లంకేశ్వరా! విశ్వామిత్రుడి యాగం పరిపూర్తి అయ్యింది. ఆ మహర్షి ఆయుధం పట్టుకోలేదు. కానీ ఇద్దరు ముక్కుపచ్చలారని రాకుమారులు ఆయన వెంట వచ్చారు. వారి బలం ఏమి బలం! వారి తేజం ఏమి తేజం! తేరి చూడరాకుండా ఉంది! రాక్షసేశ్వరా! వారిలో పెద్దవాడు మా తల్లి తాటకను నేలకూల్చాడు! మా సోదరుడు సుబాహుని తను మాడాడు! నన్నెందుకో తరిమికొట్టాడు జీవం నిలిచింది. ఇంకా భూమ్మీద నూకలు చెల్లలేదు. నిన్ను సేవించే అదృష్టం ఇంకా మిగిలినట్లుంది. అందుకే బ్రతికి నీ పాలికి వచ్చాను.

మునులు మాయావులు - మన చెడు కోరతారు ప్రభూ! మంత్ర తంత్రాలతో మన నాశనాన్ని దేవతల క్షేమాన్ని కోరతారు. ఇప్పుడు వాళ్ళు నరుల పక్షపాతులయ్యారు ప్రభూ! ఇక దేవతల బారినుండి తప్పించుకోడానికి దైత్యులకు దిక్కులేదు ప్రభూ!'

రావణుడు అంతా విన్నాడు. మౌనంగా ఉండిపోయాడు.

మునులందరూ- విశ్వామిత్ర ఋషి మున్నుగా కోసల రాకుమారులను- రామలక్ష్మణులను ఆశీర్వదించారు. మహర్షుల ఆశీస్సులు పొంది మరింత తేజస్వంతులయ్యారు దాశరధులు.

అప్పుడు - విదేహ రాజ్యం నుండి జనకుడు పంపిన ఆహ్వాన పత్రికలు వచ్చాయి. జనకతనయ - వైదేహి- జానకికి స్వయంవరం ప్రకటించారు జనకరాజర్షి. తరతరాలుగా పురాణకాలం నుండి పూజలందుకుంటున్న మహాధనువు- శివధనస్సును ఎవరు ఎక్కి పెట్టగలడో ఆ ఎక్కిటి జోదుకు తన కుమార్తె సీతనిచ్చి పెళ్ళి చేస్తానని జనకుడు ఆ వార్తాహరుల ద్వారా విషయం తెలియపరిచారు.

ఆపై మునులందరి అనుమతి తీసుకుని పొరుగు రాజ్యాలకు వార్తలందించడానికై సమీప ఆశ్రమాల్లో నివసించే మహర్షులందరికీ విషయం వివరించడానికై బయలుదేరి వెళ్ళారు.

విశ్వామిత్రుడు రామలక్ష్మణులను చూశాడు.

రాముడు వినయవినమితాంగుడై 'గురువర్యులు అనుమతిస్తే మేం అయోధ్యకు బయలుదేరుతాం! మా తండ్రిగారు మా రాక కోసం ఎదురు చూస్తూ వుంటారు! మా తల్లి కైకేయి నా కోసం ఎదురు తెన్నులు చూస్తూ ఉంటుంది. ముని ప్రభూ! మేం తమ వద్ద స్వీకరించిన బాణ విద్యా రహస్య ప్రదర్శనలు ఆమె ముందు ప్రదర్శించి ఆనందింప చేయాలి' అన్నాడు.

విశ్వామిత్రుడు ఆ వినయానికి మరింత సంతసించాడు.

'నాయనా రామచంద్రా! జనకుడి ఆహ్వానము సకల రాజలోకానికీ చేరి ఉంటుంది. అయోధ్యకూ పంపే ఉంటారు. నీవు మాతో వచ్చి ఆ శివధనస్సును సంధించు! మీ కళ్యాణ వేడుకలు మా కన్నులారా చూసి ఆనందిస్తాం!'

విశ్వామిత్రుడి మాట - గుర్వాజ్ఞ- శిరోధార్యంగా భావించాడు రాముడు. త్రికరణ శుద్ధిగా పాటించాడు.

ఆపై రామలక్ష్మణులను వెంట పెట్టుకుని తన ముని శిష్యులనూ వెంట నిడుకుని విదేహ రాజ్యానికి బయలుదేరాడు. మిథిలా నగరం వైపు వారి ప్రయాణం సాగింది. ముందు విశ్వామిత్రుడు వెనువెంట రామలక్ష్మణులు నడుస్తున్నారు.

## 56

అడవి మార్గాన నడుస్తున్నారు ముగ్గురూ. వారిని అనుసరించి మరికొందరు శిష్యగణం.

కొంత దూరం వెళ్ళగానే వారికి పాడుబడిన ఆశ్రమం అల్లంత దూరంలో కనిపించింది. ఫలవృక్షాదులు ఫలించి ఉన్నాయి. కొన్ని వాటిపై పండి- రాలి- మగ్గిపోయి- ఎండిపోయాయి. తీగలు క్రమంగా తీర్చేవారు లేక అల్లిబిల్లిగా అల్లుకున్నాయి. ఎటో సాగిపోతున్నాయి. పర్ణ కుటీరాలు శోభతరిగి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా ఆలనా పాలనా లేని కారణాన వాటి ముంగిళ్ళు బీటలు వారాయి. కుటీరం తలుపులు విరిగిపోయాయి. గోడలు బీటలు వారాయి.

అక్కడక్కడ జిల్లేళ్ళు, ముళ్ళ కంపలు మొలిచి ఆశ్రమ పరిసరం అడవిలా తయారైంది. పెంపుడు చిలుకలను రక్షించేవారు లేక అవి అడవి పట్టి ఎగిరిపోగా వాటి పంజరాలు పాడైపోయాయి. పిచ్చి పిచ్చి మొక్కలు పెరిగి పెరిగి చిన్న వృక్షాల్లా తయారయ్యాయి.

చుట్టూ ఉన్న కంచె మాత్రం భద్రంగా ఉంది.

స్వాగత ద్వారం శిథిలావస్థలో అప్పుడో ఇప్పుడో కూలిపోయేలా ఉంది. దానిని చూసి ఆగాడు విశ్వామిత్రుడు. రామలక్ష్మణులు కూడా ఆగారు.

శ్రీరామ చంద్రమూర్తి ఒకడుగు ముందుకు వేసి గురువులను సమీపించి మెల్లని కంఠ స్వరంతో మృదువుగా అడిగాడు 'ఏమిటది? ఏదో ఆశ్రమ వాటిక- నిట్టనిలువున జీవధారలు లేక- ఎండిపోయిన పైరులా- నిట్టనిలువుగా దహించబడిన వృక్షంలా- జీవ రహితంగా- చైతన్య శూన్యంగా ఉందేమిటి? ఏదో మహారాజాంతఃపురం కాపురం చేసేవారు లేక పాడుపెట్టబడినట్లుగా ఉందేమిటి ఈ మునివాటిక? తమరు సర్వ విషయ పరిజ్ఞానులు. మాపై అనురాగంతో వివరించ గోరుతున్నాము'

రాముడు, విశ్వామిత్రుడు ఎదురెదురుగా నిలబడి ఉన్నారు. లక్ష్మణుడు వారికి అడుగు దూరంలో నిలబడ్డాడు.

అప్పుడొక చిరుగాలి చల్లగా వీచింది. ఒక పైర గాలి ప్రభు- శ్రీరామచంద్రుడి నెమ్మేనిని స్పృశిస్తూ ముందుకు పోయింది.

విశ్వామిత్రుడు దీర్ఘంగా నిట్టూర్చాడు 'అదొక విషాద గాథ రామభద్రా!'

రాముడు వినసాగాడు.

'ఇది మహర్షి గౌతములవారి ఆశ్రమం. వారు ఒకానొక దురదృష్ట సమయాన తమ ఇల్లాలైన సాధ్వి అహల్యను శపించారు. ఆయన శాపవాక్కు వజ్రాయుధంగా సోకగానే ఆమెలో చైతన్యం నశించింది. శరీరం జడంగా మారింది. క్రమ క్రమంగా శిలగా మారింది. కట్టుకున్న ఇల్లాలును అలా శపించిన మహర్షి కోప తాపాలు నశింప చేసుకునేందుకు తపస్సుకు వెళ్ళారు. గురువుగారి వెంట శిష్యులు ఆశ్రమాన్ని విడిచి వెళ్ళారు. దానితో ఆలనా పాలనా లేని ఆశ్రమం ఇదిగో ఈ రూపానికి వచ్చింది. త్రేతాయుగారంభంలో ఎప్పుడో జరిగిందిది. ఎన్నో శతాబ్దాలు గడిచిపోయాయి.'

అప్పుడు రాముడు నాలుగడుగులు ముందుకు వేశాడు.

ఆయన శరీరంపై నుంచి గాలి వీచి ముందుకు వెళ్ళి ఆ పరిసరాలను స్పృశించింది. ఆయన పాద ధూళి రేగి ముందుకు సాగి అక్కడున్న రాయి రప్పలను తాకింది. ఆయన వాక్కు వెలువడి ఆ శబ్ద తరంగాలు ఆ పరిసరాలను శబ్దమయం చేశాయి.

ఆయన పాదాలు ఒక రాయిని తాకాయి. అప్పుడు చూశాడాయన-

అదొక శిల- శిల్పి మలచిన బొమ్మలాగా ఉంది. తనలో తను ముడుచుకుని కుంచించుకుపోయిన స్త్రీ మూర్తి-

ఆ మూర్తిలో క్రమ క్రమంగా చైతన్యం.

ముందుగా జీవ చైతన్యం వచ్చింది. ఆపై గాలి అందులో ప్రవేశించింది. ఆపై శబ్దం ధ్వనించింది.

ఆమె పరిణామ క్రమంలో స్త్రీ మూర్తి అయ్యింది.

ఆ రాయి- స్త్రీ కాగానే- ఆ రాతి బొమ్మ స్త్రీ మూర్తి కాగానే ఆమె తలెత్తి చూసింది. ఎదురుగా-

ధనుర్ధారి అయిన శ్రీరామ చంద్రమూర్తి జగన్మోహనాకారంగా కనిపించాడు. ఆ విశాల నేత్రాలు, ఆ ఆజానుబాహువులు, ఆ చల్లని చూపులు, ఆ కోదండం- ఆ నీల మేఘశ్యామాకృతి- ఆ శ్రీనామం- ఆ మందహాసం- ఆమెని అభిషేకించినట్లయింది.

మెల్లిగా లేచి నిల్చుంది.

ఆనాడు ఘటించిన అంజలి బంధం అలాగే ఉంది.

'మాతృమూర్తీ! ఇక్ష్వాకుడు అయిన రాముడు నమస్కరిస్తున్నాడు!' అన్నాడు రాముడు.

ఆమె గతంలో అలవాటైనట్టుగా చెయ్యెత్తింది.

అదే సమయంలో- ఇన్ని సంవత్సరాలుగా తపస్సులో మునిగిన గౌతమ మహర్షి అక్కడ ప్రత్యక్షమైనాడు.

శ్రీరామ చంద్ర పద స్పర్శతో పాపం పటాపంచలై నిర్మలురాలై నిలబడిన అహల్యనూ- జరుగుతున్న సంఘటనల్ని చూసి ఆనందం చెందుతున్న మహర్షి విశ్వామిత్రుల వారిని- ఆయన చెంత ధనుర్ధారి అయిన కోదండ రాముని- ఆ శ్రీరామ చంద్రుడి ఛాయలా నిలబడిన లక్ష్మణుడిని చూసి ఆనందంలో పొంగిపోయాడు.

మహర్షులిద్దరూ పరస్పరాభివాదాలతో గౌరవించుకున్నారు.

కొన్ని నిముషాలు గడిచాయి.

అహల్యకు అంతా వివరించాడు విశ్వామిత్రుడు.

ఆమె శ్రీరామ చంద్రుని చూసి 'రామభద్రా! నువ్వు మిథిలా రాకుమార్తెను ఉంకువగా నియమించిన శివధనుస్సు ఎక్కిడి - వివాహమైన తరువాత తిరిగి కోసల రాజ్యం వెళుతూ ఇటువచ్చి మాకు మీ కళ్యాణ రూపం చూసి వెళ్ళు తండ్రీ!' అంది.

శ్రీరామ చంద్రుడు విశ్వామిత్రుడు వైపు చూశాడు.

ఆయన కళ్ళలో అనుమతి కనిపించింది.

శ్రీరామ చంద్రుడు 'అలాగే తల్లీ! తిరిగి వచ్చి మీ చల్లని చేతిలో ఆతిథ్యం స్వీకరించి ఆశీస్సులు పొంది వెళతాను' అన్నాడు.

గౌతముడు విజయోస్తని దీవించాడు.

ఒక్కరోజులోనే అక్కడి వాతావరణమంతా మంత్రించినట్టు మాయమై పోయింది.

ఇన్ని సంవత్సరాలుగా దూరంగా ఉన్న ముని జనం ఎవరో పిలుపు పంపినట్లు వచ్చారు. కొత్త కొత్త శిష్యగణం వచ్చి చేరింది.

గౌతముడు శ్రీ చరణాల మీద వాలిన అహల్యను ఆయన లేవనెత్తి గుండెలకు హత్తుకున్నాడు.

తిరిగి వారి జీవితంలో- ఋతుక్రమంలో సకల ప్రపంచానికి వసంతం వచ్చినట్టే- వసంతం ప్రవేశించింది.

ఆ రోజు చైత్రమాసం వచ్చిన అయిదవ రోజు- వసంత పంచమి.

మిథిలా నగరంలో ప్రవేశించారు విశ్వామిత్రుడు- ఆయన వెన్నంటి రామలక్ష్మణులు.

మిథిలకు మిథిలే మిరగబడి చూసింది ఆ పురుషోత్తముడిని వీధిలో కలకలం చూసి- అంతఃపురంలో ఉన్న జానకీ దేవి గదులు దాటివచ్చి వీథినంతా పరికించింది.

అదే సమయంలో శ్రీరామచంద్రుడూ అటే చూశాడు. వారిద్దరి చూపులూ కలుసుకున్నాయి.

ఒకరిపై ఒకరు జన్మించినామన్న భావన వాటిలో ప్రతిఫలించింది.

శ్రీరామచంద్రమూర్తి చూపులు మరల్చుకుని గురువును అనుసరించాడు.

## 57

మిథిలా నగరాధీసుని సభా మంటపం.

అందరూ కొలువై ఉన్నారు. దేశ దేశాల రాకుమారులు విచ్చేశారు. జనక రాజర్షి లేచి నిలబడి సభనంతా కలయచూసి, సభా మధ్యంలో ఉంచిన విల్లుని చూపి ప్రకటించాడు 'అదిగో! అదే! అదే శివధనస్సు. తరతరాలుగా మా రాజవంశంలో పూజలందుకుంటున్న పూజాధనువు. దీనిని ఎవరు ఎక్కుపెట్టుదురో ఆ వీరాధివీరుడికి- ఆ త్రిలోక శౌర్య సంపన్నుడికి- నా కుమార్తె సీతను ఇచ్చి వివాహం చేస్తాను. వీరులు శూరులు పరాక్రమశాలులు అయిన రాకుమారులు ప్రయత్నించవచ్చును.'

ఎందరెందరో ప్రయత్నించారు! ఎవ్వరూ దానిని కదపలేకపోయారు. మహాభారంగా ఉన్న ఆ ధనుస్సును కదపడానికే శక్తి చాలక చాలామంది వెనుదిరిగి పోయారు.

విశ్వామిత్రుడు శ్రీరామచంద్రుని వైపు సాభిప్రాయంగా చూశాడు. రాముడు లేచి గురువుకు, పెద్దలకు, మునులకు, సభకు నమస్కరించాడు. సభామధ్యం చేరాడు. ఒక్కసారి సభనంతా కలయ చూశాడు.

దూరాన కూచుని అంతా చూస్తూ ఉన్న సీత చప్పున- తన చూపు రాముని చూపులతో కలవగానే లేచి నిలబడింది.

శ్రీరామచంద్రుడు చిరునవ్వు నవ్వాడు.

ఆపై- ధనస్సుకు నమస్కరించాడు. అలవోకగా దానిని అందుకున్నాడు. ఆ ధనస్సును నిలబెట్టాడు. నారి తీసుకుని వింటి కొప్పువంచి నారిని సంధించపోగా- ఫెళ- ఫెళ- ఫెళ- ఫెళ- ఫెళ.

ధ్వని ప్రతిధ్వనిస్తూ విల్లు నడిమికి విరిగింది. ఆ ధనువు విరిగిన శబ్దం గాలిలో కలిసి ఆకాశంలో ప్రతిధ్వనించి అంతటా మార్మోగింది.

శ్రీరాముడి మెడలో కళ్యాణమాల! ఎప్పుడొచ్చిందో- ఎప్పుడు శ్రీరామభద్రుడి భువనమోహన రూపాన్ని చూసి ముగ్ధురాలై అతని కంఠసీమలో ఆ కళ్యాణమాల వేసిందో- అంతా విద్యుల్లత వినువీధుల్లో మెరిసినట్లే అయ్యింది.

సభ జయజయధ్వానాలు ధనువు విరిగిన శబ్దాన్ని అనుసరించి వెళ్ళాయి.

## 58

శ్రీరామ చంద్రమూర్తి, ఆయన గురుదేవుడు, ఆయన తమ్ముడు లక్ష్మణుడు రాజగృహంలో అతిథులుగా విడిశారు.

కోసలాధీశుడైన దశథేశ్వరుడికి మిథిలా నగరాధీశుడు జనకుడు కళ్యాణ లేఖలు పంపాడు. పురోహిత బృందం రాజోచితంగా బయలుదేరింది. నలుగురు కుమారులు రామలక్షణ భరత శత్రుఘ్నులకు రాకుమార్తెలు సీత, ఊర్మిళ, మాండవి శ్రుతకీర్తి- ఇచ్చి వివాహం చేయ సంకల్పించినట్టు లేఖ పంపాడు జనకుడు.

దశరధుడు దేవేరులతో కుమారులతో మంత్రి సామంత దండనాధులతో వచ్చాడు.

శ్రీరామనవమి- ఆనాటినుంచే చైత్ర శుద్ధ నవమి- శ్రీరామనవమి అయ్యింది. ఆనాడే శ్రీరామచంద్రుని జన్మదినం. ఆనాడే నలుగురికీ వివాహాలు జరిగాయి.

సీతాకళ్యాణం చూసిన ఆనాటి జనం- సకల పాపాలూ నశించి వైకుంఠం చేరి శ్రీలక్ష్మీనారాయణులను చూస్తున్నట్టుగా పరవశించారు.

వివాహ వేడుకలు భూనభోంతరాళాలుగా దద్దరిల్లేలా జరిగాయి.

మింటి నుంచి దేవతలు పూల వర్షం కురిపించినట్లు తొలకరి చినుకులు రాలాయి.

* * * *

వివాహమయ్యాక కూతుళ్ళను అల్లుళ్ళతో అయోధ్యకు సాగనంపాడు జనకుడు.

దశరధుడు పుత్రులతో అయోధ్యకు బయలుదేరాడు.

మార్గమధ్యంలో శ్రీరామచంద్రమూర్తి జానకీ సమేతంగా గౌతమాశ్రమం చేరాడు. అహల్య ఇచ్చిన విందు ఆరగించాడు. ఆమె ఆతిథ్యం స్వీకరించాడు.

అహల్య వారి రాకకు ఎంతో సంతోషించింది. 'ఏదో మాట వరసకు సతీసమేతంగా- సీతా సమేతంగా ఇలా రా తండ్రీ! అని ప్రార్థిస్తే వచ్చి నన్ను, నా మాటల్ని సార్థకం చేశావు. నా బ్రతుకు పండింది.'

అహల్య, గౌతముడు- రాముడికి, సీతకు నార చీరలు బహూకరించారు.

తాము ధరించిన పట్టుపీతాంబరాలపైన- దివ్యాభరణాలపైనా ఆ వస్త్రాలు కట్టుకుని రాముడు-సీత వారిని ఆనందపరిచారు.

అందరూ అయోధ్యకు మరలిపోయారు.

గౌతముడు-అహల్య ప్రశాంతజీవనం శిష్యసమేతంగా సాగించారు. రామ చరిత సమన్వితమైన అహల్య జీవితకథ సుఖాంతమైంది.

మంగళం కోసలేంద్రాయ
మహనీయ గుణాత్మనే
చక్రవర్తి తనూజాయ
సార్వభౌమాయ మంగళమ్

*** సమాప్తం ***

---